ఈనాడు

కరీంనగర్ 13-3-2018 మంగళవారం సిటీ సంపుటి 44 సంచిక 212
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 5-00. పేజీలు 16+16 www.eenadu.net
Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi


సోమవారం ప్రారంభమైన బడ్జెట్ సమావేశాల్లో పోడియంలోకి వచ్చి హెడ్‌ఫోన్ విసురుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి


కోమటిరెడ్డి వెంకటరెడ్డి విసిరిన హెడ్‌ఫోన్ తగలడంతో సరోజినీదేవీ ఆసుపత్రిలో కంటికి చికిత్స చేయించుకుంటున్న శాసనమండలి ఛైర్మన్ స్వామిగౌడ్



అభివృద్ధిలో అగ్రభాగాన!

- వృద్ధి లోటును పూడ్చటంలో ఇతర రాష్ట్రాలతో పోటీపడుతున్నాం
- రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధి రేటు 8.6 శాతానికి పెరిగింది -5లో
- రాష్ట్ర పథకాలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు
- బడ్జెట్ సమావేశాల్లో గవర్నర్

సభలో వీరంగం

- హెడ్‌ఫోన్‌ను విసిరిన కోమటిరెడ్డి
- మండలి ఛైర్మన్ స్వామిగౌడ్ కంటికి గాయం
- సరోజినీదేవి ఆసుపత్రిలో చికిత్స
- ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో కాంగ్రెస్ నిరసన
- గవర్నర్ ప్రసంగ ప్రతిని చింపి విసిరివేత..
- ఇలాంటి చర్యలు సరికావు: స్వామిగౌడ్
- గవర్నర్ ప్రసంగాన్ని బహిష్కరించిన భాజపా సభ్యులు
- తొలిరోజే శాసనసభలో ఉద్రిక్తత

ఈనాడు, హైదరాబాద్: బడ్జెట్ సమావేశాల తొలిరోజే శాసన సభ నిరసనలతో హోరెత్తింది. గవర్నర్ ప్రసంగ సమయంలో కాంగ్రెస్ సభ్యుల నినాదాలు, నిరసనలతో ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ సభ్యుడు విసిరిన హెడ్‌ఫోన్ శాసనమండలి ఛైర్మన్ స్వామి గౌడ్‌కు తగిలింది. గవర్నర్ ప్రసంగాన్ని బహిష్కరిస్తున్నట్లు తెలిపి భాజపా సభ్యులు సైతం బయటికి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం పది గంటలకు ఉభయ సభల సంయుక్త సమావేశం ప్రారంభం కాగానే గవర్నర్ నరసింహన్‌ను సభాపతి మధుసూదనా చారి, శాసనమండలి ఛైర్మన్ స్వామిగౌడ్, సీఎం కేసీఆర్ సభలోకి తోడ్కొని వచ్చారు. గవర్నర్ ప్రసంగం ప్రారంభించిన తరవాత ఐదు నిమిషాల వరకూ సభ ప్రశాంతంగానే ఉంది. అన్ని పార్టీల సభ్యులు ప్రసంగ పాఠాన్ని చదువుతూ కూర్చున్నారు. ఈ సమయంలో ఒక్కసారిగా కాంగ్రెస్ సభ్యులు సీట్లలో నుంచి లేచి నిలబడి ప్లకార్డులు ప్రదర్శిస్తూ తీవ్రస్థాయిలో నినాదాలు చేస్తూ పోడియం వద్దకెళ్లేందుకు గట్టిగా ప్రయత్నించారు. 'రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలి' అంటూ పలు నినాదాలు చేశారు. వారిని పోడియం వద్దకు వెళ్లనీయకుండా ముందు జాగ్రత్తగా వారికన్నా రెట్టింపు సంఖ్యలో మార్షల్స్ ప్రతిపక్షాల సీట్ల (మిగతా 2లో)



ప్రభుత్వ ఆగ్రహం

- అత్యంత హేయమన్న సీఎం కేసీఆర్
- తీవ్రంగా పరిగణించాలని సర్కారు నిర్ణయం
- న్యాయనిపుణులు, అధికారులతో చర్చలు
- కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వంశీచంద్‌రెడ్డి, సంపత్‌ల సస్పెన్షన్‌కు నేడు సిఫార్సు -2లో
- శాసనసభా సభ్యత్వాల రద్దు, పదవీకాలం ముగిసే వరకు లేదా ప్రస్తుత సమావేశాలు ముగిసేదాకా సస్పెన్షన్ ప్రతిపాదనలు

శాసనసభ సమావేశాల మరిన్ని వార్తలు -5లో

మంటల్లో కలిసిన ప్రాణాలు


కాఠ్‌మాండూలోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో 'యూఎస్-బంగ్లా ఎయిర్‌లైన్స్' విమాన శకలాలు

నేపాల్‌లో ఘోర విమాన ప్రమాదం

- అదుపుతప్పి భూమిని ఢీకొట్టడంతో చెలరేగిన మంటలు
- క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమం -2లో
- కమిలిపోయిన మృతదేహాలు

మృతులు **50** మందికి పైగా

గాయాలు **20** మందికి

కొండలపై 'కార్చిచ్చు'

తమిళనాట విహార యాత్రలో

విషాదం

- మరణించిన వారిలో ఏడుగురు మహిళలు -2లో
- 27 మందిని రక్షించిన సిబ్బంది

మృతులు **10** మంది

గాయాలు **5** మందికి


తమవారిని కోల్పోవడంతో విలపిస్తున్న బాధితులు

రాజ్యసభ ఎన్నికలకు అయిదు నామినేషన్లు

- తెరాస నుంచి మూడు
- కాంగ్రెస్ ఒకటి, స్వతంత్ర అభ్యర్థి ఒకరు
- ముగిసిన గడువు -3లో

చదువుల చెరసాల

- వసతులు కరవైన హాస్టళ్లు
- మూత్రశాలలు, స్నానపుగదులూ తక్కువే
- పెట్టింది తినాలి.. చెప్పింది చదవాలి
- ఆదాయం తప్ప ఆర్తనాదాలు పట్టని కార్పొరేట్ కళాశాలలు
- వసతిగృహాలు తమ పరిధిలోకి రావని దులిపేసుకున్న ఇంటర్‌బోర్డు -14లో

ఇదీ సంగతి!


నాయకులంతా ఐకమత్యంగా ఉన్నారని తెలియటానికి ఈ చొక్కా వేసుకోవాలని అధిష్ఠానం ఆదేశించిందట.

బయ్యారానికి సానుకూలం!

- రాయితీలకు రాష్ట్రం సుముఖత
- మెట్టుగుట్టలో వ్యాగన్ ఓవరాయిలింగ్ ఫ్యాక్టరీ
- కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో విభజన కమిటీ సమావేశం

ఈనాడు - దిల్లీ

ఖమ్మం జిల్లా బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కేంద్రం నుంచి సానుకూలత వ్యక్తమవుతోంది. తొలుత ప్రాథమిక నివేదిక ప్రకారం సాధ్యం కాదన్నప్పటికీ ఛత్తీస్‌గఢ్‌లోని బేలడేలా నుంచి ఇనుప ఖనిజం తీసుకురావడం, అక్కడి నుంచి రైల్వేట్రాక్ వేయాలని నిర్ణయించడం, రాయితీలకు కూడా రాష్ట్రం అంగీకరిస్తున్న నేపథ్యంలో బయ్యా

బయ్యారం కొండలు


రంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు సాధ్యం కానుంది. సోమవారమిక్కడ నార్త్‌బ్లాక్‌లో కేంద్ర హోంశాఖ కార్యదర్శి రాజీవ్‌గాబా నేతృత్వంలో విభజనచట్టంలో 13వ షెడ్యూలులో పేర్కొన్న సంస్థల ఏర్పాటుపై తెలుగు రాష్ట్రాల అధికారులతో సమావేశం నిర్వహించారు. తెలంగాణ తరఫున భవన్ ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్ అశోక్‌కుమార్ హాజరయ్యారు. బయ్యారం ఉక్కు పరిశ్రమకు సంబంధించి రాయితీలపై రాష్ట్ర అధికారులను కేంద్ర అధికారులు ప్రశ్నించారు. పరిశ్రమలు, సాగునీరు, విద్యుత్తు తదితర విభాగాల నుంచి రాయితీలు ఇవ్వడంపై చర్చ జరిగింది. దీనిపై రాష్ట్రప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు రాష్ట్ర అధికారులు వివరించారు. ఆయా అంశాలపై ఇప్పటికే మెకాన్ పరిశీలన చేస్తోంది. సాధ్యాసాధ్యాలపై నివేదిక వచ్చాక బయ్యారంపై అధికారిక ప్రకటన రానున్నట్లు తెలుస్తోంది.

కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ స్థానంలో వ్యాగన్ పిరియాడిక్ ఓవరాయిలింగ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు కేంద్రం సుముఖత చూపింది. వరంగల్ అర్బన్ జిల్లా మెట్టగుట్టలోని సీతారామచంద్రస్వామి దేవస్థానం భూములు ఇవ్వడానికి రాష్ట్రప్రభుత్వం ముందుకు రావడంతో త్వరలోనే పనులు వేగవంతం కానున్నాయి. ఈ ఫ్యాక్టరీకి (మిగతా 2లో)

నేపాల్‌లో ఘోర విమాన ప్రమాదం

కాఠ్‌మాండూ: నేపాల్‌లో సోమవారం ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. బంగ్లాదేశ్ నుంచి వచ్చిన 'యూఎస్-బంగ్లా ఎయిర్‌లైన్స్' విమానమొకటి కాఠ్‌మాండూలోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగబోతూ అదుపుతప్పి భూమిని ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో 50 మందికిపైగా దుర్మరణం పాలయ్యారు. దాదాపు 20 మంది గాయపడ్డారు. క్షతగాత్రుల్లో చాలామంది పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాద సమయంలో విమానంలో మొత్తం 71 మంది(67 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది) ఉన్నారు.

బంగ్లాదేశ్ రాజధాని ఢాకా నుంచి వచ్చిన 'బాంబార్డియెర్ క్యూ400' సిరీస్ విమానం ల్యాండింగ్ సమయంలో(స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2:20) అదుపుతప్పి విమానాశ్రయం కంచెను ఢీకొట్టిందని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయం జనరల్ మేనేజర్ రాజ్‌కుమార్ ఛెత్రి తెలిపారు. విమానం భూమిని తాకిన వెంటనే మంటలు చెలరేగాయని వెల్లడించారు. రన్‌వే నుంచి పక్కకు జారి.. సమీపంలోని ఫుట్‌బాల్ మైదానంలో విమానం ఆగిపోయిందని చెప్పారు. ఈ దుర్ఘటనలో 50 మందికిపైగా మృత్యువాతపడ్డారని అధికారవర్గాలు పేర్కొన్నాయి. మంటల కారణంగా మృతదేహాలు కమిలిపోయాయని తెలిపాయి. సహాయక చర్యలు కొనసాగిస్తున్నామని పేర్కొన్నాయి. క్షతగాత్రులకు కాఠ్‌మాండూ వైద్య కళాశాలలో చికిత్స అందిస్తున్నట్లు వెల్లడించాయి. ప్రయాణికుల్లో 33 మంది నేపాలీలు, 32 మంది బంగ్లాదేశ్ వాసులు, చైనా జాతీయుడొకరు, మాల్దీవుల పౌరుడొకరు ఉన్నారని చెప్పాయి. విమానంలో చెలరేగిన మంటల వల్ల ఫుట్‌బాల్ మైదానంలో దట్టమైన పొగ అలుముకుంది. నేపాల్ ప్రధానమంత్రి కె.పి.శర్మ ఓలి, హోంమంత్రి రామ్ బహదూర్ ఘటనాస్థలానికి చేరుకొని సహాయక చర్యలను పర్యవేక్షించారు. యూఎస్-బంగ్లా ఎయిర్‌లైన్స్ 2014 జులైలో తమ సేవలను ప్రారంభించింది. ప్రస్తుతం ప్రమాదానికి గురైన బాంబార్డియర్ విమానం 17 ఏళ్లుగా నడుస్తోంది.





కాఠ్‌మాండూలోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో 'యూఎస్-బంగ్లా ఎయిర్‌లైన్స్' విమాన శకలాల వద్ద సహాయక చర్యలు ★ కాఠ్‌మాండూ విమానాశ్రయంలో విమానం అదుపుతప్పి భూమిని ఢీకొట్టడంతో రేగిన మంటలకు ఎగసిపడుతున్న పొగ

సాంకేతిక లోపాలే కారణం!

సాంకేతిక లోపాలే తాజా ప్రమాదానికి కారణమని అధికారులు అంచనా వేస్తున్నారు. వాస్తవానికి విమానాశ్రయంలో దక్షిణం వైపు నుంచి ల్యాండ్ అయ్యేందుకు బాంబార్డియెర్ విమానాన్ని అనుమతించారని.. కానీ, అది ఉత్తరం వైపు నుంచి వచ్చిందని వివరించారు. ప్రమాదానికి గురైన విమానం బ్లాక్ బాక్స్‌ను సేకరించినట్లు తెలిపారు.

ఒక్కసారిగా ఊగిపోయిన విమానం

ల్యాండింగ్ సమయంలో విమానం ఒక్కసారిగా ఊగిపోయిందని.. అనంతరం పెద్ద శబ్దం వినిపించిందని ప్రమాదం నుంచి బయటపడ్డ ప్రయాణికుడు బసంతా బొహొరా(నేపాల్) తెలిపారు. ప్రమాదం అనంతరం తాను కిటికీని బద్దలు కొట్టి బయటకు వచ్చినట్లు వెల్లడించారు. తల, కాళ్లకు గాయాలైనప్పటికీ.. అదృష్టంకొద్దీ ఈ దుర్ఘటన నుంచి ప్రాణాలతో బయటపడ్డానని వ్యాఖ్యానించారు.

నేపాల్‌లో ఇటీవలి విమాన ప్రమాదాలు

- పర్వతప్రాంతమైన నేపాల్‌లో గత కొన్నేళ్లలో పలు విమాన ప్రమాదాలు సంభవించాయి. 2016 ఫిబ్రవరిలో మయాగ్ది జిల్లాలోని రుప్సేలో 'తారా ఎయిర్' విమానం కుప్పకూలడంతో 23 మంది మృత్యువాతపడ్డారు.
- అర్ఘఖంచిలోని సంధిఖార్కవద్ద 2014ఫిబ్రవరిలో 'నేపాల్ ఎయిర్‌లైన్' విమానం ప్రమాదానికి గురైంది. ఈఘటనలో 18మంది మరణించారు.
- కాఠ్‌మాండూలోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రం సమీపంలో 'సీతా ఎయిర్' విమానం 2012 సెప్టెంబరులో కుప్పకూలడంతో 19 మంది దుర్మరణం పాలయ్యారు.
- 2012 మేలో ముస్తాంగ్‌లోని జామ్సమ్ విమానాశ్రయ సమీపంలో 'అగ్ని ఎయిర్' విమానం కూలిపోయింది. నాటి దుర్ఘటనలో 15 మంది మృత్యువాతపడ్డారు.

ఇరాన్‌లో కుప్పకూలిన ప్రైవేటు విమానం

- 11 మంది మహిళల దుర్మరణం
- మృతుల్లో టర్కీ వ్యాపార దిగ్గజం కుమార్తె
- పెళ్లికి ముందు సంబరాలు చేసుకొని తిరిగొస్తుండగా దుర్ఘటన

టెహ్రాన్: పెళ్లికి ముందు స్నేహితురాళ్లతో కలిసి ఓ సంపన్న యువతి చేసుకున్న వేడుకలు విషాదాంతమయ్యాయి. సంబరాల నుంచి తిరిగొస్తూ.. విమాన ప్రమాదంలో సదరు యువతి సహా మొత్తం 11 మంది మహిళలు దుర్మరణం పాలయ్యారు. ఇరాన్‌లోని జాగ్రోస్ పర్వతాల్లో ఆదివారం సాయంత్రం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. టర్కీకి చెందిన వ్యాపార దిగ్గజం హుసేన్ బసరణ్ కుమార్తె మీనా బసరణ్(28) వివాహం వచ్చే నెల 14న జరగాల్సి ఉంది. వివాహానికి ముందు వేడుకల్లో భాగంగా మీనా తన స్నేహితురాళ్లతో కలిసి కొన్ని రోజులు యూఏఈలో గడిపి.. ప్రైవేటు విమానం(బాంబార్డియెర్ ఛాలెంజర్ 604)లో టర్కీకి తిరుగుప్రయాణమయ్యారు. విమానంలో మీనాతో పాటు ఆమె స్నేహితులు ఏడుగురు, ముగ్గురు మహిళా సిబ్బంది ఉన్నారు. సాంకేతిక సమస్య కారణంగా పైలట్ కాస్త కిందకు దించడంతో.. జాగ్రోస్ పర్వతాల్లో విమానం కుప్పకూలింది. విమానంలోని మహిళలంతా మృత్యువాతపడ్డారు. మృతుల్లో మరో ముగ్గురు మహిళల వివాహాలు కూడా ఈ వేసవిలో జరగాల్సి ఉన్నట్లు సమాచారం.



జాగ్రోస్ పర్వతాల్లో కుప్పకూలిన విమానం శకలాలు

అమెరికాలో హెలికాప్టర్ ప్రమాదం ఐదుగురి మృత్యువాత

న్యూయార్క్: అమెరికాలోని న్యూయార్క్ సిటీలో ఓ హెలికాప్టర్ ప్రమాదవశాత్తూ కూలిపోయింది. ఆదివారం రాత్రి చోటుచేసుకున్న ఈ దుర్ఘటనలో ఐదుగురు మృత్యువాతపడ్డారు. భూమిని తాకిన అనంతరం హెలికాప్టర్ పక్కనే ఉన్న ఈస్ట్ నదిలోపడిపోయింది. పైలట్ మాత్రం ఈ ప్రమాదంనుంచి సురక్షితంగా బయటపడ్డారు.



న్యూయార్క్ సిటీలోని ఈస్ట్ నదిలో పడిపోతున్న హెలికాప్టర్

కొండలపై 'కార్చిచ్చు'

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాడులోని తేని జిల్లాలో పర్వతారోహణ(ట్రెక్కింగ్)కు వెళ్లి కార్చిచ్చులో చిక్కుకుని మరణించిన వారి సంఖ్య సోమవారం నాటికి పదికి చేరింది. వీరిలో ఏడుగురు మహిళలు, ఇద్దరు పురుషులు, ఓ బాలుడు ఉన్నారు. గాయపడిన వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. పర్వతారోహణకు వెళ్లిన కొందరు ఆదివారం కార్చిచ్చులో చిక్కుకున్న విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనలో తొలుత నలుగురు చనిపోయినట్లు సమాచారం అందింది.

36 మంది విహారయాత్రకు వెళ్లి..

తమిళనాడులోని ఈరోడు, తిరుప్పూరు, చెన్నై జిల్లాలకు చెందిన 36 మంది విహారయాత్ర కోసం ఆదివారం తేని జిల్లా కురంగణి వెళ్లారు. అక్కడ పర్వతారోహణకు పేరుగాంచిన కురంగణి కొండపైకి వీరంతా నాలుగు బృందాలుగా ఎక్కారు. సాయంత్రం పర్వతారోణను ముగించుకుని కొండ దిగుతుండగా అకస్మాత్తుగా కార్చిచ్చు కమ్ముకుంది. కొండపై దట్టమైన అడవి ఉండటంతో మంటలు వేగంగా నలువైపులా వ్యాపించాయి. దీంతో భయాందోళనలకు గురైన వారు దిక్కుతోచని స్థితిలో చెల్లాచెదురయ్యాయి. మంటలు వేగంగా చుట్టుముట్టడంతో కేకలు వేస్తూ కొండపై అడవిలో పరుగులు పెట్టారు. తప్పించుకోవడానికి కొందరు కొండపై నుంచి కిందికి దూకే ప్రయత్నం చేశారు. ఇలా పలువురు లోయలో పడగా... మరికొందరు బండరాళ్ల మధ్య చిక్కుకుపోయారు. అంతకు ముందే ట్రెక్కింగ్ ముగించుకుని కొండ దిగిన కొందరు ఇచ్చిన సమాచారం మేరకు అటవీ, రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపకశాఖల సిబ్బంది అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పలు జిల్లాల నుంచి సుమారు వంద అగ్నిమాపక వాహనాలు అక్కడికి చేరుకున్నాయి. ఓవైపు మంటలు ఆర్పుతూ మరోవైపు కార్చిచ్చులో చిక్కుకున్నవారిని కాపాడేందుకు ప్రయత్నించారు. ఇందులో సమీప ప్రాంతాల ప్రజలు సైతం స్వచ్ఛందంగా పాల్గొన్నారు. కేంద్ర రక్షణశాఖ సహాయాన్ని ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి కోరడంతో వెంటనే రక్షణశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. ఆమె ఆదేశాల మేరకు వాయుసేన రంగంలోకి దిగింది. కోయంబత్తూరు నుంచి హెలికాప్టర్లు ప్రమాదస్థలికి చేరుకుని కొండపై చిక్కుకున్న 15 మందిని రక్షించాయి. చీకటి పడటంతో సహాయక చర్యల కొనసాగింపునకు అంతరాయం కలిగింది. రాత్రి 8 గంటలకు కొందరు కొండపై నుంచి టార్చిలైట్ల ద్వారా సంజ్ఞలు ఇచ్చినట్టు తెలియడంతో సహాయక చర్యలను కొనసాగించారు. కోయంబత్తూరు జిల్లా సూలురు నుంచి వచ్చిన పది మంది కమాండోలు తెల్లవారుజాముననుంచి సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

కేరళ పోలీసులు సైతం...

ఈ కార్చిచ్చులో ఎంతమంది చిక్కుకున్నారనే విషయమై మొదటి నుంచి సందిగ్ధత నెలకొంది. మొదట 25 మంది ట్రెక్కింగ్‌కు వెళ్లినట్టు భావించగా... ఆ తర్వాత ఈ సంఖ్య 36గా తెలిసింది. అప్పటికే 15 మందిని కాపాడిన నేపథ్యంలో మృతుల గురించి మాత్రం అధికారులు చెప్పలేకపోయారు. రక్షించినవారిలో తిరుప్పూరు, ఈరోడు, చెన్నైకు చెందినవారు ఉన్నట్టు ఆదివారం రాత్రి తేని కలెక్టరు పల్లవి భల్దేవ్ తెలిపారు. అగ్నిప్రమాదంతో పలువురు తప్పించుకునే ప్రయత్నంలో కేరళ వైపు వెళ్లి ఉంటారనే అనుమానాలు వ్యక్తం కావడంతో ఆ రాష్ట్ర పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఇడుక్కి డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. స్వల్ప గాయాలతో ఉన్న నలుగురిని గుర్తించి కాపాడారు. వారిని కేరళలోని ఆస్పత్రికి తరలించారు.



కొండ వద్ద సహాయ చర్యలు

బండరాళ్లల్లో చిక్కుకోవడంతోనే ఎక్కువ మరణాలు

సోమవారం ఉదయం వరకు తమిళనాడు, కేరళ పోలీసుల గాలింపు చర్యల్లో 27 మంది ఆచూకీ లభించింది. ఈ సందర్భంగానే అయిదుగురు మహిళలు, ఇద్దరు పురుషులు, ఓ బాలుడి మృతదేహాన్ని మొదట గుర్తించగా.... తర్వాత మరో మహిళ మృతదేహం లభ్యమైంది. కాపాడిన వారిలో పలువురు గాయపడిన ఉండటంతో బోడిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారిని ఉపముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం, రాష్ట్ర అటవీశాఖ మంత్రి దిండుకల్ శ్రీనివాసన్, రెవెన్యూశాఖ మంత్రి ఆర్బీ ఉదయకుమార్ తదితరులు పరామర్శించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతున్న వారిలో ఓ యువతి సోమవారం సాయంత్రం మృతిచెందింది. దీంతో మృతుల సంఖ్య పదికి చేరింది. క్షతగాత్రుల్లో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. కొండపై నుంచి దూకేసి బండరాళ్ల మధ్య చిక్కుకోవడమే పలువురి మృతికి కారణమని తేని కలెక్టరు పల్లవి భల్దేవ్ తెలిపారు. బండరాళ్ల మధ్య చిక్కుకుని కాలిన గాయాలతో ఉన్న బాధితులు తమను రక్షించమంటూ అర్థిస్తున్న కొన్ని వీడియోలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతమయ్యాయి.

ఇంజిన్ విఫలం.. విమానం వెనక్కి మళ్లింపు

అహ్మదాబాద్: ఇండిగో విమానం ఒకటి గాల్లోకి ఎగిరిన అనంతరం ఇంజిన్లలో ఒకటి విఫలం కావడంతో సోమవారం అత్యవసరంగా వెనక్కి మళ్లించారు. అహ్మదాబాద్ నుంచి 186 మందితో కోల్‌కతా (లఖ్‌నవూ మీదుగా)కు బయల్దేరిన విమానం (ఏ320 నియో) 40 నిమిషాల్లోనే ఉదయం 10.04 ప్రాంతంలో తిరిగి చేరుకుంది. కాగా ప్రయాణికులంతా సురక్షితమని విమానాశ్రయ డైరెక్టర్ మనోజ్ గంగల్ తెలిపారు. తమ విమానం (6ఈ-244)లోని రెండో ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో ముందుజాగ్రత్తగా వెనక్కి మళ్లించినట్లు ఇండిగో ఓ ప్రకటనలో తెలిపింది. ఈ విషయమై తమ భద్రత బృందంతో పాటు, డీజీసీఏ విచారణ జరుపుతున్నట్లు పేర్కొంది.

బయ్యారానికి సానుకూలం!

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించి రూ.20 కోట్లు కేంద్రం బడ్జెట్‌లో పెట్టిందని అధికారులు చెబుతున్నారు. గిరిజన, ఉద్యాన వర్సిటీలకు సంబంధించి కేంద్ర, రాష్ట్రాధికారులు చర్చించారు. గిరిజన విశ్వవిద్యాలయానికి వరంగల్ దగ్గర ములుగులో ఇప్పటికే 200 ఎకరాలు కేటాయించినట్లు రాష్ట్రాధికారులు తెలిపారు. మరో 200 ఎకరాలు డీనోటిఫై చేయాల్సి ఉందన్న అంశాన్ని కేంద్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సిద్ధిపేట-ములుగులో ఉద్యాన వర్సిటీ ఏర్పాటు నిమిత్తం పనుల వేగవంతంపై చర్చించారు.

సభలో వీరంగం

(మొదటి పేజీ తరువాయి)

ముందుకొచ్చి 4 వరసలుగా అడ్డుగోడల్లా నిలబడ్డారు. సభ ప్రారంభ సమయానికే సభ్యుల కన్నా ముందే భారీ సంఖ్యలో మార్షల్స్ వచ్చి వెల్‌లో నిలబడి ఉన్నారు. కాంగ్రెస్ నిరసనలను ముందే పసిగట్టిన ప్రభుత్వం ముందస్తుగా తగిన రక్షణ చర్యలు తీసుకున్నట్లు కనిపించింది. గవర్నర్ నిలబడి ప్రసంగం చదివే వేదిక వద్ద సైతం మరికొందరు రక్షణగా నిలబడ్డారు. కాంగ్రెస్ సభ్యులను ముందు వరస సీట్లను దాటి అడుగు కూడా ముందుకు వేయనీయకుండా మార్షల్స్ నిలబడగా.. వారిని ప్రతిఘటిస్తూ ముందుకెళ్లేందుకు సభ్యులు బలవంతంగా యత్నించారు. ప్రసంగం ముగిసే వరకూ ఈ తంతు కొనసాగింది. ఈ గొడవలోనే ప్రసంగ ప్రతులను కాంగ్రెస్ సభ్యులు ముక్కలుగా చించి పోడియం వైపు పలుమార్లు విసిరేశారు. అవి గవర్నర్‌పై పడకుండా మార్షల్స్ గాలిలోనే పట్టుకుని కింద పడేశారు. ఈ దశలో కాంగ్రెస్ సభ్యుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి హెడ్‌ఫోన్‌ను విసరగా.. అది గవర్నర్ భుజం పైనుంచి వెళ్లి గోడను తాకి, పక్కనే కూర్చున్న స్వామిగౌడ్ కంటికి తాకుతూ కిందపడింది. గవర్నర్ ఒక్కసారిగా ఉలిక్కిపడి పక్కకు చూసి.. ప్రసంగం ఆపకుండా కొనసాగించారు. గొడవ జరుగుతుండగానే భాజపా సభ్యులు సీట్లలో నుంచి లేచి ప్రసంగాన్ని బహిష్కరిస్తున్నట్లు తెలిపి బయటికి వెళ్లిపోయారు. వారు వెళ్లిన కాసేపటికి ప్రతిపక్ష నేత జానారెడ్డి లేచి బయటికి వెళ్లారు. అయినా కాంగ్రెస్ సభ్యులు ఆయన వెంట బయటికి వెళ్లకుండా సభలోనే నిలబడి ప్రసంగం ముగిసేవరకూ గట్టిగా నినాదాలు చేస్తూ నిరసన కొనసాగించారు.





సభలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న కాంగ్రెస్ సభ్యులు ★ సోమవారం హైదరాబాద్‌లోని సరోజినీదేవీ ఆసుపత్రిలో శాసనమండలి ఛైర్మన్ స్వామిగౌడ్‌ను పరామర్శిస్తున్న ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, ఉపసభాపతి పద్మా దేవేందర్‌రెడ్డి తదితరులు

24 గంటలపాటు వైద్యుల పర్యవేక్షణలో స్వామిగౌడ్

గవర్నర్ ప్రసంగం సందర్భంగా మండలి ఛైర్మన్ స్వామిగౌడ్ కంటికి హెడ్‌ఫోన్ తగిలిన ఘటనపై సరోజినీదేవి నేత్ర వైద్యాలయంలో చికిత్స అందించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.రవీంద్రగౌడ్, అసోసియేట్ ప్రొఫెసర్ డా.శ్రీనివాస్ ప్రసాద్ ఆధ్వర్యంలో కుడి కంటికి బి-స్కానింగ్ తీశారు. గ్లకోమా పరీక్షలు కూడా నిర్వహించారు. స్కానింగ్‌లో రెటీనాకు స్వల్ప గాయమైనట్లు గుర్తించిన వైద్యులు కంటికి కట్టుకట్టారు. మరో 24 గంటలపాటు ఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలో ఉంచనున్నట్లు సూపరింటెండెంట్ రవీంద్రగౌడ్ తెలిపారు. చికిత్స అనంతరం స్వామిగౌడ్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ సభ్యులు విసిరిన మైక్ నేరుగా కంటికి తగిలిందన్నారు. బాధ కలుగుతున్నప్పటికీ గవర్నర్ ప్రసంగం పూర్తయ్యే వరకు అలాగే ఉండిపోయానన్నారు. అనంతరం సీఎం కేసీఆర్ తన వద్దకు వచ్చి పరిశీలించి.. వెంటనే పరీక్షల కోసం సరోజినీదేవి ఆసుపత్రికి వెళ్లాలని సూచించారని చెప్పారు. కంటికి ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారనీ, వాపు రావడంతో కాస్త జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరికైనా తమ నిరసన తెలిపే హక్కు ఉందనీ.. అయితే ఇలాంటి చర్యలు మాత్రం సరికాదని స్వామిగౌడ్ వ్యాఖ్యానించారు.

పలువురు మంత్రుల పరామర్శ..

సరోజినీదేవి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలి ఛైర్మన్ స్వామిగౌడ్‌ను పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పరామర్శించారు. శాసనసభ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి దగ్గరుండి వైద్య సేవల్ని పర్యవేక్షించారు. అనంతరం డిప్యూటీ సీఎంలు మహమూద్ అలీ, కడియం శ్రీహరి, పురపాలక, పంచాయతీరాజ్ శాఖ మంత్రి కేటీఆర్, హోంమంత్రి నాయిని నరసింహారెడ్డి, రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి తదితరులు ఆసుపత్రికి వచ్చి పరామర్శించారు. స్వామిగౌడ్ ఆరోగ్య పరిస్థితి గురించి సూపరింటెండెంట్ రవీంద్రగౌడ్‌ను అడిగి తెలుసుకున్నారు. కంటికి దెబ్బతగలడంతో వాపు వచ్చిందనీ, కన్ను ఎరుపుగా మారిందనీ, చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు వివరించారు. కొంత విశ్రాంతి అవసరమని సూచించారు.

కళ్లజోడుతో సీఎం కేసీఆర్

గవర్నర్ ప్రసంగం చదువుతున్నంత సేపు సీఎం కేసీఆర్ కళ్లజోడు ధరించి ప్రసంగపాఠం చదువుతూ కూర్చున్నారు. సభలో ఆయన కళ్లజోడు ధరించడం ఇదే ప్రథమం. ప్రసంగం పూర్తయిన తరవాత గవర్నర్‌ను సీఎంతో పాటు ఉభయ సభల అధిపతులు బయటికి తీసుకెళ్లారు. తెరాససభ్యులు గులాబీ రంగు కండువాలు ధరించివచ్చారు. భాజపా సభ్యులు కాషాయ, సీపీఎం సభ్యుడు ఎరుపు దుస్తులు ధరించారు. తెదేపా సభ్యులిద్దరిలో సండ్ర వెంకటవీరయ్య పసుపురంగు చొక్కావేసుకుని రాగా కృష్ణయ్య తెల్లనిదుస్తుల్లో వచ్చారు. గవర్నర్ ప్రసంగం ముగిసినవెంటనే సభ మంగళవారానికి వాయిదా పడింది. ఉభయసభల సభ్యులంతా హాజరవ్వడంతో సభ నిండుగా కనిపించింది. సీట్లు సరిపోకపోవడంతో తెరాస సభ్యులు నలుగురికి వెనుక వరస తరవాత మరో 4 కుర్చీలుఅదనంగా వేశారు. ప్రసంగసమయంలో ప్రభుత్వ పథకాలగురించి చెబుతున్నప్పుడు అధికారపార్టీ సభ్యులు పలుమార్లు బల్లలు చరిచి హర్షం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ నిరసనలపై అధికార పార్టీ సభ్యులెవరూ సభలో స్పందించకుండా ప్రశాంతంగా ఉన్నారు. తెదేపా, మజ్లిస్, సీపీఎం సభ్యులు ప్రసంగం పూర్తయ్యే వరకూ సభలోనే ఉన్నారు.

కాంగ్రెస్ నేతల రాకతో నిరసనలు..: మరోవైపు స్వామిగౌడ్‌ను పరామర్శించేందుకు కాంగ్రెస్ నేతలు షబ్బీర్ అలీ, పొంగులేటి సుధాకర్‌రెడ్డి తదితరులు ఆసుపత్రికి చేరుకున్నారు. లోపలకి వెళ్లే సమయంలో అక్కడ ఉన్న తెరాస నాయకులు, కార్యకర్తలు అడ్డుకుని నిరసన తెలిపారు. దాడి చేసి పరామర్శించడానికి వస్తారా.. అంటూ కాంగ్రెస్ నాయకులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. లోపలకి వెళ్లనీయబోమన్నారు. ఈ విషయాన్ని పోలీసులు స్వామిగౌడ్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన స్పందించి వారిని లోపలికి పంపాలంటూ పోలీసుల్ని ఆదేశించారు. కాంగ్రెస్ నాయకులు స్వామిగౌడ్ గదిలోకి వెళ్లి పరామర్శించి వచ్చారు.



సోమవారం గవర్నర్ నరసింహన్‌ను సభలోకి తోడ్కొని వస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో శాసనసభాపతి మధుసూదనాచారి, శాసనమండలి ఛైర్మన్ స్వామిగౌడ్, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి హరీశ్‌రావు

ప్రభుత్వ ఆగ్రహం

ఈనాడు, హైదరాబాద్: సోమవారం ఉభయ శాసనసభల సమావేశంలో గవర్నర్ ప్రసంగం సందర్భంగా కాంగ్రెస్ సభ్యులు వ్యవహరించిన తీరును తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. ఆ పార్టీ శాసనసభ్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, సంపత్, వంశీచంద్‌రెడ్డిలతో పాటు మండలి సభ్యుడు రాజగోపాల్‌రెడ్డిపై అత్యంత కఠినమైన చర్యలకు సిఫార్సు చేయాలని నిర్ణయించింది. కొందరు సభ్యుల శాసన సభ్యత్వాల రద్దు, మరికొందరిని పదవీకాలం ముగిసే వరకు సస్పెన్షన్, ఇంకొందరిని ప్రస్తుత సమావేశాలు ముగిసే వరకు సస్పెండ్ చేయించడం వంటివి ఇందులో ఉన్నాయి. మంగళవారం శాసనసభ, మండలి సమావేశాలు ప్రారంభమైన వెంటనే వీరి సస్పెన్షన్‌కు తీర్మానం ప్రవేశ పెట్టనున్నట్లు తెలిసింది. వీరిపై మరింత కఠిన చర్యల కోసం సభా హక్కుల కమిటీకి నివేదించాలని కోరనున్నారు. అది ఆమోదం పొందితే సభా హక్కుల కమిటీ విచారణ జరుపుతుంది. ఆయా సభ్యులకు నోటీసులు ఇస్తారు. సభలో ఉన్న వారిని విచారణ చేస్తుంది. సభలోని సంఘటనలపై సీసీటీవీ దృశ్యాల్ని పరిశీలిస్తుంది. అనంతరం చర్యలుంటాయి. గవర్నర్ ప్రసంగం ముగిసిన వెంటనే ముఖ్యమంత్రి కేసీఆర్ మంత్రులతో సమావేశమయ్యారు. కాంగ్రెస్ సభ్యుల వైఖరిపై మండిపడ్డారు. వారి ప్రవర్తన అత్యంత హేయమని సీఎం పేర్కొన్నారు. మంత్రి హరీశ్‌రావు, ఇతర మంత్రులు, విప్‌లు ఆయనకు సంఘటన వివరాలు వివరించారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హెడ్‌ఫోన్ విసిరారని, ఆయన సోదరుడు రాజగోపాల్‌రెడ్డి మైక్ విరిచి ఇచ్చారని, రామ్మోహన్‌రెడ్డి కళ్లజోడు విసిరారని, సంపత్, వంశీచంద్‌లు మైక్‌లు, గ్లాస్‌లు, పెన్నులు, పుస్తకాలు విసిరారని చెప్పినట్లు తెలిసింది. ఇలాంటివి పునరావృతం కాకుండా శాసన, చట్టపరంగా చర్యలు తీసుకుందామని పేర్కొన్నట్లు సమాచారం. సీఎం ఆదేశాలకు అనుగుణంగా మంత్రులు శాసనసభ అధికారులు, న్యాయనిపుణులతో చర్చించారు. గవర్నర్‌పై దురుసు ప్రవర్తన, సభాపతి, ఛైర్మన్లపై దాడికి సంబంధించిన శాసనసభ చట్టం 17 నిబంధన ప్రకారం ఏయే చర్యలు తీసుకోవచ్చో వివరించారు. మహారాష్ట్రలో గవర్నర్‌పై సభ్యుల దాడి, రాజస్థాన్‌లో చెప్పులు విసిరిన సంఘటన, బిహార్ తదితర శాసనసభల్లో ఇలాంటి సందర్భాల్లో ఎలాంటి చర్యలు తీసుకున్నారనే సమాచారాన్ని తీసుకున్నారు. ఏపీ శాసనసభలో రోజా తదితర సభ్యులపై చర్యల పరిణామాలను కూడా పరిశీలించారు.

శాసనసభ, మండలి బీఏసీలలో ఖండనలు

సోమవారంనాటి శాసనసభ, మండలిలోని పరిణామాలపై బీఏసీ సమావేశాల్లో చర్చ జరిగింది. శాసనసభాపతి మధుసూదనాచారి మాట్లాడుతూ.. శాసనసభలో గవర్నర్‌ను ఇబ్బంది పెట్టడం, స్వామిగౌడ్‌కు గాయం కలిగించడం దురదృష్టకరమని పేర్కొన్నారు. అక్బరుద్దీన్ మాట్లాడుతూ.. శాసనసభలో ఇది చీకటి దినమని, దాడికి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసు పెట్టాలని, కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీసులు స్వచ్ఛందంగా కేసు నమోదు చేయాలనీ, ప్రణాళిక మేరకే కాంగ్రెస్ ఈ చర్యలకు పాల్పడిందనీ, ప్రసంగం వినకుండానే నిరసనకు పూనుకోవడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నట్లు తెలిసింది. ఇప్పుడు గవర్నర్‌పై దాడి జరిగిందనీ, రేపు మనపైనా దాడి చేస్తారనీ, ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేయాలని అక్బర్ సూచించారు. జానారెడ్డి మాట్లాడుతూ.. ఈ సంఘటనలపై విచారం వ్యక్తం చేశారు. ఇది నిరసన తెలిపే క్రమంలో జరిగిందని వెల్లడించారు. భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. దీనిని తీవ్రంగా పరిగణించవద్దనీ, విపక్ష స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. దీనిపై తెరాస, మజ్లిస్ ఇతర పక్షాలు అభ్యంతరం చెప్పాయి. అనంతరం ఈ సంఘటనపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చర్యలు తీసుకునే బాధ్యతలను సభాపతి స్వీకరించాలని తెరాస, మజ్లిస్ సభాపతిని కోరాయి. శాసనమండలి బీఏసీలో నేతి విద్యాసాగర్ మాట్లాడుతూ దాడి హేయమన్నారు. తెరాస చీఫ్ విప్, విప్‌లు సుధాకర్‌రెడ్డి, పల్లారాజేశ్వర్‌రెడ్డిలు దాడికి బాధ్యులైన వారిపై గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. విపక్ష నేత షబ్బీర్‌అలీ, ఉపనేత పొంగులేటిలు సంఘటనపై విచారం వ్యక్తం చేశారు.

గ్రహం అనుగ్రహం

13-3-2018 మంగళవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం శిశిర రుతువు; ఫాల్గుణ మాసం; బహుళ పక్షం
ఏకాదశి: మ. 1-11 తదుపరి ద్వాదశి
ఉత్తరాషాఢ నక్షత్రం: మ. 12-14 తదుపరి శ్రవణం
అమృత ఘడియలు: తె. 3-10 నుంచి 4-56 వరకు
వర్జ్యం: సా. 4-37 నుంచి 6-23 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-35 నుంచి 9-23 వరకు
తిరిగి రా. 10-56 నుంచి 11-45 వరకు
రాహుకాలం: మ. 3-00 నుంచి 4-30 వరకు
సూర్యోదయం: ఉ.6-14; సూర్యాస్తమయం: సా.6-05

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
మెదక్	37.8	22.0
ఆదిలాబాద్	37.3	17.0
రామగుండం	36.8	22.0
సూర్యాపేట	36.5	26.0
మహబూబ్‌నగర్	36.5	22.5
హన్మకొండ	36.5	20.0
ఖమ్మం	36.0	20.0
కరీంనగర్	36.0	18.0
హైదరాబాద్	35.5	23.3
నిజామాబాద్	35.0	23.0

కలసికట్టుగా ఉద్యమిద్దాం

- అప్పుడే మహిళల అక్రమ రవాణాకు అడ్డుకట్ట
- 'స్టాప్ డిమాండ్ = ఎండ్ సెక్స్ ట్రాఫికింగ్' ప్రచారోద్యమానికి శ్రీకారం
- సందేశాత్మక చిత్రాల ఆవిష్కరణ
- రామోజీ గ్రూపు సంస్థల తోడ్పాటుపై వక్తల ప్రశంసలు

ఈనాడు - హైదరాబాద్

ఆధునిక ప్రపంచానికి సవాలు విసురుతోన్న మహిళల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు కలసికట్టుగా ఉద్యమిద్దామని వక్తలు పిలుపునిచ్చారు. ప్రముఖ స్వచ్ఛంద సంస్థ ప్రజ్వల- యూఎస్ కాన్సులేట్ జనరల్ హైదరాబాద్ సంయుక్తంగా 'స్టాప్ డిమాండ్= ఎండ్ సెక్స్ ట్రాఫికింగ్'' పేరిట ప్రచారోద్యమానికి శ్రీకారం చుట్టారు. పురుషుల ఆలోచన ధోరణిలో మార్పు తీసుకువచ్చేలా పబ్లిక్ సర్వీస్ ఎనౌన్స్‌మెంట్(పీఎస్ఏఎస్)ను రూపొందించారు. సినిమా థియేటర్లు, టెలివిజన్ ఛానళ్లలో ఈ చిత్రాలను ప్రచారం చేయనున్నారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమకు చెందిన రామోజీఫిలింసిటీ, గీతా ఆర్ట్స్ తదితర సంస్థల తోడ్పాటుతో రూపొందించిన పలు చిత్రాలు, లఘుచిత్రాలను సోమవారం రాత్రి హోటల్ తాజ్‌బంజారాలో ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యూఎస్ కాన్సులేట్ జనరల్(హైదరాబాద్) కేథరిన్ హడ్డా మాట్లాడారు. మహిళల అక్రమ రవాణాను అడ్డుకట్ట వేసేందుకు అమెరికాలో సరికొత్త చట్టాలకు రూపకల్పన చేసినట్లు వివరించారు. ప్రజ్వల సంస్థ ద్వారా సునీతా కృష్ణన్ చేస్తున్న కృషిని అభినందించారు. తెలుగు సినీరంగ ప్రముఖులు, ముఖ్యంగా రామోజీగ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు రామోజీ ఫిలింసిటీ ద్వారా అందించిన తోడ్పాటు మరువలేనిదన్నారు.



ప్రజ్వల సంస్థ నుంచి యూఎస్ కాన్సుల్ జనరల్(హైదరాబాద్) కేథరిన్ హడ్డా చేతుల మీదుగా జ్ఞాపిక అందుకుంటున్న రామోజీగ్రూఫ్ ప్రతినిధి మాన్వి

ప్రజ్వల సంస్థ వ్యవస్థాపకురాలు సునీతాకృష్ణన్ మాట్లాడుతూ 25 ఏళ్లుగా తాను ఈ ఉద్యమంలో కొనసాగుతున్నట్లు చెప్పారు. 80వేల మంది అమ్మాయిలను సంరక్షించినట్లు వివరించారు. రెండున్నరేళ్లుగా సైబర్ ట్రాఫికింగ్‌పై యుద్ధం చేస్తున్నానన్నారు. సినీనిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ 'ఇదికథకాదు' లఘు చిత్రం వాస్తవంగా జరిగిన సంఘటన అని తెలిపారు. విజయవాడ-హైదరాబాద్ మధ్య జరిగిన ఘటనను కరీంనగర్-హైదరాబాద్‌ల్లో జరిగినట్లు చూపామన్నారు. సునీత సాగిస్తున్న పోరును ప్రశంసించారు.

రామోజీ గ్రూపు సంస్థల ప్రతినిధి మాన్వి మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే ప్రతి అంశంలోనూ రామోజీగ్రూపు కృషి ముందు వరుసలో ఉంటుందన్నారు. స్వచ్ఛభారత్, ఓటు వినియోగం తదితర అంశాలపై తాము చేపట్టిన కార్యక్రమాలను వివరించారు.

జస్టిస్ ఎస్.వి.భట్, జస్టిస్ కోదండరామ్, జస్టిస్ నవీన్‌రావు, యూఎస్ కాన్సులేట్ జనరల్ డిప్యూటీ కమిషనర్ ఆండ్రూ, రాచకొండ పోలీసు కమిషనర్ మహేశ్ భగవత్, ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, ఐపీస్ అధికారిణి సౌమ్యమిశ్రా, నిర్మాత, దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ, అమల అక్కినేని, మంచు విష్ణు, డాక్టర్ బాలాంబ పాల్గొన్నారు. అనంతరం చిత్రాల రూపకల్పనకు సహకారం అందించిన రామోజీ గ్రూపు, గీతాఆర్ట్స్ ప్రతినిధులకు, రాజేష్, అజిత్‌నాగ్, ప్రజ్వల సంస్థ వ్యవస్థాపకురాలు సునీతాకృష్ణన్ జ్ఞాపికలను అందజేశారు.


గుత్తా సుఖేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందిస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో మంత్రులు నాయిని, పోచారం తదితరులు

రైతుల ఆదాయం రెట్టింపు చేస్తాం: మంత్రి కేటీఆర్

రైసస ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గుత్తా

ఈనాడు, హైదరాబాద్: పాడి-పంటను అభివృద్ధి చేసేందుకు హరిత, క్షీర, నీలి విప్లవాలను తెచ్చి 2022 నాటికల్లా రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్ర రైతు సమన్వయ సమితి(రైసస) ఛైర్మన్‌గా గుత్తా సుఖేందర్‌రెడ్డి సోమవారం హైదరాబాద్ బషీర్ బాగ్‌లోని రైసస సంస్థ కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి కేటీఆర్‌తో పాటు మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్, పోచారం శ్రీనివాసరెడ్డి, నాయిని నర్సింహారెడ్డి, జగదీశ్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. గుత్తా సుఖేందర్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో కేటీఆర్ మాట్లాడుతూ.. నల్గొండ జిల్లాలో డెయిరీని అభివృద్ధి చేసిన గుత్తా రైసస ఛైర్మన్‌గా రైతుల అభివృద్ధికి కృషి చేస్తారని చెప్పారు. పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ..ఎవరిపైనా పెత్తనం చేయడానికి రైసస ఏర్పాటుచేయలేదని, అందరితో కలసి పనిచేస్తూ అన్నదాతలకు మద్దతు ధర ఇప్పించాలన్నారు. తాను, గుత్తా బండికి రెండు ఎడ్లలాంటివారమని, ఎంతమంది బండి ఎక్కినా లాక్కెళ్లే శక్తి ఉందని చమత్కరించారు. ప్రతి 5 వేల ఎకరాలకొక 'రైతు వేదిక' నిర్మాణానికి స్థలాలు సేకరించాలని, ఇందుకు నిధులున్నాయని తెలిపారు. పంటలకు మద్దతు ధర రాకపోతే రైసస వెంటనే కొనుగోలు చేస్తుందన్నారు. గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రైసస సభ్యులు అధికారులకు సహకరించి రైతులకు సాయపడాలన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధి నుంచి తెరాస నేతలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి, వ్యవసాయ కమిషనర్ డాక్టర్ జగన్మోహన్ పాల్గొన్నారు.

మైనారిటీ, స్వయంప్రతిపత్తి కళాశాలలకు 'దోస్త్' మినహాయింపు

ఈనాడు, హైదరాబాద్: ఆన్‌లైన్ ద్వారా డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్-తెలంగాణ(దోస్త్) నుంచి మైనారిటీ, స్వయంప్రతిపత్తి హోదా ఉన్న కళాశాలలను మినహాయించనున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన రుసుములతో కళాశాలలను నడపలేమని, తమకు దోస్త్ నుంచి మినహాయింపు ఇవ్వాలని పలు మైనారిటీ, మరికొన్ని ప్రైవేట్ కళాశాలలు గత రెండేళ్ల నుంచి న్యాయస్థానాన్ని ఆశ్రయించి సొంతగా ప్రవేశాలకు అనుమతి పొందుతున్న సంగతి తెలిసిందే. తాజాగా మైనారిటీ విద్యాసంస్థల యాజమాన్యాలు ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఈక్రమంలో ఆయన అంగీకారం తెలిపినట్లు సమాచారం. మినహాయింపు అంశాన్ని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ తుమ్మల పాపిరెడ్డి ధ్రువీకరించారు. ఈ నెల 19న జరిగే సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.


రాజ్యసభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నరసింహాచార్యులకు నామినేషన్ పత్రాలు అందిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్. చిత్రంలో కాంగ్రెస్ నేతలు సంపత్ కుమార్, జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, గీతారెడ్డి




రాజ్యసభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నరసింహాచార్యులుకు నామినేషన్ పత్రాలు అందిస్తున్న తెరాస అభ్యర్థులు సంతోష్ కుమార్, లింగయ్య యాదవ్, ప్రకాశ్ ముదిరాజ్. హాజరైన ప్రభుత్వ చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్, ఎంపీ కేకే, మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు, ఇంద్రకరణ్‌రెడ్డి, కేటీఆర్. ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి తదితరులు

ఏపీలో తెదేపా అభ్యర్థుల నామినేషన్లు

ఈనాడు అమరావతి: రాజ్యసభ ఎన్నికల్లో తెదేపా అభ్యర్థులుగా సి.ఎం.రమేష్, కనకమేడల రవీంద్ర కుమార్ సోమవారం నామినేషన్లు వేశారు. మధ్యాహ్నం 12.30 గంటలకు రమేష్, 12.45కి రవీంద్ర కుమార్ రిటర్నింగ్ అధికారి సత్యనారాయణకు నామినేషన్ పత్రాలు అందజేశారు. రాజ్యసభ ఎన్నికల్లో మొత్తం నలుగురు నామినేషన్లు వేశారు. తెదేపా తరఫున రెండు, వైకాపా నుంచి రెండు నామినేషన్లు దాఖలయ్యాయి.

రాజ్యసభ ఎన్నికలకు అయిదు నామినేషన్లు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో మూడు స్థానాల్లో జరగనున్న రాజ్యసభ ఎన్నికలకు అయిదు నామినేషన్లు దాఖలయ్యాయి. తెరాస నుంచి జోగినపల్లి సంతోష్‌కుమార్, బండా ప్రకాశ్ ముదిరాజ్, బడుగుల లింగయ్య యాదవ్, కాంగ్రెస్ నుంచి బలరాం నాయక్, స్వతంత్ర అభ్యర్థిగా జాజుల భాస్కర్ నామినేషన్లు వేశారు. నామినేషన్ల దాఖలుకు సోమవారం గడువు కాగా చివరి రోజు సందడిగా సాగింది. తెరాస అభ్యర్థులు గన్‌పార్క్ వద్ద అమరవీరులకు నివాళులర్పించిన అనంతరం శాసనసభకు వచ్చారు. సంతోష్‌కుమార్ మంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఎంపీ కేశవరావు, ప్రభుత్వ చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్‌లతో కలిసి శాసనసభకు వచ్చి రిటర్నింగ్ అధికారి నర్సింహాచార్యులుకు నామినేషన్ పత్రాలను అందవేశారు. లింగయ్య యాదవ్ వెంట మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, తలసాని, మజ్లిస్ నేతలు వచ్చారు. బండా ప్రకాశ్.. ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రులు కేటీఆర్, ఇంద్రకరణ్‌రెడ్డి, పద్మారావులతో కలిసి వచ్చి నామినేషన్లు వేశారు. కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్ టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎల్పీ నేత జానారెడ్డి, ఎమ్మెల్యేలు గీతారెడ్డి, సంపత్‌లతో కలిసి వచ్చి నామినేషన్ పత్రాలను అందజేశారు. నామినేషన్లను మంగళవారం పరిశీలిస్తారు. తెరాస, కాంగ్రెస్ అభ్యర్థులకు నిబంధనల మేరకు పదేసి మంది చొప్పున ఎమ్మెల్యేలు ప్రతిపాదించారు. భాస్కర్‌కు ఒక ఎమ్మెల్యే మద్దతు కూడా లేదు. ఉపసంహరణకు 15 వరకు గడువుంది. ఆ తర్వాత కూడాబరిలో ముగ్గురి కంటే ఎక్కువ ఎక్కువ అభ్యర్థులుంటే 23న ఎన్నికలు అనివార్యమవుతాయి.

ఈనాడు

వ్యూహాత్మక ఒప్పందాలు

నెపోలియన్ బోనపార్టీ తరవాత అత్యంత పిన్నవయస్కుడైన ఫ్రాన్స్ అధ్యక్షుడిగా చరిత్ర సృష్టించిన ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ నాలుగు రోజుల భారత పర్యటన ఎన్నో విధాలుగా విశిష్టమైనది. డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య రాజకీయం, షి జిన్‌పింగ్ భౌగోళిక రాజకీయాలు ప్రపంచవ్యాప్తంగా సరికొత్త కాక రగిలిస్తున్న వేళ- దిల్లీ, పారిస్‌ల వ్యూహాత్మక భాగస్వామ్యం కొత్తపుంతలు తొక్కింది. 'రెండు దేశాల మధ్య రక్షణ సహకారం ఎంతో పటిష్ఠమైంది... అత్యంత విశ్వసనీయ రక్షణ భాగస్వాముల్లో ఫ్రాన్స్ ఒకటని మేము భావిస్తున్నాం'- మెక్రాన్ సమక్షంలో భారత ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్య అది. 'ఈ ప్రాంతంలో మా మొట్టమొదటి వ్యూహాత్మక భాగస్వామిగా ఇండియా ఉండాలి... ఐరోపాలోనూ ఆ మాటకొస్తే పాశ్చాత్య ప్రపంచంలోనూ ఇండియాకు మొట్టమొదటి వ్యూహాత్మక భాగస్వామిగా మేము ఉండాలనుకుంటున్నాం'- అన్న మెక్రాన్ ప్రతిస్పందనలోని గూఢత, గాఢతలకు ఉభయ దేశాల మధ్య కుదిరిన పద్నాలుగు ఒప్పందాలే అద్దం పడుతున్నాయి. వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, రక్షణ, అంతరిక్షం, సాంస్కృతిక విద్యారంగాల్లో బహుముఖ తోడ్పాటుతో పాటు ద్వైపాక్షిక అణుసహకారానికి పదేళ్ల క్రితం ఫ్రాన్స్ అధ్యక్షుడిగా నికోలస్ సర్కోజీ పర్యటనలో మేలుబాటలు పడ్డాయి. ఆయా రంగాల్లో తదుపరి అడుగులకు మదుపులొత్తుతున్న తాజా ఒప్పందాల విలువ లక్ష కోట్ల రూపాయల (1,600 కోట్ల డాలర్ల) పైచిలుకు అంటున్నారు. నింగి, నేల, సముద్రతలాల నుంచి అంతరిక్షం దాకా భారత్‌తో వ్యూహాత్మక నెయ్యాన్ని గట్టిగా ముడివేసిన మెక్రాన్- ఇండో పసిఫిక్‌లో నేడు నౌకల స్వేచ్ఛాయానం విషయంలో ఇండియా మాటే ఫ్రాన్స్ బాట అని స్పష్టీకరించారు. దాదాపు రెండు పుష్కరాల క్రితం దాకా బీజింగ్‌తో ప్రగాఢానుబంధం గల ఫ్రాన్స్, మారిన కాలమాన పరిస్థితుల్లో భారత్‌కు చేరువ కావడమే కాదు- వ్యూహాత్మక బాంధవ్యాన్ని కట్టుదిట్టం చేసుకోవాలనుకొంటోందనేందుకు ద్వైపాక్షిక ఒప్పందాలు, అధినేతల సంయుక్త ప్రకటనలే రుజువు!

దిల్లీ-పారిస్‌ల మధ్య ద్వైపాక్షిక బాంధవ్యం సరైన గాడిలో పడటానికి 1995నాటి పీవీ ఫ్రాన్స్ పర్యటన పుణ్యం కట్టుకొంది. 'భారత్‌పై ఎవరూ షరతులు రుద్దలేరు... అణు సహకారంపై మా మధ్య చర్చలను ఏ శక్తీ అడ్డుకోలేద'న్న ఫ్రాన్స్ అధ్యక్షుడు జాక్వెస్ షిరాక్ 1998నాటి ఇండియా పర్యటనలోనే వ్యూహాత్మక బాంధవ్యం పెనవడింది. భారతావని గణతంత్ర స్వర్ణోత్సవాలు, వజ్రోత్సవాలకు ఫ్రాన్స్ అధ్యక్షుల్నే విశిష్ట అతిథులుగా ఆహ్వానించడం- ఎలిజీ ప్యాలెస్‌కు ఇండియా ఇస్తున్న ప్రాధాన్యానికి చిహ్నం. అణు రియాక్టర్లు, రక్షణ ఉత్పత్తుల రంగాల్లో గొప్ప ముందంజ వేసిన ఫ్రాన్స్‌కు ఇండియా అక్షరాలా అవకాశాల స్వర్గం! ఫ్రాన్స్‌కు చెందిన అరేవాతో కలిసి మహారాష్ట్రలోని జైతాపూర్ అణు విద్యుత్కేంద్ర నిర్మాణానికి 2010లో సర్కోజీ పర్యటన సందర్భంలోనే ఒప్పందాలు ఖరారయ్యాయి. మూడో తరానికి చెందిన రెండు రియాక్టర్లతోపాటు పాతికేళ్ల పాటు ఇంధన సరఫరాకూ ఫ్రాన్స్ సమ్మతించినా ఆ ప్రాజెక్టు ఇంకా పట్టాలకెక్కనేలేదు. 9.6 గిగావాట్ల సామర్థ్యంతో ప్రపంచంలోనే అతిపెద్ద అణువిద్యుత్కేంద్ర నిర్మాణాన్ని ఈ ఏడాది చివరినాటికి మొదలుపెట్టాలని తాజాగా మోదీ, మెక్రాన్లు నిర్ణయించారు. అణు ఉత్పాతాలు ఎంత విలయ సదృశమో తెలిసినా నేతాగణాలు వెనక్కి తగ్గడంలేదు! రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు పద్దుపై విపక్షాలు విరుచుకుపడుతున్న దశలోనే- రహస్య సమాచార పరిరక్షణ ఒప్పందం మరిన్ని సందేహాలు రాజేయక మానదు. మరిన్ని రఫేల్ యుద్ధవిమానాలు కొనుగోలు చెయ్యాలంటూ మొహమాటపెట్టిన ఫ్రాన్స్- రక్షణ మంత్రుల స్థాయిలో వార్షిక చర్చలకు రంగం సిద్ధం చేసింది. చైనా దూకుడుకు విరుగుడు మంత్రం, ట్రంప్ కలుష్య అజెండాకు సౌరతంత్రం- అంతర్నిహిత సూత్రంగా మెక్రాన్ పర్యటన ఫలప్రదమైంది!

ఇండో పసిఫిక్ ప్రాంతంలో అంతా తన కనుసన్నల్లో సాగాలంటున్న చైనా అంతర్జాతీయ ఒడంబడికల్నీ కాలదన్ని విస్తరణ కాంక్షతో పేట్రేగుతోంది. ఈ తరుణంలో పరస్పరం సైనిక స్థావరాలను వినియోగించుకొనేలా దిల్లీ ఫ్రాన్స్‌ల మధ్య కుదిరిన ఒప్పందం, మెక్రాన్ మాటల్లో చెప్పాలంటే అపూర్వమైనది. హిందూ మహాసముద్రంలో అతిపెద్ద నౌకాదళ శక్తిగా రాజిల్లుతున్న ఫ్రాన్స్‌కు దక్షిణ పసిఫిక్‌లోనూ నావికా దళ స్థావరాలున్నాయి. తాజా ఒప్పందంతో, ఫ్రాన్స్ స్థావరాలను భారత్ వినియోగించుకొనే వెసులుబాటు కలగడమే కాదు- దక్షిణ చైనా సముద్ర సమీపం దాకా ఇండియా తన ఉనికిని చాటుకోగల వీలుచిక్కింది. 'ముత్యాల సరం' మాదిరిగా ఇండియాకు ఉచ్చు బిగిస్తున్న చైనా దుందుడుకు నైజానికి 'చెక్'పెట్టే కీలక పరిణామమిది. ప్రధాని మోదీ మానస పుత్రికగా అంకురించి, ఫ్రాన్స్ అధ్యక్షుడిగా ఒలాన్ దన్నుతో 2015లో పట్టాలకెక్కిన అంతర్జాతీయ సౌర కూటమి సదస్సుకూ ఇండియా వేదికైంది. రమారమి లక్ష కోట్ల డాలర్ల పెట్టుబడులతో ప్రపంచ దేశాల శుద్ధ ఇంధన అవసరాల్ని తీర్చేలా 2030నాటికి వెయ్యి గిగావాట్ల సౌర విద్యుదుత్పత్తి లక్ష్యంతో సౌర కూటమి (ఐఎస్ఏ) ఏర్పాటైంది. వాతావరణ మార్పు దుష్ప్రభావాల్ని కాచుకోవడానికి సంఘటిత అజెండాతో నిరుడు డిసెంబరు తొలివారం నుంచి పని ప్రారంభించిన ఐఎస్ఏ తొలి సదస్సులో మోదీ పది సూత్రాల కార్యాచరణను ప్రస్తావించారు. అన్ని దేశాలకూ చౌకలో సహజ ఇంధనం అందించే మహాయజ్ఞానికి నవకల్పనల తోడ్పాటు, వడ్డీ రాయితీ రుణాలు ఎంతో కీలకం కానున్నాయి. చైనా ప్రతిపాదించిన ఒన్ బెల్ట్ ఒన్ రోడ్ ప్రాజెక్టును మించి బహుళార్థ ప్రయోజనాలందించే సౌర కూటమి- భారత్, ఫ్రాన్స్‌ల సారథ్య పటిమకు కరదీపిక కానుంది. దానాదీనా మెక్రాన్ పర్యటన వ్యూహాత్మక ప్రస్థానంలో నిశ్చయంగా మైలురాయి!

ఆర్థిక సవాళ్లు యథాతథం


పెద్ద నోట్ల రద్దు, వస్తుసేవల పన్ను (జీఎస్‌టీ)ల మూలంగా భారత్ ఆర్థికాభివృద్ధి రేటు అనుకున్నంత వేగంగా పెరగలేదని మథనపడుతున్న సమయంలో- పులిమీద పుట్రలా పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) కుంభకోణం బయటపడింది. బ్యాంకుల నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏ) సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం కిందుమీదులవుతున్న సమయంలో పీఎన్‌బీ వ్యవహారం బట్టబయలు కావడం నిస్సందేహంగా ఆందోళనకరమే. ఒకదాని వెంట ఒకటిగా అశుభ వార్తలు వచ్చిపడుతున్న సమయంలో ఎన్‌డీఏ ప్రభుత్వానికి మళ్ళీ ఆశాభావం, ఆత్మవిశ్వాసం కలిగించే శుభవార్తను కేంద్ర గణాంక సంస్థ (సీఎస్ఓ) వెలువరించింది. ఆ సంస్థ సమాచారం ప్రకారం 2017-18 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో భారత ఆర్థిక వ్యవస్థ 7.2 శాతం వృద్ధిరేటు నమోదు చేసింది. గడచిన అయిదు త్రైమాసికాల్లో ఇదే అతి పెద్ద అభివృద్ధి రేటు. భారత ఆర్థిక వ్యవస్థ పునరుత్తేజితం అవుతోందనడానికి నిదర్శనమిది. వినియోగదారుల నుంచి వస్తు సేవలకు గిరాకీ పెరగడం, తదనుగుణంగా కంపెనీలు అదనపు పెట్టుబడులు పెట్టడం, అదనపు ఆదాయాలు ఆర్జించడం, స్థూల స్థిర పెట్టుబడి సంచయం 12 శాతం వృద్ధి నమోదు చేయడం- ఇవన్నీ పుంజుకొంటున్న ఆర్థికాభివృద్ధికి నికర సంకేతాలు. నేడు గనుల రంగంలో తప్ప మిగతా రంగాలన్నింటిలో వృద్ధి నమోదు కావడం సానుకూల పరిణామం.



అన్నిరంగాల్లోనూ రాణింపు అవసరం

సీఎస్ఓ గణాంకాల ప్రకారం మూడో త్రైమాసికంలో వ్యవసాయ రంగం నాలుగు శాతం, పారిశ్రామికోత్పత్తి రంగం 8.1 శాతం, నిర్మాణ రంగం 6.8 శాతం వృద్ధి నమోదు చేశాయి. వ్యాపారం, హోటళ్లు, రవాణా, కమ్యూనికేషన్లు, ప్రసార సంబంధ సేవల్లో తొమ్మిది శాతం పెరుగుదల కనిపించింది. విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా వంటి రంగాలూ 6.1 శాతం వృద్ధి కనబరచాయి. ఇది శుభసూచనే కానీ అంతా దివ్యంగా ఉందన్న సంబరపాటు ఏమాత్రం పనికిరాదు. అధిక వృద్ధిరేటు సాధనకు తోడ్పడే విధానాలను చేపడుతూనే ఉండాలి. గత త్రైమాసికంలో సాధించిన ప్రగతి అద్భుతమని భావించరాదు. 2016లో ఇదే త్రైమాసికంతో పోల్చి చూసినప్పుడు మాత్రమే అది అధిక ప్రగతిగా తేలుతుంది. ఇక్కడ గమనించాల్సిన ముఖ్యాంశం ఒకటుంది. అదేమంటే 2016 మూడో త్రైమాసికం (అక్టోబరు-డిసెంబరు)లో పెద్దనోట్ల రద్దువల్ల ఆర్థిక కార్యకలాపాలు దెబ్బతిని, అభివృద్ధి రేటు మందగించింది. దానితో పోలిస్తే ఇప్పుడు ఎక్కువ వృద్ధిరేటు సాధించినట్లు కనిపించడం సహజమే. దీన్ని చూసుకుని ఈ విషయంలో మనం చైనాను మించిపోయామంటూ ఆనందంతో గంతులేయడం తగదు. చైనా వృద్ధిరేటు ప్రస్తుతం కాస్త మందగించిందంతే. దీన్ని గమనించకుండా ఆర్థికంగా చైనాను అధిగమిస్తున్నామని గర్విస్తూ విధానపరంగా తీసుకోవలసిన ముఖ్య నిర్ణయాలను అలక్ష్యం చేయడం మంచిది కాదు.

ప్రస్తుతం కనిపిస్తున్న మెరుగుదలను నిలబెట్టుకొంటూ మరింత ఎక్కువ వృద్ధి రేటు సాధించడానికి ప్రభుత్వం ప్రాముఖ్యం ఇవ్వాలి. ఆ సత్తా భారత ఆర్థిక వ్యవస్థకు ఉంది. ఆ శక్తిని ఆచరణలోకి తీసుకురావడమెలా అన్నదే ప్రభుత్వం ముందున్న సవాలు. వార్షిక అభివృద్ధి రేటు లక్షిత 6.6 శాతాన్ని అందుకోవాలంటే నాలుగో త్రైమాసికంలోనూ 7.1 శాతం అభివృద్ధి నమోదు చేయాలి. అన్ని రంగాలూ ఊపందుకొంటేనే ఇది సాధ్యపడుతుంది. 2017 మూడో త్రైమాసికంలో వ్యవసాయ రంగం మెరుగైన ప్రగతి సాధించినప్పటికీ మొత్తం ఆర్థిక వ్యవస్థ పరుగులు తీయడానికి అదెంత మాత్రం సరిపోదు. పైగా గత త్రైమాసికాలతో పోలిస్తే ప్రస్తుత వృద్ధిరేటు ఎక్కువగా ఉన్నట్లు కనిపిస్తోందే తప్ప ఆర్థిక రథాన్ని ఉరకలెత్తించేంత గొప్ప రేటు కాదు. 2016 ద్వితీయ త్రైమాసికంలో 4.1 శాతం వృద్ధి సాధించిన వ్యవసాయ రంగం, 2017లో ఇదే కాలంలో కేవలం 1.7 శాతం పెరిగింది. వ్యవసాయం వర్ధిల్లకపోతే గ్రామీణ ఆదాయాలు పెరగవు. వస్తుసేవలకు గిరాకీ సైతం ఇనుమడించదు. దాంతో ఉత్పత్తి కుంటుపడి యావత్ ఆర్థిక వ్యవస్థను ఈ పరిస్థితి వెనక్కులాగుతుంది. దీన్ని నివారించడానికి, పల్లెప్రజల ఆదాయాన్ని పెంచడానికి యథాశక్తి కృషిసల్పాలి. పారిశ్రామిక ఉత్పత్తి రంగంలోనూ మెరుగుదల కనిపిస్తున్నా అది పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ వల్ల తగిలిన దెబ్బ నుంచి ఇప్పుడిప్పుడే కోలుకోవడం వల్ల వస్తున్న సానుకూలతే తప్ప మరేమీ కాదు. ఇంతాచేసి 2017-18లో పారిశ్రామికోత్పత్తి రంగం 4.6 శాతం వృద్ధిరేటునే నమోదు చేయనుంది. అదే 2016-17లో ఈ రంగం 7.9 శాతం వృద్ధి సాధించిందని మరచిపోకూడదు. మళ్ళీ అంత వృద్ధిని, వీలైతే ఇంకా ఎక్కువ అభివృద్ధి సాధించాలంటే పెట్టుబడి, వినియోగ, ప్రభుత్వ వ్యయాలను పెంచడం ఆవశ్యకం. వివిధ రంగాల్లో పెట్టుబడులు పుంజుకొంటే ఉత్పత్తి సామర్థ్యం, దానితోపాటే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. ఉత్పత్తి పెరిగితే స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ), ఉద్యోగాలు పెరిగితే వస్తుసేవల వినియోగం ఊపందుకుంటుంది. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లోకి పెట్టుబడులు ప్రవహిస్తే ప్రజల ఆదాయాలూ పుంజుకొంటాయి. కానీ, బ్యాంకుల దుస్థితి వల్ల అవి ఈ రెండు రంగాలకు రుణ రూపంలో తగినన్ని నిధులు సమకూరడం లేదు. దీని వల్ల పెట్టుబడి, వినియోగ వ్యయాలు గణనీయంగా పెరిగే ఆశ కనిపించడంలేదు. ఈ పరిస్థితిలో ప్రభుత్వ వ్యయం పెంచడమొక్కటే మార్గం. కానీ, ద్రవ్యలోటును కట్టడి చేయడానికి కట్టుబడి ఉన్న ప్రభుత్వం, తన వ్యయాన్ని తగ్గించుకొనక తప్పడంలేదు.



ఆదాయానికి మించిన ఖర్చులతో కేంద్ర, రాష్ట్రాలు ద్రవ్యలోటు పెరగడానికి కారణమవుతున్నాయి. రకరకాల రుణమాఫీలతో రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలు దుర్బలమవుతున్నాయి. ఈ మాఫీల కింద రద్దయిన రుణ మొత్తాలు జీడీపీలో ఒక శాతానికి సమానమని అంచనా. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గడం, ప్రభుత్వం పెట్రో ఉత్పత్తులపై రాయితీలు ఎత్తివేయడం వల్ల దేశానికి బోలెడు డబ్బు ఆదా అయ్యి, ద్రవ్యలోటు తగ్గి ఉంటుందనే పొరపాటు అభిప్రాయం జనంలో ఉంది. వాస్తవమేమంటే 2014లో ద్రవ్యలోటు జీడీపీలో 6.7 శాతం. 2017లో అది కేవలం 0.3 శాతం తగ్గి 6.4 శాతానికి చేరింది. త్వరలో కొత్త వేతన సంఘ సిఫార్సుల వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యయాలు అధికమై, ద్రవ్యలోటు మరోసారి కట్టుతప్పనుంది. మరోవైపు చమురు, ఇతర ముడిసరకుల ధరలు క్రమంగా పైకెగబాకుతూ లోటును మరింత విషమం చేయనున్నాయి. 2019 ఎన్నికలు దగ్గర పడుతున్నవేళ- కేంద్ర, రాష్ట్రాలు ఖర్చులు తగ్గించుకుంటాయనే ఆశ లేదు. ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి అవి మరింత ఎక్కువ ఖర్చుపెట్టనున్నాయి. దానాదీనా ద్రవ్యలోటు ఎగబాకడమే తప్ప తరగకపోవచ్చు. దీనివల్ల ధరలు విజృంభించి ప్రజలు, ప్రభుత్వం ఇక్కట్లపాలు కాక తప్పదు. ఈ నేపథ్యంలో ఆదాయం పెంచుకోవడానికి ప్రభుత్వం గట్టిగా కృషి చేయాలి.

ఎగుమతులే ఆలంబనగా...

ఎగుమతులు ఇనుమడిస్తే ఆదాయమూ అధికమవుతుంది కాబట్టి, కొంత కాలంగా స్తబ్ధుగా ఉన్న ఈ రంగంలో మళ్ళీ కొత్త జవజీవాలు నింపాలి. పెద్ద సంఖ్యలో కార్మికులను నియోగించి తయారుచేసే ఉత్పత్తుల ఎగుమతి ద్వారా భారత్ ఇంతకాలం నెట్టుకొచ్చింది. ఇవి చవక కాబట్టి విదేశీ విపణుల్లో బాగానే గిరాకీ ఉండేది. ఆందోళనకరంగా ఈ తరహా వస్తువుల ఎగుమతి ఇటీవలి కాలంలో తగ్గిపోతోంది. దీన్ని వెంటనే సరిదిద్దాలి. ఎగుమతులు దేశ ఆర్థికవ్యవస్థకు ఆలంబనగా నిలవడమేకాక పెద్దయెత్తున ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి. ఇటీవల ఇవి కుదించుకుపోవడానికి గల కారణాలను అన్వేషించి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలి. పెద్దనోట్ల రద్దు, వస్తుసేవల పన్నువల్ల సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్ఎంఈ)ల నుంచి భారీ సంస్థల వరకు కష్టనష్టాలకు గురై ఎగుమతుల కోసం చేసే ఉత్పత్తి, ఆయా సరకుల పంపిణీ వ్యవస్థలు దెబ్బతిన్నాయి. మన దేశంలో అత్యధిక ఉపాధి అవకాశాలను కల్పించే ఎంఎస్ఎంఈ రంగమే దెబ్బతినడం ఆర్థిక వ్యవస్థ మందగతికి కారణమవుతోంది. ఈ రంగంలో నవీన సాంకేతికతతో కార్మికుల ఉత్పాదక శక్తిని పెంచినప్పుడు మన ఎగుమతులు విదేశాలతో సమర్థంగా పోటీపడి అంతర్జాతీయ విపణిలో గిరాకీ పెంచుకోగలుగుతాయి. ఎగుమతుల ద్వారా ఆదాయం పెరిగినప్పుడు స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి చెందుతుంది. అన్నింటినీ మించి అంతేవాసులకు వనరులు దోచిపెట్టే పెట్టుబడిదారీ విధానానికి తక్షణం తెర దించాలి. రాజకీయ నాయకులు, వ్యాపారులు, అధికారుల అపవిత్ర పొత్తుతో నడిచే ఈ విధానాన్ని ఆశ్రిత పెట్టుబడిదారీ విధానమంటున్నారు. తమవాళ్లకు పర్మిట్లు ఇవ్వడం, ప్రభుత్వ నిధులు అందించడం, ప్రత్యేక పన్ను రాయితీలు మంజూరు చేయడం, ఇతర విధాలుగా ప్రభుత్వం జోక్యం చేసుకోవడం వంటి అవలక్షణాలన్నీ ఈ విధానంలో ఉంటాయి. పీవీ నరసింహారావు హయాములో మొదలైన ఆర్థిక సంస్కరణల ప్రధాన లక్ష్యం- లైసెన్సులు, పర్మిట్ల రాజ్యానికి స్వస్తి పలకడమే. కానీ, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం అంతం కాకపోవడంతో ఆ లక్ష్యం నీరుగారిపోయింది. ఆర్థికరంగంలో ఎటువంటి పక్షపాతం లేకుండా అందరికీ సమానావకాశాలు కల్పించినప్పుడు పోటీలో ప్రతిభావంతులు నెగ్గి సులువుగా పరిశ్రమలు, వ్యాపారాలను ప్రారంభించి దేశ ఆర్థిక ప్రగతికి చేయూతనివ్వగలుగుతారు. పెట్రోలియం, బొగ్గు, ఇనుము, కమ్యూనికేషన్, బ్యాంకింగ్ రంగాల్లో వలపక్షానికి తావులేకుండా చేయగలిగితే నిజమైన అభివృద్ధి సాకారమవుతుంది. కానీ, పూర్వ ప్రభుత్వాల హయాములో ఈ రంగాల్లో అయినవాళ్లకు దోచిపెట్టే తంతు జోరుగా సాగిపోయింది. ఈ అవినీతి అప్పటి ప్రభుత్వాలకు ఎసరు తేవడంతోపాటు ఆర్థిక సంస్కరణల రథాన్ని తప్పుదోవ పట్టించింది. బ్యాంకింగ్ రంగంలో నిరర్థక ఆస్తుల సమస్య భీకర రూపు ధరించింది. బ్యాంకింగ్ రంగంలో ఆ వ్యవస్థను చక్కదిద్దడానికి 2018లో కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్రవేసిన పరారీలోని ఆర్థిక నేరస్థుల బిల్లు, 2017 ఆర్థిక పరిష్కారాలు-డిపాజిట్ బీమా బిల్లు ఎంతో తోడ్పడతాయి. దీర్ఘకాలంలో సుస్థిర ప్రగతి సిద్ధించాలంటే ఆర్థిక వ్యవస్థను ప్రక్షాళించి, ఆశ్రిత పెట్టుబడిదారీ పోకడలకు అడ్డుకట్ట వేయాలి. 2017-18 మూడో త్రైమాసికంలో ఆర్థికాభివృద్ధి పుంజుకోవడం శుభవార్తే కానీ, పైన చెప్పుకొన్న లోపాలను పరిష్కరించకపోతే దేశఆర్థిక రథం గాడితప్పి మళ్ళీ మందగతిలోకి జారిపోయే ప్రమాదం ఉంది!

– డాక్టర్ మహేంద్రబాబు కురువ

వసివాడుతున్న పసితనం

దత్తత (అడాప్షన్), సంరక్షణ (ఫాస్టర్ కేర్) అనేవి ఒకే విధమైన అర్థమిచ్చినా- ఆ రెండింటి మధ్య కొంత వైరుధ్యముంది. పిల్లల్ని దత్తు ఇవ్వడానికి సంబంధించి, వాటిని ఇంకా పర్యాయపదాలుగానే పరిగణిస్తున్నారు. ఇతర దేశాల్లో వాటి పరిధి విస్తరిస్తున్నా, ఇండియాలో కొంతకాలంగా బాలల సంరక్షణ ప్రక్రియకు ప్రాచుర్యం పెరుగుతోంది. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. దత్తత స్వీకార ప్రక్రియలో సాంకేతిక పరిజ్ఞాన వినియోగం పెరిగినా- ఇప్పటికీ నిర్వహణ, పాలన, చట్టసంబంధమైన పలు అవస్థలు తప్పడంలేదు. ఫలితంగా, ఆశించిన స్థాయిలో పిల్లల్ని దత్తు తీసుకొనేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. సంబంధిత ప్రభుత్వ విభాగాలతో పాటు, స్వచ్ఛంద సేవాసంస్థల్లోనూ చొరవ తగ్గుముఖం పడుతోంది. దేశంలో వివిధ ఆర్థిక, సామాజిక స్థితిగతుల ప్రభావంతో అనాథలుగా మారుతున్న బాలబాలికలెందరో! వారి వ్యథాభరిత గాథలు సమాచార, ప్రసార మాధ్యమాల ద్వారా అధిక సంఖ్యలో వెలుగు చూస్తున్నాయి. వీటన్నింటి పర్యవసానంగా 'ఫాస్టర్ కేర్ ఇండియా' (ఎఫ్‌సీఐ) పేరిట ప్రత్యేక విధానం క్రమేణా ప్రాధాన్యం సంతరించుకుంటోంది. అనాథ అనే పదం వినాలన్నా ఎంతో బాధగా ఉంటుంది. అలాంటి పిల్లలు దేశంలో 3.2కోట్ల మందికి పైగా ఉన్నారన్న వాస్తవం గుండెను పిండేస్తుంది. 'కేంద్రం, రాష్ట్రాలు ఆచరణకు దిగాలే కానీ- అనాథ బాలల సంక్షేమం అసాధ్యమేమీ కాదు. వారి పోషణ లేదా సంరక్షణకు ఉపకరించే విధానాన్ని విస్తరించడంపై శ్రద్ధ వహించాలి' అని సర్వోన్నత న్యాయస్థానం సరిగ్గా రెండేళ్ల క్రితం దిశానిర్దేశం చేసింది. లోటుపాట్ల నివారణకు అవి గట్టి చర్యలు చేపట్టాలని ధర్మాసనం అప్పట్లోనే ఆదేశించింది. పథకాలు, కార్యక్రమాల అమలు తీరుతెన్నుల్లో పలు మార్పుచేర్పులు చోటుచేసుకోవాలనీ స్పష్టీకరించింది. ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు వివిధ స్థాయుల్లో చేపట్టాల్సిన చర్యలు, సంస్కరించాల్సిన విధానాలు ఇంకా అనేకం ఉన్నాయి.

సరళీకరణ కొనసాగింపు

పిల్లల దత్తత సమాచారం, మార్గనిర్దేశక పద్ధతి (చైల్డ్ అడాప్షన్ రిసోర్స్ ఇన్ఫర్మేషన్, గైడెన్స్ సిస్టమ్- కేరింగ్) పేరిట ఇప్పటికే విధానం అమలవుతోంది. బాలల సంరక్షణ కేంద్రాలన్నింటినీ ఒకే నియంత్రణలోకి తేవాలన్నది దీని ప్రధాన ధ్యేయం. మరో కోణంలో చూసినప్పుడు- ఎన్నో కారణాల వల్ల బిడ్డలు లేని, దక్కనివారికి; వీడి ఉండాల్సిన పరిస్థితిలోని కన్నవారికి ఎంతో కొంత ఊరట దత్తతతోనే లభిస్తుంది. తమకు బిడ్డలున్నా, లేకున్నా- ఎక్కడో గల అనాథల్నీ చేరదీసి అక్కున చేర్చుకొని, విద్యాబుద్ధులు నేర్పించి ప్రయోజకుల్ని చేసే కరుణార్ద్ర హృదయులు ఉంటారు. వారు ఆ బాలల్ని కనుల పంటగా, ఇంటి దీపాలుగా భావిస్తారు. అలా వ్యక్తిగత సంతృప్తి, సంతోషాన్ని సొంతం చేసుకోవడంతో పాటు సామాజిక బాధ్యత నిర్వర్తించడంలోనూ ముందుంటారు. అలాంటివారికి బాసటగా నిలవడంలో దత్తత సంబంధిత కేంద్ర ప్రాధికార సంస్థ- సీఏఆర్ఏ (సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ- 'కార') పాత్ర, ప్రాధాన్యం ఎనలేనివి. దత్తత తీసుకోవడం అంటే, కనకపోయినా కడుపులో పెట్టుకొని చూసుకోవడం! ఆ ఉదార హృదయుల కనుసన్నల్లోనే అటువంటి బిడ్డలకు కొత్త జీవితం లభిస్తుంది. ఆ బిడ్డలు అన్నివిధాలా ఎదుగుతారు. కేంద్ర మహిళా-శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ నిర్వచనం ప్రకారం, దత్తత అనే నాణేనికి పార్శ్వాలూ ముఖ్యమైనవే. చక్కగా పెంచుతామని ముందుకొచ్చినవారికి తగిన పిల్లల్ని ఇవ్వాల్సి ఉంటుంది. పిల్లలకు సరైన తల్లిదండ్రుల్ని ఎంపిక చేయడమూ ప్రధానమే. అవన్నీ స్వతంత్ర విభాగం 'కార' పర్యవేక్షణలోనే కొనసాగుతుంటాయి. అది విధులపరంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని కొన్ని నెలల నుంచి విరివిగా వినియోగిస్తోంది. మొత్తం దత్తత విధానమంతటినీ సరళీకరించే పనిలో నిమగ్నమవుతోంది. చట్టపరమైన చిక్కులు, న్యాయసంబంధ వివాదాలు తలెత్తకుండా- అన్ని దశల్నీ 'ఆన్‌లైన్'లో ఉంచుతోంది. అవే విధివిధానాల్ని రాష్ట్రస్థాయిలో 'సారా' (స్టేట్ లెవెల్ రిసోర్స్ అథారిటీ), జిల్లాల్లో





'దాతృత్వ పోషణ'తో సంరక్షణ

'సా' (స్పెషలైజ్డ్ అడాప్షన్ ఏజెన్సీలు) అనుసరిస్తున్నాయి. దీనివల్ల, దత్తు ఇవ్వండంటూ పిల్లల సంరక్షణ నిలయాలు లేదా ఆయా ప్రభుత్వ శాఖల కార్యాలయాల చుట్టూ ఎవరూ అదేపనిగా తిరగాల్సిన పని ఉండదు. నెలల తరబడి నిరీక్షించాల్సిన అవసరం అసలే లేదు. ఏ ప్రాంతంవారినైనా, ఎక్కడి నుంచి అయినా దత్తత తీసుకోవచ్చు. అనాథ బిడ్డను ఆదరించడం వల్ల ఆ పాప/బాబుకు నూతన జీవితమిచ్చినట్లవుతుంది. ఆత్మీయత కనబరచడమే కాక, జీవిత భద్రత కల్పించామన్న అనిర్వచనీయ తృప్తి కలుగుతుంది.

బాల్యంలో ఉండగానే ఎందరెందరో తోడు, నీడ కోల్పోతున్నారు. కారణాలేవైనా వీధుల పాలవుతున్నారు. వారిని సంరక్షించాల్సిన నిలయాల్లో అనేకం నానారకాల సమస్యలతో సతమతమవుతున్నాయి. పిల్లల ప్రయోజనాల పరిరక్షణలో ముందుండాల్సిన జిల్లాల విభాగాల (డీసీపీయూ) పరిస్థితీ ఆశాజనకంగా లేదు. శిశు గృహాలు, విహార్‌లు దేశంలో చాలా ఉన్నా- వాటి 'దత్తత అనుమతి విధానాల' తీరు ఆటంకాల్ని ఎంతకీ అధిగమించడం లేదు. సాంకేతిక పరిజ్ఞానానికి పాలన, న్యాయసంబంధమైన సత్వర చర్యలు జతపడితే తప్ప- దత్తత పద్ధతి సులభతరం కాదు. దుర్భర దారిద్ర్యం, తుపాన్ల వంటి ప్రకృతి విపత్తుల బెడద, కరవు కాటకాలు, వ్యాధులు-బాధలు... బాల్యాన్ని ఛిద్రం చేస్తున్నాయి. ఆ కష్టనష్టాల విషకోరల నుంచి పిల్లల్ని కాపాడేందుకు గతేడాది దత్తత (నియంత్రణ) చట్టాన్ని కేంద్రప్రభుత్వం రూపొందించింది. దత్తు తీసుకొనేందుకు ముందుకొచ్చినవారి తీరుతెన్నుల పరిశీలన గడువును రెండు నుంచి మూడేళ్లకు పెంచింది. సమ్మతి కుదిరిన తరవాత, బాలుడు/బాలికను తీసుకువెళ్లేందుకు వ్యవధిని 15 నుంచి 20 రోజులకు పొడిగించింది. వాటితో పాటు ఇతర అంశాలపైనా పౌరుల్లో అవగాహన పెంచాల్సి ఉన్నప్పటికీ, అదే కొరవడింది. ఆ పరిణామాల క్రమంలో ప్రస్తుతం 'ఫాస్టర్ పేరెంటింగ్' ప్రాధాన్యం ఇనుమడిస్తోంది.

సంస్థల సహాయ సహకారాలు

జైపూర్ (రాజస్థాన్)లో ఒకప్పుడు బాలల హక్కుల కమిషన్ అధ్యక్షురాలిగా పనిచేసిన మనన్, వందమంది చిన్నారుల ఆలనాపాలనా చూసేందుకు ముందడుగు వేశారు. ఇదివరకే 60మంది చిన్నారుల్ని అక్కున చేర్చుకున్న చలనచిత్ర ప్రముఖులు లారెన్స్, మరో ఆరుగురికీ ప్రేమను పంచేందుకు సిద్ధమయ్యారు. ఉత్తర్ ప్రదేశ్‌లో నివసించే వీరేందర్ దంపతులు గతంలోనే ఒక అనాథ దివ్యాంగ బాలుణ్ని దత్తు తీసుకున్నారు. వారిప్పుడు ఒకరూ ఇద్దరూ కాదు- 50 మంది బాలబాలికలకు తల్లిదండ్రుల బాధ్యత వహిస్తున్నారు. సినీ నటీమణి హన్సిక 35 మంది అనాథల్ని కంటికి రెప్పలా చూసుకుంటున్నారు. భువనేశ్వర్ (ఒడిశా)లోని ఇంద్రజిత్ అనే ఉపాధ్యాయుడు, మురికివాడల్లో ఉండే బాలల్లోని పాతికమందిని దరిజేర్చుకోవడం ద్వారా అన్నీ తానే అయ్యారు. మహారాష్ట్రలోని పుణెకి చెందిన సామాజిక సేవా కార్యకర్త ఆదిత్య- గుండె సంబంధ వ్యాధితో తల్లడిల్లుతున్న ఏడాదిన్నర వయసు గల పసివాణ్ని దత్తు తీసుకుని గుండెలకు హత్తుకున్నారు. కేరళ రాష్ట్రప్రభుత్వం 'సనాథ' పేరిట ప్రత్యేక బాల సంరక్షణ పథకాన్ని అమలుచేస్తోంది. వారిని మొదట వేసవి సెలవుల్లో పెంపుడు తల్లిదండ్రుల ఇళ్లకు పంపి, ఆ తరవాత దత్తతకు అనుమతిస్తున్నారు. అందుకు వివిధ సేవాసంస్థల నుంచీ సహాయ సహకారాలు పొందుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లోనూ 'దాతృత్వ పోషణ' క్రమంగా విస్తరిస్తోంది. చదువుసంధ్యలు నేర్పడం ద్వారా అనాథ బాలల జీవితాల్లో వెలుగులు నింపుతున్నందుకు; భద్రత, ధీమా కలిగిస్తున్నందుకు ఆ 'పెంచినవారికి' ప్రభుత్వం తరఫున విద్య, వైద్యం, ఇతర ఖర్చులు చెల్లిస్తున్నారు. ఆయా బాలల సంరక్షణ, శిక్షణ, ఉపాధి కల్పనలే ధ్యేయాలుగా తెలంగాణ సర్కారు ప్రత్యేక సొసైటీని నెలకొల్పింది. నిలువ నీడ కోల్పోయిన పిల్లలకు దత్తత భాగ్యం కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రస్తుతం సమగ్ర రీతిన విధి విధానాలు రూపొందిస్తోంది. వీటికి సమర్థ ఆచరణ జతపడిననాడు- బాల్యానికి కొంతైనా భరోసా లభించినట్లే!

– శరత్

నిజానిజాలు

జీవితం అనిర్వచనీయం. అది విచిత్రాల సమ్మేళనం. 'మనిషి మనుగడ ఒక ఆశ' అంటుంది కథా రుద్రోపనిషత్తు. జీవనం వాస్తవమన్నది అనేకులు విశ్వసించే భావన. అది అసత్యమయ్యే అవకాశం ఉంటుందంటాయి ఉపనిషత్తులు. ఎవరి ఉనికి వారికి నిజమని అనిపించినా, 'నేను ఎవరు' అనేది తెలియకుంటే? ఆ స్థితి విస్మయం కలిగించేదే!

చక్రభ్రమణమే జీవితం. అది దృశ్యాదృశ్యాల మధ్య నాటకం వంటిదంటారు తత్వజ్ఞులు. రంగస్థలంపై కనిపించేదంతా నిజమన్న భావం ఎవరికైనా కలుగుతుంది. వచ్చి వెళుతున్న పాత్రలు, వాటి స్వభావాలు, హావభావాలు సత్యంగా గోచరిస్తాయి. తెరపడగానే, అంతవరకు గల భ్రమ ఒక్కసారిగా తొలగిపోతుంది. సరిగ్గా అలాంటిదే- స్థితి, అస్తిత్వాల మధ్య జీవనం. కాలం ఇంద్రజాలమనీ కవులు వర్ణిస్తారు.

ఈ లోకంలోకి రానున్నవారు ఎలా ఉంటారో ఎవరికీ తెలియదు. లోకాన్ని విడిచివెళ్ళినవారు ఏమయ్యారన్న ఎరుకా ఉండదు. ఇదొక భావాతీత ప్రపంచం. అందరూ ఇక్కడే ఉన్నా, పరిసరాలు ఒక్కొక్కరికి ఒక్కోలా గోచరిస్తాయని మానసిక శాస్త్రజ్ఞులు చెబుతారు. ఒకరి బాధ మరొకరు అనుభవించలేరు. ఒకరి సుఖం మరొకరు ఆస్వాదించలేరు. ఒకరు ప్రేమించే వ్యక్తి మరొకరికి పగవాడు కావచ్చు. ప్రతి జీవీ తనకు తాను నిర్మించుకున్న ప్రపంచంలో జీవిస్తుంటాడు. ఆనందం, అనుబంధం, సుఖాలు, దుఃఖాలు, భావోద్వేగాలు భిన్నంగా ఉంటాయంటుంది 'మండల బ్రాహ్మణోపనిషత్తు'.

కొత్తగా ఆవిర్భవించిన నక్షత్రాల ఉనికి ఇప్పటివారికి వెంటనే తెలియకున్నా, భావి తరాలకు అవి కనిపించే అవకాశం ఉంది. ఐన్‌స్టీన్ ప్రతిపాదించిన సాపేక్ష సిద్ధాంతం కేవలం కాలానికి, స్థలానికి పరిమితం. మానవ జీవితంలోని అభిలాషలకు, ఆలోచనలకు, లౌకిక భావనలకు అది అన్వయించదు. భావోద్వేగాల్ని ఏ శాస్త్రమూ నిర్దుష్టంగా ప్రామాణీకరించలేదు. అలాంటి వాటిని సూత్రీకరించడం అసాధ్యమైన పని. విశ్వంలో సంపూర్ణ సత్య స్వరూపం అంటూ ఏదీ ఉండదని 'నారద పరివ్రాజకోపనిషత్తు' భావిస్తుంది.



అంతర్యామి

సదా పరిణామ క్రమంలో సత్యమూ మార్పులకు లోనవుతుంటుంది. నేటి తర్క మీమాంస కొంతకాలం తరవాత మిథ్యగా రూపాంతరం చెందవచ్చు. యుగాలు మారినప్పుడు, ధర్మాలూ మార్పు చెందుతాయి. యుగధర్మం అంటే ఇదే! నేడు నిజమనుకొన్నది రేపు అవాస్తవంగా మారే అవకాశాలు ఉంటాయని అక్షపాద గౌతముడు రాసిన 'న్యాయసూత్ర' చాటుతుంది. కొందరితో అనుబంధాలు, ఆత్మీయతలు కాలగమనంలో కలిసిపోతాయి. అమేయమైన సాఫల్యం చేకూరుతుందని విశ్వసించే రాజసూయయాగం వంటివి నాడు మాత్రమే ఆచరణీయ ధర్మాలు. అందుకే 'జీవితం ఆసాంతం మాయ' అని యాజ్ఞవల్క్యోపనిషత్తు వ్యాఖ్యానిస్తుంది. ఏది సత్యమో అసత్యమో, ఏది నిత్యమో అనిత్యమో నిరంతరం అన్వేషించాల్సి ఉంటుందని అది ప్రబోధిస్తుంది.

శంకర భగవత్పాదులు రచించిన 'జయమంగళ'- సంతోషం, దుఃఖం వేర్వేరు దృక్పథాలని వర్ణిస్తుంది. ఇప్పటి దుఃఖం రేపటి ఆనందానికి కారణం కావచ్చునని చెబుతుంది. సుఖదుఃఖాలు అశాశ్వతాలు. చీకటి, వెలుతురు ఊహాజనితాలనీ ఆ గ్రంథం విపులీకరిస్తుంది. మనసు, బుద్ధి, అహంకారం అసత్యాలని ఆదిశంకరులు అంటారు. అరిషడ్వర్గాల్ని మిథ్యగా పరిగణిస్తారు. అనేకం యథార్థాలు కావని ఆయన 'నిర్వాణ షట్కం' తెలియజేస్తుంది. శమంత భద్రుడు అనే ఆధ్యాత్మికవేత్త ప్రతిపాదించినట్లు, సత్యం అనే పదానికి శాశ్వతత్వం లేదు. ఈశావాస్యోపనిషత్తు 'సర్వం మిథ్య' అంటుంది.

ఇప్పటికి ఏది ధర్మమో అదే ఆచరించదగింది. దాన్ని నమ్మాలి. మనిషి ఒక ప్రత్యేక జీవన విధానానికి మాత్రమే యజమాని కాడు. నడుస్తున్న చరిత్రలోనే అతడికి భాగస్వామ్యం ఉంటుంది. గతాన్ని వెనక్కి తెచ్చే శక్తి ఎవరికీ ఉండదు. అప్పటి తప్పిదాల్ని అతడు వర్తమానంలో సరిదిద్దుకోగలడు. ముందుకాలాన్ని అంచనా వేయగలిగినా, నిర్దేశించలేడు.

ఎప్పటికి ఏది మంచిదో అదే నిజం. 'అవాస్తవమైన ఆశల పల్లకిలో ప్రయాణం ఎప్పటికీ ప్రమాదకరం' అంటారు రమణ మహర్షి. వర్తమానంలో జీవిస్తూ, అందుకు అనుగుణంగా నడుచుకోవడమే మనిషి బాధ్యత!

– అప్పరుసు రమాకాంతరావు

అభి'వృద్ధి'లో.. అగ్రభాగాన!

- బడ్జెట్ సమావేశాల్లో గవర్నర్ ఉద్ఘాటన

ఈనాడు – హైదరాబాద్

"రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో గణనీయమైన సానుకూల ప్రభావాన్ని చూపుతున్నాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు పొందుతున్నాయి. దశాబ్దాలుగా అనుభవిస్తున్న అభివృద్ధి లోటును పూడ్చడంతోపాటు.. ఇతర రాష్ట్రాలతో పోటీ పడేందుకు దోహదం చేస్తున్నాయి.." అని గవర్నర్ నరసింహన్ అన్నారు. శాసన సభ బడ్జెట్ సమావేశాలను సోమవారం ఆయన ప్రారంభిస్తూ ఉభయ సభల సభ్యులనుద్దేశించి ప్రసంగించారు. "సమ్మిళితంపై సుస్థిరమైన దృష్టి, శీఘ్ర ఆర్థిక అభివృద్ధి అనేది మా ప్రభుత్వ ప్రాథమిక సిద్ధాంతం. సమాజంలో ఇప్పటివరకూ నిర్లక్ష్యానికి గురై...అణచివేతకు గురైన వర్గాలు వృద్ధి ఫలాలను కచ్చితంగా పొందాలన్నదే లక్ష్యం. గత మూడున్నరేళ్ల కాలం ఫలప్రదమయినది. ఈ దశలో ఎదుర్కొన్న సవాళ్లను అధిగమిస్తూ అనేక రంగాల్లో గణనీయమైన పురోగతిని సాధించాం.

తాగు, సాగునీటికి అత్యంత ప్రాధాన్యం

తెలంగాణ పొలాలకు కృష్ణా, గోదావరి జలాలను తీసుకురావడం కోసం అనేక భారీ, మధ్య తరహా సాగునీటి ప్రాజెక్టులు నిర్మించడంతోపాటు..కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిచేయడానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాం. మిషన్ భగీరథ కింద ప్రతి కుటుంబానికి తాగునీటిని సమకూర్చడం, విద్యుత్ పరిస్థితిని మెరుగుపరచడం వంటివీ చేస్తున్నాం.

ఆర్థిక వ్యవస్థ దశ తిరిగింది...

రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆర్థిక వ్యవస్థ దశ తిరిగి అభివృద్ధి పథంలోకి ప్రవేశించింది. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంత స్థూల జాతీయోత్పత్తి(జీఎస్‌డీపీ) 4 శాతం. అప్పటి భారతదేశ వృద్ధి రేటు 5.9 శాతం కన్నా తక్కువగా ఉంది. రాష్ట్రం ఏర్పడిన తరవాత 2014-17 మధ్య కాలంలో రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధి రేటు 8.6 శాతానికి పెరిగింది. ఇది ఇప్పటి జాతీయ సగటు 7.5 శాతం కన్నా అధికం. జాతీయ తలసరి ఆదాయం రూ.1.03 లక్షలైతే తెలంగాణ తలసరి ఆదాయం రూ.1.54 లక్షలుంది.



తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఉభయసభలనుద్దేశించి ప్రసంగిస్తున్న గవర్నర్ నరసింహన్. చిత్రంలో శాసనమండలి ఛైర్మన్ స్వామిగౌడ్, శాసనసభాపతి మధుసూదనాచారి

రైతుల సమస్యల పరిష్కారానికి సమగ్ర విధానం

వ్యవసాయ, వ్యవసాయేతర రంగాల్లో రైతుల సమస్యలను పరిష్కరిస్తూ ప్రభుత్వం సమగ్ర విధానాన్ని ఆవిష్కరించింది. వ్యవసాయ యాంత్రీకరణ, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో సరఫరా చేయడానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. పంటల ఉత్పాదకత పెరుగుదల నిమిత్తం చేపట్టిన చర్యలు రైతుల ఆదాయంపై గణనీయమైన ప్రభావం చూపాయి. గత ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో 101.29 లక్షల టన్నుల ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేశాం. 50.10 లక్షల గొర్రెలను పంపిణీ చేయడం ద్వారా గొర్రెల కాపరుల ఆర్థిక స్థితిని మెరుగుపరిచాం. మాంసం ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధించే కృషి జరుగుతోంది.

నిరంతర విద్యుత్‌తో రికార్డు

గత జనవరి ఒకటి నుంచి దాదాపు 23 లక్షల పంపు సెట్లకు, ఎత్తిపోతల పథకాలకు నాణ్యమైన నిరంతర విద్యుత్‌ను ఉచితంగా సరఫరా చేస్తూ రికార్డు సృష్టించాం. విద్యుత్ రంగంలో స్వయం సమృద్ధి సాధనలో భాగంగా ప్రస్తుతం 15,344 మెగావాట్ల విద్యుత్తు సమకూర్చుకోగలుగుతున్నాం. మరో 12,931 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం గల విద్యుత్ ప్రాజెక్టులు నిర్మాణ దశల్లో ఉన్నాయి. విద్యుత్ రంగంలో ఈ గమ్యాన్ని చేరుకున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ.

ఐరాస లక్ష్యాలను అందుకుంటాం

ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను అందుకోవడానికి ఈ ప్రభుత్వం వివిధ విధానాల్లో లక్ష్యాలను నిర్ణయిస్తోంది. రాష్ట్ర సౌరవిధానం దేశంలోనే అత్యుత్తమైంది. 3283 మెగావాట్ల స్థాపిత సౌర విద్యుత్‌తో రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా ఉంది. టీఎస్ ఐపాస్ కింద ఏక గవాక్ష విధానంలో 15 రోజుల్లోపే అన్ని పారిశ్రామిక అనుమతులు ఇచ్చేలా పారదర్శక విధానాన్ని అమలుచేస్తున్నాం. దీని ఫలితంగా 4.47 లక్షల మందికి ఉపాధినిచ్చే 6,206 పారిశ్రామిక యూనిట్ల స్థాపన దిశగా రూ.1.18 లక్షల కోట్ల పెట్టుబడులొచ్చాయి. నేతన్నకు చేయూత పథకం కింద పొదుపు నిధిలో ప్రభుత్వ వాటాను 8 నుంచి 16 శాతానికి పెంచాం. ప్రపంచ ఉత్తర అంకుర సంస్థల కేంద్రంగా హైదరాబాద్ గుర్తింపు పొందింది. మండల కేంద్రాలను జిల్లా కేంద్రాలకు అనుసంధానం చేసేందుకు 4665 కిలోమీటర్ల రోడ్లను విస్తరిస్తున్నాం. మెట్రోరైలులో నేను స్వయంగా ప్రయాణించా. ఇందులో సౌకర్యాలు ప్రపంచ స్థాయిలో ఉన్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెరిగాయి. వసతిగృహాల విద్యార్థుల ఆహార భత్యం పెంచాం. నిరుపేదల రోజువారీ అవసరాలను తీర్చేందుకు సామాజిక భద్రత పథకం కింద 41.78 లక్షల మందికి లబ్ధి చేకూర్చాం.

బంగారు తెలంగాణ సాధిస్తాం...

నా ప్రభుత్వం చిత్తశుద్ధితో చేసిన కృషి సామాన్య ప్రజల జీవితాలలో సానుకూల, గణనీయమైన ప్రభావాన్ని తీసుకొచ్చింది. బంగారు తెలంగాణ లక్ష్యాన్ని సాధించేందుకు పూర్తి నిబద్ధతతో ముందుకు సాగుతామని పునరుద్ఘాటిస్తున్నా. శాసనసభ చర్చలు మన ప్రజాస్వామ్య వ్యవస్థ పట్ల మనకున్న నమ్మకాన్ని పెంపొందిస్తాయని ఆశిస్తున్నా.' అని పేర్కొన్నారు. చివరగా గవర్నర్ "ఓం సర్వే భవంతు సుఖినః, సర్వే సంతు నిరామయః సర్వే భద్రాణి పశ్యంతు మా కశ్చిత్ దుఃఖభాగ్ భవత్ ఓం శాంతిః శాంతిః శాంతిః" అనే పద్యం చదివారు. "అందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలి. ఆరోగ్యంగా ఉండాలి. ఆధ్యాత్మిక ఉన్నతి అంటే ఏమిటో తెలుసుకోవాలి. ఏ ఒక్కరూ బాధ పడకూడదు." అంటూ దాని భావాన్ని వివరించి ప్రసంగాన్ని ముగించారు.

27 వరకు శాసనసభ, మండలి సమావేశాలు

- 15న రాష్ట్ర బడ్జెట్
- 27న ద్రవ్య వినిమయ బిల్లు
- బీఏసీలో నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: శాసనసభ, మండలి సమావేశాలు ఈనెల 27 వరకూ జరగనున్నాయి. ఈనెల 15న బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. 27న ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చించి, ఆమోదిస్తారు. శాసనసభ, మండలి కార్యకలాపాల సలహా కమిటీ(బీఏసీ)లో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. శాసనసభాపతి మధుసూదనాచారి అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రి హరీశ్‌రావు, మంత్రులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఈటల రాజేందర్, విపక్షనేత జానారెడ్డి, ఉపసభాపతి పద్మాదేవేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నేత భట్టివిక్రమార్క, మజ్లిస్ శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్, భాజపాపక్ష నేత కిషన్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య (తెదేపా), సున్నం రాజయ్య(సీపీఎం), శాసనసభా కార్యదర్శి నర్సింహాచార్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యకలాపాల నిర్వహణపై చర్చించారు. మంగళ, బుధవారాలు గవర్నర్‌కు ధన్యవాద తీర్మానంపై చర్చిస్తారు. 15న బడ్జెట్ ప్రవేశపెడతారు. 16,17,18 సెలవులుంటాయి. 19 నుంచి 25 వరకు సమావేశాలు కొనసాగుతాయి. 26న శ్రీరామనవమి సెలవుదినం కాగా 27న ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చతో సమావేశాలు ముగుస్తాయి. ముందుగా ఈనెల 17న సమావేశం జరపాలని భావించినా, ఆ రోజు ఏఐసీసీ సమావేశాలున్నాయని కాంగ్రెస్ నేతలు చెప్పడంతో ఆరోజు సెలవు ఇవ్వాలని నిర్ణయించారు. దానికి బదులుగా 25న ఆదివారం సమావేశం జరపాలని తీర్మానించారు. సోమవారం మండలిలో డిప్యూటీ ఛైర్మన్ నేతి విద్యాసాగర్ అధ్యక్షతన బీఏసీ సమావేశం జరిగింది. 10 రోజుల పాటు మండలి సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు.



జాతీయగీతం ఆలాపన సందర్భంగా తమ స్థానాల్లో లేచి నిల్చొన్న ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు, ఎమ్మెల్యేలు

ఇది చీకటి దినం

- కాంగ్రెస్ సభ్యుల్లో కొందరు మద్యం తాగి సభలోకి వచ్చారు
- తెరాస విప్‌లు, ఎమ్మెల్సీల ఆరోపణ
- వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- స్వామిగౌడ్‌పై దాడి బీసీలపై దాడి అన్న మంత్రులు తలసాని, జోగురామన్న

ఈనాడు, హైదరాబాద్, హైదరాబాద్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ నేతల కారణంగా తెలంగాణ ఉభయ సభల్లో సోమవారం చీకటి దినంగా మిగిలిపోయిందని, కొందరు కాంగ్రెస్ సభ్యులు మద్యం తాగి సభకు వచ్చి సభ్య సమాజం తలదించుకునేలా ప్రవర్తించారని తెరాస నేతలు విమర్శించారు. శాసనసభాపక్ష కార్యాలయంలో సోమవారం చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, విప్‌లు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బోడకుంటి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీలు వీజీ.గౌడ్, నారదాసు లక్ష్మణ్‌రావు, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్‌లు వేర్వేరుగా విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు దాడులకు ముందస్తు వ్యూహం పన్నినట్టు రెండు రోజుల క్రితమే సమాచారం వచ్చిందన్నారు. బస్సుయాత్ర తుస్సుమందని, అది భరించలేని పరిస్థితుల్లో ఆ పార్టీ నేతలు దాడులకు పాల్పడుతున్నారన్నారు. వారిని సస్పెండ్ చేసి, అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ..'కొందరు సభ్యులు మద్యం తాగి సభకు వచ్చారు. మత్తులో సరిగ్గా నిలుచోలేక తూలారు. ఒక సభ్యుడు తూలి జానారెడ్డిపై పడగా ఆయన సభ నుంచి వెళ్లిపోయారు.' అని ఆరోపించారు. మద్యం తాగి వచ్చిన వారిని ఏడాది పాటు సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఓర్వలేకనే భౌతిక దాడులు: తలసాని, జోగురామన్న

ముఖ్యమంత్రి కేసీఆర్ వెనకబడిన తరగతుల వారికి అండగా ఉన్నారని, ఓర్వలేకనే కాంగ్రెస్ భౌతికదాడులకు దిగుతోందని విలేకర్లతో మాట్లాడుతూ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, జోగురామన్నలు ఆరోపించారు. స్వామిగౌడ్‌పై దాడి ద్వారా బీసీలపై కాంగ్రెస్‌కు ఎంత అక్కసు ఉందో శాసనసభ సాక్షిగా రుజువయిందన్నారు. కాంగ్రెస్‌కు బీసీలు బాగుపడటం ఇష్టంలేదని, అందుకే వారి ఆత్మస్థైర్యం దెబ్బతీసేలా ఈ తరహా కుట్రలు చేస్తోందన్నారు. స్వామిగౌడ్‌ను గాయపరడం ద్వారా బీసీల మనోభావాలని కాంగ్రెస్ దెబ్బతీసిందన్నారు.

బస్సుయాత్ర తుస్సు మన్నందుకే ఈ ఆక్రోశం

గవర్నర్ ప్రసంగిస్తున్నప్పుడు కాంగ్రెస్ సభ్యులు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని తెరాస సభ్యులు కర్నె ప్రభాకర్, కొండా సురేఖ, జీవన్‌రెడ్డి తదితరులు అన్నారు. కాంగ్రెస్ చేపట్టిన బస్సుయాత్ర తుస్సుమందని, ఆ ఆక్రోశం పట్టలేకనే ఆ పార్టీ నేతలు ఇలా వ్యవహరించారని విమర్శించారు. అసెంబ్లీ వాయిదా అనంతరం మీడియా పాయింట్‌లో వారు మాట్లాడారు. కాంగ్రెస్ సభ్యులు గాంధీభవన్‌లో మాదిరిగానే అసెంబ్లీలోనూ ప్రవర్తిస్తున్నారన్నారు. రాజకీయ భవిష్యత్తు అంధకారం అవుతుందనే భయంతోనే కొందరు పనికట్టుకుని ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. మిగతా పార్టీలు కాంగ్రెస్ తీరును తప్పుపట్టకపోవడం విచారకరమన్నారు.



సమావేశాలకు హాజరయ్యేందుకు బాబుజగ్జీవన్‌రాం విగ్రహం నుంచి అసెంబ్లీకి ప్లకార్డులతో పాదయాత్రగా వస్తున్న భాజపా ప్రజాప్రతినిధులు రాంచందర్‌రావు, చింతల రామచంద్రారెడ్డి, రాజాసింగ్, లక్ష్మణ్, కిషన్‌రెడ్డి, ప్రభాకర్

గవర్నర్ లక్ష్యంగా అరాచకం

- మైక్‌లు, హెడ్‌ఫోన్లు, పెన్నులు, కళ్లజోళ్లతో దాడులు
- కాంగ్రెస్ చర్యలు ఉగ్రదాడితో సమానం
- తెలంగాణ పరువుతీశారు
- మంత్రి హరీశ్‌రావు ధ్వజం
- బాధ్యులపై కఠిన చర్యల బాధ్యత సభాపతిదేనని వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: ఉభయ సభల్లో తెలంగాణ బడ్జెట్ సమావేశాల ప్రారంభోపన్యాసం చేస్తున్న గవర్నర్ నరసింహన్‌ను లక్ష్యంగా చేసుకొని కాంగ్రెస్ సభ్యులు అరాచకానికి పాల్పడ్డారని, మైక్‌లు, హెడ్‌ఫోన్లు, పెన్నులు, కళ్లజోళ్లతో దాడులు చేశారని శాసన సభ వ్యవహారాల మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఆ దాడి దారుణమైందని, ఉగ్రదాడి మాదిరిగా ఉందని అభివర్ణించారు. 130 ఏళ్ల చరిత్ర అంటే ఇదేనా? అని ప్రశ్నించారు. మండలి ఛైర్మన్ స్వామిగౌడ్‌ను గాయపరడం ద్వారా ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించడంతోపాటు..తెలంగాణకు చెడ్డపేరు తెచ్చారని ఆక్షేపించారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నామని, ఏ నిర్ణయమైనా సభాపతి తీసుకుంటారని పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం ఆయన తెరాస శాసన సభాపక్ష కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. "తెలంగాణ అభివృద్ధిలో దూసుకెళ్తోంది. దేశంలోనే అగ్రస్థానంలో ఉంది. మాట్లాడేందుకు ఏమీ లేకపోవడంతో..కాంగ్రెస్ తీవ్ర అసహనంతో ఉంది. దాడులకు పూనుకుంది. గవర్నర్ ప్రసంగం ప్రారంభించిన వెంటనే కాంగ్రెస్ సభ్యులు లేచి ఏకవచనంతో మాట్లాడారు. అసభ్య పదజాలం వాడారు. మైక్‌లు, హెడ్‌ఫోన్లు పగులగొట్టి గవర్నర్‌పైకి విసిరారు. పెన్నులు, కళ్లజోళ్లు, పుస్తకాలు, కాగితాలనూ విసిరివేశారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గవర్నర్‌పైకి హెడ్‌ఫోన్‌ను విసరగా..అది స్వామిగౌడ్‌కు తగిలింది. కోమటిరెడ్డి మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడుతూ దీనిని అంగీకరించారు. చట్టసభలు దేవాలయంతో సమానం. ఇక్కడ చట్టాలు చేయాల్సి ఉండగా కాంగ్రెస్ నేతలు కుస్తీలకు దిగుతున్నారు. గవర్నర్ ప్రసంగం విన్న తర్వాత వారికి ఏమైనా అభ్యంతరాలు ఉంటే సభ దృష్టికి తేవచ్చు. ఇవేమీ లేకుండా సభను అడ్డుకునేందుకు కాంగ్రెస్ అల్లర్లకు దిగుతోంది. జానారెడ్డి లాంటి సుదీర్ఘ అనుభవం గల నేతలు ఇలాంటి చర్యలను ఎలా సమర్థిస్తారు? ఆ పార్టీ వైఖరిని అన్ని పార్టీలు బీఏసీలో తీవ్రంగా ఖండించాయి. సీసీటీవీ ఫుటేజీని పరిశీలించి బాధ్యులను కఠినంగా శిక్షించే పూర్తి అధికారం సభాపతిదే. ఇతర రాష్ట్రాల్లో ఇలాంటి వారిపై వేటు పడింది. తెలంగాణలోనూ అలా జరగాలి.

మాది దేశభక్తి... కాంగ్రెస్‌ది దేశద్రోహం

తెలంగాణ ఉద్యమ సమయంలో శాసనసభలో మమ్మల్ని మాట్లాడనిచ్చే వారు కాదు. ప్రజల గుండె చప్పుడును వినిపించేందుకు అప్పట్లో మేం నిరసనలు తెలిపాం. మాది దేశభక్తి. ఇప్పుడు కాంగ్రెస్ వాళ్లు చేసింది దేశద్రోహ చర్యతో సమానం. కాంగ్రెస్‌కు దమ్ముంటే చర్చలతో దాడి చేయాలి. భౌతిక దాడులు సిగ్గుచేటు. ఈ రోజు జరిగిన ఘటన నన్నెంతో బాధించింది." అని హరీశ్ అన్నారు.



సమావేశాలకు హాజరయ్యేందుకు ద్విచక్రవాహనంపై వస్తున్న సీపీఎం ఎమ్మెల్యే సున్నం రాజయ్య

వాస్తవాలకు దూరం

సున్నం రాజయ్య

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: సభలో గవర్నర్ ప్రసంగం వాస్తవాలకు దూరంగా ఉందని సీపీఐ ఎమ్మెల్యే సున్నం రాజయ్య అన్నారు. సామాజిక వర్గాల అభివృద్ధికి ఏం చేస్తున్నారో చెప్పకుండా మసి పూసి మారేడు కాయ చేశారని విమర్శించారు. మిషన్ కాకతీయ పథక అమలు బాగుందన్న ప్రభుత్వం క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకోవాలని హితవుపలికారు.

మేం ఎవరిపైనా దాడి చేయలేదు

- హెడ్‌ఫోన్ కావాలని విసిరింది కాదు..
- సీఎల్పీ ఉపనేత కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- గాయం తగిలినట్లు రుజువు చేస్తే క్షమాపణ చెబుతానని వెల్లడి

హైదరాబాద్, నల్గొండ పురపాలిక, న్యూస్‌టుడే: అసెంబ్లీలో కాంగ్రెస్ సభ్యులెవరూ, ఎవరిపైనా దాడి చేయలేదనీ, ప్రభుత్వమే తమపై పోలీసులు, మార్షల్స్‌ను ఉసిగొల్పిందని సీఎల్పీ ఉపనేత కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. సోమవారం సభ వాయిదా పడిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల హామీలను ప్రస్తావించకుండా గవర్నర్‌తో పచ్చి అబద్ధాలు చెప్పించిందనీ, అందుకే అడ్డుకునే ప్రయత్నం చేశామన్నారు. నిరసన తెలుపడానికి పోడియం వద్దకు వెళ్లడం ఆనవాయితీ కానీ. .పోలీసులు, మార్షల్స్ తమను అడ్డుకుని కిందపడేసి నెట్టి, కొట్టి రౌడీల్లా ప్రవర్తించారన్నారు. ఘటనలో తన కుడి మోకాలికి గాయమైందంటూ మీడియాకు చూపించారు. ఈ సందర్భంలోనే తన హెడ్‌ఫోన్ ఎగిరిపోయిందే తప్ప కావాలని విసిరేసింది కాదన్నారు. దీనికంతటికీ కారణం సీఎం కేసీఆరేననీ, నియంతలా పాలిస్తున్నారని మండిపడ్డారు. తాము తాగొచ్చామని తెరాస సభ్యులు ఆరోపించడం అవివేకమనీ, కావాలంటే సీఎం సహా సభ్యులందరికీ రోజూ బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు చేయాలన్నారు. కేసీఆర్ తనను బలిచేయాలని చూస్తున్నారనీ, తనపై చర్యలు తీసుకుంటే ప్రజల్లోకి వెళ్తానని స్పష్టం చేశారు. పార్టీ అధిష్ఠానం ఆదేశిస్తే సీఎం కేసీఆర్ సొంత నియోజకవర్గమైన గజ్వేల్ నుంచి తాను పోటీ చేస్తానని కోమటిరెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్‌లో తమ బంధువులు ఎక్కువగా ఉన్నారనీ, కేసీఆర్‌ను ఓడించేందుకు వారు చాలన్నారు. నల్గొండలో తమ సామాజికవర్గంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారే ఎక్కువనీ, కేసీఆర్ పోటీ చేస్తే ఇంట్లో కూర్చొని గెలుస్తానని పేర్కొన్నారు.

గాయమైనట్లు నాటకమాడుతున్నారు..: మండలి ఛైర్మన్ స్వామిగౌడ్‌కు గాయమైనట్లు వీడియో రుజువులు చూపితే క్షమాపణ చెబుతానని కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. సోమవారం నల్గొండలో ఆయన మాట్లాడుతూ.. శాసనసభలో వ్యవహారాలు ముగిసిన 17 నిమిషాల తర్వాత వీల్‌ఛైర్‌లో కూర్చోబెట్టి స్వామిగౌడ్‌కు గాయమైనట్లు నాటకమాడుతున్నారని విమర్శించారు. నిజంగా గాయమైతే తన పదవికీ రాజీనామా చేస్తానని ప్రకటించారు.



బడ్జెట్ సమావేశాల సందర్భంగా చోటుచేసుకున్న ఘటనలో మోకాలికి గాయమైందంటున్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి

ప్రసంగమంతా అబద్ధాల పుట్ట

సభను బహిష్కరించిన భాజపా సభ్యులు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగమంతా అబద్ధాల పుట్ట అని భాజపా శాసనసభ్యులు ఆరోపించారు. బడ్జెట్ సమావేశం మొదలైన కాసేపటికే సభను బహిష్కరించిన వారు విలేకరులతో మాట్లాడారు. నాలుగేళ్లుగా చెబుతున్న విషయాలనే అరిగిపోయిన రికార్డులా మళ్లీ చదివారన్నారు. తప్పుల తడకగా ఉన్న ప్రసంగాన్ని వినలేక మధ్యలోనే బయటికి వచ్చామన్నారు. భాజపా శాసనసభాపక్ష నేత కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. 53 మంది పోలీసుల మధ్యలో సభ నిర్వహించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. రైతుల ఆత్మహత్యలు, నిరుద్యోగ సమస్య, రాష్ట్రంలో పెరుగుతున్న అవినీతిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. లక్ష ఉద్యోగాలు, దళితులకు మూడెకరాల భూపంపిణీ అంశాలను ప్రస్తావించకపోవడం దారుణమని ఎమ్మెల్యే, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. బీసీ ఉప ప్రణాళిక ఎందుకు అమలు చేయలేదో చెప్పలేదన్నారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య ఏమైందని ప్రశ్నించారు. అన్ని అబద్ధాలే మాట్లాడి గవర్నర్ వ్యవస్థకే నరసింహన్ కలంకం తెచ్చారన్నారు. గవర్నర్ ప్రసంగం తెలంగాణ ప్రజలను అవమాన పరిచేలా ఉందని ఎమ్మెల్సీ రామచంద్రారావు అన్నారు. ఎమ్మెల్యేలు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, చింతల రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

నీళ్లు, నియామకాల ప్రస్తావనేది: ఆర్.కృష్ణయ్య

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: నీళ్లు, నియామకాల విషయాన్ని ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని తెదేపా ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య అన్నారు. గవర్నర్ ప్రసంగం ముగిసిన అనంతరం ఆయన ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్యతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా.. భర్తీ అంశాన్ని ప్రసంగంలో చేర్చని ప్రభుత్వం నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఏ ఒక్క బీసీ సమాఖ్య గురించి గానీ, బీసీ డిక్లరేషన్ అంశాలను గానీ ప్రసంగంలో చేర్చలేదన్నారు. తెరాస ఎన్నికల ప్రణాళికలోని అంశాలను ప్రసంగం నుంచి ఎత్తివేశారని సండ్ర ఆరోపించారు. ధర్నాలు చేయడానికి అనుమతి ఇవ్వని కేసీఆర్‌కు దిల్లీలో ధర్నా చేసే హక్కు ఎక్కడుందని ప్రశ్నించారు.



బడ్జెట్ సమావేశాల సందర్భంగా సభలో స్పీకర్ పోడియం వద్ద కాంగ్రెస్ సభ్యుల ఆందోళన

పార్టీ ఫిరాయింపుదారులపై చర్యలేవి?: చాడ

ఈనాడు, హైదరాబాద్: పార్టీ ఫిరాయింపుదారుల రాజీనామాలు సభాపతి వద్ద అపరిష్కృతంగా నిలిచిపోయాయని.. ఇది స్పీకర్ పదవికే కలంకమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ ఫిరాయింపుదారులను ప్రోత్సహిస్తూ సభను ఎన్నిరోజులైనా నడుపుతామని ప్రకటించడం సిగ్గుచేటన్నారు.


ప్రభుత్వ హామీల ప్రస్తావనే లేదు

- సభలో జరిగినవి యాదృచ్ఛిక ఘటనలే
- జానారెడ్డి, ఉత్తమ్, భట్టి, షబ్బీర్

హైదరాబాద్, న్యూస్‌టుడే: తెరాస ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు సంబంధించిన అంశాల్లో ఏ ఒక్కటీ గవర్నర్ ప్రసంగంలో లేకపోవడంతోనే కాంగ్రెస్ సభ్యులు అసహనానికి, నిరాశకు, ఆవేశానికి లోనై నిరసన తెలిపే ప్రయత్నం చేశారని ఆ పార్టీ పేర్కొంది. సభలో జరిగిన ఘటనలు ఉద్దేశపూర్వకంగా చేసినవి కావనీ.. యాదృచ్ఛికంగా చోటుచేసుకున్నవేనని స్పష్టం చేసింది. సోమవారం కాంగ్రెస్ శాసనసభా పక్షనేత కె.జానారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రస్తావన గవర్నర్ ప్రసంగంలో లేకపోవడంతోనే తమ సభ్యులు నిరసన తెలిపే ప్రయత్నం చేశారన్నారు. పోలీసులు, మార్షల్స్ రావడంతో ఉద్రిక్తత చోటు చేసుకుందన్నారు. గవర్నర్ ప్రసంగ పాఠాలను చించేసి, మైకులు విసిరేసి నిరసన తెలిపిన ఘటనలు గతంలో అనేకం జరిగాయన్నారు. ఉద్యమ సమయంలో తెరాస నేతలు సభలో ఎలా వ్యవహరించారో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదన్నారు. గతంలో పార్లమెంటులోనూ ఎంపీ పొన్నం ప్రభాకర్‌పై పెప్పర్ స్ప్రే దాడి జరిగిందని గుర్తు చేశారు. సభలో ఉద్రిక్త పరిస్థితులకు ముఖ్యమంత్రి కేసీఆరే బాధ్యత వహించాలన్నారు. మద్యం తాగి వచ్చారంటూ శాసనసభను అవమానించేలా తెరాస సభ్యులు మాట్లాడటాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. తోపులాటలో తన బల్ల నొక్కుకుపోతే పక్కదాంట్లోకి వెళ్లాననీ, తెరాస సభ్యుడొకరు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. ఎవరు తాగొచ్చారో స్పీకర్ విచారణ జరపాలన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. 'తెరాసకు ఇదే చివరి బడ్జెట్, ఎన్నికల హామీలకు సంబంధించి ఏ అంశాన్నీ ప్రసంగ పాఠంలో చేర్చలేదు. గవర్నర్ చేత పచ్చి అబద్ధాలు చెప్పించే ప్రయత్నం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే ప్రయత్నం చేశాం. ప్రభుత్వం పోలీసులు, మార్షల్స్‌ను మా మీదికి ఎగదోసి ఉద్రిక్త పరిస్థితులు కల్పించింది' అని పేర్కొన్నారు. కోటి ఎకరాలకు సాగునీరు ఇస్తామని..16 లక్షల ఎకరాలకు నీరిచ్చామని గవర్నర్ చేత చెప్పించారన్నారు. రూ.వేల కోట్ల వ్యయం పెంచి ప్రజలపై ఆర్థిక భారం మోపుతుంటే గవర్నర్ ఎలా ప్రశంసిస్తారని ప్రశ్నించారు. మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎమ్మెల్యేల కంటే పోలీసులే ఎక్కువమంది ఉన్నారనీ, తోపులాటలో మైకులు ఎగిరి మండలి ఛైర్మన్‌కు తగిలి ఉండొచ్చన్నారు. ఘటన తర్వాత స్వామిగౌడ్ మామూలుగానే ఉన్నట్లు టీవీల్లో ప్రసారం జరిగిందనీ, ప్రభుత్వం కావాలనే కుట్ర పూరితంగా వ్యవహరిస్తోందన్నారు. మండలిలో విపక్షనేత షబ్బీర్‌అలీ మాట్లాడుతూ.. ఈ ఘటన యాదృచ్ఛికంగా జరిగిందేననీ, గవర్నర్‌పై తమకు అపార గౌరవం ఉందన్నారు. జీవన్‌రెడ్డి మాట్లాడుతూ...సీఎం మాటలకు విశ్వసనీయత లేదనీ, సభలో ఉద్రిక్త పరిస్థితులకు కేసీఆరే బాధ్యత వహించాలన్నారు. తెరాస ఎల్పీ సమావేశంలోనే కాంగ్రెస్‌పై కుట్ర జరిగిందని ఆరోపించారు.

శ్రీవారికి రూ.కోటి విరాళం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారికి బెంగళూరుకు చెందిన దాత జి.ప్రశాంత నారాయణ రూ.కోటి విరాళాన్ని సోమవారం సమర్పించారు. ఇందుకు సంబంధించిన చెక్కును తిరుమల జేఈవో శ్రీనివాసరాజుకు ఇండియా సిమెంట్స్ పీఆర్వో ప్రసన్నకుమార్ ద్వారా అందజేశారు. ఈ మొత్తాన్ని బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని ట్రస్టు కింద డిపాజిట్ చేయాలని దాత సూచించారు.


మహాపాదయాత్ర చేస్తూ ముంబయి చేరిన మహారాష్ట్ర రైతులు ఆదివారం రాత్రి ఆజాద్ మైదానానికి వెళ్తూ.. ఓ పై వంతెన మీద ఇలా కనిపించారు

శాంతించిన అన్నదాతలు

• మహారాష్ట్రలో నిరసనల విరమణ • డిమాండ్లకు అంగీకరించిన భాజపా సర్కారు

రైతంటే శ్రమ..
రైతంటే సంఘటిత శక్తి..
రైతంటే నేలతల్లి అంత సహనం
రైతంటే నష్టాలకు వెనుదీయని ధైర్యం
రైతంటే ఆత్మత్యాగానికీ వెనుకాడని మొండితనం
రైతంటే తన పంటకు తానే విలువను నిర్ణయించుకోలేనితనం
రైతంటే ప్రభుత్వాలు చేస్తామన్నా చూస్తామన్నా నమ్మే అమాయకత్వం

అలాంటి రైతులు 50 వేల మంది.. 180 కిమీ పాదయాత్ర.. మహా రద్దీగా ఉండే ముంబయి మహానగరంలో ఆందోళన కార్యక్రమం.. అయినా అంతా ప్రశాంతం.. పరీక్షలు రాసే విద్యార్థులకు కానీ, కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులకు కానీ ఎవరికీ ఇబ్బంది తలెత్తని విధంగా ఉద్యమం.. రైతు స్ఫూర్తికిది దర్పణం.

ముంబయి: భగభగ మండే ఎండలో "మహా పాదయాత్ర" చేసుకుంటూ ముంబయిచేరిన వేలాదిమంది మహారాష్ట్ర అన్నదాతలు సోమవారం శాంతించారు. ప్రతిపక్షాలతోపాటు శివసేన ఒత్తిడి నడుమ వీరి డిమాండ్లకు రాష్ట్రంలోని భాజపా ప్రభుత్వం అంగీకరించింది. దీంతో నిరసనలను విరమిస్తున్నట్లు రైతులు ప్రకటించారు. సంపూర్ణంగా పంట రుణాలు, విద్యుత్ బిల్లుల మాఫీ; వడగళ్లవాన, కీటకాల దాడుల్లో దెబ్బతిన్న పంటలకు పరిహారం; అటవీ భూములపై హక్కులు; స్వామినాథన్ కమిటీ సిఫార్సుల అమలు తదితర డిమాండ్లతో వీరు నిరసనలకు దిగిన సంగతి తెలిసిందే. వీటి కోసం గత మంగళవారమే పాదయాత్ర మొదలుపెట్టారు. సీపీఎం అనుబంధ అఖిల భారత కిసాన్ సభ(ఏఐకేఎస్) ఆధ్వర్యంలో నాసిక్ నుంచి ముంబయికి(180 కి.మీ.) తరలివచ్చారు. దక్షిణ ముంబయిలోని ఆజాద్ మైదాన్‌లో వీరిని ఉద్దేశించి రాష్ట్ర రెవెన్యూ మంత్రి చంద్రకాంత్ పాటిల్ ప్రసంగించారు. దాదాపు అన్ని డిమాండ్లూ తమకు సమ్మతమేనని తెలిపారు. సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఎదుట ఆయన ప్రకటన చేశారు. మరోవైపు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ విలేకరులతో మాట్లాడారు. అటవీ భూముల్లో వ్యవసాయం చేస్తున్న గిరిజనులు, రైతులకు పట్టాలు ఇవ్వడంపై ఓ కమిటీ ఏర్పాటు చేస్తామని చెప్పారు.

ఎర్ర సముద్రాన్ని తలపించిన ఆజాద్ మైదాన్: 50,000 మందికిపైగా రైతులు తెల్లవారుజామునే కదలిరావడంతో దక్షిణ ముంబయిలోని ఆజాద్ మైదాన్ కిక్కిరిసింది. వీరి చేతుల్లోని ఎర్రని జెండాలతో ఈ ప్రాంతమంతా ఎర్రని సముద్రంలా కనిపించింది. పదో తరగతి పరీక్షలురాసే విద్యార్థులకు, కార్యాలయాలకు వెళ్లే ముంబయివాసులకు ఎలాంటి ఇబ్బందీ కలగకుండా రైతులు జాగ్రత్త వహించారు. తూర్పుముంబయిలోని కేజే సోమయ్య మైదానం నుంచి ఆదివారం అర్ధరాత్రిదాటిన వెంటనే వీరు ఆజాద్ మైదాన్‌కు పయనమయ్యారు.

అసెంబ్లీలో రగడ: రైతు నిరసనలపై అసెంబ్లీ లోనూ రాజకీయ రగడ రేగింది. మిత్రపక్షమైన శివసేన కూడా రైతులకు మద్దతు పలుకుతూ ప్రభుత్వంపై విమర్శలు సంధించింది. రైతుల చేతుల్లో ఎర్ర జెండాలున్నా.. తమ మద్దతు వారికేనని స్పష్టీకరించింది. కాంగ్రెస్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ), మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన (ఎంఎన్‌ఎస్) తదితర పార్టీలు ఇప్పటికే ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్న సంగతి తెలిసిందే.

అహంకారాన్ని పక్కనపెట్టండి..రాహుల్: అహంకారాన్ని పక్కనపెట్టి రైతుల సమస్యలను పరిష్కరించాలని ప్రధాని మోదీ, సీఎం ఫడణవీస్‌లను కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ కోరారు.

ప్రధాన డిమాండ్లివీ...: 1. నిరసనకు దిగిన రైతుల్లో చాలామంది మహారాష్ట్ర ప్రభుత్వ పథకాల కింద లబ్ధిపొందలేకపోతున్నారు. దీంతో బేషరతుగా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. 2. నిరసనలకు నేతృత్వం వహించిన ఏఐకేఎస్... స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేస్తోంది. కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) పంట ఉత్పత్తి వ్యయం కంటే ఒకటిన్నర రెట్లు ఎక్కువగా ఉండాలని కోరుతోంది. 3. ఏళ్లుగా అటవీ భూముల్లో వ్యవసాయం చేస్తున్న గిరిజన రైతులు తమకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. 4. బుల్లెట్ రైళ్లు, ప్రధాన రహదారుల నిర్మాణం లాంటి భారీ ప్రాజెక్టుల కోసం బలప్రయోగంతో వ్యవసాయ భూములను లాక్కోవడంతోపాటు నదుల అనుసంధానం ప్రాజెక్టులనూ రైతులు వ్యతిరేకిస్తున్నారు. 5. వడగళ్ల వాన, కీటకాల దాడుల్లో నష్టపోయిన పంటలకుగాను ఎకరానికి రూ.40,000 పరిహారాన్ని డిమాండ్ చేస్తున్నారు.





ముంబయిలోని ఆజాద్ మైదాన్‌లో రైతులతో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి (అంతరచిత్రంలో) మండుటెండలో పాదయాత్రలో పాల్గొని పాదం చిట్లిపోయిన మహిళకు సోమవారం ముంబయిలో చికిత్స చేస్తున్న వైద్యుడు

పాక్ ఎగువసభలో కృష్ణకుమారి ప్రమాణస్వీకారం

తొలి హిందూ దళిత మహిళా సెనేటర్‌గా ఘనత



ఇస్లామాబాద్: పాకిస్థాన్ సెనేటర్‌గా బాధ్యతలు స్వీకరించిన కృష్ణకుమారి కోహ్లీ(39) ఆ పదవిని చేపట్టిన తొలి హిందూ దళిత మహిళగా సోమవారం ఘనతను సాధించారు. పాక్ ఎగువసభలో ఆమెతో సహా 51 మంది సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. సింధ్ ప్రావిన్సులోని థార్ జిల్లా నగర్‌పార్కర్ అనే మారుమూల ప్రాంతానికి చెందిన ఆమె బిలవల్ భుట్టో జర్దారీ నేతృత్వంలోని పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) సభ్యురాలు. సింధ్ నుంచి సెనేటర్‌గా ఎన్నికైన ఆమె ప్రమాణస్వీకారానికి తన కుటుంబ సంప్రదాయ (థారీ) వస్త్రధారణలో పార్లమెంటుకు చేరుకున్నారు. తమ ప్రాంతంలోని మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు వైద్య సేవలు మెరుగుపరుస్తానని, తాగునీటి కొరత తీరుస్తానని పేర్కొన్నారు. ఆమె ఎన్నిక పాక్‌లో మహిళలకు, మైనారిటీల హక్కులకు మైలురాయిగా పలువురు అభివర్ణిస్తున్నారు.

విపక్ష నేతలకు నేడు సోనియా విందు

దిల్లీ: భాజపాకి వ్యతిరేకంగా విపక్షాలన్నింటినీ ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ మంగళవారం రాత్రి విందు సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలను ఎదుర్కొని, అధికార భాజపాని నిలువరించడానికి బలమైన విపక్ష కూటమి అవసరమనే ఉద్దేశంతో దీనిని ఏర్పాటు చేస్తున్నారు. తృణమూల్ కాంగ్రెస్, ఆర్జేడీ, వామపక్షాలతో పాటు మునుపటి యూపీఏ భాగస్వామ్య పక్షాలన్నింటినీ సోనియా ఆహ్వానించారు. వేరే కార్యక్రమాల కారణంగా తాను ఈ భేటీకి హాజరుకాలేనని తృణమూల్ అధ్యక్షురాలు మమతా బెనర్జీ కాంగ్రెస్ వర్గాలకు సమాచారం ఇచ్చారు. ఆ పార్టీ తరఫున సుదీప్ బందోపాధ్యాయ హాజరవుతారు. డీఎంకే తరఫున కణిమొళి రానున్నారు. ఆర్జేడీ నుంచి లాలూప్రసాద్ తనయుడు తేజస్వీ యాదవ్ హాజరవుతారు. ఎన్డీఏలో భాగస్వామిగా ఉన్న తెదేపా ఈ విందు సమావేశానికి హాజరవుతుందనే వార్తలు వెలువడినా ఆ పార్టీ వర్గాలు మాత్రం అలాంటిదేమీ లేదని స్పష్టం చేశాయి. బ్యాంకుల కుంభకోణాలు, కావేరీ జలాలు, రైతుల సమస్యలు, రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందం వంటి అంశాలపై ఉమ్మడి పోరాటానికి వ్యూహాన్ని ఈ భేటీలో ఖరారుచేసే అవకాశాలున్నాయి.

విద్యాబోర్డులకు ఉమ్మడి కోర్సు యోచనేదీ లేదు!

• లోక్‌సభలో కేంద్రం స్పష్టీకరణ

దిల్లీ: సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ, ఎన్‌ఐఓఎస్‌లతో పాటు రాష్ట్రాల విద్యాబోర్డులన్నింటికీ ఉమ్మడిగా విద్యాకోర్సును ప్రవేశపెట్టే యోచనేదీ లేదని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ సహాయమంత్రి ఉపేంద్ర కుశ్వహ తెలిపారు. వివిధ ప్రశ్నలకు ఆయన సోమవారం లోక్‌సభలో సమాధానాలిచ్చారు. ఇలాంటి ఉమ్మడి విద్యాప్రణాళిక స్థానిక అంశాలు, సంస్కృతులు, భాషల అవసరాలను నెరవేర్చలేదని పేర్కొన్నారు. అలాగే జాతీయ సార్వత్రిక విద్యాసంస్థ (ఎన్‌ఐఓఎస్)ను మూసివేసే యోచనలేదని స్పష్టంచేశారు.

జాతీయస్థాయిలో విద్యార్థులడేటా: జాతీయస్థాయిలో 1నుంచి 12తరగతులకు చెందిన వారి సమగ్ర వివరాలను (డేటాబేస్) రూపొందిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. జాతీయవిద్యా ప్రణాళిక, నిర్వహణ సంస్థ (ఎన్‌ఐఈపీఏ) ఆధ్వర్యంలో.. ఏకీకృత జిల్లా విద్యా సమాచారవిధానం (యూ-డైస్)లో భాగంగా దీన్ని రూపొందిస్తున్నట్లు వివరించారు. పాఠశాలలు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు సంబంధించిన సమగ్ర సమాచారం ఇందులో ఉంటుందని తెలిపారు. ఆధార్ కార్డుల ఆధారంగా తయారుచేసే ఈ విధానంలో ప్రతి విద్యార్థికి ఏకీకృత గుర్తింపు సంఖ్యను కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులందరి వివరాలతో దీన్ని రూపొందిస్తున్నట్లు వివరించారు.

బోగస్ విద్యాబోర్డులపై: దేశంలోని వివిధ ప్రాంతాల్లో నడుపుతున్న బోగస్ విద్యాబోర్డులకు సంబంధించిన వివరాలేవీ (డేటా) నిర్వహించడం లేదని మంత్రి తెలిపారు. అలాంటి కొన్ని బోర్డుల ఉదంతాలు తమ శాఖ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. ప్రజలను తప్పుతోవ పట్టిస్తున్న సంస్థలను గుర్తించి కేసులు నమోదు చేయాల్సిందిగా రాష్ట్రప్రభుత్వాలు, పోలీసుఅధికారులకు తెలిపాయన్నారు.

జవాబుపత్రాలకు డిజిటల్‌విధానం లేదు: కళాశాలలు, విశ్వవిద్యాలయాల విద్యార్థుల జవాబుపత్రాలను దిద్దేందుకు డిజిటల్ విధానం ప్రతిపాదనేదీ ప్రభుత్వం వద్ద లేదని కేంద్ర మానవవనరుల అభివృద్ధిశాఖ సహాయమంత్రి సత్యపాల్‌సింగ్ లోక్‌సభకు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర, ప్రాంతీయ చట్టాల కింద అలాంటి విధానాల రూపకల్పనకు మాత్రం వర్సిటీలకు స్వయంప్రతిపత్తి ఉన్నట్లువెల్లడించారు.

చిట్‌ఫండ్ రంగం బలోపేతానికి లోక్‌సభలో బిల్లు

దిల్లీ: చిట్‌ఫండ్ రంగాన్ని క్రమబద్ధీకరించి, బలోపేతం చేయడానికి ఉద్దేశించిన 'చిట్‌ఫండ్స్ (సవరణ) బిల్లు-2018'ని ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. నిర్వాహకుల (ఫోర్‌మెన్) కమిషన్‌ను ప్రస్తుతమున్న 5% నుంచి 7 శాతానికి పెంచాలని ఈ బిల్లు ప్రతిపాదిస్తోంది. ఆర్థిక మంత్రిత్వ శాఖలోని పార్లమెంటరీ స్థాయీ సంఘం, కేంద్రం నియమించిన చిట్‌ఫండ్స్ సలహా బృందం ఇచ్చిన సిఫార్సుల ఆధారంగా బిల్లును రూపొందించారు. వేలం జరిగేటప్పుడు స్వయంగా, లేదా ప్రత్యక్ష ప్రసార సదస్సు ద్వారా ఇద్దరు చందాదారులైనా తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాలనేది కొత్త బిల్లులో నిబంధన. చిట్‌ఫండ్ వ్యాపార రంగం ఎదుర్కొంటున్న సవాళ్ల గురించీ బిల్లులో ప్రస్తావించారు. వివిధ వర్గాల ఆర్థికావసరాలు తీర్చడానికి దోహదపడుతున్న చిట్‌ఫండ్లపై 1982లో మొదటిసారిగా చట్టం చేశారు.

ఎగవేతదారుల ఆస్తుల స్వాధీనానికి...

రుణాల ఎగవేతదారులు, పలాయనంలో ఉన్న నేరగాళ్ల ఆస్తులన్నింటినీ స్వాధీనం చేసుకుని బకాయిలు వసూలు చేసుకునేందుకు వీలు కల్పించే 'పరారీలోని ఆర్థిక నేరగాళ్ల బిల్లు-2018'ని ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. పంజాబ్ నేషనల్ బ్యాంకును రూ.12,700 కోట్ల మేర మోసగించి పరారైన నీరవ్‌మోదీ వంటివారి ఆస్తుల్ని విక్రయించడానికి నూతన చట్టం అమల్లోకి వచ్చాక వీలుంటుంది. రూ.100 కోట్లు, అంతకంటే ఎక్కువ ఎగవేతకు పాల్పడి, దేశం విడిచి పారిపోయినవారికి ఇది వర్తిస్తుంది. అలాంటివారిని 'పలాయనంలో ఉన్న నేరగాడు'గా ప్రకటిస్తారు. 'దేశంలోని చట్టాల నుంచి తప్పించుకునే ఉద్దేశంతో మన న్యాయవ్యవస్థకు అందనంత దూరంలో తలదాచుకుంటున్నవారిని దండించి, చట్టాల పవిత్రతను కాపాడడం బిల్లు ఉద్దేశం. విచారణలకు హాజరుకాని ఇలాంటివారివల్ల కేసుల దర్యాప్తులో ఆటంకం ఎదురవుతోంది. న్యాయస్థానాల విలువైనసమయం వృథాఅవుతోంది. రుణాలను ఎగవేస్తున్నవారితో బ్యాంకింగ్ రంగంపైనా ప్రభావంపడుతోంది. ఈపరిస్థితిని ఎదుర్కోవడానికి ప్రస్తుతమున్న చట్టాలు సరిపోవడం లేదు. పలాయనంలో ఉన్న నేరగాళ్లు భారత్‌కు తిరిగి వచ్చి విచారణను ఎదుర్కొనేలా చేయడం నూతన బిల్లు ఉద్దేశమ'ని ప్రభుత్వం పేర్కొంది. 'అక్రమ నగదు చలామణి నిరోధకచట్టం' (పీఎంఎల్ఏ)తో పోలిస్తే నూతన చట్టం భిన్నమైనది. నేరానికి పాల్పడి, దాని ద్వారా పొందే లబ్ధిపైనే జప్తు ఉత్తర్వులు ఇవ్వడానికి పీఎంఎల్ఏ వీలు కల్పిస్తుంది. నేరంవల్ల కలిగిన లబ్ధికిందికి వస్తుందా లేదా అనే అంశంతో సంబంధం లేకుండా అన్ని రకాల ఆస్తుల్ని స్వాధీనం చేసుకోవడం నూతన చట్టం ప్రకారం సాధ్యమవుతుంది.

ఒక దేశం.. ఒకటే రిజర్వేషన్

తెరాస లోక్‌సభాపక్షనేత జితేందర్‌రెడ్డి

అవసరమైతే సుప్రీంకోర్టుకి వెళ్తాం: ఎంపీ కవిత

ఈనాడు, దిల్లీ: సమాఖ్య స్ఫూర్తితోనే దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందంటున్న కేంద్రం ఒకే దేశం-ఒకే రిజర్వేషన్‌పై ఎందుకు దృష్టి సారించడం లేదని తెరాస లోక్‌సభాపక్షనేత జితేందర్‌రెడ్డి ప్రశ్నించారు. సోమవారమిక్కడ లోక్‌సభ వాయిదా అనంతరం తెరాస ఎంపీలు మీడియాతో మాట్లాడారు. ' 'దేశమంతా ఒకటే పన్ను ఉండాలంటూ జీఎస్టీ తీసుకొచ్చారు. ఎన్నికల నిర్వహణ ఖర్చు పెరిగిపోతోందంటూ ఒక దేశం -ఒక ఎన్నికలంటున్నారు. మరి అలాంటప్పుడు మరి రిజర్వేషన్లు కూడా దేశవ్యాప్తంగా ఒకేవిధంగా ఎందుకు అమలు చేయరు" అని జితేందర్‌రెడ్డి కేంద్రాన్ని నిలదీశారు. "తమిళనాడులో 69 శాతం, మహారాష్ట్రలో 52 శాతం రిజర్వేషన్లు అమలులో ఉన్నాయన్నారు. రాజస్థాన్, హరియాణా, ఆంధ్రప్రదేశ్‌లు రిజర్వేషన్లు పెంచాలని కోరుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం రిజర్వేషన్ బిల్లు పాస్‌చేసి కేంద్రానికి పంపి మూడున్నరేళ్లయింది. షెడ్యూలు 9లో తెలంగాణ పాస్ చేసిన బిల్లును చేర్చాలి. అధికరణ16(4)ను సవరించడానికి కేంద్రం ఎందుకు విముఖత చూపుతోందో అర్థం కావడంలేదు. జనాభా ప్రకారం రిజర్వేషన్లు ఇచ్చుకుంటామని ఆ హక్కు రాష్ట్రాలకు ఇవ్వాల్సిందే" అని ఆయన అన్నారు. ఎంపీ కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. "తెలంగాణ ప్రజల డిమాండైన రాష్ట్ర ఉద్యోగాలు, విద్యలో రిజర్వేషన్ల కోటా పెంపుపై ఉద్యమిస్తున్నాం. కేంద్రం స్పందించడంలేదు. దీనిపై ఆందోళన కొనసాగిస్తాం. రాష్ట్ర విభజన తర్వాత 12 శాతం బీసీ 9శాతం ఎస్టీలకు పెంచాలి. సుప్రీంకోర్టుకి వెళ్లి రిజర్వేషన్లు సాధించుకుంటాం" అని తెలిపారు. ఎంపీ సీతారాంనాయక్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత బీసీ, ఎస్సీ-ఎస్టీల జనాభా శాతం తెలంగాణలో పెరిగిందన్నారు. ఆ సమయంలో బీసీ, ఎస్సీ-ఎస్టీల జనాభా శాతం తగ్గితే రిజర్వేషన్లు తగ్గించరు కదా మరి పెరిగినప్పుడు ఎందుకు పెంచరని ప్రశ్నించారు. రాజ్యాంగానికి అనుగుణంగానే దళిత, బీసీ వర్గాల రిజర్వేషన్లు పెంచాలని డిమాండు చేస్తున్నామని ఆదిలాబాద్ ఎంపీ నగేశ్ తెలిపారు.

కరీంనగర్‌లో ఐఐటీ ఏర్పాటు చేయండి: వినోద్

ఈనాడు, దిల్లీ: తెలంగాణలోని కరీంనగర్‌లో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ) ఏర్పాటు చేయాలని తెరాస ఎంపీ వినోద్‌కుమార్ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఈ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ సభ దృష్టికి తీసుకొచ్చారు. ఐఐఐటీ ఏర్పాటుకి తగిన భూమి ఇవ్వడానికి తెలంగాణ ప్రభుత్వం ముందుకొచ్చిందని వినోద్‌కుమార్ గుర్తు చేశారు. రాష్ట్రప్రభుత్వ ప్రతిపాదనను అనుమతించి కరీంనగర్‌లో ఐఐఐటీ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

తెలంగాణ రహదారులకు రూ.5792 కోట్లు మంజూరు.. కేంద్రం: తెలంగాణలోని 866 కిలోమీటర్లకు రూ.5972 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్రం రహదారిరవాణా, జాతీయ రహదారుల శాఖ సహాయమంత్రి మాన్సుఖ్ మాండవీయ తెలిపారు. సోమవారం లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ ఎంకెఖాన్ అడిగిన ప్రశ్నకు కేంద్రసహాయమంత్రి ఈమేరకు సమాధానమిచ్చారు.

గిరిజన వర్సిటీకి స్థలం అప్పగించలేదు: విభజన చట్టం ప్రకారం తెలంగాణలో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాల్సి ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం ఇంకా స్థలం అప్పగించలేదని కేంద్రం స్పష్టం చేసింది. భూపాలపల్లి జిల్లాలో వర్సిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారన్నారు. భూ బదలాయింపులో అటవీ అనుమతులు, ఆక్రమణలకు సంబంధించి కొన్ని ఇబ్బందులు ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం తెలిపిందన్నారు. భూమి అప్పగింత, పార్లమెంటులో బిల్లు పాస్ అయిన తర్వాత వర్సిటీ పనులు ప్రారంభమవుతాయని ఖమ్మం ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మానవవనరుల అభివృద్ధిశాఖ సహాయమంత్రి సత్యపాల్ సింగ్ సోమవారం సమాధానం ఇచ్చారు.

ఆరో రోజూ అంతరాయమే

• కార్యకలాపాలను చేపట్టలేకపోయిన పార్లమెంటు ఉభయ సభలు

ఈనాడు - దిల్లీ

పార్లమెంటు మలి విడత బడ్జెట్ సమావేశాలు వరుసగా ఆరో రోజూ స్తంభించాయి. తెలుగుదేశం, తెరాస, వైకాపా, ఏఐఏడీఎంకె, తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీలు వివిధ సమస్యలపై ఆందోళనలు కొనసాగిస్తూ రావడంతో ఉభయ సభల్లోనూ కార్యకలాపాలు సోమవారం కూడా ముందుకు సాగలేదు. తెదేపా ఎంపీలు పార్లమెంటు ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు పార్టీ సహచరులతో కలిసి ప్రత్యేక హోదా కోసం నిరసన కొనసాగించారు. రాష్ట్రాభివృద్ధి కోసం రైతులు త్యాగం చేసి ఎన్నో భూములు ఇచ్చారని, వాటికి సమానమైన చేయూత కేంద్రం కూడా అందించాలని అశోక్ కోరారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి మొత్తం 18 డిమాండ్లు పూర్తిగా నెరవేర్చేంత వరకూ తమ పోరాటం కొనసాగుతుందని లోక్‌సభలో తెదేపా నేత తోట నరసింహం స్పష్టం చేశారు. లోక్‌సభలోనూ తెదేపా సభ్యుల ఆందోళన కొనసాగించారు.

సన్నాయి శివన్న...

చిత్తూరు ఎంపీ శివప్రసాద్ సోమవారం సన్నాయి వాద్యకారుడి వేషంలో నిరసన తెలిపారు. రాయిలాంటి మోదీ గుండెను కరిగించాలన్న ఉద్దేశంతోనే సన్నాయి వాద్యకారుడి అవతారం ఎత్తినట్లు పేర్కొన్నారు. ప్రత్యేక హోదా ఇచ్చి ఏపీ ప్రజల ఆత్మగౌరవాన్ని గుర్తించాలన్నారు.

వైకాపా నిరసన...

వైకాపా సభ్యులు పార్లమెంటు ప్రధాన ద్వారం వద్ద ప్లకార్డులు పట్టుకొని ప్రత్యేకహోదా కోసం నిరసన చేపట్టారు. సభ ప్రారంభమైన అనంతరం లోక్‌సభ లోపలా ఆందోళన చేశారు.



సోమవారం లోక్‌సభ వెల్‌లో వివిధ పార్టీల ఎంపీల నిరసన

రిజర్వేషన్ల కోసం తెరాస..

తెలంగాణలో ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లు పెంచుకోవడానికి రాష్ట్రానికి అవకాశం ఇవ్వాలని కోరుతూ తెరాస ఎంపీలు కూడా తమ ఆందోళనను కొనసాగించారు. పార్లమెంటు బయట అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. లోక్‌సభ లోపల ప్లకార్డులు పట్టుకొని నినదించారు.

బ్యాలెట్ పత్రాలు కావాలంటూ తృణమూల్..

ఎన్డీయే ప్రభుత్వం ఈవీఎంలను అడ్డుపెట్టుకొని ఎన్నికల కుంభకోణానికి పాల్పడుతోందని, వాటి స్థానంలో తిరిగి బ్యాలెట్ పత్రాలు తీసుకురావాలంటూ తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేశారు. తర్వాత పార్లమెంటు లోపల వీరు నీరవ్‌మోదీని దేశానికి రప్పించాలంటూ ఆందోళన చేపట్టారు.

రాజ్యసభలోనూ ఇదే వరుస

రాజ్యసభలోనూ నిరసనల పర్వం కొనసాగింది. తెలుగుదేశం, తృణమూల్ కాంగ్రెస్, ఏఐఏడీఎంకె సభ్యులు ఉదయం 11 గంటలకు సభామధ్యమంలోకి వచ్చిన వెంటనే సభాధ్యక్షుడు వెంకయ్యనాయుడు సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభమైనా అదే పరిస్థితి పునరావృతమైంది. ఉపసభాపతి పీజే కురియన్ ఒక్క నిమిషంలోనే సభను మంగళవారానికి వాయిదావేస్తున్నట్లు ప్రకటించారు.

నేడు పార్లమెంటు వద్ద రైల్వే ఉద్యోగుల ప్రదర్శన

ఎన్‌పీఎస్ రద్దుకు ఏఐఆర్‌ఎఫ్ డిమాండ్

దిల్లీ: జాతీయ పింఛన్ పథకం (ఎన్‌పీఎస్)ను ఉపసంహరించుకోవాలనీ, కనీస వేతనాలను పెంచాలనీ డిమాండ్ చేస్తూ రైల్వే సిబ్బంది మంగళవారం పార్లమెంట్ వద్ద ప్రదర్శన నిర్వహించనున్నారు. సుదీర్ఘ పోరాటంతో సాధించుకున్న విశ్రాంత ప్రభుత్వోద్యోగుల సామాజిక భద్రతను 2004లో ఎన్‌పీఎస్‌తో కోల్పోయినట్లయిందని 'అఖిల భారత రైల్వే ఉద్యోగుల సమాఖ్య' ప్రధాన కార్యదర్శి శివగోపాల్ మిశ్ర ఆరోపించారు. 2004 తర్వాత ఉద్యోగాల్లో చేరినవారికి పింఛన్ భరోసా లేదని సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన తెలిపారు. దీనికి నిరసనగా పార్లమెంటు వద్ద చేపట్టనున్న ప్రదర్శనకు దాదాపు 50 వేల మంది హాజరుకాబోతున్నారని చెప్పారు. తమ ఆందోళన కార్యక్రమం వల్ల రైళ్ల రాకపోకలకు మాత్రం అంతరాయం కలిగించబోమని స్పష్టంచేశారు. రూ.18,000 కనీస వేతనాన్ని రూ.26,000కి పెంచాలని డిమాండ్ చేశారు.

భాజపా గూటికి సమాజ్‌వాదీ ఎంపీ నరేశ్

• జయాబచ్చన్‌పై అనుచిత వ్యాఖ్యలతో కమలనాథులకు ఇబ్బందికర పరిస్థితి

దిల్లీ: వివాదాస్పద వ్యాఖ్యలతో తరచూ వార్తల్లోకి ఎక్కే సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) రాజ్యసభ ఎంపీ నరేశ్ అగర్వాల్ సోమవారం భారతీయ జనతా పార్టీలో చేరారు. ఆ సందర్భంగా ఆ పార్టీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చేసిన వ్యాఖ్యలు కమలనాథులకు ఇబ్బందికరమైన పరిస్థితిని కల్పించాయి. మహిళలను కించపరిచేలా ఉన్న ఆ వ్యాఖ్యలను భాజపా నేతలు వెంటనే ఖండించాల్సి వచ్చింది. సమాజ్‌వాదీ పార్టీ రాజ్యసభకు తనను తిరిగి నామినేట్ చేయకుండా సినీనటి జయాబచ్చన్‌కు నాలుగో సారి అవకాశం కల్పించటంపై నరేశ్ అగర్వాల్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ..."సినిమాలో డ్యాన్సులు చేసి, నటించిన ఓ వ్యక్తి కోసం నాకు రాజ్యసభ టికెట్ నిరాకరించారు" అని వ్యాఖ్యానించారు. ఎస్పీ అధినేత ములయాం సింగ్ యాదవ్, ఆయన సోదరుడు రాంగోపాల్ యాదవ్‌లంటే తనకు ఇప్పటికీ ఇష్టమేనని అన్నారు. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ తనకు ఆదర్శమని చెప్పారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ సమక్షంలో నరేశ్ అగర్వాల్ భాజపాలో చేరారు. భాజపా అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా వెంటనే ఓ ప్రకటన విడుదల చేస్తూ....జయా బచ్చన్‌పై నరేశ్ అగర్వాల్ చేసిన వ్యాఖ్యలతో పార్టీకి ఎలాంటి సంబంధంలేదన్నారు. అన్ని రంగాల ప్రజలను తమ పార్టీ గౌరవిస్తుందని, వారిని రాజకీయాల్లోకి ఆహ్వానిస్తుందన్నారు. ఆ తర్వాత కొద్ది సమయానికి కేంద్ర మంత్రి సుష్మాస్వరాజ్ కూడా నరేశ్ వ్యాఖ్యలను తప్పుపడుతూ ట్వీట్ చేశారు. జయా బచ్చన్‌పై అతని వ్యాఖ్యలు సమర్థనీయం కాదని పేర్కొన్నారు. రాజ్యసభ ఎంపీగా నరేశ్ అగర్వాల్ పదవీ కాలం ఏప్రిల్ 2వ తేదీతో ముగియనుంది.

ఒకప్పుడు బామ్మనో, తాతయ్యో ఆరోగ్య చిట్కాలు చెప్పేవారు. అయితే నేటి చిన్న కుటుంబాల ప్రపంచంలో సామాజిక మాధ్యమాలే వారి పాత్ర పోషిస్తున్నాయి. అవును.. వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విటర్ వంటి వేదికల నిండా ఎక్కడ చూసినా ఇప్పుడు ఆరోగ్య చిట్కాలు, సూచనలే. శరపరంపరంగా వెల్లువెత్తుతున్న ఇవి ఎక్కడ్నుంచి పుట్టుకొస్తున్నాయో, ఎవరు సృష్టిస్తున్నారో తెలియదు. వారికి ఆయా విషయాల పట్ల అవగాహన, అనుభవం ఉన్నాయో లేవో కూడా తెలియదు. అందువల్ల వీటి విషయంలో జాగ్రత్తగా ఉండటం ఎంతో అవసరం. అసత్యాలను, అర్ధ సత్యాలను నిజమేనని నమ్మి ఆచరిస్తే అంతిమంగా నష్టపోయేది మనమే. మహాభాగ్యమైన ఆరోగ్యాన్ని చేజేతులా దెబ్బతీసుకున్నట్టే. అందువల్ల ఇలాంటి సామాజిక మాధ్యమ ఆరోగ్యసూచనల నిజానిజాలపై ఓ కన్నేద్దాం!




అపోహల వలలో పడిపోకండి

మధుమేహం మందులు కేవలం ఉదయాన్నే వేసుకోవాలా?



ఇది పూర్తిగా తప్పు. మధుమేహం మందుల్లో కొన్ని ఉదయం పూట, మరికొన్ని భోజనంతో పాటు వేసుకోవాల్సి ఉంటుంది. వీటిని డాక్టరు సూచించినట్టుగా క్రమం తప్పకుండా వాడుకోవాలి. ఇష్టం వచ్చినట్టు వేసుకోవటం, మధ్యలో మానెయ్యటం ప్రమాదకరం. ఆహార, వ్యాయామ నియమాలతోనే గ్లూకోజును నియంత్రణలో ఉంచుకోవచ్చని, మందులు వేసుకోవటం అవసరం లేదనే ప్రచారం కూడా కొన్ని మాధ్యమాల్లో సాగుతోంది. మధుమేహులు ఇలాంటి జాగ్రత్తలు తీసుకోవటం తప్పనిసరే కావొచ్చు గానీ- పూర్తిగా ఆహార, వ్యాయామ పద్ధతులతోనే దీన్ని నియంత్రణలో పెట్టుకోవటం కష్టం. ఇలాంటి జాగ్రత్తలతో ఎవరికీ ఏడాదికి మించి గ్లూకోజు నియంత్రణలో ఉండటం లేదని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఒకప్పుడు మధుమేహం బయటపడ్డాక 3 నెలల పాటు ఆహార, వ్యాయామ నియమాలు పాటించాలని సూచించి.. వాటితో ప్రయోజనం కనబడకపోతే మందులు ఇవ్వటం మొదలుపెట్టేవారు. కానీ మధుమేహం ఉన్నట్టు గుర్తించిన రోజు నుంచే మందులు మొదలెట్టాలన్నది ప్రస్తుత అవగాహన. ఎందుకంటే మధుమేహం ఉందని గుర్తించేసరికే దాదాపు 50% మందిలో ఏదో ఒక దుష్ప్రభావం మొదలై ఉంటోందని అధ్యయనాలు చెబుతున్నాయి. కాబట్టి మధుమేహ మందులను క్రమం తప్పకుండా వాడుకోవటం చాలా కీలకం. దీని ద్వారా గ్లూకోజును నియంత్రణలో ఉంచుకోవటంతో పాటు మధుమేహ దుష్ప్రభావాల బారినపడకుండానూ కాపాడుకోవచ్చు. రక్తంలో గ్లూకోజు పరగడుపున 125 ఎంజీ/డీఎల్, భోజనం చేశాక 200 ఎంజీ/డీఎల్ మించకుండా ఉంటేనే మధుమేహం నియంత్రణలో ఉన్నట్టు అర్థం. ఇందుకు మందులు ఎంతగానో తోడ్పడతాయన్న సంగతిని మరవరాదు. మొదట్లో మధుమేహానికి రెండు రకాల మందులే అందుబాటులో ఉండేవి. ఇప్పుడు దాదాపు 7 రకాల మందులు లభిస్తున్నాయి. రకరకాల మందులను కలిపి ఇవ్వటమూ ఇప్పుడు విస్తృతంగా వాడకంలోకి వచ్చింది. మధుమేహ నియంత్రణకు, దుష్ప్రభావాల నివారణకు ఇలా భిన్న రకాల మందులు కలిపి ఇవ్వటం అవసరమని పరిశోధకులు సిఫార్సు చేస్తున్నారు.

జలుబుతో బాధపడే పిల్లలకు బత్తాయి పండ్లు ఇవ్వొద్దా?




ఇందులో ఏమాత్రం నిజం లేదు. బత్తాయి, కమలా వంటి పుల్లటి పండ్లు, అరటిపండు తింటే జలుబు చేస్తుందని.. ఒకవేళ జలుబు, దగ్గు ఉంటే అవి మరింత తీవ్రమవుతాయని అనుకోవటం పొరపాటు. నిజానికి విటమిన్ సితో నిండిన పుల్లటి పండ్లు.. ఖనిజాలతో కూడిన అరటిపండు రోగనిరోధకశక్తిని, జీర్ణశక్తిని పెంచుతాయి. ఇలా ఇవి జలుబు, దగ్గు నుంచి త్వరగా కోలుకోవటానికి తోడ్పడతాయి. అరటిపండ్లు మన ఒంట్లో తగ్గిపోయిన ఖనిజాలను భర్తీ చేస్తుంది. వీటిలోని కేలరీలు ఒంటికి త్వరగా శక్తిని అందిస్తాయి కూడా. దీంతో బలహీనత బారినపడకుండా చూస్తూ జలుబు త్వరగా తగ్గటానికి దోహదం చేస్తుంది. బత్తాయి, కమలా పండ్లలోని విటమిన్ సి వైరస్‌లతో పోరాడటంలో సాయం చేస్తూ జలుబు నుంచి త్వరగా బయటపడేలా చూస్తుంది. పైగా విటమిన్ సి మంచి యాంటీఆక్సిడెంట్ కూడా. ఇది హానికర విషతుల్యాలను బయటకు పంపించేస్తుంది. దీని మూలంగా జ్వరం, దగ్గు మందులు మరింత సమర్థంగా పనిచేయటానికీ తోడ్పడుతుంది.

కేవలం నీరు తాగటం వల్లనే బరువు తగ్గొచ్చా?

ఇప్పుడిప్పుడే ప్రచారమవుతున్న సందేశం ఇది. రెండు మూడు వారాల పాటు ఆహారం పూర్తిగా మానేసి, కేవలం నీళ్లు మాత్రమే తాగటం ద్వారా బరువు తగ్గుతుందనేది దీని సారాంశం. అయితే ఆహారమేమీ తీసుకోకుండా కేవలం నీళ్లు తాగటం వల్ల స్వల్పకాలంలోనే కాదు, దీర్ఘకాలంలోనూ దుష్ప్రభావాలకు దారితీయొచ్చు. ఆహారం తినకపోవటం వల్ల అవసరమైన పోషకాలు అందవు. దీంతో శరీర వ్యవస్థలన్నీ అస్తవ్యస్తమవుతాయి. రక్తంలో గ్లూకోజు స్థాయులు బాగా పడిపోవటం వల్ల విపరీత పరిణామాలకు దారితీయొచ్చు. అసలే తిండి తినకపోవటం వల్ల శరీరం షాక్‌కు గురై కొంతసేపు గ్లూకోజు స్థాయులు పెరిగే అవకాశమూ లేకపోలేదు. ఒంట్లో నీటి మోతాదు పెరగటం వల్ల కణాలు, మెదడు కూడా ఉబ్బిపోయే అవకాశముంది. మరోవైపు- ఆకలితో మాడటం వల్ల శరీరం పస్తులున్నప్పటి స్థితిలోకి వెళ్లిపోతుంది. దీంతో తిరిగి ఆహారం తీసుకోవటం ప్రారంభించాక కేలరీలను ఖర్చు చేయకుండా కొవ్వు రూపంలో దాచుకోవటానికి ప్రయత్నిస్తుంది. ఇది ముమ్ముందు బరువు పెరగటానికి దారితీస్తుంది.

గర్భనిరోధక మాత్రలు దీర్ఘకాలం వేసుకోవటం మంచిది కాదా?



ఇది పూర్తిగా అపోహే. గర్భనిరోధక మాత్రలను దీర్ఘకాలం వాడినా తిరిగి సంతానం కలగటంలో ఎలాంటి ఇబ్బందీ ఉండదు. అయితే కొందరికి మాత్రలు వేసుకోవటం ఆపేసిన తర్వాత కొద్ది నెలల పాటు నెలసరి సరిగా కాకపోవచ్చు. దీనికి బరువు తక్కువగా ఉండటం, తీవ్రమైన ఒత్తిడి వంటివీ దోహదం చేస్తుండొచ్చు. నిజానికి గర్భనిరోధక మాత్రలు సంతానం కలగకపోవటానికి దారితీసే అండాశయ, గర్భాశయ క్యాన్సర్ల బారినపడకుండానూ కాపాడతాయి. అలాగే రుతుస్రావం అధికంగా కావటానికి దారితీసే ఎండోమెట్రియోసిస్ లక్షణాలు తగ్గుముఖం పట్టటానికీ తోడ్పడతాయి. సంతానం కావాలని కోరుకునేవారు గర్భనిరోధక మాత్రలను ఆపేసిన వెంటనే గర్భధారణకు ప్రయత్నించాలని కొందరు సూచిస్తుంటారు. అయితే 4-6 వారాల పాటు వేచి ఉండటం మంచిది. అయితే దీర్ఘకాలంగా.. అంటే ఐదారేళ్లుగా క్రమం తప్పకుండా మాత్రలు వాడే కొందరిలో గర్భధారణకు ప్రయత్నిస్తున్నా ఆరు నెలల నుంచి ఏడాది వరకు సంతానం కలగకపోవచ్చు. దీనికి కారణం- చాలాకాలంగా మాత్రలను వేసుకోవటం వల్ల ఒంట్లోని కొవ్వులో ఈస్ట్రోజెన్ ఎక్కువ మొత్తంలో పోగుపడటమే. ఇది గర్భధారణ అవకాశాలను తగ్గించే అవకాశముంది. అయితే దీర్ఘకాలం విచ్చలవిడిగా ఈ మాత్రలను వాడితే కొన్నిరకాల క్యాన్సర్ల ముప్పు పెరగొచ్చని అధ్యయనాలు పేర్కొంటున్నాయి.

అధిక రక్తపోటుకు చికిత్స అవసరం లేదా?



ఇది పెద్ద అపోహ. అధిక రక్తపోటు (హైబీపీ) సైలెంట్ కిల్లర్. ఇది పైకి ఎలాంటి లక్షణాలు కనిపించకుండానే లోలోపల అవయవాలను దెబ్బతీస్తుంది. నిర్లక్ష్యం చేస్తే గుండెపోటు, పక్షవాతం, కిడ్నీ వైఫల్యం, కళ్లు దెబ్బతినటం వంటి తీవ్ర సమస్యలకు దారితీస్తుంది. కాబట్టి అధిక రక్తపోటుకు చికిత్స తీసుకోవటం తప్పనిసరి. ఇప్పుడు దీనికి రకరకాల మందులు అందుబాటులో ఉన్నాయి. అవసరాన్ని బట్టి, రక్తపోటు గ్రేడులను బట్టి, వయసును బట్టి డాక్టర్లు వీటిని సూచిస్తారు. రక్తపోటు 2, 3 గ్రేడుల్లో ఉంటే వెంటనే చికిత్స తీసుకోవాల్సి ఉంటుందనే సంగతి మరవకూడదు. డాక్టర్ సూచించిన మందులను క్రమం తప్పకుండా, శ్రద్ధగా వేసుకోవటం చాలా కీలకం. ఎట్టి పరిస్థితుల్లోనూ మధ్యలో మానెయ్యకూడదు. చాలామంది హైబీపీ మందులను 'లైఫ్ లాంగ్' వేసుకోవాల్సి ఉంటుందని భావించి అసలు మొదలుపెట్టకుండా ఉండిపోతుంటారు. ఇది మంచి పద్ధతి కాదు. ఈ మందులు మన 'లాంగ్ లైఫ్' కోసం పనిచేస్తాయని గుర్తుంచుకోవాలి. అంటే వీటిని జీవితాంతం వాడుతున్నామని కాదు, ఇవి జీవితం అంతం కాకుండా కాపాడతాయని గుర్తుంచుకోవాలి. అలాగే ఎవరి ఇష్టం ప్రకారం వాళ్లు మందులు వేసుకోవటం తగదు. ఏదో ఒక మందు బాగా పనిచేస్తుందనో, మరెవరో చెప్పారనో మందులను మార్చొద్దు.

కాన్పు సహజ ప్రక్రియ.. ఇందులో డాక్టర్ల జోక్యం అవసరం లేదా?



ప్రమాదకరమైన ప్రచారం ఇది. నిజానికి గర్భిణి ఆరోగ్యవంతంగా ఉండి.. లోపల బిడ్డ చక్కగా పెరుగుతూ.. గర్భధారణ కాలమంతా కూడా సజావుగా సాగిపోతే కాన్పు చాలావరకు సహజంగానే జరిగే అవకాశముంది. ఇందులో సందేహం లేదు. అయినా కూడా కాన్పు ఆసుపత్రిలో, నిపుణుల సమక్షంలోనే జరగటం అన్ని విధాలా మంచిది. ఎందుకంటే అన్నీ మనం అనుకున్నట్టుగా సజావుగా సాగకపోవచ్చు. కొన్నిసార్లు అత్యవసరంగా సిజేరియన్ చేయాల్సిన పరిస్థితి తలెత్తొచ్చు. బిడ్డ తల, శరీరం పెద్దగా ఉండి.. తల్లి కటిభాగం నుంచి సురక్షితంగా బయటకు రాలేని పరిస్థితి ఉండటం, జననాంగం నుంచి బిడ్డ బయటకు వచ్చే మార్గం సరిగా లేకపోవటం, బిడ్డ అడ్డం తిరగటం, తల్లికి గుర్రపువాతం లేదా గ్లూకోజు స్థాయులు బాగా పెరిగిపోయి బిడ్డ పరిస్థితి ప్రమాదకరంగా పరిణమించటం, నెలలు నిండకముందే ఉమ్మనీరు బయటకు వెళ్లిపోవటం, ఇద్దరి కన్నా ఎక్కువమంది కవలలు పుట్టే అవకాశం ఉండటం.. వంటి పరిస్థితుల్లో తప్పకుండా సిజేరియన్ చేయాల్సి వస్తుంటుంది. అందువల్ల గర్భం ధరించినప్పట్నుంచే క్రమం తప్పకుండా డాక్టర్‌ను సంప్రదించి, అవసరమైన పరీక్షలు చేయించుకోవటం మంచిది. అలాగే ఆసుపత్రిలోనే కాన్పయ్యేలా చూసుకోవటం తప్పనిసరి. ఏదైనా అనుకోని ఆపద ఎదురైతే డాక్టర్లు తక్షణం ఆపరేషన్ థియేటర్‌లోకి మార్చి సిజేరియన్ చేయటానికి వీలుంటుంది.

కండోమ్ వాడితే ఎలాంటి సుఖవ్యాధులు అంటుకోవా?



ఇది పూర్తిగా నిజం కాదు. కండోమ్‌తో సుఖవ్యాధులను నివారించుకోవటం సాధ్యమే. అయితే ఇది నూటికి నూరు శాతం సురక్షితం కాదు. కండోమ్ సరిగా ధరించకపోయినా.. మధ్యలో ఊడిపోయినా, చిరిగిపోయినా గనోరియా, సిఫిలిస్, హెచ్‌పీవీ, క్లమీడియా వంటివి ఒకరి నుంచి మరొకరికి వ్యాపించొచ్చు. ఒకవేళ జననాంగ భాగాల చుట్టుపక్కల ఎక్కడైనా పొక్కులు, పుండ్ల వంటివి ఉంటే కండోమ్ ధరించినా ఉపయోగం లేదు. వాటి నుంచి వచ్చే స్రావాలు అంటుకోవటం ద్వారా సుఖవ్యాధుల బారినపడే అవకాశముంది. కొందరికి సుఖవ్యాధుల మూలంగా నోట్లో లేదా పెదవుల చుట్టూరా పొక్కులు, పుండ్ల వంటివి తలెత్తుతుంటాయి. ఇలాంటి పరిస్థితిలో ముఖరతి చేస్తే సుఖవ్యాధులు అంటుకోవచ్చు. కాబట్టి సుఖవ్యాధుల నివారణకు కండోమ్ ఒక్కటే మార్గమని అనుకోవటానికి లేదు. తెలిసీ తెలియని వయసులో ఉత్సుకత కొద్దీ లైంగిక ప్రయోగాలకు దిగకపోవటం, నమ్మకమైన ఒకే భాగస్వామికి కట్టుబడి ఉండటం, శృంగారంలో అసహజ పద్ధతులకు దూరంగా ఉండటం మంచిది.

రోజూ మల విసర్జన కాకపోతే జబ్బులు వస్తాయా?



దీనికి శాస్త్రీయ నిరూపణలేవీ లేవు. రోజుకు కనీసం ఒకసారైనా మల విసర్జనకు వెళ్లాలని చాలామంది భావిస్తుంటారు గానీ ఒకవేళ అలా జరగకపోయినా వచ్చిన ప్రమాదమేమీ లేదు. కాకపోతే కొందరు మానసికంగా చాలా చికాకు అనుభవిస్తుంటారు. కడుపు ఉబ్బిపోయిందని, గ్యాస్ పైకి తంతోందని, ఒళ్లు బద్ధకంగా.. నొప్పులుగా ఉందని, తలనొప్పి వచ్చిందని.. ఇలా రకరకాలుగా చెబుతుంటారు. అయితే ఇవన్నీ మానసిక భావనలే. ఇవేవీ శాస్త్రీయంగా రుజువు కాలేదు. మలబద్ధకం వల్ల రకరకాల జబ్బులు వస్తాయన్నదీ నిర్ధరణ కాలేదు. అయితే చాలారోజుల పాటు విసర్జన కాకుండా మలం లోపలే ఉండిపోతే అది గట్టిపడిపోతుంది. దీంతో విసర్జన సాఫీగా జరగక విపరీతంగా ముక్కటం చేస్తుంటారు. ఫలితంగా మలద్వారం వద్ద చీరుకుపోవటం, గీరుకుపోవటం, రక్తనాళాలు చినిగినట్టయి రక్తం పడటం వంటి ఇబ్బందులు తలెత్తుతుంటాయి. మనలో చాలామంది మలం గట్టిగా వస్తున్నా, ముక్కాల్సి వస్తున్నా, విసర్జన పూర్తిగా అయినట్టు అనిపించకపోయినా, ఉదయాన్నే విసర్జనకు వెళ్లాలని అనిపించికపోయినా.. ఇలా ఎలాంటి తేడా కనబడినా మలబద్ధకమనే భావిస్తుంటారు. నిజానికి రోజుకు 3 సార్ల నుంచి వారానికి 3 సార్ల వరకూ మలవిసర్జన జరగటం సహజం. ఇది వ్యక్తిగత అలవాట్ల మీద ఆధారపడి ఉంటుంది.

పిల్లలకు పాలే అన్నింటికన్నా మంచి ఆహారమా?



చక్కెర, ప్రోటీన్, కొవ్వులతో కూడిన పాలు సంపూర్ణ ఆహారమే. కాదనలేం. కానీ ఆ పేరుతో పిల్లలకు బలవంతాన మరీ ఎక్కువగా పాలు తాగించాల్సిన అవసరమేమీ లేదు. పిల్లల బరువులో ప్రతి కిలోకు 30 మిల్లీలీటర్ల పాలు ఇస్తే చాలు. అతిగా పాలు తాగితే కడుపు నిండిపోయి.. మిగతా ఆహారం సరిగా తినరు. దీంతో ఐరన్, పీచు తగినంత అందదు. ఫలితంగా ఐరన్ లోపంతో రక్తహీనత తలెత్తొచ్చు. అందువల్ల పిల్లలకు పాలే కాదు.. మిగతా ఆహారం కూడా ముఖ్యమేననే విషయాన్ని గుర్తించాలి.

పిడికెడు జాలీలు

చూడటానికి పిడికెడంత కూడా ఉండవు గానీ మూత్రపిండాలు (కిడ్నీలు) మహా గట్టివి. రక్తంలోని వ్యర్థాలను, విషతుల్యాలను, అధికంగా ఉన్న నీటిని ఎప్పటికప్పుడు వడకట్టి.. మూత్రం రూపంలో బయటకు పంపేస్తుంటాయి. ఒంట్లో నీరు, లవణాల సమతుల్యత దెబ్బతినకుండా, రక్తపోటు నియంత్రణలో ఉండేలానూ చూస్తాయి. కిడ్నీల వడపోత సామర్థ్యం తగ్గితే ఒంట్లోని జీవక్రియలన్నీ అస్తవ్యస్తమవుతాయి. కాబట్టి ఇవి దెబ్బతినకుండా చూసుకోవటం ఎంతైనా అవసరం.

రోజూ వాడేవే అయినా...

వయసు పెరుగుతున్నకొద్దీ కిడ్నీల వడపోత సామర్థ్యం తగ్గుతూ వస్తుంది. 30 ఏళ్లు దాటిన తర్వాత కిడ్నీ పనితీరు ఏటా 10% మేరకు పడిపోతుంది. మనం రోజూ వాడుకునే ఆహార పదార్థాలు కూడా కిడ్నీజబ్బు ముప్పును పెంచొచ్చు.

1. **ఉప్పు:** దీనిలోని సోడియం రక్తపోటును పెంచుతుంది. ఇది కిడ్నీలను దెబ్బతీసి కిడ్నీ వైఫల్యానికి దారితీస్తుంది.
2. **చక్కెర:** దీన్ని మితిమీరి తీసుకుంటే గుండె, కిడ్నీజబ్బుల ముప్పు పెరిగేలా చేసే యూరిక్ ఆమ్లం ఉత్పత్తి పెరుగుతుంది.
3. **కూల్‌డ్రింకులు:** రోజుకు 2 కన్నా ఎక్కువ కూల్‌డ్రింకులు తాగేవారికి మూత్రంలో సుద్ద పోయే ముప్పు ఎక్కువ. ఇదీ కిడ్నీజబ్బు ముప్పును పెంచుతుంది.
4. **మాంసాహార ప్రోటీన్లు:** వీటితో కిడ్నీల మీద భారం ఎక్కువగా పడుతుంది.
5. **నొప్పి మందులు:** ఎన్‌ఎస్‌ఏఐడీ రకం నొప్పిమందులను అనవసరంగా, తరచుగా, దీర్ఘకాలంగా, పెద్దమొత్తంలో వాడితే కిడ్నీలకు హానికరంగా పరిణమిస్తుంది.
6. **మద్యం:** అతిగా మద్యం తాగితే కిడ్నీల్లో యూరిక్ ఆమ్లం పోగుపడుతుంది. దీంతో నెఫ్రాన్‌లోని వడపోత మార్గాల్లో అడ్డంకి తలెత్తి కిడ్నీ వైఫల్యం, కిడ్నీజబ్బులకు దారితీస్తుంది.




వీటిని విస్మరించొద్దు

- రాత్రిపూట ఎక్కువసార్లు మూత్రం రావటం
- మూత్రం పోస్తున్నప్పుడు నొప్పి, ఇబ్బంది
- మూత్రంలో రక్తం, సుద్ద పడటం
- పాదాలు, కాళ్ల వాపులు
- ముఖం ఉబ్బరించటం
- ఆకలి తగ్గటం
- ఆయాసం
- నిస్సత్తువ, రక్తహీనత
- వాంతి, వికారం
- ఎముకల నొప్పులు, బాధలు

మనదేశంలో పట్టణ వాసుల్లో 17.2% మంది కిడ్నీజబ్బుతో బాధపడుతున్నారు.	కిడ్నీజబ్బుకు మధుమేహం, అధిక రక్తపోటు అతిపెద్ద ముప్పు కారకాలు.	మధుమేహుల్లో 30-40% మంది కిడ్నీజబ్బులోకి జారిపోయే అవకాశముంది.	అధిక రక్తపోటుతో బాధపడేవారిలో 14-22% మందికి దీర్ఘకాల కిడ్నీజబ్బు వచ్చే అవకాశముంది.

నివారణే శ్రీరామరక్ష

కిడ్నీలు దెబ్బతిన్నాక బాధపడే కన్నా అలాంటి పరిస్థితి రాకుండా నివారించుకోవటమే ఉత్తమం.



- తగినంత నీరు తాగటం
- మధుమేహం, అధిక రక్తపోటు సమస్యలను నియంత్రణలో ఉంచుకోవటం
- రోజు మొత్తమ్మీద ఉప్పు 5-6 గ్రాములు (చెంచా) మించకుండా చూసుకోవటం
- బరువు అదుపులో ఉంచుకోవటం
- రోజూ కనీసం అరగంట సేపు వ్యాయామం చేయటం
- సిగరెట్లు, బీడీలు, చుట్టల వంటివి తాగకపోవటం
- కిడ్నీజబ్బు ముప్పు ఎక్కువగా గలవారు ఏడాదికోసరి పరీక్షలు చేయించుకోవటం

వినికిడి 'మతిమరుపు'

వినికిడిలోపిస్తే చుట్టుపక్కల వాళ్ల మాటలు వినిపించకపోవటమే కాదు.. డిమెన్షియా వంటి విషయగ్రహణ సమస్యలకూ దారితీస్తుందని అధ్యయనాలు పేర్కొంటున్నాయి. దీని వెనకగల కారణమేంటో స్పష్టంగా బయటపడలేదు. కానీ వినికిడిలోపించటం వల్ల నలుగురితో



మాట్లాడటానికి, కలవటానికి జంకటం వంటివి ఇందుకు దోహదం చేస్తుండొచ్చని భావిస్తున్నారు. మెదడు ఆరోగ్యానికి నలుగురితో సంబంధాలు కూడా చాలా కీలకం. మాటలు సరిగా వినబడకపోవటం వల్ల మెదడుకు ప్రేరణలు తగ్గిపోయి డిమెన్షియా ముప్పు పెరగటానికి కారణమవుతోంది. కాబట్టి వినికిడిలో ఏదైనా మార్పు కనబడితే వెంటనే ఒకసారి డాక్టర్‌ను సంప్రదించటం మంచిది.

ఈనాడు సినిమా

ప్రభాస్ సరసన పూజ ?


ప్రభాస్


పూజా హెగ్డే

వరుసగా అవకాశాల్ని అందుకొంటూ తన జోరును ప్రదర్శిస్తోంది పూజా హెగ్డే. త్వరలోనే ఎన్టీఆర్, మహేష్‌లతో కలిసి నటించబోతున్న ఆమె ప్రభాస్‌తోనూ జోడీ కట్టబోతోందని సమాచారం. ప్రస్తుతం 'సాహో'లో నటిస్తున్న ప్రభాస్... తదుపరి రాధాకృష్ణ కుమార్ దర్శకత్వంలో ఓ చిత్రం చేయబోతున్నారు. విభిన్నమైన ప్రేమకథతో తెరకెక్కనున్న ఆ చిత్రం కోసమే పూజా హెగ్డేని కథానాయికగా ఎంపిక చేసుకొన్నట్టు తెలిసింది. ఈ యేడాది జూన్‌లోనే ప్రభాస్ - రాధాకృష్ణకుమార్ చిత్రం మొదలు కాబోతోంది. గోపీకృష్ణ మూవీస్ పతాకంపై కృష్ణంరాజు నిర్మించనున్నారు. త్వరలోనే విడుదల కానున్న 'రంగస్థలం'లో పూజాహెగ్డే ఓ ప్రత్యేకగీతం చేసింది. ఆమె తెలుగు చిత్రాల్లో అవకాశాలు అందుకొంటూనే, హిందీ చిత్రాలపై కూడా దృష్టిపెడుతోంది. సల్మాన్‌ఖాన్ 'రేస్ 3'లో పూజ నటిస్తోంది.

కొత్త కబుర్లు

వరుణ్‌తో అదితి


వరుణ్‌తేజ్

'తొలిప్రేమ'తో మరొక విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న వరుణ్‌తేజ్, తదుపరి సంకల్ప్‌రెడ్డి దర్శకత్వంలో నటించబోతున్నారు. 'ఘాజీ'తో విజయాన్ని అందుకొన్న సంకల్ప్, ఈసారి అంతరిక్షం నేపథ్యంలో సాగే కథని సిద్ధం చేశారు. ఆ కథ నచ్చడంతో వరుణ్ పచ్చ జెండా ఊపేశారు. ప్రస్తుతం పూర్వ నిర్మాణ కార్యక్రమాల్లో ఉన్న ఆ చిత్రాన్ని వై.రాజీవ్‌రెడ్డి, జాగర్లమూడి సాయిబాబు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇందులో వరుణ్ సరసన కథానాయికగా అదితిరావు హైదరీని ఎంపిక చేసుకొనే అవకాశాలున్నట్టు తెలిసింది. మణిరత్నం 'చెలియా'తో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన అదితి, ప్రస్తుతం సుధీర్‌బాబుతో కలిసి 'సమ్మోహనం'లో నటిస్తోంది.


అదితిరావు హైదరీ


నాని


నాగార్జున

ఉగాది నుంచి షురూ

నాగార్జున, నాని కథానాయకులుగా వైజయంతీ మూవీస్ పతాకంపై ఓ చిత్రం తెరకెక్కబోతోంది. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వం వహిస్తారు. సి.అశ్వనీదత్ నిర్మాత. ఈ సినిమా చిత్రీకరణ ఉగాది రోజు నుంచి హైదరాబాద్‌లో మొదలవుతుంది. ప్రస్తుతం అమెరికాలో సంగీత చర్చలు కొనసాగుతున్నాయి. నిర్మాత మాట్లాడుతూ "ఇదివరకు పలు మల్టీస్టారర్ చిత్రాలు మా సంస్థలో తెరకెక్కాయి. అవన్నీ కూడా వాణిజ్యపరంగా మంచి విజయాల్ని అందుకొన్నాయి. ఇప్పుడు నాగార్జున, నాని కలయికలో రూపొందుతున్న చిత్రం కూడా మా సంస్థకి మంచి పేరు తీసుకొస్తుంది. మా సంస్థలో మణిశర్మ స్వరాలు అందించిన చిత్రాలన్నీ సంగీతం పరంగా మంచి విజయాలుగా నిలిచాయి. ఈ సినిమా కూడా ఓ మెట్టు పైనే ఉండేలా ఆయన స్వరాలు సమకూరుస్తున్నారు. మూడు పాటలకి సంబంధించి సంగీత చర్చలు ప్రస్తుతం అమెరికాలో జరుగుతున్నాయి" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "వినోదాత్మకంగా సాగే విభిన్నమైన కథతో తెరకెక్కుతున్న చిత్రమిది" అన్నారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: శ్యామ్‌దత్, కూర్పు: ప్రవీణ్ పూడి, మాటలు: వెంకట్ డి.పట్టి, శ్రీరామ్ ఆర్. ఇరగం.

'కిరాక్ పార్టీ'తో కోరిక తీరింది!

"జీవితంలో ఎప్పుడో ఒకసారి 'శివ'లాంటి కళాశాల నేపథ్యమున్న చిత్రం తీయాలనే కోరిక ఉండేది. అది 'కిరాక్‌పార్టీ'తో తీరినట్టుగా భావిస్తున్నా" అన్నారు అనిల్ సుంకర. ఆయన నిర్మాణంలో నిఖిల్ కథానాయకుడిగా తెరకెక్కిన చిత్రం 'కిరాక్ పార్టీ'. శరణ్ కొప్పిశెట్టి దర్శకుడు. శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు అనిల్ సుంకర. ఆ విషయాలివీ...



● "ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థుల జీవితాల్లోని పలుకోణాల్ని స్పృశించే చిత్రమిది. చివరి ఇరవై నిమిషాలు భావోద్వేగంతో సాగుతూ కన్నీళ్లు పెట్టిస్తుంది. కన్నడ సినిమా 'కిరిక్ పార్టీ' బాగుందని అమెరికాలో ఉన్న ఓ మిత్రుడు చెప్పడంతో నేను, నిఖిల్, ఇతర మిత్రులం కలిసి చూశాం. వెంటనే పునర్నిర్మాణ హక్కుల్ని కొన్నా. 'శివ'లోని స్టూడెంట్స్ రాజకీయం ఓ కోణమైతే, 'హ్యాపీడేస్'లో కాలేజీ కుర్రాళ్ల జీవితాలు మరో కోణం. ఈ రెండింటి మేళవింపుతో సాగే చిత్రమిది. ఓ కాలేజీ అమ్మాయిని అనవసరపు మాటలతో బాధపెడితే...తను ఎలా ప్రతిస్పందించింది, ఆ తర్వాత ఏ పరిస్థితులకి దారితీసిందనేది తెరపైనే చూడాలి. సుధీర్‌వర్మ, చందు మొండేటి అందించిన స్క్రీన్‌ప్లే, సంభాషణలతో పాటు, చిత్రంలోని ఐదు పాటలూ... ఇలా అన్నీ సంతృప్తినిచ్చేలా ఉంటాయి. కిరాక్ అంటే జోష్ అని అర్థం".

● "మా ఎ.కె. ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నుంచి వరుసగా చిత్రాలు రాబోతున్నాయి. కథానాయకుడు అల్లరి నరేష్‌తో నిర్మించే చిత్రం షూటింగ్ మార్చి చివరలో ఆరంభమవుతుంది. గిరి దర్శకత్వం వహిస్తారు. అలాగే టైగర్ నాగేశ్వరరావు కథని ఓ పెద్ద కథానాయకుడుతో బయో పిక్‌గా తెరకెక్కించబోతున్నాం. 'కిట్టు ఉన్నాడు జాగ్రత్త' తెరకెక్కించిన వంశీ దర్శకత్వంలో ఆ చిత్రం రూపొందనుంది. అలాగే శర్వానంద్ కథానాయకుడుగా శ్రీనివాసరాజు దర్శకత్వంలో ఓ చిత్రాన్ని నిర్మిస్తాం. రాజ్‌తరుణ్‌తో తీసిన 'రాజుగాడు' సినిమా టీజర్ ఉగాదికి విడుదలవుతుంది. మహేష్‌బాబు కథానాయకుడుగా 14 రీల్స్ సంస్థ నుంచి మరో చిత్రం ఉంటుంది. ఎప్పుడు మొదలవుతుందని ఇప్పుడే చెప్పలేను. సురేష్ ప్రొడక్షన్స్, ఎ.కె. ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా వెంకటేష్ కథానాయకుడుగా ఓ చిత్రం తెరకెక్కుతోంది. తేజ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ఈ నెల 26న గానీ ఏప్రిల్ 1న కానీ ప్రారంభం అవుతుంది".

గీతోపదేశం

ఎదిగే పక్షి రెక్కకు సహజం
ఎగిరే లక్షణం
వదిలేస్తుంది నిన్నటి గూటిని
కదిలే ఆ క్షణం
ఏదీ నీది కాదని అనుకో
ఏదో నాటికి
అయినా రేపు మిగిలే ఉంది
ఆశావాదికి

గీతం: చిరునవ్వులతో బ్రతకాలి...
చిత్రం: మీ శ్రేయోభిలాషి
రచన: వెనిగళ్ల రాంబాబు
- పంపినవారు:
ఎం. షేక్ సాదిఖ్ అలీ, వరంగల్

ఏప్రిల్‌లోనే అక్టోబర్ వస్తుంది


వరుణ్ ధావన్, బనితా సంధు

వరుస విజయాలతో జోరు మీదున్న బాలీవుడ్ యువ కథానాయకుడు వరుణ్ ధావన్ నటిస్తున్న తాజా చిత్రం 'అక్టోబర్'. విక్కీ డోనర్, పీకూ లాంటి చిత్రాలతో ప్రత్యేకత చాటుకున్న సూజిత్ సర్కార్ దీనికి దర్శకత్వం వహిస్తున్నారు. వరుణ్, సూజిత్ కలయికలో తెరకెక్కుతున్న తొలి చిత్రమిది. మోడల్ బనితా సంధు ఈ చిత్రంతో కథానాయికగా పరిచయమౌతోంది. తాజాగా విడుదలైన ఈ సినిమా ట్రైలర్ ఆకట్టుకుంటోంది. ఓ విభిన్నమైన ప్రేమకథతో ఈ చిత్రం తెరకెక్కినట్లు తెలుస్తోంది. 'ఇది ప్రేమ కథ కాదు... ప్రేమను గురించిన కథ' అని ప్రచార చిత్రంలో వెల్లడించారు. వరుణ్ ఈ చిత్రంలో స్టార్ హోటల్‌లో ట్రైనీగా పని చేస్తున్న హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థిగా కనిపిస్తాడు. ఈ చిత్రంలో అధిక భాగాన్ని దిల్లీలోని ఓ స్టార్ హోటల్‌లో తెరకెక్కించారు. అక్కడే వరుణ్ హోటల్ ఉద్యోగుల పనితీరును క్షుణ్నంగా పరిశీలించి తన పాత్రకు సిద్ధమయ్యాడని చిత్రబృందం చెప్పింది. ప్రచార చిత్రాల్లో వరుణ్‌ను చూస్తుంటే పాత్ర కోసం అతడు తీసుకున్న శ్రద్ధ అర్థమవుతోంది. 'అక్టోబర్' చిత్రం ఏప్రిల్ 13న ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఊళ్లో పెళ్లి సందడి


సాక్షి చౌదరి, రాజేంద్రప్రసాద్

రాజేంద్రప్రసాద్, సాక్షి చౌదరి, బ్రహ్మానందం, అలీ, రిషి, ఖయ్యూం, ధనరాజ్, కృష్ణుడు, సాయి, హేమంత్ ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రం 'ఊ.పె.కు.హ.' (ఊళ్లో పెళ్ళికి కుక్కల హడావిడి). 'నిధి' ప్రసాద్ దర్శకత్వం వహించారు. భాగ్యలక్ష్మి నిర్మాత. అనూప్ రూబెన్స్ స్వరకర్త. సోమవారం హైదరాబాద్‌లో పాటల విడుదల కార్యక్రమం జరిగింది. తొలి సీడీని కథానాయకుడు రాజేంద్రప్రసాద్ విడుదల చేశారు. జెమిని కిరణ్ స్వీకరించారు. అనంతరం రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ "సరికొత్త నేపథ్యంలో సాగే కథతో తెరకెక్కిన చిత్రమిది. ఇందులోని వినూత్నమైన హాస్య సన్నివేశాలు ప్రేక్షకుల్ని కడుపుబ్బ నవ్విస్తాయి. అనూప్ పాటలు ఆకట్టుకుంటాయి. ఎనభై మంది నటులు ఇందులో కనిపిస్తారు. అంతమంది ఉన్నప్పటికీ ప్రేక్షకులకి ఎలాంటి గందరగోళం కలగకుండా చిత్రాన్ని తీర్చిదిద్దాం. అంతా నవ్వుల లోకంలో తేలిపోయేలా దర్శకుడు చిత్రాన్ని తెరకెక్కించార"న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "అనూప్ బిజీగా ఉన్నప్పటికీ అనుకున్నదాని కంటే ముందే వినసొంపైన పాటల్ని అందించి సహకరించాడు. ప్రచార చిత్రం చూసిన వారు బాగుందంటున్నారు. ప్రతి సన్నివేశం నవ్విస్తుంది. ప్రతి ఒక్కరూ పాత్రల్లో జీవించారు. ఇది కొత్త కోణంలో సాగే కామెడీ చిత్రం. త్వరలోనే విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామ"న్నారు. అనూప్ మాట్లాడుతూ "కీబోర్డ్ ప్లేయర్‌గా ఉన్నప్పుడే నిధి ప్రసాద్ చిత్రానికి పనిచేశా. ఇప్పుడాయన చిత్రానికి సంగీతదర్శకుడిగా చేయడం ఆనందంగా ఉంది. మళ్లీ తను విజయాల బాటలో ప్రయాణం చేస్తారనే నమ్మకం నాకుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో విక్రమ్, నాగరాజు, సాయి, ఖయ్యూం, రిషి, సాక్షిచౌదరి తదితరులు పాల్గొన్నారు.

వంకాయల సత్యనారాయణమూర్తి కన్నుమూత



సీనియర్ నటుడు వంకాయల సత్యనారాయణమూర్తి (78) సోమవారం విశాఖపట్నంలో కన్నుమూశారు. నాటక, సినీరంగాల్లో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న వంకాయల కొంతకాలంగా శ్వాసకోశ సమస్యతో బాధపడుతూ, నాలుగురోజుల క్రితం విశాఖ కేర్ ఆసుపత్రిలో చికిత్స కోసం చేరారు. సోమవారం మృతి చెందారు. 1940 డిసెంబరు 28న విశాఖపట్నంలో జన్మించిన ఆయన 1970లో నాటక రంగంలోకి ప్రవేశించారు. 1976లో సినీ రంగప్రవేశం చేశారు. 'నీడలేని ఆడది' చిత్రంతో ప్రయాణం మొదలుపెట్టి, మొత్తం 184 చిత్రాల్లో నటించారు. క్యారెక్టర్ నటుడిగా ఆయనకంటూ ఓ శైలి ఉంది. 'సీతాకోకచిలుక', 'సూత్రధారులు', 'సీతామాలక్ష్మి', 'దొంగకోళ్లు', 'ఊరికి ఇచ్చిన మాట', 'విజేత', 'స్టేషన్ మాస్టర్', 'మావిచిగురు' సినిమాలు ఆయనకు మంచి పేరుని తెచ్చిపెట్టాయి. వంకాయల చివరి సినిమా... 'కారం దోస'. పలు టెలివిజన్ ధారావాహికల్లోనూ నటించి మెప్పించిన వంకాయల సినిమాల్లోకి రాకముందు చదువుతో పాటు, ఆటల్లోనూ ప్రతిభ కనబరిచారు. బి.కామ్‌లో గోల్డ్ మెడల్ అందుకొన్న ఆయన 1960లో షూటింగ్ పోటీలో భారతదేశంలోనే మొదటి స్థానం పొందారు. చదువు, ఆటల్లో ప్రతిభవల్ల హిందూస్థాన్ షిప్‌యార్డులో ఉద్యోగం వచ్చినప్పటికీ, నటనపైనే మక్కువని ప్రదర్శించి సినిమా రంగంలోకి ప్రవేశించారు. వంకాయలకు భార్య శకుంతల, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 2001 నుంచి విశాఖ సిరిపురంలో చిన్న కుమార్తె లావణ్య ఇంట్లో ఉంటున్నారు. ఈనెల 13న కాకినాడలో జరిగే నాటకానికి సమాయత్తమవుతుండగా ఆయన కన్నుమూశారు.

- న్యూస్‌టుడే, పెదవాల్తేరు


దీపికా పదుకొణె

పేరు ప్రఖ్యాతుల్ని పట్టించుకోను కానీ...!

చిత్ర పరిశ్రమలో సత్తా చాటగలిగితే చాలు డబ్బు, పేరుప్రతిష్ఠలు వాటంతటవే ఊహించని రీతిలో వచ్చి పడతాయి. బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా కొనసాగుతూ హాలీవుడ్‌లోనూ గుర్తింపు తెచ్చుకునే ప్రయత్నాల్లో ఉన్న దీపికా పదుకొణె పేరు ప్రఖ్యాతులకు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వనంటోంది. ముంబయిలో జరిగిన ఓ అవార్డుల కార్యక్రమంలో పాల్గొంది దీపిక. "పేరు ప్రఖ్యాతులకు అంత ప్రాధాన్యం ఇవ్వను కానీ నేను పనిచేస్తున్న సినిమా రంగంలో డబ్బు, పేరు భాగం. అందుకే ఆ రెండింటిని నిర్లక్ష్యం చేయలేను. నా కష్టానికి దక్కే అదనపు ఉత్పత్తులవి. నేను నా పనిని ప్రేమిస్తాను. పదేళ్లుగా నటిగా ఎంతో కష్టపడ్డాను. ఎన్నో నేర్చుకున్నాను. పనిని ఎంజాయ్ చేశాను. భవిష్యత్తులోనూ అంతే" అని చెప్పింది దీపిక.

అందరూ బాగుండాలి!

ప్రముఖ బాలీవుడ్ నటుడు ఇర్ఫాన్‌ఖాన్ బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న విషయం తెలిసిందే. ఆయనతో కలిసి 'పీకూ'లో నటించింది దీపిక. "అందరి ఆరోగ్యం బాగుండాలనే ఎప్పుడూ కోరుకోవాలి. ఇర్ఫాన్ ఆరోగ్యం ఇప్పుడు బాలేదు కాబట్టి త్వరగా కోలుకోవాలని ప్రార్థిద్దాం. అనారోగ్యంతో బాధపడుతున్న అందరి కోసం కూడా ప్రార్థనలు చేద్దాం" అని చెప్పింది దీపిక.

అనువంశికత గీతాలు


నేహా దేశ్‌పాండే, సంతోష్‌రాజ్

సంతోష్‌రాజ్, నేహా దేశ్‌పాండే జంటగా నటిస్తున్న చిత్రం 'అనువంశికత'. జెనిటిక్ లవ్ స్టోరీ... అనేది ఉపశీర్షిక. రమేష్ ముక్కెర దర్శకత్వం వహిస్తుండడంతో పాటు స్వరాలు సమకూరుస్తున్నారు. తాళ్లపల్లి దామోదర్ గౌడ్ నిర్మాత. హైదరాబాద్‌లో పాటల విడుదల కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ "సినిమా నిర్మాణం పలు సమస్యలతో కూడుకొన్నది. వాటన్నిటినీ తట్టుకొని దామోదర్‌గౌడ్ ఈ చిత్రాన్ని పూర్తి చేశారు. పాటలు బాగున్నాయ"న్నారు. చిత్రంలో ముఖ్యభూమిక పోషించిన సుమన్ మాట్లాడుతూ "రక్త సంబంధీకుల్ని పెళ్లి చేసుకొంటే వచ్చే పరిణామాల్ని ఆధారంగా చేసుకొని దర్శకుడు చిత్రాన్ని తెరకెక్కించాడు. మంచి సందేశంతో పాటు, వినోదమూ ఉంద"న్నారు. నిర్మాత మాట్లాడుతూ "వినూత్నమైన ఓ మంచి కథాంశంతో తెరకెక్కిన చిత్రమిది. మా తొలి ప్రయత్నం ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో తైదల బాపు, కొత్త మనోహర్‌రెడ్డి, సమ్మయ్య, రాధాకృష్ణ, అనిల్, విజయలక్ష్మి, రజియా బేగం తదితరులు పాల్గొన్నారు.


అర్ష


'మిఠాయి' వినోదం

కమల్ కామరాజు, రవివర్మ, రాహుల్ రామకృష్ణ, ప్రియదర్శి, శ్వేతా వర్మ, అర్ష, భూషణ్ కల్యాణ్, అజయ్ ఘోష్ ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్న చిత్రం 'మిఠాయి'. ప్రశాంత్ కుమార్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. వికారాబాద్‌లో వేసిన ప్రత్యేకమైన సెట్‌లో కీలక సన్నివేశాల్ని తెరకెక్కించారు. దర్శకనిర్మాత మాట్లాడుతూ "విభిన్నమైన పాత్రలతో పాటు, విభిన్నమైన నేపథ్యంలో సాగే డార్క్ కామెడీ కథ ఇది. తొలి షెడ్యూల్ చిత్రీకరణ పూర్తయింది. 'పెళ్లిచూపులు' చిత్రానికి స్వరాలు అందించిన వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్నారు. ఈ నెల 17 నుంచి మరో షెడ్యూల్ చిత్రీకరణ మొదలుపెడతాం" అన్నారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: రవివర్మన్.

సంగీత్‌రోజున ఓ చోకర్... పెళ్లికూతురు చేస్తున్నప్పుడు ఓ హారం... పెళ్లిరోజున మెడనిండా కనిపించే కాసులపేరూ, రాళ్లనెక్లెస్... ఇలా సందర్భాన్ని బట్టి కాబోయే వధువు రకరకాల నగల్ని ఎంచుకోవడం తెలిసిందే. ఇక్కడ మధ్యతరగతి వారు బంగారు నగల్ని ఎక్కువగా ఎంచుకుంటే... ఆ పైస్థాయివారు వజ్రాభరణాలూ, నవరత్నాలకూ ప్రాధాన్యం ఇస్తారు. కానీ అన్నిసార్లూ బోలెడు డబ్బు పెట్టి అన్నింటినీ కొనాలని లేదుగా.. అందుకే వెండిపై బంగారపు పూత, అల్లాయ్, మైక్రోగోల్డ్‌ప్లేటెడ్, వన్‌గ్రామ్ గోల్డ్ వంటి ఎన్నోరకాల పెళ్లి నగలు ఇప్పుడు పరిష్కారం అంటున్నారు పింక్‌పాంథర్స్ నిర్వాహకురాలు శరణ్య.







బంగారు బొమ్మకు... 1 గ్రాము చాలు

పెళ్లికూతురు నగలతో నిండుగా కనిపిస్తేనే కదా అందం. కానీ అన్నిసార్లు అందరికీ అచ్చం బంగారంతోనో, వజ్రాలతోనో చేయించుకునే స్థోమత ఉండదు. అలాని జీవితంలో ఒకే ఒక్కసారి వచ్చే మధురఘట్టాన్ని వదులుకోలేం కదా.. అందుకే ఈ రోజుల్లో ఎక్కువమంది బంగారంపూత పూసిన నగలకు ఓటేస్తున్నారు. అంతర్జాలం అరచేతిలోకి వచ్చాక నేటితరం అమ్మాయిలకు డిజైన్‌లపై అవగాహన కూడా పెరిగింది. దానికి తగ్గట్లే సీజెడ్‌లతో వజ్రాలను తలపిస్తూ, కుందన్లూ, బీడ్స్‌తో నవరత్నాలను పోలి ఉండే నయా నగల డిజైన్‌లు ఇప్పుడు పెళ్లికూతురుకి ప్రత్యేకతను తెచ్చిపెడుతున్నాయి. ఇక టెంపుల్ జ్యూయలరీది ప్రత్యేక స్థానమే. నెమళ్లూ, లక్ష్మీదేవి ఆకృతులూ, ఏనుగులూ వంటివాటితో ప్రత్యేకంగా రూపొందించిన ఇవి అమ్మాయి మెడకు నిండుదనం తేవడం ఖాయం.











ఎలాంటి డిజైన్లు...


సీజెడ్ రకాల్ని ఎంచుకుంటే ఒకటే నగ ఐదారు వరుసల్లో ఉండేలా ఎంచుకుంటే తాళికట్టే వేళ కళకళలాడిపోవచ్చు. అదే బంగారంలానే కనిపించాలి అనుకుంటారా? గుత్తపూసల హారాలూ, కాసుమాలలూ, మామిడిపిందెల హారం, సీతారాముల డిజైన్లు ఉన్నవి వివిధ వరుసల్లో, సైజుల్లో ఎంచుకోవచ్చు. ఇవి కాకుండా పెద్దపెద్ద జుంకీలు వాటికి ముత్యాలూ, కుందన్లతో తయారుచేసిన చెంపసరాలు, మెరిసిపోయే పాపిట బిళ్ల ఉంటే చాలు. వీటిల్లో ఇప్పుడు బాహుబలి జుంకీ మాటీలదే హవా. చోకర్ తప్పనిసరి అనుకునేవారూ, మెడ కాస్త వెడల్పుగా ఉండేవారు పద్మావతీ పెయింటింగ్ చోకర్ ఎంచుకోవచ్చు. అరవంకీ, బంగారు జడ, జడబిళ్లలూ, సూర్యచంద్రులూ, నెలవంకలూ, వడ్డాణం, పట్టీలు.....ఆడంబరంగా కనిపించేలా చేస్తాయి. వీటిల్లో సీజెడ్ రకాలే కాదు...దేవతావిగ్రహాలతో రూపొందించిన డిజైన్‌లు ఇట్టే ఆకట్టుకుంటాయి. మొఘల్, కుందన్, మీనాకారీ వర్క్‌లతో చేసిన యాంటిక్ జ్యూయలరీకి భలే డిమాండ్.











గోళ్లు విరిగిపోతున్నాయా?

గోళ్లపై గీతలు పడటం, తరచూ విరిగిపోవడం... ఇవన్నీ వాటికి సరైన పోషకాలు అందట్లేదనడానికి సంకేతాలు. వంటగదిలో ఉండే కొన్ని పదార్థాలతోనే వాటి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. అదెలాగో చూద్దామా...



- గోళ్లకు తేమ సరిగ్గా అందకపోవడం వల్ల అవి సులువుగా విరిగిపోతాయి. ఈ సమస్యకు బాదం నూనె చక్కని పరిష్కారం. రోజులో ఒక్కసారైనా ఈ నూనెతో మర్దనా చేయడం వల్ల గోళ్లు మృదువుగా, ఆరోగ్యంగా మారతాయి. లేదంటే గోరువెచ్చని కొబ్బరినూనెలో కొద్దిగా నిమ్మరసం కలిపి వాడినా ఫలితం ఉంటుంది.
- విటమిన్-ఇ లోపం కూడా ఈ సమస్యలకు కారణమే. ఒకసారి వైద్యులను సంప్రదించి విటమిన్-ఇ మాత్రల్ని తీసుకుంటే మంచిది. లేదంటే విటమిన్-ఇ నూనెను తరచూ రాసుకోవడం వల్ల కూడా గోళ్లు బలంగా మారతాయి.
- ఆపిల్ సిడార్ వెనిగర్‌లో మెగ్నీషియం, పొటాషియం, క్యాల్షియం, ఇనుము ఎక్కువ మోతాదులో ఉంటాయి. దీనికుండే ఆమ్ల లక్షణం ఫంగస్‌ను సులువుగా నివారిస్తుంది. అందుకే దీన్ని గోళ్లకు తరచూ రాసుకోవడం వల్ల ఇన్‌ఫెక్షన్లు రాకుండా ఆరోగ్యంగా ఉంటాయి.
- గ్రీన్‌టీలో యాంటీఆక్సిడెంట్లు ఎక్కువ. కాచి చల్లార్చిన గ్రీన్‌టీలో కాసేపు వేళ్లు ఉంచి ఆ తరువాత చల్లని నీళ్లతో కడిగేయాలి. ఇలా తరచూ చేయడం వల్ల పసుపు పచ్చగా మారిన గోళ్లు మామూలు రంగులోకి మారి తాజాగా కనిపిస్తాయి.
- నిమ్మరసంలో దూది ఉండ ముంచి గోళ్లను తుడవాలి. ఆ తరువాత గోరువెచ్చని నీళ్లతో కడిగేయాలి. దీంట్లో ఉండే యాంటీఆక్సిడెంట్లు గోళ్లు ఇంకా పాడవకుండా కాపాడతాయి. కాస్త టొమాటో గుజ్జు తీసుకుని ఒక పదినిమిషాలు అందులో వేళ్లు ఉంచి ఆ తరువాత కడిగేసినా ఫలితం ఉంటుంది.



12న ముగింపు-క్రితం

బంగారం వెండి

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	31,320	31,430	31,350	31,340
ఆర్నమెంట్	29,250	29,350	29,100	29,100
వెండి (కిలో)	39,441	39,650	40,000	40,000
	ప్రొద్దుటూరు		రాజమండ్రి	
బంగారం(24క్యా)	31,360	31,350	31,040	31,240
ఆర్నమెంట్	29,030	29,030	29,010	29,210
వెండి (కిలో)	39,600	39,800	38,800	39,000
	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	31,370	31,370	-------	-------
ఆర్నమెంట్	29,180	29,180	2,901	2,921 గ్రా
వెండి (కిలో)	39,900	39,900	41. 40	41. 60 గ్రా



ఈ స్టాంపులన్నీ మహిళలవే


ఒక్కొక్కరికి ఒక్కొక్క అభిరుచి. బెంగళూరుకు చెందిన జానె డిసౌజాకు మాత్రం పలు రంగాల్లో సాధికారత సాధించిన మహిళల పేరుతో విడుదలైన స్టాంపులను సేకరించి, భద్రపరచడం ఆసక్తి. అలా సేకరించిన వాటిని మహిళా దినోత్సవం సందర్భంగా 'విమెన్ ఆఫ్ ఇండియా' పేరుతో బెంగళూరులో మూడురోజులపాటు ప్రదర్శన ఏర్పాటు చేసింది. యాభైఏళ్ల నుంచీ ఇదే పనిలో ఉన్న జానె డిసౌజా అప్పట్లో కువైట్‌లోని బ్రిటిష్ సంస్థలో కార్యదర్శిగా చేసేది. అలా దేశవిదేశాలకు చెందిన ప్రముఖుల స్టాంపులు దాదాపు లక్షకు పైగా సేకరించింది. వాటిల్లో భారతదేశానికి చెందినవి 300కు పైగా ఉన్నాయ ని చెబుతుంది. కొన్నాళ్ల క్రితం కువైట్ నుంచి మంగళూరు వచ్చిన ఆమె 'దక్షిణ కన్నడ స్టాంపుల, పురాతన నాణేల సేకరణ సంఘం'లో చేరింది. ఆమె సేకరించిన వాటిల్లో రచయిత్రులు మహాదేవి వర్మ, క్రాంతి దేవి, సిస్టర్ నివేదిత, నాయికలు దేవికారాణి, మీనాకుమారి, లీలా నాయుడు, సావిత్రి, కన్నన్‌దేవిలకు సంబంధించినవీ ఉన్నాయి. 'ఒక్కో స్టాంపును చూస్తే.. ఆయా రంగాల్లో వారు సాధించిన విజయాలు గుర్తుకొచ్చి స్ఫూర్తి కలిగిస్తాయి. వాటన్నింటినీ ప్రదర్శనలో ఉంచాను. వాటిలో తీవ్రవాదుల హైజాక్‌లో ప్రయాణికుల్ని రక్షించడంలో ప్రాణాలు కోల్పోయిన నీర్జా బానోత్ సహా మరెన్నో ఉన్నాయి. ఇలా చేయడం చాలా సంతోషంగా ఉంది. ఇకపైనా మరిన్ని స్టాంపుల్ని సేకరించి.. ఇలాంటి ప్రదర్శనల్ని ఇంకా ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నా...' అంటుంది జానె డిసౌజా.

మళ్లీ మళ్లీ వేడి చేయకూడదు

కొందరు మిగిలిన ఆహార పదార్థాలను ఫ్రిజ్‌లో ఉంచి మర్నాడు వేడి చేసుకుని తీసుకుంటుంటారు. నిజానికి తిరిగి వేడిచేయడం అనేది సరైన పద్ధతి కాదు. ముఖ్యంగా ఈ పదార్థాలను అసలు చేయకూడదు. అవేంటంటే...

పాలకూర: ఈ కూరతో చేసిన ఏ వంటకాన్నీ తిరిగి వేడి చేయకూడదు. అదీ ఓవెన్‌లో. ఎందుకంటే పాలకూరలోని నైట్రేట్ వేడి చేసినప్పుడు వ్యర్థంగా మారుతుంది. అది క్యాన్సర్‌కీ కారణం కావచ్చు. అలానే పాలకూరలోని ఇనుము కూడా ఫ్రీరాడికల్స్‌ను విడుదల చేసి అనారోగ్యాలకు కారణమవుతుంది.

పుట్టగొడుగులు: మాంసకృత్తులు సమృద్ధిగా లభించే వాటిలో పుట్టగొడుగులు ముందుంటాయి. వీటితో చేసిన పదార్థాలను వండిన వెంటనే తినేయాలి తప్ప తిరిగి వేడి చేసుకోకూడదు. ఇలా చేయడం వల్ల టాక్సిన్లు విడుదలై జీర్ణవ్యవస్థను ఇబ్బంది పెడతాయి.



బంగాళాదుంపలు: వీటిలో పొటాషియం, విటమిన్ సి, విటమిన్ బి6 అధికం. ఈ దుంపల్ని వేడి చేసినప్పుడు మృత బ్యాక్టీరియా విడుదలవుతుంది. పలు సమస్యలకు కారణమవుతుందది.

గుడ్లు: ఇందులో కూడా ప్రొటీన్ అధికం. ఉడికించిన వెంటనే గుడ్లను తినేయాలి. గంటలు గంటలు పక్కన ఉంచడం సరి కాదు. అలాగని ఉడికించిన వాటిని మళ్లీ కాస్త వేడి చేయడం లేదంటే ఓవెన్‌లో ఉంచడం చేయకూడదు. అలా తీసుకుంటే మాత్రం జీర్ణవ్యవస్థ ఇబ్బంది పెట్టే సమస్యలు ఎదురవుతాయి.

చికెన్: దీనితో చేసిన ఏ వంటకాన్నీ మళ్లీ వేడి చేయకూడదు. ఇలా చేసిన పదార్థాలను తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ పనితీరు మందగిస్తుంది. వాంతులూ, విరేచనాల వంటి సమస్యలూ బాధిస్తాయి.

వ్యర్థాలే కాసులు కురిపిస్తున్నాయి!

అది గుంటూరు జిల్లా బాపట్ల మండలంలోని నందిరాజుతోట. ఈ గ్రామంలో ఏ వీధి చూసినా పచ్చగా.. పరిశుభ్రంగా కనిపిస్తుంది. పూతోటలూ, నర్సరీలతో కళకళలాడుతుంది. నిత్యకళ్యాణం పచ్చతోరణంగా కనిపించే నందిరాజుతోట స్వచ్ఛతకు నిలువెత్తు నిదర్శనం. ఈ ప్రత్యేకతలతో ఆ ఊరు రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడానికి కారణం ఆ గ్రామ సర్పంచి వెంకటేశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి మరియమ్మ. ఈ కృషి గురించి వారి మాటల్లోనే...



'చెత్త నుంచి సంపద తయారీ' అనే నినాదంతో అడుగులు వేయడమే కాదు.. దాన్ని నిజం చేసి చూపించారు వెంకటేశ్వరమ్మ, మరియమ్మ. వారికి ఈ ఆలోచన ఎందుకు వచ్చిందంటే.. మూడేళ్ల క్రితం నందిరాజుతోటలో పంచాయతీరాజ్ అధికారులు వ్యర్థాల నుంచి సంపదను సృష్టించుకోవచ్చని శిక్షణ తరగతుల ద్వారా చెప్పారు. ఈ కార్యక్రమానికి హాజరైన వెంకటేశ్వరమ్మ, మరియమ్మ.. తమ గ్రామంలో ఆ ఆలోచనను ఆచరణలో పెట్టాలనుకున్నారు. గ్రామస్తులతో ఇదే విషయం చర్చించారు. అందరూ చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా.. డంపింగ్ యార్డుకు తరలించడానికి ఒప్పుకున్నారు.

వ్యర్థానికి అర్థం: అలా 2015లో గ్రామ సరిహద్దుల్లో లక్షా నలభై వేల రూపాయల వ్యయంతో డంపింగ్ యార్డును నిర్మించారు. దీనికయ్యే ఖర్చంతా వెంకటేశ్వరమ్మే స్వయంగా భరించింది. ఇదొక్కటే కాదు కంపోస్టు యూనిట్ తయారీని స్థాపించి దానికి 'చెత్త నుంచి సంపద సృష్టి' తయారీ కేంద్రం అని పేరు పెట్టారు. ఈ కేంద్రానికి డ్వామా నుంచి నిధులు అందాయి. ఆ తరువాత ప్రతి ఇంటికీ ప్లాస్టిక్ డబ్బాలను అందించి.. తడి, పొడి చెత్తలను వేరుచేయమని చెప్పారు. ఇందుకోసం ఉపాధి హామీ నిధులతో సిబ్బందిని నియమించారు. అలా వేరు చేసిన చెత్తను కంపోస్టు యూనిట్‌లో సేంద్రియ ఎరువు తయారు చేయడం మొదలుపెట్టారు. ఇలా చేయడం వల్ల వీధులూ శుభ్రంగా మారాయి. దోమల బెడదా, అనారోగ్యాల సమస్యలు తగ్గాయి. వ్యర్థాల నుంచి ఎరువులు వస్తున్నాయి. సిబ్బంది ద్వారా గ్రామంలో ప్రతి రోజూ 500 కిలోల వ్యర్థాలు సేకరిస్తున్నారు. నెలకు రెండున్నర టన్నుల వరకు కంపోస్టు ఎరువు తయారవుతోంది. కేజీ ఎరువును రూ.10 చొప్పున అమ్ముతున్నారు. అలా ఇప్పటి వరకు రూ.2 లక్షల పైన ఆదాయం సాధించారు. ఆ ఎరువుల్ని పొదుపు సంఘాల మహిళలకు అందిస్తున్నారు. దాంతో వారు పూల మొక్కల నర్సీలు ఏర్పాటు చేసి, ఉపాధి పొందుతున్నారు.

వందశాతం మరుగుదొడ్లు: గతంలో అక్కడ మహిళలు బహిర్భూమికి ఆరుబయటకు వెళ్లాల్సిందే! ఈ సమస్యను నివారించాలని మరుగుదొడ్లు లేని 486 ఇళ్లలో వాటిని ఏర్పాటు చేశారు. ఇళ్లు లేనివారికోసం సామూహికంగా కొన్ని మరుగుదొడ్లు నిర్మించారు. ఇవన్నీ ఒకెత్తయితే... నాలుగు లక్షల రూపాయలు ఖర్చు చేసి ప్రత్యేకంగా తొట్టెలు కట్టించి వాటిలో ఆకుకూరలు పెంచుతున్నారు. అలా వచ్చిన తాజా కూరల్ని గ్రామంలోని గర్భిణులకూ, బాలింతలకు ఉచితంగా అందేలా చూస్తున్నారు. మూడేళ్లుగా ఆ గ్రామాన్ని స్వచ్ఛత దిశగా నడిపిస్తున్నందుకు ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, పంచాయతీరాజ్ అధికారుల నుంచి సర్పంచి ప్రసంసలు అందుకుంది. రెండు సార్లు జాతీయ పురస్కారాలు, ఓ సారి రాష్ట్ర పురస్కారాన్ని సాధించిందీ ఊరు. ఇంటినుంచే తడి, పొడి వ్యర్థాలు వేర్వేరుగా సేకరించడం, వ్యర్థాల నుంచి సేంద్రియ ఎరువు తయారీపై రాష్ట్రంలో 13 జిల్లాలకు చెందిన రెండు వేల మంది అధికారులు, ఎంపీపీలు, సర్పంచులు, ఉద్యోగులకు నందిరాజుతోటలో శిక్షణ ఇచ్చారు. ఇతర రాష్ట్రాల అధికారులూ వీరి వద్ద శిక్షణ తీసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు.

-జి. సురేష్‌కుమార్, న్యూస్‌టుడే బాపట్ల

నేను ఒత్తిడికి గురవుతున్నానట!

నేనో సంస్థలో కొన్నేళ్లుగా పనిచేస్తున్నా. పని విషయంలో ఎలాంటి పొరపాట్లు లేవు. ఈ మధ్య నా సహోద్యోగి ...'నేను అనుకున్నపని అనుకున్నట్లుగా జరగకపోతే ఒత్తిడికి లోనుకావడం గమనించిందట'. మొదట అది విని నేను ఆశ్చర్యపోయినా తను చెప్పిన దాంట్లో నిజం ఉందనిపించింది. నేను చేసే పని పక్కాగా ఉండాలని కోరుకుంటా. ఆఫీసులోనే కాదు.. ఇంట్లో కూడా పని అనుకున్నంత పక్కాగా కాకపోతే నేను భరించలేను. నా ఒత్తిడికి అదే కారణమా!

– ఓ సోదరి

డియర్ వసుంధర



డా॥ కవిత గూడపాటి
ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

ఒక పనిని అంతే పక్కాగా చేయడంలోనే కిక్ ఉంటుందనీ, మీకు అదే క్రేజీగా అనిపిస్తుందని చెబుతున్నారు. మంచిదే.. అయితే మీరు అలా మారడానికి కారణం కార్యాలయంలో బాస్ లేదా ఇంట్లో మీ భాగస్వామా... మీకు మీ అమ్మానాన్నల నుంచి ఆ అలవాటు వచ్చిందా.. లేదంటే మొదటినుంచీ అంతేనా. ఈ ప్రశ్నలు ఎందుకంటే.. సాధారణంగా పని వందశాతం పక్కాగా చేయాలనుకోవడం కాస్త ఆందోళనతో కూడిన విషయమే. పైగా మనం బాగా చేయలేమేమో అనే అసంతృప్తి కూడా కొన్నిసార్లు ఇలా ఆలోచించేలా చేస్తుంది. కుటుంబం మన నుంచి ఎక్కువగా ఆశించడం లేదా ఓ వ్యక్తి మనల్ని మానసికంగా వేధించడం వల్ల ఆందోళన పెరిగినా కూడా ఇలా చేయొచ్చు. ఇక, మీరు ఆ పక్కా పని తాలూకు ఒత్తిడి నుంచి బయటపడాలంటే..

అన్నిసార్లు కాదు కానీ.. కొన్నిసార్లు పనిని సంతృప్తికరంగా చేస్తే చాలు. ఒకవేళ అనుకున్న పనులు మీరు ఆశించనట్లుగా జరగకపోతే ఏం జరగొచ్చని మీరు భయపడుతున్నారో తెలుసుకోండి. ఎవరైనా మిమ్మల్ని నిరాకరిస్తారా, మిమ్మల్ని చూసి నవ్వుతారా, ఉద్యోగం పోతుందని భయపడుతున్నారా... ఆలోచించండి. నిజం చెప్పాలంటే మీరు ఊహించినంత సమస్య తొంభై తొమ్మిదిశాతం ఉండకపోవచ్చు. క్రమం తప్పకుండా వ్యాయామం, ధ్యానం అలవాటుగా మార్చుకోండి. అలాగే అప్పుడప్పుడూ చేయించుకోవడం వల్ల కూడా ఎంతో మంచిది. ఇక, కుదిరినప్పుడల్లా స్నేహితులతో మాట్లాడటం, కుటుంబసభ్యులతో ఎక్కువ సమయం గడపడం తప్పనిసరి. ఈ జాగ్రత్తలు తీసుకున్నా కూడా ఫలితం లేకపోతే మాత్రం నిపుణుల దగ్గర కౌన్సెలింగ్ చేయించుకోవడం మంచిది. మీరు మీ జీవితాన్ని ఆనందించాలి. చేతిలో పని ఉండాలి అయితే... దానికోసం మీరు ఒత్తిడికి గురై.. మథనపడకూడదని గుర్తించండి.

మీ ప్రశ్నలు ఇకపై vasucareer@eenadu.net కు పంపించగలరు.

చదువు

నైపుణ్య

ఈనాడు
కరీంనగర్
మంగళవారం మార్చి 13, 2018
■ e-mail: edc@eenadu.in



చదువుల్లో చాలా మార్కులు వచ్చాయి.. చాలదు! టెక్నికల్‌గా టాప్ లేపేస్తానంటారా.. ఫర్వాలేదు! కష్టపడటానికి కాస్త కూడా వెనకాడరు.. ఓ..ఓకే! ఇంకేం.. కెరియర్‌కి తిరుగులేదనుకుంటున్నారా? లాభం లేదు.. ఇంకా కావాలి. అంతకుమించి.. ఇంకేవో ఉండాలి. ఏంటవి? అవే 'బిజినెస్ స్కిల్స్'. అభ్యర్థుల్లో పరిశ్రమలు పరిశోధిస్తున్న కార్పొరేట్ నైపుణ్యాలు. డిగ్రీ పట్టాతో ఉద్యోగ వేట మొదలు పెట్టిన వాళ్లూ, కొత్తగా కొలువులోకి ప్రవేశించి ఎదుగుదలకు ఎదురుచూస్తున్న వాళ్లూ వీటిని తప్పనిసరిగా మెరుగుపరచుకోవాలని 'మాన్‌స్టర్' సంస్థ మరీమరీ చెబుతోంది.

కెరియర్‌లో దూసుకెళదాం!

ఏ కెరియర్‌ను ప్రారంభిస్తున్నా దానిలో విజయం సాధించాలంటే కొన్ని నైపుణ్యాలు అవసరమవుతాయి. ఇవి ఉంటే వృత్తిలో విజయవంతం కావొచ్చు. భవిష్యత్తులో పదోన్నతులు వచ్చే అవకాశాలు పెరుగుతాయి. చేసుకున్న విజ్ఞప్తులు ఫలించే వీలుంటుంది.

ఫలానా పరిశ్రమలో పనిచేస్తున్నారనేదానితో సంబంధం లేకుండా ఈ నైపుణ్యాలు ఎవరికైనా అవసరమే. ప్రతి ఒక్కరిలో ఇవి ఎంతో కొంత ఉంటాయి. వాటిని మెరుగుపర్చుకోవడమూ, మిగతావి నేర్చుకోవడమూ చేస్తే కెరియర్‌లో దూసుకువెళ్ళవచ్చు.

టీం వర్క్, పీపుల్ స్కిల్స్

ఎందుకు?: తన అవసరాన్ని గుర్తించిన వెంటనే సాయపడటానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండేవారిని బృందంలోని ప్రతి ఒక్కరూ ఇష్టపడతారు. అలాగే తోటి ఉద్యోగులతోనూ కలిసిపోవాలి. అప్పుడే ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం దొరుకుతుంది. సొసైటీ ఫర్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ జరిపిన సర్వేలో 83% ఉద్యోగులు టీం వర్క్‌కు ప్రాధాన్యం ఇచ్చారు. ముఖ్యంగా ప్రారంభ స్థాయి ఉద్యోగులకు ఇది ప్రధానమని వారు చెప్పారు.

ఎలా?: ఈ నైపుణ్యాలు పెంచుకోవాలంటే మంచి శ్రోత అవ్వాలి. ముఖ్యంగా అంతిమ ఫలితాల గురించి ఆలోచిస్తూ ఆందోళన, ఒత్తిడులకు గురవుతూ వాటి నుంచి బయట పడాలనుకునే సహోద్యోగులు చెప్పేది ఆలకించాలి. తోటి ఉద్యోగులు వచ్చి సాయాన్ని అర్థించేవరకూ ఆగకుండా చొరవ చూపి, ఇష్టపూర్వకంగా వారికి సాయం చేయాలి.



అలాగే తోటివారితో సంబంధాలు యాంత్రికంగా ఉండకూడదు. వారిపై నిజమైన ఆసక్తిని చూపి, వారితో కలిసిమెలిసివుండాలి.

మీ పరిజ్ఞానాన్ని బృందంతో పంచుకోవాలి. కాన్ఫరెన్స్‌లు, నెట్‌వర్కింగ్ ఈవెంట్లు, ఇండస్ట్రీ గురించిన సమాచారాన్ని చదువుతున్నపుడు మీకు ఆసక్తి కలిగించిన అంశాలను వారితో పంచుకోవాలి. పరస్పర సహకారం ఎప్పుడూ అనుకూల ఫలితాలను అందిస్తుంది.

నెగోషియేటింగ్

ఎందుకు: కావాల్సినదాన్ని దక్కించుకోవడానికి అనునయాత్మకంగా ఉండటం అవసరం. అది ఎప్పుడు ఎలా ఉండాలో విద్యార్థులూ, అభ్యర్థులూ తెలుసుకోవాలి. ముఖ్యంగా జాబ్ ఆఫర్ పొందడంలో, నిధులను సమకూర్చుకునే సందర్భంలో ఈ నైపుణ్యాలు ఉపయోగపడతాయి.

కెరియర్ ప్రారంభంలోనే మంచి నెగోషియేటర్‌గా మారడం ప్రధానం అంటారు రాబిన్ పింక్లే. ఆమె 'గెట్ పెయిడ్ వాట్ యూఆర్ వర్త్: ద ఎక్స్‌పర్ట్ నెగోషియేటర్స్ గైడ్ టూ శాలరీ అండ్ కాంపెన్‌సేషన్'' అనే ప్రసిద్ధ పుస్తక సహ రచయిత. చాలావరకూ వేతన పెరుగుదల ప్రారంభ జీతంపైనే ఆధారపడి ఉంటాయి. ఇది గుర్తిస్తే ఈ అంశం ఎంత ప్రధానమైనదో అర్థమవుతుంది.

వేరే ఉద్యోగానికి బదిలీ అవుతున్నప్పుడు పని నియమావళిలో అనుకూలతలు, అక్కడి ప్రోత్సాహకాలు, ప్రయోజనాలు పొందడంలో ఈ నైపుణ్యాలు తోడ్పడతాయి.

ఎలా?: శాలరీ నెగోషియేషన్స్ కోసం ముందుగా అందుకు అవసరమైన సమాచారాన్ని సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది. మీ విద్య, నైపుణ్యాలు, అనుభవంతో పరిశ్రమలో సగటున ఎంత మొత్తంలో పొందుతున్నారో తెలుసుకోవాలి. ఇందుకుగానూ మెంటర్ సహకారం తీసుకోవచ్చు. లేదా ఆన్‌లైన్‌లో ఎంత జీతానికి మీకు అర్హత ఉందో నిర్ధారించుకోవాలి. వీటన్నింటి సాయంతో మీ అభ్యర్థనను బలపరచుకోవచ్చు.

సమయ నిర్వహణ

ఎందుకు: సమయం అంటే ఒక రకంగా డబ్బు అని చెప్పవచ్చు. 'మీ పని నాణ్యత కచ్చితంగా కీలకమే అయినప్పటికీ సమయం కూడా ప్రధానం' అంటారు జూలీ మార్గెన్‌స్టర్న్. 'టైం మేనేజ్‌మెంట్ ఫ్రం ద ఇన్‌సైడ్ అవుట్' రచయిత్రి ఈమె. మేనేజర్లు ఉద్యోగుల నుంచి ఎప్పుడూ మంచి పనితనాన్ని ఎక్కువ మొత్తంలో ఆశిస్తుంటారు. అందుకే సమయ నిర్వహణ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి. దీని ద్వారా తక్కువ స్థాయి కార్యక్రమాలపై ఎక్కువ శక్తిని ఖర్చు చేయకుండా నిరోధించుకోవచ్చు.

ఎలా?: మీ దృష్టిని ఎక్కడ కేంద్రీకరించాలో తెలియాలంటే.. ముందుగా మేనేజర్ నుంచి తుది గడువులు, విజయాన్ని గణించే పద్ధతుల వివరాలు తెలుసుకోవాలి. ఒకసారి ఆ సమాచారాన్ని సేకరించుకుంటే.. మీ పనిలో ఏయే విషయాలకు ప్రాధాన్యమిచ్చి దృష్టి సారించాలి, వేటిని ముందస్తుగా పూర్తిచేయాలనే అంశాలపై స్పష్టత వస్తుంది.

బహిరంగ ప్రసంగ కళ

ఎందుకు?: మిమ్మల్ని మీరు సమర్థులుగా, స్నేహభావం గల వ్యక్తిగా నిరూపించుకోవడానికి ఈ నైపుణ్యాలు అవసరమవుతాయి. పబ్లిక్ స్పీకింగ్ కోచ్, కెన్నెడీ స్పీచ్ కమ్యూనికేషన్స్ ఫౌండర్, కెన్నెడీ అభిప్రాయం ప్రకారం.. 'పెద్ద సంఖ్యలో ఉన్న ప్రేక్షకుల ముందు ఉన్నా, చిన్న బృంద సభ్యుల మధ్య ఉన్నా మీరు చెప్పాలనుకున్న విషయాన్ని వ్యక్తపరచడం, మీ భావాలను స్పష్టంగా తెలియజేయడం కొంచెం కష్టమే'.

ఎలా?: బృంద సమావేశాల్లో ప్రెజెంటేషన్లను ఉపయోగించడం ద్వారా పబ్లిక్ స్పీకింగ్ నైపుణ్యాలను మెరుగుపరచుకోవచ్చు. ప్రెజెంటేషన్ దగ్గర పడుతున్న కొద్దీ విద్యార్థులకైనా, ఉద్యోగులకైనా కాస్త బెరుకు సహజం. ఇక్కడ గుర్తుంచుకోవాల్సింది ఒక్కటే.. మీరు ఏం చెబుతారు? ఎలా చెబుతారు? సంబంధిత సమాచారాన్ని ప్రేక్షకులు ఎలా తీసుకుంటారు? అనేవి పూర్తిగా మీ అధీనంలోనే ఉంటాయి. కాకపోతే ప్రతీ ప్రెజెంటేషన్ తరువాత మీ ఉన్నతాధికారి నుంచి ఫీడ్‌బ్యాక్ తప్పకుండా తీసుకోవాలి. తద్వారా భవిష్యత్తులో ఇవ్వబోయే ప్రసంగాలను మెరుగుపరచుకోవచ్చు.

ఆఫీసు బయట ఈ నైపుణ్యాలను మెరుగుపరచుకునే అవకాశాలున్నాయి. పబ్లిక్ స్పీకింగ్ వర్క్‌షాప్‌లను నిర్వహించే టోస్ట్‌మాస్టర్ వంటి ఎన్నో సంస్థలు అందుబాటులో ఉన్నాయి. వాటిలో చేరి నైపుణ్యాలకు పదును పెట్టుకోవచ్చు.

పరిశోధన

ఎందుకు?: సొంత కెరియర్ అభివృద్ధికీ, సంస్థ అభివృద్ధికీ తోడ్పడేలా విలువైన ఉద్యోగిగా గుర్తింపు పొందాలంటే.. పరిశ్రమలో చోటు చేసుకునే మార్పులపై అవగాహన ఉండాలి. ప్రముఖ బిజినెస్ కోచ్ రాచెల్ రిట్‌లాప్ ఇదే విషయం చెబుతారు.

ఈ కింది అంశాల ద్వారా మార్పులపై ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవచ్చని ఆమె సూచించారు.

- సోషల్ మీడియాలో అందుబాటులో ఉండే ఇండస్ట్రీ గ్రూపులు, ఫోరాల్లో పాల్గొనడం
- సోషల్ మీడియాలో థాట్ లీడర్లను అనుసరించడం
- పోటీ సంస్థల సమాచారాన్ని తెలుసుకోవడానికి గూగుల్ అలర్ట్స్‌ను పెట్టుకోవడం
- ఇండస్ట్రీ పోడ్‌కాస్ట్‌లను వినడం
- ఇండస్ట్రీ న్యూస్‌లెటర్లకు సైన్ అప్ అవడం
- ట్రేడ్ పబ్లికేషన్స్‌కు సబ్‌స్క్రైబ్ అవడం
- వృత్తిగత సంఘాల్లో చేరడం
- ఇండస్ట్రీ కాన్ఫరెన్సులకు హాజరవడం

గ్రాఫిక్ డిజైన్‌లో..

తాజా ఇంటర్న్‌షిప్స్

>>> వెబ్ డెవలప్‌మెంట్
సంస్థ: Hungama Digital Media Entertainment ప్రదేశం: హైదరాబాద్
స్టైపెండ్: నెలకు రూ. 10,000
లింకు: internshala.com/i/9558
గడువు: మార్చి 14, 2018
అర్హులు: హెచ్‌టీఎంఎల్, సీ, డేటాస్ట్రక్చర్స్, సీ++ ప్రోగ్రామింగ్, ఐఓఎస్, ఆండ్రాయిడ్

>>> గ్రాఫిక్ డిజైన్
సంస్థ: Hungama Digital Media Entertainment
ప్రదేశం: హైదరాబాద్
స్టైపెండ్: నెలకు రూ. 10,000
లింకు: internshala.com/i/9559
గడువు: మార్చి 14, 2018
అర్హులు: సంబంధిత నైపుణ్యాలున్న విద్యార్థులూ, గ్రాడ్యుయేట్లూ.

>>> లైవ్ ఆపరేషన్స్
సంస్థ: Uber ప్రదేశం: హైదరాబాద్
స్టైపెండ్: నెలకు రూ. 15,000
లింకు: internshala.com/i/9560
గడువు: మార్చి 14, 2018
అర్హులు: ఎంఎస్ ఆఫీస్, ఇంగ్లిష్, హిందీ భాషల్లో నైపుణ్యం ఉన్నవారు.

>>> లీడ్ జనరేషన్
సంస్థ: Tata Community Initiatives Trust
ప్రదేశం: హైదరాబాద్ స్టైపెండ్: నెలకు రూ. 2000 లింకు: internshala.com/i/9561
గడువు: మార్చి 12, 2018
అర్హులు: సంబంధిత నైపుణ్యాలున్న విద్యార్థులూ, గ్రాడ్యుయేట్లూ.



>>> అకౌంట్స్
సంస్థ: Marico Limited ప్రదేశం: హైదరాబాద్ స్టైపెండ్: నెలకు రూ. 10,000
లింకు: internshala.com/i/9562
గడువు: మార్చి 9, 2018
అర్హులు: ఎంఎస్ ఆఫీస్, అకౌంటింగ్, ఎంఎస్ ఎక్సెల్, ఆంగ్లభాషా నైపుణ్యాలు ఉన్నవారు.

>>> ఫైనాన్స్ అండ్ మార్కెటింగ్ ఎన్ఎస్ఈ
సంస్థ: Star Fing ప్రదేశం: హైదరాబాద్, బెంగళూరు స్టైపెండ్: నెలకు రూ. 10,000-15,000
లింకు: internshala.com/i/9563
గడువు: మార్చి 10, 2018
అర్హులు: సంబంధిత నైపుణ్యాలున్న విద్యార్థులూ, ఇటీవలి గ్రాడ్యుయేట్లూ.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్

సంస్థ: నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ (ఎన్ఎల్‌సీ) ఇండియా లిమిటెడ్, తమిళనాడు.
పోస్టు: ఇండస్ట్రియల్ ట్రైనీ (ఫైనాన్స్) **ఖాళీలు:** 50
కాలవ్యవధి: 12 నెలలు **స్టైపెండ్:** నెలకు రూ. 10,000
అర్హత: సీఏ/ సీఎంఏ ఇంటర్ ఉత్తీర్ణత. **వయసు:** 28 ఏళ్లకు మించకూడదు.
ఎంపిక: అకడమిక్ ప్రతిభ ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది:** 27.03.2018
వెబ్‌సైట్: https://web.nlcindia.com/itf/

మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ కార్పొరేషన్

సంస్థ: మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్, నాగ్‌పూర్ (మహారాష్ట్ర). **పోస్టు:** ఎగ్జిక్యూటివ్ ట్రైనీ (కెమిస్ట్రీ)
ఖాళీలు: 13 **అర్హత:** ఎంఎస్సీ కెమిస్ట్రీ, గేట్-2017 స్కోరు.
వయసు: 28 ఏళ్లకు మించకూడదు. **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా.
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ: 09.04.2018 నుంచి 08.05.2018 వరకు
వెబ్‌సైట్: http://www.mecl.gov.in/

ప్రవేశాలు

ఏపీఈసెట్ - 2018

ఆంధ్రప్రదేశ్‌లోని వర్సిటీలు, వాటి అనుబంధ వృత్తి విద్య కళాశాలల్లో యూజీ కోర్సుల లేటరల్ ఎంట్రీకి నిర్వహించే పరీక్ష. జేఎన్‌టీయూ అనంతపురం ఈ పరీక్షను నిర్వహిస్తోంది. **కోర్సులు:** బీఈ/ బీటెక్/ బీఫార్మసీ. **అర్హత:** సంబంధిత బ్రాంచుల్లో డిప్లొమా, బీఎస్సీ (మ్యాథమేటిక్స్) ఉత్తీర్ణత. **ప్రవేశపరీక్ష తేది:** 03.05.2018 **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ:** 15.03.2018 నుంచి 21.04.2018 వరకు. **వెబ్‌సైట్:** http://sche.ap.gov.in

టీఎస్ పీజీఈసెట్ - 2018

తెలంగాణ రాష్ట్రంలోని వర్సిటీలు, వాటి అనుబంధ వృత్తి విద్య కళాశాలల్లో పీజీ కోర్సుల ప్రవేశాలకు నిర్వహించే పరీక్ష.
కోర్సులు: ఎంఈ, ఎంటెక్, ఎంఫార్మసీ, ఎంఆర్క్, గ్రాడ్యుయేట్ లెవెల్ ఫార్మాడీ (పీబీ). **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ, బీటెక్, బీఫార్మసీ, బీఆర్క్ ఉత్తీర్ణత. **ప్రవేశపరీక్ష తేది:** 2018 మే 28 నుంచి 31 వరకు. **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం:** 15.03.2018 http://pgecet.tsche.ac.in/

ఏపీఐసెట్ - 2018

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వర్సిటీలు, వాటి అనుబంధ కళాశాలల్లో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల ప్రవేశాలకు నిర్వహించే పరీక్ష.
కోర్సులు: ఎంబీఏ, ఎంసీఏ. **అర్హత:** డిగ్రీ ఉత్తీర్ణత. **ప్రవేశ పరీక్ష తేది:** 2018 మే 2. **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ:** 16.03.2018 నుంచి 24.04.2018 వరకు
వెబ్‌సైట్: http://sche.ap.gov.in/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

మెప్పించి సాధించే మెలకువలు



త్వరలో ఏపీపీఎస్‌సీ గ్రూప్-I ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరగబోతున్నాయి. బోర్డు సభ్యులను మెప్పించేలా జవాబులు చెప్పి ఆశించిన ఉద్యోగం సాధించటానికి ఏమేం తెలుసుకోవాలి? వేటిపై దృష్టి పెట్టాలి? ఇటీవల గ్రూప్-I స్టేట్ టాపర్‌గా నిలిచిన ఆకుల వెంకటరమణ తన ఇంటర్వ్యూ అనుభవాల ప్రాతిపదికగా అభ్యర్థులకు ఇస్తున్న సూచనలు!

గ్రూప్-I ఇంటర్వ్యూ గైడెన్స్

మన గురించి క్షుణ్ణంగా తెలుసుకుని మనల్ని ప్రభావవంతంగా ఇంటర్వ్యూ బోర్డుకు పరిచయం చేసుకోవడమే ఇంటర్వ్యూ. అభ్యర్థులు గ్రూప్-1 క్యాడర్‌లోని అన్ని ఉద్యోగాల విధులూ, బాధ్యతలను తెలుసుకుని ఇంటర్వ్యూకు వెళ్ళటం శ్రేయస్కరం. పబ్లిక్ సర్వీసులో ఎందుకు చేరాలనుకుంటున్నారని అడిగితే తడబడకుండా చెప్పేంత స్పష్టతతో ఉండాలి.

మా కుటుంబ వ్యవసాయ నేపథ్యం, నేను వ్యవసాయ రంగంలో పనిచేయటం, అలాగే ఇటీవల వార్తల్లో, బడ్జెట్లో వ్యవసాయ సంబంధిత అంశాలు ఉండటం వల్ల నా ఇంటర్వ్యూలో 50 శాతానికి పైగా వ్యవసాయ సంబంధిత ప్రశ్నలు ఉండొచ్చని భావించాను. కానీ ఒక్క ప్రశ్న కూడా వ్యవసాయంపై అడగలేదు. అందువల్ల ఇంటర్వ్యూ జరిగేటప్పుడు మనం ఆశించిన ప్రశ్నలు రాలేదనేది ఆలోచించకూడదు. వేరే ఆలోచనలు దరిచేరనీయకుండా అడిగిన ప్రశ్నలకు కుదిరినంతగా మంచి సమాధానాలు స్పష్టంగా చెప్పాలి.

ఇంటర్వ్యూలో ఇచ్చే సమాధానాలు సూటిగా, స్పష్టంగా, అడిగిన ప్రశ్నకు సంబంధించినవై ఉండాలి. సానుకూల ధోరణి తప్పనిసరి. విశాల దృష్టితో, సమతూకంగా ఉంటే బోర్డు మెప్పు పొందవచ్చు. పక్షపాతం లేకుండా, లోతైన ఆలోచనలతో, ఆలోచనల్లో స్పష్టతతో మాట్లాడాలి. పక్షపాత ధోరణి ప్రదర్శించకూడదు. ధైర్యంగా చెప్పాలి, కానీ వ్యవస్థ మూలాలను ప్రశ్నించే ధోరణి పనికిరాదు. పొంతన లేకుండా.. వైరుధ్యాలతో మాట్లాడకుండా తార్కికంగా, హేతుబద్ధంగా జవాబులు చెప్పాలి.

పరిధి మరిచి ప్రసంగించకూడదు

అభ్యర్థులు ఇంటర్వ్యూలో ఆవేశంతో రాజకీయ ప్రకటనలు చేయడం గానీ, సభ్యులనుద్దేశించి తన పరిధి మర్చిపోయి, ప్రసంగాలు చేయటం గానీ చేయకూడదు. అది చాలా నష్టదాయకం.

మనం చెప్పే సమాధానాలను మధ్యలోనే ఇంటర్వ్యూయర్ అర్థాంతరంగా ఆపేయవచ్చు. దీనికి ఆందోళన పడకూడదు. అభ్యర్థి మంచి జవాబు చెపుతుంటే సాధారణంగా ఇంటర్వ్యూయర్ మరో ప్రశ్నకు వెళ్లిపోతారు. అందుకని అలా మధ్యలో మన సమాధానం ఆపేయటం మంచి సూచనే. నా ఇంటర్వ్యూలో కూడా చాలాసార్లు మధ్యలో ఇలా కట్ చేశారు.

అభ్యర్థులు తమకు సౌకర్యమున్న భాషలో సమాధానాలు చెప్పవచ్చు. ఇంగ్లిష్, తెలుగు.. రెండు భాషల్లో కూడా కుదిరినంతగా చెప్పవచ్చు. ఒకవేళ ఆంగ్లంలోనే మాట్లాడాలని నిర్దేశిస్తే... కంగారుపడకూడదు. సింపుల్ ఇంగ్లిష్‌లో మాట్లాడటానికి ప్రయత్నించండి. మాట్లాడే ఇబ్బంది ఉన్నట్లయితే నేర్చుకుంటాననే సంసిద్ధత వ్యక్తం చేయాలి. అలాగే ఇప్పటివరకూ తగినంతగా నేర్చుకోని లోపాన్ని ఒప్పుకోవాలి. ఎందుకంటే గ్రూప్-1 స్థాయి ఉద్యోగులకు భవిష్యత్తులో ఆలిండియా సర్వీసులైన ఐఏఎస్, ఐపీఎస్‌లుగా పదోన్నతి లభిస్తుంది. ప్రభుత్వ వ్యవహారాలు ఇంగ్లిష్‌లో జరుగుతాయి కదా?

◗ అనూహ్యమైన ప్రశ్నలు సంధిస్తే?

ఒక్కోసారి కావాలనే ఇంటర్వ్యూలో ఒత్తిడి కలగజేసే, వ్యతిరేక ప్రశ్నలను అడగవచ్చు. ఇలాంటి సందర్భాల్లో ఎలా స్పందించాలో తెలుసుకోవాలి.

ఇబ్బంది పెట్టే ప్రశ్నలకు 'తెలియదు' అనో, 'లేదు/ కాదు' అనో చెప్పవచ్చు. కానీ ఎప్పుడూ నటన పనికిరాదు. ఇబ్బందికర ప్రశ్నలు వేసినపుడు 'నాకు తెలిసినంతవరకూ' అంటూ పాక్షిక సమాధానాలు ఇవ్వవచ్చు.

◗ **'రోడ్డు విభాగం వారి ప్రణాళికలో భాగం కాని రహదారి నిర్మాణాన్ని అనుమతించమని ఓ ఎమ్మెల్యే మిమ్మల్ని అడిగారు. ఆయన ఒత్తిడికి మీరు లొంగుతారా?'** అని గతంలో గ్రూప్-1లో అడిగారు.

ఆ రోడ్డు నిర్మాణం చట్ట వ్యతిరేకం అయితే 'సాధ్యం కాదు' అని కచ్చితంగా చెప్పవచ్చు. కానీ అలాంటి పరిస్థితి లేనపుడు ఈ ప్రశ్నకు 'ఔను' అని గానీ 'లేదు' అని గానీ చెప్పటం సరికాదు. ప్రజా ప్రతినిధికి నిర్మొహమాటంగా 'లేద'ని కటువుగా జవాబు చెప్పటం ఆచరణీయం కాదు. అలా చేయకూడదు. ఆయన ప్రజల ఆకాంక్షను ప్రతిఫలిస్తున్నారని గమనించాలి. ఆయన ప్రతిపాదనకు తగిన గౌరవాన్నిచ్చి, చట్టాన్నీ, నిబంధనలనూ ఉల్లంఘించకుండా ఆయన వినతిని మన్నించడానికి ప్రయత్నించాలి.

గ్రూప్-1 ఇంటర్వ్యూలో నాలుగుసార్లు విఫలమైన అభ్యర్థిని 'కెరియర్లో, జీవితంలో మీరు ఫెయిలైనట్టు కాదా?' అని అడిగారు. ఇలాంటి ప్రశ్న మిమ్మల్ని అడిగితే ఆందోళన పడకూడదు. 'వివిధ కారణాల వల్ల ఎంపికవ్వటంలో జాప్యం జరగవచ్చు. ఇంతటి పోటీలో కూడా నేను వరసగా ఇంటర్వ్యూలకు సెలక్టవుతున్నానంటే నిలకడతో కూడిన నా మెరుగుదలను సూచిస్తుంది' అని చెప్పటం సముచితంగా ఉంటుంది. ఆ ప్రశ్నకు ఏ జవాబు చెప్పినా అది ఆశావహంగా ఉండాలి. అంతేకానీ, గత ఎంపికల తీరు గురించి వ్యతిరేకంగా మాట్లాడటం కానీ, మీపై మీరు సానుభూతిని ప్రదర్శించటం కానీ చేయకూడదు.

◗ ('వారాంతాల్లో ప్రభుత్వ వసతి గృహ విద్యార్థులకు పాఠాలు చెప్పేవాణ్ని' అని నేను చెబితే... దానిపై అడిగిన ప్రశ్న.) **'ఇంజినీరింగ్ విద్యార్థులకు ట్యూషన్లు చెప్పి ఆ డబ్బుతో స్కూలు పిల్లలకు ట్యూటర్లను పెట్టవచ్చు కదా... మీ చదువుకు సార్థకత వచ్చేది. అలాగే స్కూలు పిల్లలకు ఉపయోగపడేది కదా? మీరు తప్పు చేయలేదా?'**

'మీరు చెప్పింది నిజమే సర్. కానీ ఇంజినీరింగ్ విద్యార్థులు నిజంగా నేర్చుకోవాలంటే ఎన్నో అవకాశాలు ఉచితంగా లభిస్తున్నాయి. నేను బీటెక్ చదివేటప్పుడూ, ఇంజినీరింగ్ ఉద్యోగం చేసేటప్పుడూ యూట్యూబ్‌లో ఎంఐటీ, కాలిఫోర్నియా లాంటి యూనివర్సిటీల ప్రొఫెసర్ల లెక్చర్లను ఉచితంగా వినేవాడిని. నేను వారికంటే గొప్పగా చెప్పగలను అనుకోవటం లేదు. ఇంజినీరింగ్ విద్యార్థులకు కావలసింది ఆసక్తి మాత్రమే. అందుకే ప్రభుత్వ స్కూలులో వెనకబడిన విద్యార్థుల విషయంలో వారికి అందుబాటులో లేని నాణ్యమైన విద్యను నాదైన పద్ధతిలో అంటే.. ప్రశ్నించే తరహాలో అందజేశాను'.

◗ **'మీరు ప్రభుత్వోద్యోగంలో చేరితే లంచం తీసుకోరు, ప్రజాసేవ చేస్తారు అని ఎలా నమ్మాలి?'**

'భవిష్యత్తులో నేను అవినీతికి పాల్పడతానో లేదో అన్నది నేనిప్పుడు వర్తమానంలో నిరూపించలేను. కానీ నేను ఇంతవరకూ నడిచిన నా దారిని మాత్రం చెప్పగలను. దాన్నిబట్టి నా గురించి ఒక అంచనాకు రావచ్చును..' అంటూ వాస్తవంగా చేసిన సేవాకార్యక్రమాల వివరాలు చెప్పవచ్చు.

◗ **'మీ గౌరవనీయమైన వృత్తిని మీరెందుకు వదలాలనుకుంటున్నారు?'** (టీచర్లనూ, డాక్టర్లనూ అడిగిన ప్రశ్న..)

'ఒక వ్యక్తి స్థాయిలో లేదా ఒక సంస్థ స్థాయిలో పనిచేసి సమాజంపై చూపించే ప్రభావం కన్నా గ్రూప్-1 స్థాయిలో మరింతమంది టీచర్లనూ, ప్రభుత్వ వైద్యులనూ మెరుగైన ప్రజాసేవకు ప్రోత్సహించవచ్చు. సమాజంలో తద్వారా గుణాత్మక మార్పులను తీసుకురావొచ్చు'.

పబ్లిక్ సర్వీస్ కమిషన్ అభ్యర్థుల నుంచి ఆశించే లక్షణాలు

❑ నాయకత్వ లక్షణాలు ❑ రాజ్యాంగ స్ఫూర్తి ❑ ప్రజానుకూల ధోరణి (సమానత్వం, భావ స్వేచ్ఛ, సామాజిక న్యాయం, వ్యక్తి గౌరవం, ప్రజాస్వామిక వైఖరి, జాతీయ సమైక్యత..దీనిలో భాగం) ❑ సంక్షేమం, సాధికారత రెండిటిపై అవగాహన ❑ స్వభావంలో నమ్రత.

గంగా విహారం.. హస్తకళలు అపురూపం

- ప్రధాని మోదీతో కలిసి మెక్రాన్ పడవ ప్రయాణం
- యూపీ కళాకారుల నైపుణ్యానికి ఫ్రాన్స్ అధ్యక్షుడి కితాబు
- రూ.500 కోట్ల సౌర విద్యుత్ ప్లాంటు ప్రారంభం



సోమవారం వారణాసిలో అస్సీ ఘాట్ నుంచి దశాశ్వమేధ ఘాట్‌కు పడవలో విహరిస్తున్న ప్రధాని మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్

వారణాసి, దాదర్ కలాన్ (యూపీ): భారతదేశ పర్యటనకు వచ్చిన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ సోమవారం మరపురాని అనుభూతుల్ని మూటగట్టుకున్నారు. భారత ప్రధాని నరేంద్రమోదీతో కలిసి ఆయన వారణాసి తీరంలో పడవలో విహరించారు. యూపీ హస్తకళాకారులు తమ పనితీరును ప్రదర్శించిన తీరు ఆయన్ని మంత్రముగ్ధుడిని చేసింది. ఇద్దరు అతిథులు కలిసి యూపీలోనే అతిపెద్దదైన రూ.500 కోట్ల సౌర విద్యుదుత్పత్తి కర్మాగారాన్ని లాంఛనంగా ప్రారంభించి, వెలుగులు పంచారు. విదేశీ అతిథికి ఘనమైన స్వాగతం పలకడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన ఏర్పాట్లు చూడముచ్చట కలిగించాయి. భారతీయ సంస్కృతి-సంప్రదాయాలను చాటి చెప్పేరీతిలో వారణాసి తీరంలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

కళాకారుల నైపుణ్యాన్ని వివరించిన మోదీ

బడా లాల్‌పూర్‌లో ఉన్న దీన్‌దయాళ్ ఉపాధ్యాయ హస్తకళా వాణిజ్య సదుపాయ కేంద్రం- సంకుల్‌ను మెక్రాన్ సందర్శించినప్పుడు నరేంద్రమోదీ చొరవ తీసుకుని ఆయా వస్తువుల గొప్పతనం గురించి తానే వివరించారు. వారణాసికి అంతర్జాతీయ ఖ్యాతిని తీసుకువచ్చిన కళారూపాలు, వాటిని రూపొందించే పద్ధతి, ఇతర ప్రత్యేకతల్ని విడమరిచి చెప్పారు. ప్రఖ్యాత బెనారస్ చీరలను మగ్గాలపై ఎలా సిద్ధం చేసేదీ చూపించారు. తివాచీల తయారీని కూడా మెక్రాన్ తెలుసుకున్నారు. ఇద్దరు నేతలూ కొద్దిసేపు హస్తకళాకారులతో ముచ్చటించారు. సుమారు ముప్పావుగంట అక్కడ గడిపారు. చిత్రకళ, చేతిపని తీరు గురించి తెలుసుకునేందుకు మెక్రాన్ ఎక్కువ ఆసక్తి చూపించారు.

సౌర విద్యుత్తు... ప్రజలకు అంకితం

అంతర్జాతీయ సౌర కూటమి (ఐఎస్ఏ) కార్యక్రమంలో భాగంగా మీర్జాపూర్ జిల్లాలోని దాదర్ కలాన్‌లో నెలకొల్పిన 75 మెగావాట్ల సౌర విద్యుత్తు ప్లాంటుకు మోదీ, మెక్రాన్ ప్రారంభోత్సవం చేశారు. ఫ్రాన్స్ సాంకేతికతతో 388 ఎకరాల విస్తీర్ణంలో 1.18 లక్షల సౌర ఫలకాలను నెలకొల్పారు. ఇవి నెలకు సుమారు 1.30 కోట్ల యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయగలుగుతాయి.

సంప్రదాయబద్ధ స్వాగతం

తాజ్‌మహల్ సందర్శన అనుభూతులతో వారణాసికి చేరుకున్న మెక్రాన్‌కు... వారణాసి నగర సాంస్కృతిక వైశిష్ట్యం కళ్లకు కట్టేలా అడుగడుగునా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పూల జల్లు, వేద మంత్రోచ్చారణలు, షెహనాయ్ వాద్యాల నడుమ మోదీ, మెక్రాన్, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌లు అస్సీ ఘాట్ నుంచి దశాశ్వమేధ ఘాట్ వరకు 20 నిమిషాలపాటు జల విహారం చేశారు. కళాకారులు శంఖాలు ఊదుతూ, ఢమరుకాలను మోగిస్తూ సందడి చేశారు. ఘాట్ల వద్ద ప్రజలు, విద్యార్థులు రెండు దేశాలకు చెందిన పతాకాలు ఊపుతూ కనిపించారు. రెండు దేశాలకు చెందిన కళాకారులు వివిధ సాంస్కృతిక అంశాలను ప్రదర్శించారు. చేతిలో చేయి వేసి హస్తకళా కేంద్రం నుంచి ఘాట్ వరకు వచ్చిన ఇద్దరు అతిథుల్ని ఈ అంశాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. శ్రీరాముడి అరణ్యవాసం, పట్టాభిషేకం సహా వివిధ అంశాలను వీరు తిలకించారు. 'భారతదేశ సాంస్కృతిక రాజధానికి స్వాగతం' అంటూ 50 అడుగుల ఎత్తున ఇద్దరు నేతల చిత్రాలతో కూడిన కటౌట్‌ను తులసీఘాట్ వద్ద నెలకొల్పారు. సంప్రదాయ సంగీత, నృత్యాలపై మెక్రాన్ సంతృప్తి వ్యక్తంచేశారు.

ఇంటర్‌సిటీ రైలు ప్రారంభం: యూపీ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ సోమవారం మండువాడీ-పట్నా ఇంటర్‌సిటీ రైలును ప్రారంభించారు. ఇది వారణాసి నుంచి మూడో మహామన ఎక్స్‌ప్రెస్. ఎల్ఈడీ దీపాలు, డిజిటల్ తెరలు, మెరుగైన మరుగుదొడ్లు వంటి వసతులు వీటిలో ఉన్నాయి.



హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రులు కేటీఆర్, మహేందర్‌రెడ్డి, ఈటల రాజేందర్ సమక్షంలో.. జపాన్‌కు చెందిన ఇసే ఫుడ్స్ సిద్దిపేట జిల్లా నర్మెట్టలో ఏర్పాటుచేయనున్న పరిశ్రమకు సంబంధించి అనుమతి పత్రాలను ఆ సంస్థ ఛైర్మన్ మియా కోషికి అందజేస్తున్న రాష్ట్ర పరిశ్రమల ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్

తెలంగాణలో జపాన్ పరిశ్రమలు

- నర్మెట్టలో 140 ఎకరాల్లో 'ఇసె ఫుడ్స్' ఏర్పాటు
- రాష్ట్రానికి గొప్ప మేలు: కేటీఆర్

ఈనాడు, హైదరాబాద్: జపాన్‌కు చెందిన ప్రముఖ పారిశ్రామిక సంస్థ 'ఇసె (ఐఎస్ఈ) ఫుడ్స్' తెలంగాణలో పరిశ్రమలను స్థాపించేందుకు ముందుకొచ్చింది. సిద్దిపేట జిల్లా నంగనూరు మండలం నర్మెట్ట గ్రామంలోని 140 ఎకరాల్లో కోడిగుడ్ల శుద్ధి, వ్యర్థాలతో సేంద్రియ ఎరువుల తయారీ పరిశ్రమలను, సుజుకీ కంపెనీ భాగస్వామ్యంతో లిథియం అయాన్ బ్యాటరీల పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసి, మూడేళ్లలో ఉత్పత్తి ప్రారంభిస్తుంది. రూ.225 కోట్ల పెట్టుబడులతో వేయి మందికి ఉపాధి కల్పించాలని నిర్ణయించింది. సోమవారం ఈ సంస్థ ఛైర్మన్, జపాన్ ప్రధానమంత్రి సలహాదారు మిత్సుహిరో మియాకోషి అధ్యక్షతన ప్రతినిధి బృందం హైదరాబాద్‌లో పరిశ్రమలు, పౌరసరఫరాలు, రవాణా శాఖ మంత్రులు కేటీఆర్, ఈటల రాజేందర్, మహేందర్‌రెడ్డిలతో సమావేశమైంది. పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ ఇతర అధికారులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు జయేశ్ చేతుల మీదుగా సంస్థకు అనుమతులు, రాయితీల పత్రాలను అందజేశారు. 'ఇసె ఫుడ్స్' సంస్థ ఆహార శుద్ధి రంగంలో ప్రపంచంలోని మొదటి పది స్థానాల్లో ఉంది. దేశ విదేశాల్లో పరిశ్రమలున్నాయి. ఈ సంస్థ హైదరాబాద్‌ని నేషనల్ బ్యాడ్మింటన్ అకాడమీ ద్వారా టోక్యో ఒలింపిక్స్‌లో పాల్గొనే క్రీడాకారులకు నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. జపాన్ పర్యటన సందర్భంగా కేటీఆర్ ఈ సంస్థ ప్రతినిధులను కలిసి హైదరాబాద్‌లో పెట్టుబడులకు ఆహ్వానించారు. వెంటనే స్పందించిన ఛైర్మన్ అప్పట్లో తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ తర్వాత సంస్థ ప్రతినిధి బృందం తెలంగాణకు వచ్చి అధికారులతో భేటీ అయింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలను పరిశీలించి నర్మెట్టలో పరిశ్రమల ఏర్పాటుకు నిర్ణయించింది. దీనికి అనుగుణంగా ప్రభుత్వం 140 ఎకరాలను సంస్థకు కేటాయించింది. దీంతోపాటు పారిశ్రామిక రాయితీలను ప్రకటించింది. సోమవారం వీటిని కేటీఆర్ అందజేశారు.

తెలంగాణలో జపాన్ వెలుగులు..: జపాన్‌కు చెందిన అగ్రశ్రేణి సంస్థ ఇసె ఫుడ్స్ తెలంగాణలో పరిశ్రమలను ఏర్పాటు చేయనుండడం రాష్ట్రానికి గొప్ప మేలు చేస్తుందని మంత్రి కేటీఆర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. తాము జపాన్‌లో ఎంవోయూ చేసుకున్న కొద్ది కాలానికే ఈ సంస్థ రంగంలోకి దిగడం చిత్తశుద్ధికి నిదర్శనమనీ, దీనిద్వారా జపాన్ వెలుగులు తెలంగాణలో విరజిమ్ముతాయన్నారు. ఇసే ఫుడ్స్ పెట్టుబడులతో ఆహార శుద్ధి రంగం మరింతగా పురోగమిస్తుందన్నారు. తెలంగాణ కోళ్లు, కోడిగుడ్ల ఉత్పత్తిలో దేశంలో అగ్రస్థానంలో ఉందనీ, ఇసే ఫుడ్స్ ద్వారా పరిశ్రమ స్థానం మరింత సుస్థిరమవుతుందని మంత్రి ఈటల పేర్కొన్నారు.

తెలంగాణకు ఉజ్వల భవిష్యత్తు: మియాకోషి

తెలంగాణలో పరిశ్రమల స్థాపన కోసం ప్రభుత్వ చొరవ, ఇక్కడి పారిశ్రామిక విధానాలు, ఆచరణ అద్భుతంగా ఉన్నాయని ఇసె ఫుడ్స్ ఛైర్మన్ మియాకోషి పేర్కొన్నారు. ఒప్పందం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం మంచి సహకారాన్ని అందించిందనీ, తెలంగాణకు ఉజ్వల భవిష్యత్తు ఉందనీ, తమ పరిశ్రమల ద్వారా ఆహార శుద్ధికి ప్రోత్సాహం లభిస్తుందనీ చెప్పారు. ఈ సందర్భంగా జపనీస్ భాషలో తెలంగాణ ప్రభుత్వం ముద్రించిన పారిశ్రామిక విధాన బ్రోచర్‌ను మియాకోషి చేతుల మీదుగా విడుదల చేశారు.

నేరాలపై అత్యుత్తమ దర్యాప్తులకూ అవార్డులు: కేంద్రం

దిల్లీ: నేరాలపై అత్యుత్తమ దర్యాప్తుతో నిజాలు వెలుగులోకి తెచ్చినవారికీ ఇకపై అవార్డులు దక్కనున్నాయి. పోలీసు బలగాల్లో వృత్తిపరమైన ప్రమాణాలను పెంచడమే లక్ష్యంగా ఈ అవార్డులను ప్రవేశపెట్టాలని కేంద్రం నిర్ణయించింది. "పోలీసు దర్యాప్తులో ప్రతిభ కనబరిచినందుకు కేంద్ర హోం మంత్రి పతకం'గా ఈ అవార్డుకు నామకరణమూ చేసింది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని పోలీసు బలగాలు, కేంద్ర దర్యాప్తు సంస్థలోని సిబ్బందికి వీటిని అందించనున్నట్లు సీనియర్ ప్రభుత్వ అధికారి తెలిపారు. సబ్-ఇన్‌స్పెక్టర్ నుంచి సూపరింటెండెంట్ హోదా ఉండే అధికారులు వీటి కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. గత మూడేళ్ల సమాచారాన్ని విశ్లేషించిన అనంతరం ఈ ఏడాది 162 పతకాలను అందించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. వీటిలో 137ను రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని అధికారులకు ఇస్తామని చెప్పారు.

తీహార్ జైలుకు కార్తి చిదంబరం

- 13 రోజుల పాటు న్యాయ నిర్బంధం
- ఐఎన్ఎక్స్ మీడియా కేసులో ప్రత్యేక కోర్టు ఆదేశం
- ప్రత్యేక గది కేటాయింపునకు నిరాకరణ

దిల్లీ: ఐఎన్ఎక్స్ మీడియా ముడుపుల కేసులో నిందితుడు, కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి పి.చిదంబరం తనయుడు కార్తి చిదంబరంని దిల్లీలోని ప్రత్యేక కోర్టు 13 రోజుల న్యాయ నిర్బంధానికి పంపించింది. తనకు భద్రతాపరమైన ముప్పు ఉందని, తీహార్ జైలులో ప్రత్యేక గది(సెల్)ని కేటాయించాలన్న నిందితుడి అభ్యర్థనను న్యాయస్థానం తోచిపుచ్చింది. అలాగే తన బెయిల్ పిటిషన్‌ను సత్వరమే విచారణ చేపట్టాలన్న కార్తి అప్పీలునూ జడ్జి నిరాకరించారు. ఫిబ్రవరి 28న అరెస్టు అయిన కార్తికి 12 రోజుల పోలీస్ కస్టడీ ముగియటంతో సీబీఐ సోమవారం ప్రత్యేక జడ్జి సునీల్ రాణా ముందు కార్తిని ప్రవేశపెట్టింది. పోలీస్ కస్టడీకి పంపించాలని సీబీఐ కోరకపోవటంతో న్యాయ నిర్బంధానికి (జుడీషియల్ కస్టడీ)కి పంపిస్తున్నామని, కార్తిని తిరిగి ఈ నెల 24న తన ఎదుట హాజరుపరచాలని జడ్జి ఆదేశించారు. కేంద్ర మాజీ మంత్రి కుమారుడినైన తనకు వివిధ వర్గాల నుంచి ప్రమాదం పొంచి ఉందని, సమాజంలో తన హోదాను గుర్తించి అయినా జైలులో ప్రత్యేక గదిని కేటాయించాలని కార్తి అభ్యర్థించారు. దీనికి సీబీఐ అభ్యంతరం తెలిపింది. కార్తి భద్రతకు ఎలాంటి ముప్పు లేదని, ప్రత్యేక గదిని, స్నానపు గదిని కేటాయించాల్సిన ఆవశ్యకత లేదని సీబీఐ న్యాయవాది వీకే శర్మ పేర్కొనటాన్ని కార్తి తరఫు న్యాయవాది దయన్ కృష్ణన్ తీవ్రంగా ఆక్షేపించారు. దర్యాప్తు సంస్థ అభ్యంతరం రాజకీయ ప్రేరేపితంలా కనిపిస్తుందని, కార్తి భద్రతపై మా ఆందోళనను అది మరింత తీవ్రతరం చేస్తుందని కృష్ణన్ తెలిపారు. సమాజంలో చిదంబరం కుటుంబ హోదాను గుర్తించ నిరాకరించలేమని చెబుతూనే ఇతర నిందితులకు భిన్నంగా చూడలేమంటూ జడ్జి స్పష్టం చేశారు. అయితే, కార్తికి తగినంత భద్రత కల్పించాలని జైలు అధికారులకు సూచించారు. జైలు వైద్యుడి పరిశీలన అనంతరం కళ్లజోడు, ఔషధాలు తన వెంట కార్తి తీసుకెళ్లవచ్చని జడ్జి తెలిపారు. దుస్తులు, పుస్తకాలు, ఇంటి ఆహారం వంటివి తిరస్కరించారు. ఇంతకు ముందు కార్తి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై తమ అభిప్రాయాన్ని తెలిపేందుకు సీబీఐకి ఈనెల 15వ తేదీ వరకు గడువు ఇచ్చినందున అదే అంశంపై ఇప్పుడు అత్యవసర విచారణ చేపట్టడం సాధ్యం కాదని జడ్జి స్పష్టంచేశారు. కార్తిని తీహార్ జైలుకు తీసుకెళ్లాలని ఆదేశించారు.

పరిమితి రూ.13,000 వాడుక రూ.9 కోట్లు!

ఎస్‌బీఐకి ముంబయి వాసి టోకరా

దిల్లీ: ముంబయికి చెందిన సందీప్‌కుమార్ రఘుపూజారి అనే వ్యక్తి కేవలం 200 డాలర్ల (రూ.13,000) పరిమితితో విదేశీ ప్రయాణ కార్డులు కొనుగోలు చేసి, ఏకంగా 14.1 లక్షల డాలర్ల (సుమారు రూ.9.10 కోట్లు) మేర ఈ-కామర్స్ వెబ్‌సైట్ల ద్వారా ఖర్చు చేశాడని భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) ఫిర్యాదు చేసింది. దీనిపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) సోమవారం కేసు నమోదు చేసింది. కార్డులో ఉండే నగదు పరిమితిని తప్పుడు పద్ధతుల్లో మార్చేసి, బ్రిటిష్ ఈ-కామర్స్ సైట్ల ద్వారా 374 లావాదేవీలతో 2016 నవంబరు- 2017 ఫిబ్రవరి మధ్య భారీగా ఖర్చు చేశారని ఎస్‌బీఐ తెలిపింది. ముందస్తు చెల్లింపు పద్ధతిలో నవీ ముంబయిలోని ఎస్‌బీఐ ఎన్నారై సేవుడ్స్ శాఖ నుంచి కార్డు తీసుకుని, డేటాబేస్‌లో మార్పులు చేసి, ఆ వివరాలను వ్యవస్థ నుంచి తొలగించినట్లు బ్యాంకు అనుమానిస్తోంది.

కుమార్తె కోసమే జైట్లీ మౌనం

పీఎన్‌బీ కుంభకోణంపై రాహుల్ వ్యాఖ్యలు

దిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) కుంభకోణంపై కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మరోసారి లక్ష్యంగా చేసుకున్నారు. కుమార్తెను ఈ కేసు నుంచి కాపాడేందుకే జైట్లీ పెదవి విప్పడంలేదంటూ సోమవారం ఆయన ఆరోపణలు గుప్పించారు. న్యాయవాదిగా పనిచేస్తున్న జైట్లీ కుమార్తెకు పీఎన్‌బీ నిందితుల్లో ఒకరు భారీ స్థాయిలో చెల్లింపులు చేసినట్లు ఆరోపించారు. ఈ తతంగమంతా కుంభకోణం వెలుగుచూసేందుకు నెల రోజుల ముందే జరిగిందని చెప్పారు. కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) అధికారులు జైట్లీ కుమార్తె సంస్థలో ఎందుకు సోదాలు చేపట్టలేదంటూ ఆయన ఆశ్చర్యం వ్యక్తంచేశారు. ఇది దేనికి సంకేతమో చెప్పాలన్నారు. మరోవైపు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యూల్ మెక్రాన్‌తో రాహుల్, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఆదివారం సమావేశమయ్యారు.

ఆర్వో మంచినీళ్లు సురక్షితం కాదు

- మిషన్ భగీరథ నీళ్లపై దుష్ప్రచారం
- ఈఎన్‌సీ సురేందర్‌రెడ్డి వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: ఆరోగ్యానికి అవసరమయ్యే ఖనిజ లవణాలు ఆర్వో ప్లాంట్లలోని మంచినీటిలో ఉండవని...అవి సురక్షితమైనవి కావని రాష్ట్ర తాగునీటి శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) సురేందర్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో కొందరు ఆర్వో ప్లాంట్ల యజమానులు మిషన్ భగీరథ నీళ్లు మంచివి కావంటూ గ్రామాల్లో ప్రచారం చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని వెల్లడించారు. ప్లాస్టిక్ సీసాలు, క్యాన్‌లలోని నీటిని తాగకుండా ప్రజలను చైతన్యవంతం చేసేందుకు గ్రామ స్థాయిలో కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. భగీరథ నీళ్ల నాణ్యత, పర్యవేక్షణ అంశాలపై సోమవారమిక్కడ నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈఎన్‌సీ మాట్లాడుతూ.. 'ఆర్వో నీటి వినియోగం, ప్లాంట్ల నియంత్రణ ఇప్పుడు అవసరం. భగీరథ నీళ్ల నాణ్యతను పరిరక్షించటంలో కెమిస్ట్, మైక్రో బయాలజిస్టులదే కీలక పాత్ర. గ్రామాల్లోని జల భాండాగారాల వద్ద నీటి నాణ్యత తగ్గకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతి నీటి శుద్ధి కేంద్రంలోను అత్యాధునిక సదుపాయాలతో నీటి నాణ్యతను పరిరక్షించే విభాగాలను ఏర్పాటు చేశాం. ఎన్నో జాగ్రత్తలు తీసుకొని అందజేసే భగీరథ నీటిని.. ప్రజలు తమ ఇళ్లల్లో సురక్షిత పద్ధతుల్లో వాడటమూ అవసరం. దీనిపై గ్రామాల వారీగా తాగునీరు, పారిశుద్ధ్య కమిటీలకు త్వరలోనే అవగాహన కల్పిస్తాం' అని పేర్కొన్నారు.

ఇంకెన్నాళ్లీ సాగదీత?

- '2జీ' కేసుల దర్యాప్తులో జాప్యంపై సుప్రీంకోర్టు ఆగ్రహం
- 6 నెలల్లో పూర్తిచేయాలని సీబీఐ, ఈడీలకు ఆదేశం
- అదృశ్య హస్తమేదైనా దర్యాప్తును ఆలస్యం చేస్తోందా? అంటూ ప్రశ్న
- ప్రజలకు వాస్తవాలు తెలియకుండా దాయలేమని వ్యాఖ్య

దిల్లీ

దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించిన 2జీ స్పెక్ట్రమ్ కేటాయింపుల కుంభకోణం కేసుల దర్యాప్తులో చోటుచేసుకుంటున్న జాప్యంపై సుప్రీంకోర్టు సోమవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కేసులను ఇంకా ఎన్నాళ్లు సాగదీస్తారంటూ దర్యాప్తు సంస్థలను నిలదీసింది. 2జీ కేటాయింపులు, దానికి సంబంధించి వెలుగులోకి వచ్చిన అన్ని కేసుల దర్యాప్తును ఆర్నెళ్లలో పూర్తిచేయాలంటూ కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)లకు డెడ్‌లైన్ విధించింది. ఎయిర్‌సెల్-మాక్సిస్ ఒప్పందానికి విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక మండలి(ఎఫ్ఐపీబీ) ఆమోదం దక్కడంలో చోటుచేసుకున్న అవకతవకలు సహా 2జీ కుంభకోణం సంబంధిత కేసులన్నింటిలో దర్యాప్తు స్థితిగతులను(స్టేటస్) వివరిస్తూ రెండు వారాల్లోగా తమకు నివేదిక సమర్పించాలని కేంద్రప్రభుత్వాన్ని ఆదేశించింది.

2జీ కేసుల్లో 2010లో ప్రారంభమైన దర్యాప్తు ఇప్పటికీ పూర్తికాకపోవడం చాలా దురదృష్టకరమని జస్టిస్ అరుణ్ మిశ్ర, జస్టిస్ నవీన్ సిన్హాలతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఇలాంటి తీవ్రమైన, సున్నితమైన వ్యవహారాల్లో ప్రజలకు వాస్తవాలు తెలియకుండా దాయలేమని పేర్కొంది. 'దర్యాప్తు ఆలస్యమయ్యేలా ఏదైనా అదృశ్య హస్తం అడ్డుకుంటోందా?' అని ప్రశ్నించింది. దీనిపై అటార్నీ జనరల్ కె.కె.వేణుగోపాల్ స్పందిస్తూ.. 2జీ కుంభకోణానికి సంబంధించి ఎయిర్‌సెల్-మాక్సిస్ కేసు మాత్రమే ప్రస్తుతం పెండింగ్‌లో ఉందని న్యాయస్థానానికి నివేదించారు. ఈ కేసుతో సంబంధమున్న మలేసియా వ్యాపార దిగ్గజం టి.ఆనంద కృష్ణన్ దర్యాప్తుకు సహకరించడం లేదని.. అందువల్లే దర్యాప్తులో జాప్యం చోటుచేసుకుంటోందని తెలిపారు. '2జీ' కేసులో ప్రత్యేక పబ్లిక్ ప్రాసెక్యూటర్(ఎస్‌పీపీ)గా సీనియర్ న్యాయవాది ఆనంద్ గ్రోవర్ స్థానంలో అదనపు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను నియమిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయానికి సుప్రీంకోర్టు ఆమోదముద్ర వేసింది.

ఎస్ఎస్‌సీ ప్రశ్నపత్రాల లీక్‌పై స్పందించాలని ఆదేశం

గత నెల్లో నిర్వహించిన స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) ఉద్యోగ నియామక ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయంటూ వచ్చిన ఆరోపణలపై సుప్రీంకోర్టు స్పందించింది. ఈ వ్యవహారంపై దర్యాప్తు జరిపించాలని కోరుతూ ఓ న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్‌పై సమగ్ర స్పందన దాఖలు చేయాలని కేంద్రప్రభుత్వాన్ని ఆదేశించింది.

పెరారివాళన్ పిటిషన్‌ను కొట్టివేయండి: సీబీఐ

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్య కేసులో తనను దోషిగా నిర్ధారించడాన్ని సమర్థిస్తూ 1999 మే 11న వెలువరించిన తీర్పును వెనక్కి తీసుకోవాల్సిందిగా సుప్రీంకోర్టులో ఎ.జి.పెరారివాళన్ దాఖలు చేసిన వినతిని సీబీఐ వ్యతిరేకించింది. అతడి పిటిషన్‌ను కొట్టివేయాలని కోరుతూ న్యాయస్థానంలో ప్రమాణపత్రం దాఖలు చేసింది. రాజీవ్ హత్య కోసం పన్నిన కుట్రలో పెరారివాళన్ పాత్ర ఉన్నట్లు సర్వోన్నత న్యాయస్థానం ఇప్పటికే నిర్ధారించిన సంగతిని గుర్తుచేసింది. ప్రస్తుతం ఆ కేసునంతటినీ తిరగదోడటం సాధ్యం కాదని.. పెరారివాళన్ పిటిషన్‌ను కొట్టివేయాలని విన్నవించింది.

రాజ్యసభ బరిలో కేంద్ర మంత్రులు

నామినేషన్లు దాఖలు చేసిన జైట్లీ, ప్రసాద్, ప్రధాన్

దిల్లీ: రాజ్యసభలో ఏర్పడిన ఖాళీల భర్తీకి ఈ నెల 23న జరగనున్న ఎన్నికలను పురస్కరించుకుని పలువురు కేంద్ర మంత్రులు సోమవారం ఆయా రాష్ట్రాల్లో నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. గుజరాత్ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ఈసారి ఉత్తర్‌ప్రదేశ్ నుంచి 11 మంది భాజపా అభ్యర్థులతో కలిసి నామినేషన్లు సమర్పించారు. కేంద్ర మంత్రులు పురుషోత్తమ్ రూపాలా, మన్సుక్ మాండవీయలు గుజరాత్ నుంచి బరిలో దిగారు. న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ తన సొంత రాష్ట్రమైన బిహార్ నుంచి మరోసారి పోటీ చేస్తున్నారు. ఆ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న పెట్రోలియం-సహజవాయువు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈసారి మధ్యప్రదేశ్‌కు మారి, అక్కడి నుంచి నామినేషన్ వేశారు. సామాజిక న్యాయం-సాధికారత శాఖ మంత్రి థావర్‌చంద్ గహ్లోత్ కూడా మధ్యప్రదేశ్ నుంచే పోటీ చేస్తున్నారు. సీనియర్ న్యాయవాది, కాంగ్రెస్ అధికార ప్రతినిధి అభిషేక్ మను సింఘ్వి తృణమూల్ కాంగ్రెస్ మద్దతుతో పశ్చిమబెంగాల్ నుంచి నామినేషన్ సమర్పించారు. వివిధ రాష్ట్రాల్లో 58 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఇవి కాకుండా కేరళలో ఒక స్థానానికి ఉప ఎన్నిక నిర్వహిస్తున్నారు.

జైలు నుంచే 'ఉగ్రవాద' కుట్ర!

శ్రీనగర్: కొందరు నేరస్థులు ఉగ్రవాద కార్యకలాపాలకు జైలు నుంచే ప్రణాళిక రచిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) శ్రీనగర్‌లోని కేంద్ర కారాగారంపై సోమవారం విస్తృతస్థాయిలో దాడులు జరిపింది. ఎన్ఎస్‌జీ కమాండోలు, మేజిస్ట్రేట్‌లు, వైద్యులు, సాక్షులతో సహా వెళ్లిన 20 బృందాలు సోదాలు నిర్వహించాయి. పాకిస్థానీలతోపాటు కరుడుగట్టిన ఉగ్రవాదులను ఉంచే బ్యారెక్కులు, బహిరంగ ప్రాంతం(ఓపెన్ గ్రౌండ్)లో డ్రోన్‌లను ఉపయోగించి అధికారులు అణువణువూ గాలించారు. ఈ సందర్భంగా దాదాపు పాతిక చరవాణిలు, కొన్ని సిమ్‌కార్డులు, డిజిటల్ కార్డులు, పెన్‌డ్రైవ్‌లు, ఐపాడ్ వంటివాటితో పాటు జిహాదీ సాహిత్యం, అనేక పత్రాలు, హిజ్‌బుల్ ముజాహిదీన్ గోడప్రతి, పాక్ జెండాను కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఎన్ఐఏ ప్రతినిధి ఒకరు తెలిపారు. ఉగ్రవాద కార్యకలాపాలకు సంబంధించి కుప్వారాలో ఇప్పటికే ఇద్దరు యువకులు అరెస్టయ్యారు. వారి విచారణలో అల్-బద్ర్ ఉగ్రవాదసంస్థకు సంబంధించి కొత్తవారిని చేర్చుకునే ప్రక్రియ, ఆయుధాల వినియోగంలో శిక్షణ తదితర కార్యకలాపాలకు శ్రీనగర్ కేంద్ర కర్మాగారం నుంచే కుట్ర జరుగుతున్నట్లు వెల్లడైంది. ఈమేరకు ఎన్ఐఏ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సోదాలు నిర్వహించింది. ఫిబ్రవరి 6న శ్రీనగర్‌లోని ఓ ఆసుపత్రి నుంచి లష్కరే తోయిబా ఉగ్రవాది మొహమ్మద్ నవీద్ తప్పించుకున్న వ్యవహారంపై కూడా ఎన్ఐఏ దర్యాప్తు జరుపుతోంది. నవీద్ తప్పించుకోవడానికి కూడా జైలు నుంచే కుట్ర జరిగినట్లు ఎన్ఐఏ భావిస్తోంది.

కశ్మీర్‌లో ఎదురుకాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదుల హతం

శ్రీనగర్: జమ్మూ-కశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లాలో సోమవారం జరిగిన ఎదురుకాల్పుల్లో భద్రత దళాలు ముగ్గురు ఉగ్రవాదులను మట్టుపెట్టాయి. ఈ ఘటనతో కశ్మీర్ లోయలో పట్టుసాధించేందుకు ఐఎస్ఐఎస్ ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. హకురా ప్రాంతంలో ఉగ్రవాదులున్నారన్న సమాచారంతో భద్రతదళాలు ఆదివారం రాత్రి నుంచి గాలింపు చేపట్టాయి. ఈ సందర్భంగా ఐఎస్ఐఎస్‌కు అనుబంధ సంస్థగా ప్రకటించుకున్న తెహ్రీక్-ఉల్-ముజాహిదీన్‌కు చెందిన ముగ్గురు ఉగ్రవాదులు తారసపడగా భద్రత దళాలు ఎదురుకాల్పులు జరిపాయి. శ్రీనగర్‌కు చెందిన ఈసా ఫజ్లీ, కోకెర్‌నాగ్‌కు చెందిన సయ్యద్ ఒవైస్ పాటు మరో ఉగ్రవాదిని హతమార్చినట్లు పోలీసు అధికారి ఒకరు తెలిపారు. మూడో వ్యక్తి ఎవరన్నది గుర్తించాల్సి ఉంది. హతుల్లో ఒకరికి ఇటీవల సౌరాలోని పోలీసు భద్రత కేంద్రంపై దాడితో సంబంధం ఉన్నట్లు వెల్లడించారు.

కశ్మీర్ ఆర్థిక మంత్రికి ఉద్వాసన

కశ్మీర్ సమస్య రాజకీయమైనది కాదన్నందుకు ఆగ్రహం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో పీడీపీ-భాజపా కూటమి రూపకర్తల్లో ఒకరైన ఆ రాష్ట్ర ఆర్థిక మంత్రి హసీబ్ ద్రబు(57)ను ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తి సోమవారం కేబినెట్ నుంచి తొలగించారు. కశ్మీర్ అంశం రాజకీయమైనది కాదంటూ హసీబ్ ద్రబు ఆదివారం ఓ ఇంటర్వ్యూలో పేర్కొనటం ఆయన ఉద్వాసనకు కారణమయ్యింది. "నా దృష్టిలో కశ్మీర్ సమస్య రాజకీయమైనది కాదు. రాజకీయాల పేరుతో గత 50, 70 ఏళ్లుగా ప్రజలను వక్రమార్గం పట్టించారు. అలాఅని రాజకీయ పరిస్థితి మెరుగుపడిందీ లేదు. కశ్మీర్ సమాజం తన ఉనికిని తాను ఎలా అన్వేషించుకుంటుందో అనే కోణంలో మనం చూడాల్సి ఉంది" అని శుక్రవారం దిల్లీలో ఓ ముఖాముఖీలో వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు పార్టీ వైఖరికి వ్యతిరేకంగా ఉన్నాయని, ఉపసంహరించుకోవాలని పీడీపీ ఉపాధ్యక్షుడు మొహమ్మద్ సర్తాజ్ మద్నీ ఒత్తిడి తెచ్చినప్పటికీ ఆయన నిరాకరించారు.

రాజీవ్ హత్యకేసులో ఆయన కుటుంబంపై అనుమానం

భాజపా నేత సుబ్రహ్మణ్యస్వామి

చెన్నై, న్యూస్‌టుడే: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ హత్యకేసులో ఆయన కుటుంబంపై అనుమానం ఉందని భాజపా సీనియర్ నేత సుబ్రహ్మణ్యస్వామి ఆరోపించారు. దిల్లీలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ... తమకు వ్యతిరేకంగా సైన్యాన్ని పంపడం వల్లే రాజీవ్‌గాంధీని హతమార్చినట్టు ఎల్టీటీఈ తెలిపిందన్నారు. శ్రీలంక అభ్యర్థన మేరకు మన పార్లమెంట్‌లో తీర్మానం ఆమోదించి ఆ దేశానికి రాజీవ్‌గాంధీ అప్పట్లో సైన్యాన్ని పంపారని తెలిపారు. ఈ నేపథ్యంలో రాజీవ్ హంతకులపై ఆయన కుటుంబసభ్యులు కారుణ్యం చూపించడం పలు అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. హంతకులను క్షమించినట్టు రాహుల్‌గాంధీ పేర్కొనడం ఆయనకు దేశభక్తి లేదనే విషయాన్ని సూచిస్తోందని తెలిపారు. అదే సమయంలో ఈ క్షమాపణ ఎందుకో అర్థం కావడం లేదన్నారు.

సెన్సెక్స్ ▲ 611 — 33918

నిఫ్టీ ▲ 195 — 10421

డోజోన్స్ 25209 ▼ 127

నాస్‌డాక్ 7585 ▲ 24

అమెరికా కాలమానం ప్రకారం సోమవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

రూపాయి 65.04 ▲ (ఒక అమెరికా డాలరుకు) 13 పైసలు

ముడి చమురు 64.95 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)



ఘనం (+)


నిఫ్టీ	12న	మార్పు%
BHARTI AIRTEL	421.55	4.82
VEDANTA	317.40	4.36
ITC	270.10	4.19
NTPC	171.15	4.11
IOC	400.65	3.93
HINDALCO INDU	227.65	3.38
TATA MOTORS	352.60	3.25
HERO MOTO	3694.50	3.02
AXIS BANK	519.20	2.74
HPC	366.75	2.72

గ్రహణం (-)

నిఫ్టీ	12న	మార్పు%
COAL INDIA	297.65	-2.10
AUROBINDO PHA	582.85	-1.62
SBI	252.85	-0.16


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)




కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	59.12	68.55	బహ్రెయిన్ దీనార్	160.09	183.46
పౌండ్ స్టెర్లింగ్	81.91	95.01	కువైట్ దీనార్	178.88	222.68
యూరో	72.83	84.48	ఒమన్ రియాల్	156.77	179.36
జపనీస్ యెన్/100	55.45	64.30	సౌదీ రియాల్	15.72	18.63
ఆస్ట్రేలియా డాలరు	46.49	53.79	యూఏఈ దిర్హమ్	16.09	18.81
సింగపూర్ డాలరు	44.97	53.28	మలేషియా రింగిట్	14.81	18.21
థాయ్ బాత్/100	188.88	225.90	చైనీస్ యువాన్	7.26	11.78

సోమవారం నిఫ్టీ కదలికలు



ద్రవ్యోల్బణం: చల్లబడింది



- నాలుగు నెలల కనిష్ఠానికి
- ఫిబ్రవరిలో 4.44 శాతానికి

ద్రవ్యోల్బణం అదుపులోకి రావడంతో పాటు.. పారిశ్రామిక ఉత్పత్తి కూడా అంతక్రితం ఏడాదితో పోలిస్తే రాణించడంతో పారిశ్రామిక వర్గాల్లో ఆనందం నిండింది. కనీసం సమీప భవిష్యత్‌లో కీలక రేట్లలో పెంపు ఉండదన్న అంచనాలు వెలువడ్డాయి.

దిల్లీ: రిటైల్ ద్రవ్యోల్బణం ఫిబ్రవరిలో నాలుగు నెలల కనిష్ఠ స్థాయికి చేరింది. ఆహార వస్తువుల ధరలు తగ్గడం, ఇంధన వ్యయాలు కిందకు దిగిరావడంతో 4.44 శాతానికి చేరింది. వినియోగదారు ధరల సూచీ(సీపీఐ) ఆధారంగా లెక్కించే రిటైల్ ద్రవ్యోల్బణం గత జనవరిలో 5.07 శాతానికి పెరిగిన సంగతి విదితమే. ఇక గతేడాది ఫిబ్రవరిలో ఇది 3.65 శాతమే కాగా, గతేడాది నవంబరులో 4.88 శాతంగా నమోదైంది.


- వినియోగదారు ఆహార విభాగానికి సంబంధించి ఫిబ్రవరిలో 3.26 శాతమే ధరలు పెరిగాయి. అంతక్రితం 4.7 శాతం మేర ద్రవ్యోల్బణం నమోదైంది.
- కూరగాయలు సైతం జనవరిలో 26.97 శాతం మేర ప్రియం కాగా.. ఫిబ్రవరి కల్లా అవి 17.57 శాతానికి పరిమితమయ్యాయి.
- పళ్ల ధరలు కూడా 4.80 శాతం (అంతక్రితం 6.24%) మాత్రమే పెరిగాయి.
- పాలు, పాల ఉత్పత్తులు 4.21%, తృణ ధాన్యాలు 2.1%, మాంసం, చేపలు 3.31%, గుడ్లు 8.51% చొప్పున ప్రియం అయ్యాయి.
- ఇంధన ధరలు 6.8% పెరగ్గా.. జనవరిలో మాత్రం 7.73% ప్రియమయ్యాయి.

పారిశ్రామికం: రాణించింది

- జనవరిలో 7.5 శాతానికి

దిల్లీ: పారిశ్రామికం రాణించింది. అంతక్రితం ఏడాది జనవరిలో 3.5 శాతం వృద్ధి చెందిన పారిశ్రామికోత్పత్తి సూచీ(ఐఐపీ) ఈ ఏడాది జనవరిలో 7.5 శాతానికి పెరిగింది. తయారీ రంగం, వినియోగదారు, యంత్రపరికరాల వస్తువులు మంచి ప్రదర్శనను కనబరచడం ఇందుకు నేపథ్యం. డిసెంబరు 2017లో ఐఐపీ 7.1 శాతం మేర వృద్ధి నమోదు చేసిన విషయం తెలిసిందే.

- పారిశ్రామికోత్పత్తి సూచీ(ఐఐపీ)లో 77.63 శాతం వాటా ఉన్న తయారీ రంగం ఈ జనవరిలో 8.7 శాతం పెరిగి ఆర్థిక వ్యవస్థలో రికవరీ సంకేతాలను కనబరచింది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో వృద్ధి 2.5 శాతంగానే ఉంది.
- పెట్టుబడులకు గీటురాయిగా పరిగణించే యంత్ర పరికరాల రంగం 2018 జనవరిలో 14.6 శాతం వృద్ధి చెందగా.. 2017 జనవరిలో 0.6 శాతం క్షీణతను నమోదు చేసింది.
- మన్నికలేని వినియోగదారు వస్తువులు(ఎఫ్ఎమ్‌సీజీ) కూడా 10.5 శాతం వృద్ధి చెందింది. కిందటేడాది జనవరిలో ఇది 9.6 శాతం పెరిగింది.
- మన్నికైన వినియోగదారు వస్తువుల ఉత్పత్తి 2017 జనవరిలో 2% తగ్గగా.. ఈ సారి మాత్రం 8 శాతం పెరిగింది.
- కాగా, గనుల తవ్వకం కిందటేడాది జనవరిలో 8.6 శాతం మేర రాణించగా.. ఈ సారి మాత్రం 0.1 శాతమే పెరగడం గమనార్హం.




ఎయిర్‌టెల్ రూ.16,500 కోట్ల నిధుల సమీకరణ

దిల్లీ: టెలికాం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ భారీగా నిధుల సమీకరణ చేపట్టనుంది. రుణాల పునర్నిర్మాణం, స్పెక్ట్రమ్ చెల్లింపుల కోసం రూ.16,500 కోట్ల వరకు నిధుల సమీకరణకు కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. ప్రైవేట్ ప్లేస్‌మెంట్ పద్ధతిలో మార్పిడి రహిత డిబెంచర్ల (ఎన్‌సీడీలు) జారీ ద్వారా రూ.10,000 కోట్ల వరకు, విదేశీ కరెన్సీ బాండ్ల జారీ ద్వారా 1 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.6,500 కోట్లు) వరకు సమీకరించడానికి కంపెనీ బోర్డు అనుమతి ఇచ్చిందని ఎక్స్ఛేంజీలకు ఎయిర్‌టెల్ తెలిపింది. ఎన్‌సీడీల ద్వారా నిధుల సమీకరణను ఒకటి లేదా రెండు దఫాల్లో కంపెనీ చేపట్టనుంది. వీటిపై ఇచ్చే రేట్లను కాలానుగుణంగా మార్పులు చేస్తారు. రుణాలను పెంచుకునేందుకు తుది అనుమతి కోసం వాటాదార్లను ఎయిర్‌టెల్ కోరనుంది. డిసెంబరు 31 నాటికి కంపెనీ ఏకీకృత నికర రుణం రూ.91,714 కోట్లుగా ఉంది. అంతక్రితం త్రైమాసికంలో ఇది రూ.91,480 కోట్లుగా ఉంది.

14 ఏళ్ల కనిష్ఠానికి ఆంధ్రా బ్యాంకు షేరు!

- ఒక దశలో 15 శాతానికి పైగా నష్టం
- రూ.231 కోట్లు తగ్గిన మార్కెట్ విలువ
- స్టెర్లింగ్ బయో కేసులో తాజా పరిణామం
- మాజీ డైరెక్టర్‌పై అదనపు ఛార్జ్‌షీట్



ఈనాడు - హైదరాబాద్

ఆంధ్రా బ్యాంకు షేరు మదుపర్లకు చుక్కలు చూపించింది. సోమవారం ఒక దశలో 15 శాతానికి పైగా క్షీణించి దాదాపు 14 ఏళ్ల కనిష్ఠ స్థాయిని తాకింది. అయితే.. చివర్లో కాస్త కోలుకున్నా, మార్కెట్ విలువ రూ.231 కోట్ల మేరకు క్షీణించింది. మార్చి ఫ్యూచర్ కాంట్రాక్టులను ట్రేడర్లు భారీగా విక్రయించారు. గుజరాత్‌కు చెందిన స్టెర్లింగ్ బయోటెక్ కంపెనీ రుణాల రూపంలో దాదాపు రూ.5,000 కోట్ల మేరకు చేసిన కుంభకోణం కేసులో తాజాగా ఆంధ్రా బ్యాంకు మాజీ డైరెక్టర్ అనుప్ ప్రకాశ్ గార్గ్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అనుబంధ ప్రాసిక్యూషన్ కంప్లైంట్ (ఛార్జ్‌షీట్) దాఖలు చేయడంతో మార్కెట్‌లో బ్యాంకు షేరు భారీగా క్షీణించింది. గత ఏడాది అక్టోబరులో కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ఈ కేసు దాఖలు చేసింది. ఆంధ్రా బ్యాంకు ఆధ్వర్యంలో బ్యాంకుల కన్సార్షియం నుంచి స్టెర్లింగ్ బయోటెక్ రూ.5,000 కోట్లకు పైగా రుణాలను తీసుకుంది. ఆ తర్వాత ఈ ఖాతా నిరర్థక ఆస్తిగా మారింది. స్టెర్లింగ్ బయోటెక్‌కు అనుకూలంగా వ్యవహరించడానికి అనూప్ ప్రకాశ్ గార్గ్ రూ.1.5 కోట్లకు పైగా లంచం తీసుకున్నారని ఛార్జ్‌షీట్‌లో ఆరోపించారు. మనీ లాండరింగ్ చట్టం కింద ఛార్జిషీట్ దాఖలైంది. 2006 అక్టోబరు నుంచి 2009 అక్టోబరు మధ్య కాలంలో గార్గ్ ఆంధ్రాబ్యాంకు డైరెక్టరుగా పని చేశారు. గార్గ్‌ను అరెస్టు చేసి జుడీషియల్ కస్టడీలో ఉంచిన విషయం తెలిసిందే. గార్గ్‌కు చెందిన రూ.1.23 కోట్ల ఆస్తులను ఈడీ స్వాధీనం చేసుకున్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. స్టెర్లింగ్ బయోటెక్ కుంభకోణం, బ్యాంకుపై ప్రతికూల ప్రభావం చూపగలదన్న అంచనాలతో మదుపర్లు షేర్లను విక్రయించారు.

చివరకు 6.88% నష్టం..

సోమవారం ఒక దశలో ఆంధ్రా బ్యాంకు షేరు ధర 15 శాతానికి పైగా క్షీణించి రూ.32.55 కనిష్ఠ స్థాయిని తాకింది. క్రితం ముగింపు రూ.38.50తో పోలిస్తే.. బీఎస్ఈలో రూ.37 వద్ద ప్రారంభమైన షేరు ధర రూ.32.55-37.20 మధ్య కదలాడింది. చివరకు రూ.35.85 వద్ద ముగిసింది. అంటే రూ.2.65 (6.88%) నష్టపోయింది. బీఎస్ఈలో 44.43 లక్షల షేర్లు చేతులు మారాయి. ఎన్ఎస్ఈలో ఒక దశలో రూ.31.95 కనిష్ఠ స్థాయిని తాకిన షేరు, క్రితం ముగింపుతో పోలిస్తే 6.74 శాతం క్షీణించి రూ.35.95 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో 5.56 కోట్ల షేర్లు ట్రేడయ్యాయి. ఆంధ్రా బ్యాంకు మార్కెట్ విలువ సోమవారం రూ.231 కోట్ల మేరకు తగ్గి రూ.3,128.99 కోట్లకు పరిమితమైంది. 2018లో ఇప్పటి వరకూ ఆంధ్రా బ్యాంకు షేరు దాదాపు 41 శాతం నష్టపోయింది.

కొత్త ఫండ్లు మీకోసం

ఒకపక్క స్టాక్‌మార్కెట్లు ఊగిసలాటకు గురవుతున్నా.. చిన్న మదుపర్లు మ్యూచువల్ ఫండ్‌లపై సానుకూల ధోరణిని కనబరుస్తున్నారు. ఫిబ్రవరిలో ఈక్విటీల నుంచి విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐలు) రూ.11,000 కోట్లను వెనక్కి తీసుకోగా.. దేశీయ మదుపర్లు, మ్యూచువల్ ఫండ్ సంస్థలు మాత్రం నికర కొనుగోలుదార్లుగా నిలవడమే ఇందుకు నిదర్శనం. ఈ వారం కొత్తగా వచ్చిన ఫండ్‌లను ఒకసారి చూస్తే..



1 కోటక్ ఎఫ్ఎమ్‌పీ సిరీస్- 220 (1150 రోజులు)

- **ముగింపు తేదీ** : గురువారం (మార్చి 15)
- **విభాగం** : క్లోజ్- ఎండెడ్ రుణ పథకం
- **కేటాయింపులు** : 80-100% రుణ పథకాల్లో, 0- 20% మనీ మార్కెట్ పథకాల్లో
- **రిస్క్** : స్వల్పం
- **ప్రామాణిక సూచీ** : క్రిసిల్ కాంపోజిట్ బాండ్ ఫండ్
- **ప్లాన్‌లు** : రెగ్యులర్, డైరెక్ట్
- **ఆప్షన్‌లు** : గ్రోత్, డివిడెండ్
- **కనీస దరఖాస్తు** : రూ.5000, ఆ తర్వాత రూ.10 చొప్పున ఎంతైనా జతచేసుకోవచ్చు
- **ఎగ్జిట్ లోడ్** : లేదు
- **ఫండ్ మేనేజర్** : దీపక్ అగర్వాల్

2 ఫ్రాంక్లిన్ ఇండియా ఫిక్స్‌డ్ మెచ్యూరిటీ ప్లాన్స్- సిరీస్ 3 - ప్లాన్ సి

- **ముగింపు తేదీ** : నేడు (మార్చి 13)
- **విభాగం** : క్లోజ్- ఎండెడ్ రుణ పథకం
- **కేటాయింపులు** : 80-100% రుణ పథకాల్లో, 0- 20% మనీ మార్కెట్ పథకాల్లో
- **రిస్క్** : స్వల్పం
- **ప్రామాణిక సూచీ** : క్రిసిల్ కాంపోజిట్ బాండ్ ఫండ్
- **ప్లాన్‌లు** : రెగ్యులర్, డైరెక్ట్
- **ఆప్షన్‌లు** : గ్రోత్, డివిడెండ్
- **కనీస దరఖాస్తు** : రూ.5000, ఆ తర్వాత రూ.1 చొప్పున ఎంతైనా జతచేసుకోవచ్చు
- **ఎగ్జిట్ లోడ్** : లేదు
- **ఫండ్ మేనేజర్** : ఉమేశ్ శర్మ, సచిన్ పడ్వాల్ దేశాయ్

3 యుటీఐ- ఫిక్స్‌డ్ టెర్మ్ ఇన్‌కమ్ ఫండ్ సిరీస్ (1134 రోజులు)

- **ముగింపు తేదీ** : మార్చి 26
- **విభాగం** : క్లోజ్- ఎండెడ్ రుణ పథకం
- **కేటాయింపులు** : 80% రుణ పథకాల్లో, 20% మనీ మార్కెట్ పథకాల్లో
- **రిస్క్** : స్వల్పం
- **ప్రామాణిక సూచీ** : క్రిసిల్ కాంపోజిట్ బాండ్ ఫండ్
- **ప్లాన్‌లు** : రెగ్యులర్, డైరెక్ట్
- **ఆప్షన్‌లు** : గ్రోత్, డివిడెండ్
- **కనీస దరఖాస్తు** : రూ.5000, ఆ తర్వాత రూ.10 చొప్పున ఎంతైనా జతచేసుకోవచ్చు
- **ఎగ్జిట్ లోడ్** : లేదు
- **ఫండ్ మేనేజర్** : సునీల్ పాటిల్

మరోవైపు కొన్ని మ్యూచువల్ ఫండ్ సంస్థలు ఈ వారం డివిడెండ్‌లను ప్రకటించాయి. అవేంటో చూస్తే..

పథకం	ఆప్షన్	ప్లాన్‌లు	డివిడెండు (యూనిట్‌కు)	రికార్డు తేదీ
ఐడీఎఫ్‌సీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్	డివిడెండ్	రెగ్యులర్	రూ.1.08	మార్చి 15
ఐడీఎఫ్‌సీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్	డివిడెండ్	డైరెక్ట్	రూ.0.3667	మార్చి 15
ఎల్ఐసీ ఎంఎఫ్ మిడ్‌క్యాప్ ఫండ్	డివిడెండ్	రెగ్యులర్, డైరెక్ట్	రూ.0.150	మార్చి 15
ఎల్ఐసీ ఎంఎఫ్ ట్యాక్స్ ప్లాన్	డివిడెండ్	రెగ్యులర్, డైరెక్ట్	రూ.0.5	మార్చి 15
ఎల్ఐసీ ఎంఎఫ్ గ్రోత్ ఫండ్	డివిడెండ్	రెగ్యులర్, డైరెక్ట్	రూ.0.275	మార్చి 15
హెచ్‌డీఎఫ్‌సీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్	డివిడెండ్	రెగ్యులర్, డైరెక్ట్	రూ.1.75	మార్చి 15
హెచ్‌డీఎఫ్‌సీ ట్యాక్స్‌సేవర్	డివిడెండ్	రెగ్యులర్, డైరెక్ట్	రూ.7	మార్చి 15

ఐషర్- పొలారిస్ సంయుక్త సంస్థ రద్దు

దిల్లీ: అమెరికాకు చెందిన పొలారిస్ ఇండస్ట్రీస్‌తో కలిసి ఏర్పాటు చేసిన సంయుక్త సంస్థ (జేవీ) ఐషర్ పొలారిస్‌ను మూసివేస్తున్నట్లు ఐషర్ మోటార్స్ ప్రకటించింది. వ్యక్తిగత వినియోగ వాహనం మల్టీక్స్ తయారీ, అమ్మకాల నిమిత్తం అయిదేళ్ల కిందట ఈ సంయుక్త సంస్థ ఏర్పాటైంది. అయితే మల్టీక్స్ అమ్మకాలు ఆశించిన రీతిలో జరగలేదు. ఈ నేపథ్యంలో సంయుక్త సంస్థ కార్యకలాపాలను తక్షణమే ఆపివేయడానికి ఐషర్ పొలారిస్ (ఈపీపీఎల్) బోర్డు నిర్ణయం తీసుకుంది. ఈపీపీఎల్ బోర్డు సమావేశం 9న జరిగిందని ఐషర్ మోటార్స్ తెలిపింది.

మీ ఆస్తులన్నీ వెల్లడించండి

- యునిటెక్‌కు సుప్రీంకోర్టు ఆదేశం

దిల్లీ: యునిటెక్ ఆస్తులన్నీ 15 రోజుల్లోగా వెల్లడించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇళ్ల కోసం డబ్బులు చెల్లించిన వారికి, నిధులు వాపసు ఇచ్చేందుకు సదరు ఆస్తులను వేలం వేయాలని పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలో న్యాయమూర్తులు ఏఎం ఖాన్‌విల్కర్, డీవై చంద్రచూడ్‌లతో కూడిన బెంచ్ ఈ వ్యాఖ్యలు చేసింది. యునిటెక్‌కు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఇచ్చిన రుణాల్లో కొన్నింటిని స్వాధీనం చేసుకున్న జేఎం ఫైనాన్షియల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఏఆర్‌సీ)కి రూ.25 లక్షల జరిమానాను బెంచ్ విధించింది.

మార్కెట్ కబుర్లు

- అన్ని వ్యాపార విభాగాల్లో కలిపి రూ.2,597 కోట్ల విలువైన ఆర్డర్లను తమ నిర్మాణ విభాగం దక్కించుకుందని **ఎల్ అండ్ టీ** ప్రకటించింది.
- మహారాష్ట్ర స్టేట్ ఎలక్ట్రిసిటీ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ నుంచి 75 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్ట్ అభివృద్ధి ఆర్డరును బిడ్ ద్వారా **సుజ్లాన్** దక్కించుకుంది.
- యూరోనెక్స్ట్ పారిస్, యూరోనెక్స్ట్ లండన్ ఎక్స్ఛేంజీల నుంచి తమ అమెరికన్ డిపాజిటరీ షేర్లు (ఏడీఎస్)ను స్వచ్ఛందంగా డీలిస్ట్ చేయనున్నట్లు ఐటీ దిగ్గజం **ఇన్ఫోసిస్** తెలిపింది. అయితే న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజీలో తమ ఏడీఎస్ కొనసాగుతుందని వెల్లడించింది.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.908.48 కోట్ల మధ్యంతర డివిడెండును **నాల్కో** ప్రకటించింది. ఇందులో భాగంగా రూ.546.95 కోట్ల విలువైన చెక్‌ను ప్రభుత్వానికి కంపెనీ సీఎండీ తపన్ కుమార్ చంద్ అందించారు.
- గోరఖ్‌పూర్‌లోని న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్లాంట్‌కు స్టీమ్ జెనరేటర్ల సరఫరా నిమిత్తం రూ.736 కోట్ల ఆర్డరును **భెల్** దక్కించుకుంది.
- **అవంతీ ఫీడ్స్‌**లో రూ.1,047.20 కోట్ల విలువైన 10 శాతం వాటాను బహిరంగ మార్కెట్ లావాదేవీ ద్వారా థాయ్ యూనియన్ గ్రూప్ పబ్లిక్ కంపెనీ విక్రయించింది.
- తమ గ్రూప్ సంస్థ టీసీఎస్‌లో 1.48 శాతం వాటాకు సమానమైన 2.83 కోట్ల షేర్లను విక్రయించడం ద్వారా దాదాపు రూ.8,200 కోట్లను **టాటా సన్స్** సమీకరించనుందని ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ వర్గాల సమాచారం.
- రుణ సెక్యూరిటీలను ఒకటి లేదా పలు దఫాల్లో విక్రయించడం ద్వారా రూ.8000 కోట్ల వరకు సమీకరించడానికి పంజాబ్ నేషనల్ బ్యాంక్ అనుబంధ సంస్థ **పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్** యత్నిస్తోంది.
- వాట్సాప్‌లో త్రైమాసిక ఫలితాల లీకేజీకి సంబంధించి అంతర్గత దర్యాప్తు చేపట్టాల్సిందిగా **బాటా ఇండియా**ను సెబీ ఆదేశించింది. వ్యవస్థలను బలోపేతం చేయాల్సిందిగా సూచించింది.
- అర్హులైన సంస్థాగత మదుపర్ల (క్యూఐపీ)కు సెక్యూరిటీల జారీ ప్రతిపాదనను శుక్రవారం **జిందాల్ స్టీల్ అండ్ పవర్** బోర్డు పరిశీలించనుంది.


ఎంఎస్ఎంఈలు పూర్తిగా కోలుకోలేదు

ట్రాన్స్‌యూనియన్ సిబిల్, సిడ్బీ నివేదిక

ముంబయి: పెద్దనోట్ల రద్దు, వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) అమలు వల్ల తలెత్తిన పరిస్థితుల నుంచి సూక్ష్మ, చిన్న, మధ్యస్థాయి సంస్థలు (ఎంఎస్ఎంఈ) పూర్తిగా కోలుకోలేదని ట్రాన్స్‌యూనియన్ సిబిల్, సిడ్బీ నివేదిక పేర్కొంది. ఆర్థిక వ్యవస్థ చాలావరకు కోలుకున్నా, రూ.10 లక్షల లోపు రుణాలు తీసుకున్న ఎంఎస్ఎంఈలు ఇంకా ఇబ్బంది పడుతూనే ఉన్నాయని తెలిపింది. రూ.10 లక్షలు-10 కోట్ల వరకు రుణాలు తీసుకున్న సంస్థలు, పెద్దనోట్ల రద్దుకు ముందు స్థాయికి చేరాయని వివరించింది. రూ.50 లక్షలకు మించి రుణాలు తీసుకున్న సంస్థలు అన్ని రంగాల్లో పూర్వస్థాయికి చేరాయని పేర్కొంది. సంఘటిత ఆర్థిక వ్యవస్థల నుంచి వివిధ సంస్థలు, వ్యక్తులకు అందిన మొత్తం రుణాలు రూ.100 లక్షల కోట్లు కాగా, ఇందులో ఎంఎస్ఎంఈలకు చేరింది రూ.11.75 లక్షల కోట్లు. 5 కోట్ల ఎంఎస్ఎంఈలలో 50 లక్షల సంస్థలకే సంఘటిత ఆర్థిక సంస్థల నుంచి రుణాలు అందుతున్నాయి.

12న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)



కోడిగుడ్లు			
హైదరాబాద్	330	వరంగల్	332
చిల్లరగా (ఒక గుడ్డు)	3.90	విశాఖపట్నం	332
బెంగళూరు	365	చెన్నై	370
13వ తేదీకి...		చిత్తూరు	362
విజయవాడ/గోదావరి	322	నమక్కల్	360

ఎన్ఎస్ఈ

సోమవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 386.60 (377.90) 3693431
AMBUJA CEMEN 240.85 (235.40) 1926518
ASIAN PAINTS 1131.50 (1129.10) 527293
AUROBIND PHA 582.85 (592.45) 2692769
AXIS BANK LT 519.20 (505.35) 5283334
BAJAJ AUTO L 2957.75 (2935.40) 246428
BAJAJ FINANC 1665.25 (1654.20) 486187
BHARTI AIRTE 421.55 (402.15) 7558993
BHARTI INFRA 339.50 (333.15) 6680146
BOSCH LTD 18247.45 (18203.55) 8342
BPCL 446.75 (439.40) 2541996
CIPLA 580.65 (571.05) 919792
COAL INDIA L 297.65 (304.05) 6796993
DR. REDDYS 2148.40 (2129.90) 530428
EICHER MOTOR 28316.90 (27963.85) 23032
GAIL 446.45 (436.90) 1934480
HCL TECH 967.65 (943.00) 2473118
HDFC 1858.05 (1818.60) 3242604
HDFC BANK 1867.25 (1851.05) 1639279
HERO MOTOCOR 3694.50 (3586.35) 192336
HINDALCO IND 227.65 (220.20) 9531278
HINDUSTAN UN 1324.20 (1300.75) 874857
HPCL 366.75 (357.05) 1930082
ICICI BANK 300.65 (292.70) 12163952
INDIABULLS H 1210.45 (1199.20) 1406491
INDIAN OIL 400.65 (385.50) 13848992
INDUSINDBANK 1735.30 (1697.55) 858788
INFOSYS LTD 1185.75 (1163.40) 3838485
ITC 270.10 (259.25) 19900387
KOTAK MAHIND 1100.60 (1082.45) 1255474
LARSEN & TOU 1310.05 (1290.50) 2267260
LUPIN 769.80 (764.50) 1174238
M&M 737.10 (728.50) 1867680
MARUTI SUZIK 8810.30 (8660.60) 438339
NTPC LTD 171.15 (164.40) 2911168
ONGC 183.85 (179.90) 4161129
POWER GRID C 195.00 (192.90) 8011688
RELIANCE IND 930.30 (913.10) 3801407
SBI 252.85 (253.25) 25332474
SUN PHARMA 512.65 (506.80) 4632925
TATA CONSULT 3052.15 (3034.10) 1045670
TATA MOTORS 352.60 (341.50) 8238960
TATA STEEL L 622.90 (606.75) 12193581
TECH MAHINDR 619.55 (619.20) 4336200
ULTRATECH 4176.00 (4079.85) 102681
UPL LIMITED 717.95 (712.15) 944809
VEDANTA LIMI 317.40 (304.15) 11167602
WIPRO 290.70 (285.05) 1746849
YES BANK LTD 311.15 (303.25) 12860205
ZEE ENTERTAI 576.25 (568.50) 894309

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1433.60 (1437.70) 16143
ACC 1559.90 (1531.85) 270932
ASHOK LEYLAN 145.40 (147.00) 17320780
AVENUE SUPER 1315.65 (1306.55) 524560
BAJAJ FINSER 5040.05 (4966.25) 107704
BANK OFBAROD 132.10 (131.55) 13816607
BEL 150.15 (148.45) 4718909
BHEL 86.95 (86.15) 9123597
BRITANNIA 4866.80 (4841.80) 73006
CADILA HEALT 389.30 (384.20) 574306
COLGATE PALM 1043.95 (1037.65) 211717
CONTAINER 1238.25 (1248.70) 153267
CUMMINS INDI 776.20 (776.75) 107217
DABUR INDIA 327.75 (327.25) 1508106
DLF LIMITED 217.70 (211.35) 6107809
EMAMI LIMITE 1061.55 (1084.50) 105102
GLAXOSMI CON 6836.65 (6626.75) 11245
GLAXOSMI PHA 2256.15 (2272.80) 8479
GLENMARK PHA 536.65 (533.15) 723438
GODREJ CONSU 1078.60 (1072.85) 232726
HAVELLS INDI 505.20 (503.25) 744387
HINDUSTAN ZI 318.85 (313.30) 3756718
ICICI PRU LI 385.90 (390.50) 782272
IDEA CELLULR 78.50 (78.85) 11486493
INTERGLOBE A 1276.70 (1289.60) 696943
JSW STEEL LT 297.85 (291.95) 4186325
LIC HOUS.FIN 492.55 (483.30) 2756313
MARICO LIMIT 309.45 (308.60) 444257
MCDOWELL 3134.10 (2978.25) 777077
MOTHERSON 319.20 (317.15) 1843613
MRF 71094.20 (70781.65) 3757
NHPC LTD 26.65 (26.85) 5347073
NMDC LTD 123.75 (121.90) 3630215
OIL INDIA 326.70 (320.85) 300758
ORACLE FIN S 3934.35 (3892.10) 15476
P&G HYG&HEAL 9402.45 (9402.70) 1262
PETRONET LNG 231.00 (230.70) 4320480
PIDILITE IND 890.25 (878.70) 520945
PIRAMAL ENTE 2415.55 (2362.60) 120392
PNB 94.60 (95.60) 45021305
POWER FIN CO 88.25 (93.10) 12617836
RURAL ELEC C 126.45 (128.15) 4390077
SAIL 72.35 (69.50) 19443718
SHREE CEMENT 16151.50 (16000.75) 17193
SHRIRAM TRAN 1343.70 (1338.70) 1208005
SIEMENS 1106.85 (1085.80) 78009
SUN TV LTD 893.00 (879.30) 1531117
TATA POWER 80.85 (80.00) 3328605
TITAN IND 829.10 (819.10) 1033715
TORRENT PHAR 1311.85 (1329.80) 487366

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

AMAR RAJA BA 812.95 (793.50) 21775
ANDHRA BANK 35.85 (38.50) 4443299
ANDHRA CEMEN 9.70 (10.13) 38070
ANDHRA PAPER 297.80 (289.65) 9406
ANDHRA PETRO 58.90 (57.65) 77120
ANDHRA SUGAR 456.95 (437.90) 9967
ASTRA MICROW 86.25 (85.05) 59726
AUROBINDO PH 582 (592.45) 741253
AVANTEL SOFT 546.60 (524) 6046
AVANTI FEEDS 2281.70 (2357.70) 4428133
BALAJI AMIN 572.50 (576) 8763
BARTRONICS 12.03 (11.80) 7274
BHAGYA NAG 45.30 (47.15) 31143
BN RATHI SEC 39.55 (39.05) 27468
BRILLIANT SE 8.70 (8.71) 182949
COROMAN FERT 506.65 (510.20) 8385
CUBEX TUB 22.70 (23.75) 6336
CYBERMATE 3.03 (2.83) 22569
CYIENT LIMIT 624.50 (621.90) 20396
DIVI'S LAB 1010.70 (996.45) 15286
DR REDDY 2147.10 (2130.45) 30666
GATI CORPN 101.15 (100.95) 113338
GAYATRI PROJ 206.20 (201.35) 6443
GMR INFRASTR 17.40 (17.10) 3155901
GOLDST INFRA 196.35 (197.05) 8453
GRANULES (I) 108.60 (107.20) 80288
GSS AMERICA 55.75 (55.95) 354993
GVK POWER 15.35 (14.65) 477316
HBL NIFE POW 48.25 (49.60) 70851
IKF SOFT 0.61 (0.62) 68602
ILFS ENGINEE 36.80 (37.30) 20253
INNAREDY COM 3.25 (3.10) 8384
IVRCL INFRAS 3.76 (3.90) 336725
KAKATIYA CEM 264.05 (268.65) 7548
KALLAM SPG 31.30 (31.50) 24098
KAVERI SEED 483.15 (479.90) 26030
KCP LTD 115.90 (117.25) 9596
KERNEX MICRO 37.25 (38.20) 17542
KNR CONSTRUC 294.35 (295) 7931
LANCO INDUS 322.25 (319) 33574
LANCO INFRAT 1.01 (1.06) 818530
LOKESH MACH 58.25 (58.65) 25129
MADHUCON PRO 24.05 (23.95) 21982
MEGA SOFT 12.11 (12.61) 13882
MIC ELECTRON 6.42 (6.12) 57574
MOLD-TEK.TEC 53.85 (55.50) 400448
MOLDTK PLA 317.95 (319.05) 7734
NAGARJAGRICH 41.15 (38.80) 45523
NATCO PHARMA 729.55 (721.05) 45601
NAVA BH VENT 143.30 (146.80) 10961
NCC 122.80 (117.95) 755943
NCL IND 222.60 (219.05) 12645
NEHA INTER 6.57 (6.59) 50147
NETTLINX 75.15 (80.40) 12116
NIHAR INFO 12.86 (12.25) 1002
NILE 699.10 (726.95) 9234
OIL COUNTRY 37.05 (37.70) 10442
PANYAM CEMEN 42.45 (44.05) 18075
PENNER IND 55.80 (55.25) 38567
PHYTOCHEM I 61.85 (60.90) 5986
PITTI LAMIN 86.10 (86.70) 4243
PL ENTERPRI 2.36 (2.36) 1
POKARNA 193.15 (198.20) 3778
PRAJAY ENGS 12.51 (13.05) 10257
PREMIER EXPL 364.50 (361) 458
PRISM CEMENT 116.40 (115.90) 72722
PRUDENTL PHA 3.91 (3.89) 224987
RAGSAN PETRO 62 (62) 675
RAIN INDUSTR 392.45 (388.50) 389140
RAJ PACKAGIN 41.30 (35.10) 34757
SAGAR CEM 934.55 (921.80) 5679
SAMKRG PIST 291.10 (290.80) 9430
SATVAH. ISPA 20.10 (19.95) 3906
SMS PHARMA 77.40 (76.25) 7393
SOUTH BIO TE 2.62 (2.70) 3985
SPHERE GLOBA 35.65 (36.25) 2247
SREE RAYAL A 50.70 (51.85) 146292
SRINIVASA SH 60 (58) 6526
STEEL EXCHAN 24.70 (24.40) 32750
SUJANA METAL 1.27 (1.29) 43331
SUJANA UNIVE 0.77 (0.81) 156117
SURANA TELE 4.95 (4.90) 4865
SURYALAKSH.C 72.05 (73) 102979
SUVEN PHARMA 178.70 (176.85) 58158
TAJ GVK HOTE 154.80 (151.70) 2831
TANLA 33.15 (33.45) 77698
TERA SOFTWAR 50.20 (48.90) 3653
TRANS BIOTEK 2.25 (2.35) 27356
TRENDY KNIT 0.27 (0.27) 3000
VICEROY HOTE 13.95 (14) 16391
VIJAY TEXTIL 43.10 (45.30) 8179
VIMTA LABS 199.45 (194.35) 2338
VISAKA IND 663.15 (639) 8013
VISTA PHARMA 42.50 (42.65) 43167
VIVIMED LABS 75.45 (71.90) 169050
XL TELENE 2.50 (2.49) 3031
YBRANT DIGIT 5.04 (4.99) 228035
ZENOTECH LAB 39.55 (37.70) 68009
ZENTECH 133 (132.45) 100059

ఎన్నాళ్లో వేచిన లాభం

611 పాయింట్లు దూసుకెళ్లిన సెన్సెక్స్

- రెండేళ్లలో అత్యధిక ఒక రోజు లాభం ఇది
- దాదాపు 200 పాయింట్లు కొల్లగొట్టిన నిఫ్టీ
- కలిసొచ్చిన అమెరికా పరిణామాలు
- ద్రవ్యోల్బణం, ఐఐపీపై అంచనాలు సైతం



చింత చిగురు కోసం వెళితే.. చందమామ దొరికినట్లు..
ఒక మ్యాచ్ గెలవడానికి వెళ్లి.. ఛాంపియన్ అయినట్లు..
ప్యూన్ ఉద్యోగానికెళితే.. సీఈఓ కుర్చీ ఎదురైనట్లు..
జూనియర్ ఆర్టిస్టవుతామనుకుంటే.. హీరో వేషం వచ్చినట్లు..
ఎడారిలో గుక్కెడు నీళ్లకోసం వెళితే.. ఒయాసిస్సు ఎదురైనట్లు..

నెల రోజులకు పైగా అరకొర లాభాలు, నష్టాలు చవిచూసిన మదుపరికి సోమవారం సరిగ్గా అలాంటి అనుభూతే కలిగింది.

రెండేళ్లుగా ఒక రోజులో భారీ లాభాలే దక్కని వారికి గొప్ప ఊరట అనేది చిన్న పదంగానే అనిపించవచ్చు.

ఎందుకంటే బడ్జెట్ తరవాత పెద్ద ర్యాలీల జోలికి వెళ్లని దేశీయ మార్కెట్లు.. ఇప్పుడు జోరును ప్రదర్శించాయి.

అమెరికా ఆర్థిక వ్యవస్థపై నమ్మకం కుదరడంతో అంతర్జాతీయ మార్కెట్లు లాభాల్లోకి వెళ్లడంతో, మన బుల్ సైతం సగర్వంగా వారం రోజుల శిఖరాగ్రాన నిలిచింది.

ఈ మూడే లాభాలిచ్చాయి

1 అందివచ్చిన అమెరికా

అమెరికా ఆర్థిక వ్యవస్థ ఆశావహం వైపు నడవడం అంతర్జాతీయంగా మార్కెట్లకు ఊరటనిచ్చిందని చెప్పాలి. అంతర్జాతీయ వాణిజ్య యుద్ధమేఘాలు కొద్దిగా వైదొలగినట్లు కనిపించింది. అక్కడి ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ముందుకు వెళుతుందనడానికి నిదర్శనంగా ఉద్యోగ గణాంకాలు పెరిగాయి. దీంతో అంతర్జాతీయ వాణిజ్యం కూడా రాణిస్తుందన్న విశ్వాసంతో ప్రపంచ వ్యాప్త సూచీలు పెరిగాయి.

2 ఆసియా, ఐరోపా మార్కెట్ల ర్యాలీ

గత వారం ర్యాలీని ఆసియా, ఐరోపా మార్కెట్లు కొనసాగించాయి. అమెరికా నుంచి వచ్చిన సానుకూల ఉద్యోగ నివేదికతోనే ఇది సాధ్యమైంది. స్థానిక సెంటిమెంటు బలంగా ఉండడంతో ఆసియా సూచీలు రాణించాయని చెప్పాలి. వాణిజ్య యుద్ధ మేఘాల స్థానంలో ఆర్థిక ఆశావహ దృక్పథం రావడం ఇందుకు కారణమని బ్రోకరేజీ సంస్థలు పేర్కొన్నాయి.

3 దేశీయంగానూ..

వాణిజ్య యుద్ధం సడలించినట్లు అనిపించడంతో దేశీయంగా ఫండ్ కొనుగోళ్లు రాణించాయి. రిటైలర్లు ముందడుగు వేశారు లోహ షేర్లలో ఆ విషయం స్పష్టంగా కనిపించింది. ఆ సూచీ 2.32% లాభపడింది. వేదాంతా, జిందాల్ స్టీల్, సెయిల్, హిందాల్కో, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, నాల్కో, ఎన్ఎమ్‌డీసీ, హిందుస్థాన్ జింక్‌లు 4.43% దాకా ముందుకెళ్లాయి. ద్రవ్యోల్బణం, ఐఐపీ గణాంకాల మీద సానుకూల అంచనాలు కూడా కలిసొచ్చాయి.

నేడూ.. అదే జోరు!

అమెరికాపై ఆశావహ దృక్పథంతో సోమవారం అంతర్జాతీయంగా పరుగులు పెట్టిన ప్రభావం.. నేడూ ఉండొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఫిబ్రవరి నెల రిటైల్ ద్రవ్యోల్బణం 4.44 శాతానికి పరిమితం కావడం, జనవరి నెల పారిశ్రామికోత్పత్తి సూచీ 7.5 శాతం పెరగడం కూడా కలిసిరావొచ్చని అంటున్నారు. నిఫ్టీ 10450 స్థాయిని అధిగమిస్తే మాత్రం 10600 స్థాయిని పరీక్షించే అవకాశం ఉందని బ్రోకరేజీ సంస్థ ఒకటి అంటోంది. 10320 వద్ద తక్షణ మద్దతును దొరకబుచ్చుకోవచ్చని అంచనా వేస్తోంది. యూరోనెక్స్ట్ పారిస్, లండన్ ఎక్స్ఛేంజీల నుంచి తన అమెరికన్ డిపాజిటరీ షేర్లను ఇన్ఫోసిస్ స్వచ్ఛందంగా డీలిస్ట్ చేసుకుంటున్న నేపథ్యంలో ఆ షేర్లపై మదుపర్లు దృష్టి కేంద్రీకరించవచ్చని అంటున్నారు.

ఎలా పరుగులు తీసిందంటే..

బీఎస్ఈ సెన్సెక్స్ ప్రారంభంలోనే సెంచరీ కొట్టింది. అంతక్రితం రోజుతో పోలిస్తే 33468.16 వద్ద మొదలై 100 పాయింట్లకు పైగా లాభాన్ని పొందింది. అనంతరం దేశీయ ఫండ్‌ల కొనుగోళ్లకు తోడు, రిటైల్ మదుపర్ల అండ కొనసాగడంతో, లాభాలు పెరుగుతూ పోయాయి. ఒక దశలో 33962.48 వద్ద గరిష్ఠ స్థాయికి చేరింది సెన్సెక్స్. అంతక్రితం ముగింపు 33307.14తో పోలిస్తే 655 పాయింట్ల లాభమన్నమాట. చివరి నిమిషాల్లో కొంత లాభం కోల్పోయినప్పటికీ.. చివరకు 610.55 పాయింట్ల లాభంతో సెన్సెక్స్ వారం రోజుల గరిష్ఠ స్థాయి అయిన 33,917.94 పాయింట్ల వద్ద సగర్వంగా ముగిసింది. మార్చి 1, 2016న సెన్సెక్స్ పొందిన 777.35 పాయింట్ల ఒక రోజు లాభం తరవాత, వచ్చిన గరిష్ఠ లాభం ఇదే కావడం గమనార్హం. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీలో ప్రధాన సూచీ అయిన నిఫ్టీ సైతం ద్విశతకం చేరువగా లాభాన్ని పొందింది. 194.55 పాయింట్ల లాభంతో 10,421.40 వద్ద స్థిరపడింది. ఒక దశలో 10,433.65 వద్ద గరిష్ఠ స్థాయినీ పొందింది.

రాణించిన భారతీ, ఐటీసీ

రుణ పునర్నిర్మాణం కోసం రూ.16,500 కోట్ల నిధులను సమీకరించడానికి కంపెనీ బోర్డు ఆమోదం తెలిపిన నేపథ్యంలో భారతీ ఎయిర్‌టెల్ షేరు దూసుకెళ్లింది. సెన్సెక్స్ షేర్లలో అత్యధికంగా 4.68 శాతం పెరిగి రూ.420.75 వద్ద ముగిసింది. జీఎస్‌టీ మండలి సిగరెట్లపై సెస్సు మార్పు చేయకపోవడంతో ఐటీసీ స్క్రిప్ 4.09 శాతం లాభంతో రూ.270 వద్ద స్థిరపడింది. ఎన్‌టీపీసీ జారీ చేయబోయే ప్రతిపాదిత అన్‌సెక్యూర్డ్ డాలర్ల నోట్లకు మూడీఎస్ బీఏఏ2 రేటింగ్ ఇవ్వడంతో ఎన్‌టీపీసీ షేరు 4.33% హెచ్చి రూ.171 వద్దకు చేరింది. ఇన్ఫోసిస్, రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌యూఎల్, ఎల్ అండ్ టీ, సన్ ఫార్మా, కోటక్ బ్యాంక్, డాక్టర్ రెడ్డీస్‌లు సైతం 0.78-1.93% మేర రాణించి సూచీల లాభాలకు కారణమయ్యాయి.

గేరు మార్చిన వాహన షేర్లు

ఫిబ్రవరిలో దేశీయ ప్యాసింజరు వాహనాల విక్రయాలు 7.77% పెరిగి 2,75,329కు చేరాయన్న వార్తల నేపథ్యంలో వాహన షేర్లు సైతం రాణించాయి. టాటా మోటార్స్ 3.07% లాభంతో రూ.352.20 వద్ద స్థిరపడగా.. హీరో మోటోకార్ప్, మారుతీ సుజుకీ, ఎం అండ్ ఎం, బజాజ్ ఆటోలు వరుసగా 2.75%, 1.69%, 1.02% ; 0.75% చొప్పున పరుగులు తీశాయి.

మధ్య, చిన్న స్థాయి షేర్లలో కూడా కొనుగోళ్లు కనిపించాయి. చమురు-గ్యాస్, ఎఫ్ఎమ్‌సీజీ, విద్యుత్, బ్యాంకింగ్, మౌలిక, టెక్నాలజీ, వాహన, యంత్ర పరికరాలు, పీఎస్‌యూ, ఆరోగ్య సంరక్షణ, స్థిరాస్తి సూచీలు సైతం 2.13% వరకు రాణించాయి.

ఇతర షేర్లు సైతం(రూ.లలో)

కంపెనీ	ముగింపు(లాభం%లో)
టాటా స్టీల్	622.70(2.82)
యాక్సిస్ బ్యాంక్	519.20(2.74)
ఐసీఐసీఐ బ్యాంక్	300.70(2.73)
యెస్ బ్యాంక్	311.45(2.64)
అదానీ పోర్ట్స్	386.05(2.32)
ఓఎన్‌జీసీ	183.65(2.23)
ఇండస్ఇండ్ బ్యాంక్	1733.55(2.09)
హెచ్‌డీఎఫ్‌సీ	1854.95(2.01)

ఐడీబీఐ, కోల్ ఇండియాలకు నష్టాలు

కుంభకోణాలు, అప్పుల నేపథ్యంలో మదుపర్లు బ్యాంకుల షేర్లకు దూరంగా నిలిచారు. ముఖ్యంగా ఆంధ్రాబ్యాంక్ షేరు ఒక దశలో 14% తగ్గి 14 ఏళ్ల కనిష్ఠ స్థాయి అయిన రూ.33.20 వద్దకు చేరింది. చివరకు 6.88% నష్టంతో సరిపుచ్చుకుని రూ.35.85 వద్ద ముగిసింది. ఐడీబీఐ బ్యాంక్ సైతం ఒక దశలో 12% పైగా నష్టపోయి.. చివరకు 8.49% నష్టంతో రూ.64.70 వద్దకు చేరింది. కోల్ ఇండియా మధ్యంతర డివిడెండు అంచనాల కంటే తక్కువగా ఉండడంతో 2% నష్టపోయిన ఆ షేరు రూ.297.80 వద్ద స్థిరపడింది.

రూ.34,000 కోట్లకు గండి!

9 నెలల్లో జీఎస్‌టీ ఎగవేతలు

దిల్లీ: జీఎస్‌టీ అమల్లోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే భారీ స్థాయిలో పన్ను ఎగవేతలను పన్ను అధికారులు గుర్తించారు. ప్రభుత్వ ఆదాయానికి దాదాపు రూ.34,000 కోట్ల వరకు గండికొట్టినట్లు తెలుస్తోంది. జులై నుంచి డిసెంబరు మధ్య దాఖలైన రిటర్న్‌ల ప్రాథమిక విశ్లేషణలో పై విషయం వెల్లడైంది. ప్రధానంగా దిగుమతి లావాదేవీ వ్యవహారాల్లో పన్ను ఎగవేతలు ఎక్కువగా ఉన్నట్లు తేలింది. దిగుమతి చేసుకున్న వస్తువు అమ్మకం విలువను బిల్లులో తక్కువగా చూపించడం ద్వారా కొందరు ఆ మేరకే పన్ను చెల్లించారు. ఇలా ప్రతిసారీ అమ్మకం సమయంలో తక్కువ పన్ను చెల్లించుకుంటూ వచ్చారు. తద్వారా వాస్తవంగా కట్టాల్సిన దాని నుంచి తప్పించుకున్నారు. ప్రాథమిక విశ్లేషణ ప్రకారం ఐజీఎస్‌టీ చెల్లించేవాళ్లు 73,000 మంది కాగా.. రూ.30,000 కోట్ల వరకు పన్ను చెల్లిస్తున్నారు. అయితే రీఫండ్‌ను క్లెయిమ్ చేసుకోలేదు. మరోవైపు 33,000 మంది వాస్తవ చెల్లింపు కంటే రూ.10,000 కోట్లు ఎక్కువగా క్లెయిమ్ చేసుకున్నారు.

సుంకం నుంచీ పిండుకున్నారు..: దిగుమతిదార్లు సాధారణంగా అనుసంధానిత వస్తు, సేవల పన్నును చెల్లిస్తుంటారు. అంత్య వినియోగదారు చెల్లించే జీఎస్‌టీకి లేదంటే క్లెయిమ్ కింద పొందిన రీఫండ్ మొత్తంతో ఈ పన్ను చెల్లింపును సర్దుబాటు చేయాలి. అయితే పెద్దకంపెనీలు సహా దిగుమతిదార్లు ఐజీఎస్‌టీని చెల్లిస్తున్నప్పటికీ, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌కు క్లెయిమ్ చేసుకోవడం లేదనే విషయం తేలింది. బిల్లు లేకుండానే దేశంలోకి వస్తువులను దిగుమతి చేసినట్లు అనుకోవాల్సిన పరిస్థితిని ఇది కల్పిస్తోందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. విలాసవంత, హానికారక ఉత్పత్తుల దిగుమతులపై సెస్సు విషయంలో ఇదే తరహా పరిస్థితి నెలకొంది. దిగుమతుల సమయంలో సెస్సు చెల్లిస్తున్నారు కాని క్రెడిట్‌కు క్లెయిమ్ చేసుకోవడం లేదు. వినియోగదారు చెల్లించే జీఎస్‌టీతోనూ సర్దుబాటు చేసుకోవడం లేదు.

కాకినాడ ప్రాజెక్టుకు మీరూ నిధులివ్వండి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరిన చమురు సంస్థలు

దిల్లీ: కాకినాడ వద్ద రూ.32,901 కోట్ల పెట్రో రసాయనాల ప్రాజెక్టు ఏర్పాటు చేయడానికి, మనగలిగేందుకు వీలు కల్పించేలా నిధులు ఇవ్వాలని ప్రభుత్వ రంగ చమురు సంస్థలు (పీఎస్‌యూ) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరుతున్నాయని చమురు మంత్రిత్వ శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. కాకినాడలో ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు హెచ్‌పీసీఎల్, గెయిల్ ఇండియాలు గతేడాది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు లోకసభకిచ్చిన రాతపూర్వక సమాధానంలో ఆయన పేర్కొన్నారు. 'ప్రాజెక్టు ఏర్పాటుకు సాధ్యాసాధ్యాల నివేదిక రూపొందుతోంది. చమురు పీఎస్‌యూలు మాత్రం ఈ ప్రాజెక్టు మనగలగాలంటే.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిధులు ఇవ్వాలని కోరుతున్నాయ'ని ఆయన వివరించారు.

మొబైల్.. ఇ మెయిల్ మార్చుకోవచ్చు



- జీఎస్‌టీలో సవరణకు అవకాశం
- ఇబ్బందుల పరిష్కారానికి వీలు
- ఇ-వే బిల్లుకు ఇది తప్పనిసరి

వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) విధానంలో వ్యాపారుల మొబైల్ నంబరు, ఇ-మెయిల్ చిరునామాలకు చాలా ప్రాధాన్యం ఉంది. పన్నుల విభాగం ఎలాంటి సమాచారాన్నైనా వీటి ద్వారానే వ్యాపారులకు తెలియజేస్తుంటుంది. రిటర్న్‌ల దాఖలు, జీఎస్‌టీ నమోదు సమయంలోనూ వీటి అవసరం తప్పనిసరి. ఎందుకంటే ఆఖర్లో వీటికి వచ్చే ఓటీపీ (వన్ టైం పాస్‌వర్డ్)తోనే ఈ ప్రక్రియలు పూర్తవుతాయి. మరి పొరపాటున మొబైల్ నెంబరు, ఇ-మెయిల్ చిరునామాలు తప్పుగా ఇస్తే ఏంటి పరిస్థితి? లేదంటే కొత్త నెంబరుకు మారితే ఏం చేయాలి?



సతీష్ సరాఫ్
చార్టర్డ్ అకౌంటెంట్

గతేడాది జులై 1 నుంచి జీఎస్‌టీని అమల్లోకి తెస్తుండటంతో కొత్త పన్నుల విధానానికి మారాల్సిందిగా అంతకు ముందు రెండు నెలల్లో (మే, జూన్) వ్యాపారులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తొందరపెట్టాయి. ఆ హడావుడిలో జీఎస్‌టీ నమోదు కోసమని ఏదొక మొబైల్ నెంబరు, ఇ-మెయిల్ చిరునామాను కొందరు వ్యాపారులు ఇచ్చేశారు. వీటిలో కొన్ని నెంబర్లు పనిచేయడం లేదు. ఇందుకు రకరకాల కారణాలున్నాయి. మరికొంత మంది పన్ను విభాగాల అధికారులైతే, వ్యాపారులను జీఎస్‌టీ విధానానికి మార్చేందుకు తమ మొబైల్ నెంబరు, ఇ-మెయిల్ చిరునామాలు పొందుపరిచిన సంఘటనలు కూడా ఉన్నాయి.

పాస్‌వర్డ్ మార్చాలన్నా ఇబ్బందే: జీఎస్‌టీ నమోదు సమయంలో ఇచ్చిన ఫోన్ నెంబర్లు, ఇ-మెయిల్ చిరునామాలు తప్పుడివి కావడంతో, కొంత మంది వ్యాపారులు రిటర్న్‌ల దాఖలప్పుడు ఓటీపీ పొందే విషయంలో ఇబ్బంది పడుతున్నారు. అంతేకాకుండా పాస్‌వర్డ్ మార్చుకోవడం కూడా వీలుకావడం లేదు. ఈ సమస్యల పరిష్కారం కోసం కొందరు జీఎస్‌టీ ప్రాక్టీషనర్లను ఆశ్రయిస్తున్నారు. అయితే వారు కూడా వ్యాపారులకు పూర్తి స్థాయిలో పరిష్కార మార్గం చూపలేకపోతున్నారు. కొందరు డిజిటల్ సంతకాల ద్వారా, రిటర్న్‌ల దాఖలు చేయిస్తున్నారు. అయితే వ్యాపారులందరి దగ్గర డిజిటల్ సంతకాలు (డీఎస్‌సీ) ఉండకపోవచ్చన్న విషయం మనం ఇక్కడ గుర్తుంచుకోవాలి.

ఇ-వేబిల్లుకూ తంటా..: జీఎస్‌టీ మండలి 26వ సమావేశం సిఫారసుల ప్రకారం ఏప్రిల్ 1 నుంచి ఇ-వేబిల్లు అమలు తప్పనిసరి కానుంది. ఇ-వే బిల్లు పొందడం దగ్గర నుంచి ఏదేని సమాచారం వ్యాపారులకు రావాలంటే అప్పుడిచ్చిన ఫోన్ నెంబరు, ఇ-మెయిల్ చిరునామాకే వస్తాయి. ఒకవేళ ఇచ్చిన నెంబరు తప్పయితే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

11 అడుగులు..

గతంలో ఇచ్చిన మొబైల్ నెంబరు, ఇ-మెయిల్ చిరునామాలు మార్చుకుని, తాము ప్రస్తుతం వినియోగిస్తున్నవి జత చేయాలంటే ఏమి చేయాలో చూద్దాం. 11 దశల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుంది.

1 తొలుత జీఎస్‌టీ వెబ్‌సైట్‌ను తెరిచి మీ ఐడీ, పాస్‌వర్డ్ ద్వారా లాగిన్ అవ్వాలి.

2 సర్వీసెస్ విభాగంలోకి వెళ్లాలి. అనంతరం రిజిస్ట్రేషన్‌పై క్లిక్ చేయాలి. ఆ తర్వాత తెరచుకునే వెబ్‌పేజీలో అమెండ్‌మెంట్ ఆఫ్ నాన్-కోర్ ఫీల్డ్స్ (ప్రధానేతర వివరాల సవరణ)ను ఎంపిక చేసుకోవాలి. అప్పుడు మీ రిజిస్ట్రేషన్ దరఖాస్తు కనిపిస్తుంది. అనంతరం ఆథరైజ్డ్ సిగ్నేచర్ ట్యాబ్‌కు వెళ్లి 'యాడ్ న్యూ'పై క్లిక్ చేయాలి. ఒకవేళ మీ రిజిస్ట్రేషన్ దరఖాస్తు వెబ్‌పేజీపై కనిపించకుంటే సర్వీసెస్ విభాగంలో యూజర్ సర్వీసెస్‌కు వెళ్లాలి. అందులో మై సేవ్డ్ అప్లికేషన్‌ను ఎంపిక చేసుకొని 'ఎడిట్'పై క్లిక్ చేయాలి. ఆ తర్వాత ఆథరైజ్డ్ సిగ్నేచర్ ట్యాబ్‌కు వెళ్లి 'యాడ్ న్యూ'పై క్లిక్ చేయాలి.

3 ఆథరైజ్డ్ పర్సన్ కింద కొత్త వ్యక్తి (యజమాని/ భాగస్వామి/ డైరెక్టరు లాంటి వాళ్లు కాకుండా) పేరు, హోదా చేర్చాలి. ఫొటో, పాన్ కార్డ్, ఆధార్‌కార్డ్ తదితరాలను అప్‌లోడ్ చేయాలి. మీరు జీఎస్‌టీ వివరాల్లో ఏవైతే ఫోన్ నెంబరు, ఇ-మెయిల్ చిరునామా ఉండాలని కోరుకుంటున్నారో, వాటిని పొందుపర్చాలి. ఇవన్నీ పూర్తయ్యాక 'సేవ్'పై క్లిక్ చేయాలి.

4 ఇప్పుడు ఆథరైజ్డ్ పర్సన్ ట్యాబ్‌లో మరో ఆథరైజ్డ్ పర్సన్ వివరాలు మీకు కనిపిస్తాయి.

5 ఆ తరవాత అసలు ఆథరైజ్డ్ పర్సన్ (యజమాని/ భాగస్వామి/ డైరెక్టరు లాంటి వాళ్లు)ను 'ఎడిట్' చేయాలి. ప్రైమరీ ఆథరైజ్డ్ సిగ్నేచరీలో 'టిక్కు' గుర్తును తొలగించాలి (అంటే బాక్సును అన్‌చెక్ చేయాలి).

6 అనంతరం ఆథరైజ్డ్ సిగ్నేచరీ ట్యాబ్‌లో కొత్తగా చేర్చిన ఆథరైజ్డ్ సిగ్నేచరీ దగ్గరకు వెళ్లాలి. ప్రైమరీ ఆథరైజ్డ్ సిగ్నేచరీ బాక్స్‌పై క్లిక్ చేయాలి. ఆకుపచ్చ రంగులో 'టిక్కు' గుర్తు కనిపిస్తుంది.

7 పాత మొబైల్ నెంబరు, ఇ-మెయిల్ చిరునామాలు కొత్తగా చేర్చిన ఆథరైజ్డ్ పర్సన్ వివరాల్లో కనిపిస్తాయి. జీఎస్‌టీ వివరాల్లో మీరు ఏ ఫోను నెంబరు, ఇ-మెయిల్ చిరునామా ఉండాలని కోరుకుంటున్నారో పాత వాటి స్థానంలో వీటిని పొందుపరచాలి.

8 మొబైల్ నెంబరు, ఇ-మెయిల్ చిరునామాల సవరణ అనంతరం 'సేవ్'పై క్లిక్ చేయాలి. ఆ తరవాత మార్పు చేసిన మొబైల్ నెంబరు, ఇ-మెయిల్ చిరునామాకు వచ్చిన ఓటీపీని నమోదు చేయాలి. ఓటీపీ సరైనదో కాదో సర్వర్ గుర్తిస్తుంది.

9 ఓటీపీ పరిశీలన అనంతరం కొత్త ఇ-మెయిల్ చిరునామా, మొబైల్ నెంబరు వివరాలు జీఎస్‌టీ డేటాలో నిక్షిప్తమవుతాయి.

10 ఆ తర్వాత ఆథరైజ్డ్ సిగ్నేచరీ ట్యాబ్‌కు వెళ్లాలి. కొత్తగా చేర్చిన ఆథరైజ్డ్ సిగ్నేచరీని 'ఎడిట్' చేయాలి. ప్రైమరీ ఆథరైజ్డ్ పర్సన్ బాక్స్‌ను అన్‌చెక్ చేశాక, కొత్తగా చేర్చిన ఆథరైజ్డ్ పర్సన్‌ను డిలీట్ కొట్టాలి (ఇది ఎంతో ముఖ్యం). అప్పుడు 'సబ్మిట్'పై క్లిక్ చేయాలి.

11 కొత్తగా చేర్చిన ఆథరైజ్డ్ సిగ్నేచరీని తొలగించాక, పాత ఆథరైజ్డ్ సిగ్నేచరీ వద్దకు వెళ్లాలి. మీకు పాత మొబైల్ నెంబరు, ఇ-మెయిల్ చిరునామా స్థానంలో కొత్తవి కనిపిస్తాయి.

పై 11 దశల్లో జీఎస్‌టీ కింద నమోదైన వ్యాపారులు మొబైల్ నెంబరు, ఇ-మెయిల్ చిరునామాలను మార్చుకోవచ్చు. ఇది నిరూపితమైన పద్ధతి కూడా. అయితే చాలా జాగ్రత్తగా దీనిని చేయాల్సి ఉంటుంది. అప్పుడే పాతవాటిని విజయవంతంగా మార్చుకోగలం. అందువల్ల ఈ ప్రక్రియను ప్రారంభించే ముందు ప్రతి ఒక్క దశను పూర్తిగా చదివి అర్థం చేసుకోవడం ఎంతో ముఖ్యం. ఈ ప్రక్రియలో ప్రధానేతర వివరాలను (నాన్-కోర్ ఫీల్డ్స్) సవరిస్తున్నాం కనుక జీఎస్‌టీ నిబంధనల ప్రకారం పన్నుల శాఖ అనుమతులు అవసరం లేదు. మరోవైపు రిటర్న్‌ల దాఖలు సమయంలో కంపెనీలు, ఎల్‌ఎల్‌పీలు ఓటీపీ బదులు డీఎస్‌సీని ఉపయోగించుకోవచ్చు. ఒకవేళ ఓటీపీనే తప్పనిసరి అయితే ఓటీపీనే వాడాల్సి ఉంటుంది.

గమనిక: పైన పేర్కొన్న 11 దశల ద్వారా ఇ-మెయిల్ చిరునామా, మొబైల్ నంబరు సవరణ విజయవంతం కాకపోనట్లైతే ఇందుకు వ్యాపారులు ఇచ్చిన వివిధ రకాల సమాచారం కారణమై ఉండవచ్చు.

ఇళ్ల అమ్మకాలు పెరిగాయ్!

ఏప్రిల్-డిసెంబరులో 29.3% వృద్ధి: ఇక్రా

ముంబయి: దేశీయంగా ఇళ్ల అమ్మకాలు పెరుగుతున్నాయి. 2016 ఏప్రిల్-డిసెంబరుతో పోలిస్తే, 2017 ఇదే కాలంలో అమ్మకాలు 29.3 శాతం పెరిగాయి. పూర్తయి, మిగిలిపోయినవి అమ్మడానికి పట్టే సమయం కూడా 12 త్రైమాసికాలకు తగ్గింది. 2017 మార్చిలో ఇది 14 త్రైమాసికాలుగా ఉండేది. ఇవన్నీ ఇళ్ల అమ్మకాలు పుంజుకుంటున్నాయనే దానికి నిదర్శనాలని రేటింగ్ సంస్థ ఇక్రా తాజా నివేదికలో తెలిపింది.

- స్థిరాస్తి సంస్థలు ఈ ఆర్థిక సంవత్సరంలో తొలి 9 నెలల కాలంలో (ఏప్రిల్-డిసెంబరు 17) దాదాపు 1.73 కోట్ల చదరపు అడుగుల విస్తీర్ణం అమ్మినట్లు వెల్లడించింది. ఏడాది క్రితం ఇదే కాలంలో 1.34 కోట్ల చదరపు అడుగులు మాత్రమే విక్రయించినట్లు ఇక్రా పేర్కొంది. 11 నమోదిత సంస్థల నమూనాతో ఈ వివరాలు తెలిపినట్లు వెల్లడించింది.
- ఈ 9 నెలల్లో కొనుగోలుకు నమోదు చేసుకున్న విస్తీర్ణం విలువ కూడా రూ.11,651 కోట్లకు పెరిగింది. ఏడాది క్రితం ఈ మొత్తం రూ.9,205 కోట్లు మాత్రమే.
- ఇదే సమయంలో కొత్త ప్రాజెక్టుల విస్తీర్ణాలు 1.87 కోట్ల చ.అ.ల నుంచి 1.08 కోట్ల చ.అ.కు పరిమితమయ్యాయి.
- వసూళ్లు కూడా రూ.9,735 కోట్ల నుంచి 3 శాతం తగ్గి రూ.9,456 కోట్లకు తగ్గాయి.

'కొత్తగా వస్తున్న ప్రాజెక్టులు తగ్గాయి. కొనసాగుతున్న ప్రాజెక్టుల్ని త్వరితగతిన పూర్తి చేసేందుకే డెవలపర్లు ఆసక్తి చూపిస్తున్నారు. డిమాండ్ పెరగడం, కొత్త ప్రాజెక్టులు తక్కువగా రావడం, బుక్ చేసుకున్న ఇళ్లను త్వరితగతిన పూర్తి చేస్తుండటంతో ఈ రంగంలో వృద్ధి నమోదవుతోంద'ని ఇక్రా ఉపాధ్యక్షుడు శుభమ్ జైన్ తెలిపారు. 2016 నవంబరులో పెద్ద నోట్ల రద్దు ప్రభావం, గత ఏడాది ప్రవేశపెట్టిన వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) నుంచి తేరుకోవడంతో పాటు కొత్తగా అమల్లోకి వచ్చిన స్థిరాస్తి నియంత్రణ, అభివృద్ధి చట్టం (రెరా)తో ఇప్పుడిప్పుడే ఈ రంగం స్థిరీకరణ దిశగా వెళుతోందని, భవిష్యత్తులో సమతుల్య రంగంగా అభివృద్ధి చెందగలదని ఇక్రా నివేదికలో తెలిపింది.

ఎ 320 నియో విమానాలు 11 నిలిపివేత

దిల్లీ: ప్రాట్ అండ్ విట్నీ ఇంజిన్ల వైఫల్యాల నేపథ్యంలో, ఎ320 నియో విమానాల నిలిపివేత కొనసాగుతోంది. ఇండిగో సంస్థకు చెందిన 8, గోఎయిర్ సంస్థ నిర్వహిస్తున్న 3 విమానాలను నిలిపివేస్తున్నట్లు విమానయాన నియంత్రణ సంస్థ డీజీసీఏ సోమవారం ప్రకటించింది. ఇండిగో విమానం ఇంజిన్ వైఫల్యంతో అత్యవసరంగా అహ్మదాబాద్ విమానాశ్రయంలో దిగిన కొన్ని గంటల్లోనే డీజీసీఏ ఈ నిర్ణయం వెలువరించింది. 'విమానాల భద్రతను దృష్టిలో ఉంచుకొని సరైన నిర్ణయం తీసుకున్నామ'ని పౌర విమానయాన కార్యదర్శి ఆర్ఎన్ చౌబే తెలిపారు.

15 నుంచి ఒంటిపూట బడులు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ఈనెల 15 నుంచి ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు ఒంటిపూట మాత్రమే పనిచేస్తాయి. ఈ మేరకు తెలంగాణ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కిషన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటలు బడులు పని చేస్తాయి. పదో తరగతి పరీక్షా కేంద్రాలు ఉన్న ఉన్నత పాఠశాలలు మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటాయి అంతేకాకుండా ఉన్నత పాఠశాలల్లో పాత విధానంలోనే ఐచ్ఛిక సెలవులు వినియోగించుకోవచ్చునని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆహార శుద్ధి పరిశ్రమలకు ప్రోత్సాహం

పంటల దిగుబడులకు తగ్గట్లుగా ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించి రైతులకు ఆదాయం పెంచేందుకు కృషి చేయాలని వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి సూచించారు. ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు నూతన విధానం రూపకల్పనలో భాగంగా సోమవారం సచివాలయంలో అధికారులు, శాస్త్రవేత్తలతో ఆయన సమావేశమై చర్చించారు. రాష్ట్రంలో మిరప, పసుపు పంటలకు అవసరమైనన్ని శీతలగిడ్డంగుల నిర్మాణం చేపట్టాలన్నారు. మత్స్య సంపద ఎగుమతులు పెంచేందుకు అనుబంధ పరిశ్రమలు నెలకొల్పాలన్నారు. వరి ధాన్యం, పప్పులు, వేరుసెనగ ఉత్పత్తుల తయారీకి మిల్లుల ఏర్పాటుపై చర్చించారు.

పట్టు పరిశ్రమ అభివృద్ధి మండలిలో ఇద్దరి నియామకం

రాష్ట్ర పట్టు పరిశ్రమ అభివృద్ధి మండలిలో అనధికార సభ్యుల కోటాలో ఇద్దరిని నియమిస్తూ పట్టు పరిశ్రమ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. జనగామ జిల్లాకు చెందిన పెద్ది రవీందర్, నల్గొండ జిల్లా బండలపహాడ్‌కు చెందిన తీగల శశికళను నియమించారు. వీరి పదవీకాలం ఏడాది ఉంటుంది.

నేడు అంబేడ్కర్ విగ్రహాల ముందు మహాధర్నా

మందకృష్ణమాదిగ

ఉస్మానియా యూనివర్సిటీ, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ కోసం మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా అంబేడ్కర్ విగ్రహాల ముందు మహాధర్నా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఈ నెల 13న నిర్వహించాల్సిన బంద్‌ను రద్దు చేసుకున్నామని పేర్కొన్నారు. పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని, దిల్లీకి ముఖ్యమంత్రి కేసీఆర్ అఖిలపక్ష బృందాన్ని తీసుకెళ్లాలని కోరుతూ మంగళవారం నిర్వహించే ఆందోళనలో రవాణాకు, విద్యార్థుల చదువులకు, పరీక్షలకు ఎలాంటి ఆటంకం కలిగించకుండా పెద్ద సంఖ్యలో అంబేడ్కర్ విగ్రహాల ముందు మహాధర్నా నిర్వహించాలని పిలుపునిచ్చారు.

చదువుల చెరసాల



ర్యాంకులన్నీ మావేనంటూ ప్రకటనలు.. మీ పిల్లల్ని ఇంజినీర్లు, వైద్యులుగా చేయడం మాకే సాధ్యమంటూ ప్రచారం చేసే కార్పొరేట్ జూనియర్ కళాశాలలు విద్యార్థులకు వసతుల కల్పన ఊసే మరిచిపోతున్నాయి. లక్షల్లో రుసుములు వసూలు చేస్తున్నా వసతిగృహాల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా బందీఖానాల్లాంటి గదుల్లో వారిని కుక్కిపారేస్తున్నాయి. విద్యార్థులను కేవలం మార్కులు, ర్యాంకులు తెచ్చే యంత్రాలుగా చూస్తున్నాయి. పదో తరగతి మార్కుల ఆధారంగా విద్యార్థుల తలరాతలను కళాశాలల యాజమాన్యాలే రాసేస్తున్నాయి. ఏ విద్యార్థి ఏం చదవాలో నిర్ణయించేస్తున్నాయి. విపరీతమైన ఒత్తిడి, కనీస వసతులు కరవైన హాస్టళ్లలో ఇమడలేక విద్యార్థులు తీవ్ర మానసిక సంఘర్షణకు లోనవుతున్నారు. ఏటా పదుల సంఖ్యలో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడడానికి ప్రధాన కారణమిదే. సరస్వతీ నిలయాలను చదువుల చెరసాలలుగా మారుస్తున్నా, వసతిగృహాలను అనుమతి లేకుండానే నిర్వహిస్తున్నా, కనీస వసతులు లేకుండా పిల్లల్ని అవస్థలు పెడుతున్నా ఇంటర్ బోర్డు, ప్రభుత్వం చేష్టలుడిగి చూస్తున్నాయి.

- మూడు నెలల క్రితం జేఎన్‌టీయూహెచ్ సమీపంలోని ఓ కార్పొరేట్ కళాశాలలోకి వెళ్లాం. మరో 15 రోజుల్లో నేను స్వర్గానికి వెళుతున్నాను అని విద్యార్థులు రాసిన రాతలు పలుచోట్ల కనిపించాయి. పిల్లలు ఎంత ఒత్తిడిలో నలిగిపోతున్నారో చెప్పడానికి ఇది చాలదా?

  – ఓ విద్యార్థి సంఘ నేత ఆందోళన

- హాస్టళ్లు ఇంటర్‌బోర్డు పరిధిలో లేవు. అందువల్ల ఎంత మందికి ఒక మూత్రశాల ఉండాలన్న దానిపై నిబంధనలు కూడా లేవు. ఈసారి హాస్టళ్లను కూడా ఇంటర్ బోర్డు వద్ద నమోదు చేసుకోవాలని నిర్ణయించినా ఇంకా స్పష్టత రాలేదు

  – ఓ జిల్లా విద్యాశాఖాధికారి వ్యాఖ్యలు

- కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో రెండు బోధనా పిరియడ్ల తర్వాత 10 నిమిషాల విరామం కూడా ఉండడం లేదు. దీంతో మూత్రవిసర్జనకూ వెళ్లలేక విద్యార్థులు ఉగ్గబట్టుకుంటున్నారు. జనగామకు చెందిన ఒక బాలిక ఏడాదిపాటు ఇలాంటి ఇబ్బంది ఎదుర్కొంది. సెలవులకు ఇంటికెళ్లి అక్కడే కుప్పకూలిపోయి మృతి చెందింది. కళాశాలలోని అధ్వాన పరిస్థితుల వల్ల బిడ్డను కోల్పోయామని ఆ విద్యార్థిని తండ్రి 'ఈనాడు' వద్ద కన్నీటి పర్యంతమయ్యారు.

- మా అమ్మాయి హైదరాబాద్‌లో ఓ కార్పొరేట్ జూనియర్ కళాశాలలో చదువుతోంది. వాళ్ల వసతిగృహంలో డైనింగ్ హాల్‌లో వర్షాకాలం వస్తే చాలు ఆహారపదార్థాల చుట్టూ ఈగలు ముసురుతున్నాయి. ఇలాగైతే వారి ఆరోగ్యం ఏమవ్వాలి?

  – కరీంనగర్‌కు చెందిన విద్యార్థి తండ్రి ఆవేదన

ఆరోగ్యం హారీ..

జనగామ జిల్లా దేవరుప్పులకు చెందిన ఓ వ్యక్తి తన కుమారుణ్ని హైదరాబాద్‌లోని ఒక కార్పొరేట్ కళాశాలలో చేర్చారు. ఆ కుర్రాడికి అక్కడి భోజనం సరిపడలేదు. ఇంటిమీద బెంగతో చదువుపై శ్రద్ధ చూపలేకపోయాడు. హైదరాబాదులో చదవలేనంటే తల్లిదండ్రులు వచ్చి నచ్చజెప్పి వెళ్లారు. ఓ రోజు కళాశాల నుంచి ఫోన్ రావడంతో తల్లిదండ్రులు హుటాహుటిన బయల్దేరి వెళ్లారు. కుర్రాడు కడుపునొప్పితో విలవిల్లాడుతున్నాడు. వెంటనే బయటకు తీసుకుచ్చి వైద్యశాలలో పరీక్షలు చేయించడంతో అకాల భోజనం, అన్నంలో అనుచిత పదార్థాలు కలపడంతో ఇలా కడుపునొప్పి వస్తుందని, ఇంటి వంట తినకపోతే తీవ్రమవుతుందని వైద్యులు హెచ్చరించారు. ఒకప్పుడు ఆరోగ్యంగా ఉన్న ఆ కుర్రాడు ఇప్పుడు పది అడుగులు వడివడిగా నడవలేడు. చదువూ అంతంత మాత్రమే.

తక్కువ వేతనానికి వస్తారని.. బోధనలో అనుభవం, తగిన అర్హతలు లేనివారిని చాలా కళాశాలలు ప్రిన్సిపాళ్లు, వైస్‌ప్రిన్సిపాళ్లుగా నియమించుకుంటున్నాయి. వారు పిల్లలపై జులుం ప్రదర్శిస్తున్న ఘటనలెన్నో. కొన్నాళ్ల క్రితం హైదరాబాద్ ఎస్ఆర్‌నగర్‌లో ఓ కార్పొరేట్ కళాశాల బ్రాంచి ప్రిన్సిపాల్ ఓ విద్యార్థిని కొట్టడం వివాదాస్పదమైంది. తనను క్షమించాలని ప్రిన్సిపాల్ ఆంగ్లంలో రాసిన మూడు లైన్ల లేఖ చదివినవారంతా అధ్వానమైన ఆయన ఆంగ్ల భాషా పాండిత్యాన్ని చూసి ముక్కున వేలేసుకున్నారు. విద్యార్థుల హాజరు, తదితర వ్యవహారాలు చూసే ఫ్లోర్ ఇన్‌ఛార్జులు చాలాచోట్ల విద్యార్థులతో మూర్ఖంగా వ్యవహరిస్తున్నారు.

తినలేక తింటున్నారు..

ఆహారం నాణ్యంగా, రుచిగా ఉండడం లేదు.. తినలేకపోతున్నామని పిల్లలు చెబుతున్నా ఈ రెండేళ్లు ఓర్చుకోమని తల్లిదండ్రులు బుజ్జగిస్తున్నారు. ప్రతి ఆదివారం పిల్లలకు ఇష్టమైనవి వండితెస్తున్నారు. బిస్కెట్లు, డ్రైఫ్రూట్స్ కొనుక్కొచ్చి ఇస్తున్నారు. ఉదయం 6 నుంచి 6.30 గంటల మధ్య అల్పాహారం. అంత పొద్దున్నే తినలేక విద్యార్థులు విముఖత చూపుతున్నారు. పరిశుభ్రత లేని శౌచాలయాలు, భోజనశాలల వల్ల చాలామంది విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారు. సిక్ రూమ్‌లు లేవు. జగిత్యాలకు చెందిన ఓ ఉద్యోగి తన కుమార్తెను హైదరాబాద్‌లోని బాచుపల్లిలోని ఓ కార్పొరేట్ కళాశాలలో చేర్పించారు. భోజనం బాగా లేదని, ఇంటికి వచ్చేస్తానని అమ్మాయి పట్టుబట్టడంతో ఆమె తల్లిని హైదరాబాద్‌కు పంపించి అక్కడే ఇల్లు తీసుకుని కూతురిని చదివిస్తున్నారు.

అపార్ట్‌మెంట్లే కళాశాలలు

అపార్ట్‌మెంట్ లేదా వాణిజ్య అవసరాల కోసం నిర్మించిన భవనాలను లీజుకు తీసుకొని కళాశాలు నడిపిస్తున్నారు. సూర్యకాంతి అసలు సోకని భవనాల్లో నడుస్తున్న కార్పొరేట్ కళాశాలలెన్నో. కొన్ని భవనాల్లో మూత్రశాలలు తగినన్ని లేక, సమయం సరిపోక ప్రతిరోజూ స్నానాలు చేయడం కూడా సమస్యగా మారుతోంది. హాస్టల్ గదుల్లో కుక్కినట్లుగా బెడ్లు వేస్తున్నారు. మంచాల మధ్య నడవడానికి కూడా చోటు ఉండని వసతిగృహాలెన్నో. అయిదారు అంతస్థుల భవనం అయినా లిఫ్టులు ఉండవు. ఉన్నా విద్యార్థులను వినియోగించనివ్వరు. సెల్లార్లలో ఉండే భోజనశాలకు ఇన్ని అంతస్తులు దిగిరావాల్సిందే.

అగ్నిప్రమాదం జరిగితే..

కూకట్‌పల్లి అగ్నిమాపక కేంద్రం పరిధిలో 540 విద్యాసంస్థలుంటే అగ్నిప్రమాద నిరోధక ఏర్పాట్లున్నవి 10 శాతంలోపే. రాష్ట్రవ్యాప్తంగా అన్నిచోట్లా ఇదే పరిస్థితి. అగ్నిమాపక చట్టంలో కళాశాలల గురించి లేదని అగ్నిమాపక శాఖ చేతులు దులిపేసుకుంది. అగ్ని ప్రమాదం జరిగితే విద్యార్థుల భద్రతకు ఎవరు పూచీ?

పిల్లలు తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడాలన్నా వారానికి ఒకసారి 10 నిమిషాలు అనుమతిస్తున్నారు. అక్కడ ఉండే ఒకటి రెండు ఫోన్ల కోసం బారులు తీరాల్సిందే. సమయం ముగిసిపోతే ఆ భాగ్యమూ దక్కదు. బిడ్డలను చూద్దామని ఆదివారాలు కళాశాలలకు వచ్చే తల్లిదండ్రులను గంట మాత్రమే అవకాశం ఇస్తున్నారు.

అడగొద్దు నాన్నా


వసతులకు సంబంధించి సమస్యలను విద్యార్థులు అమ్మానాన్నలకు కూడా చెప్పడం లేదు. కొందరు చెప్పినా ప్రిన్సిపాళ్లను అడగొద్దని బతిమాలుతున్నారు. తల్లిదండ్రులు చెప్పి వెళ్లాక తమను ఇబ్బంది పెడతారన్న భయమే ఇందుకు కారణం. మొత్తానికి కార్పొరేట్ కళాశాలల్లో పరిస్థితి.. పెట్టింది తినాలి, చెప్పింది చదవాలి అన్నట్లు తయారైంది. తల్లిదండ్రులకు సమస్యలు చెబితే టీసీపై రెడ్ మార్కు వేస్తామని బెదిరిస్తున్నారని విద్యార్థులుబోర్డు అధికారులకూ ఫిర్యాదు చేశారు.

తూతూమంత్రం తనిఖీలు

ఒత్తిడి భరించలేక ఇంటర్మీడియట్ విద్యార్థులు గత అక్టోబరు, నవంబరు వరుస ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ఇంటర్ బోర్డు కళాశాలల వసతిగృహాలను తనిఖీ చేయాలని ఆదేశించింది.

- హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో నారాయణ, శ్రీచైతన్య, శ్రీగాయత్రి, వెలాసిటీ తదితర కార్పొరేట్ కళాశాలలకు అనుబంధంగా నడుస్తున్న 146 వసతిగృహాలను ఆయా జిల్లాల అధికారులు తనిఖీ చేశారు.
- ప్రతి వసతిగృహంలోనూ వసతుల లేమి, అపరిశుభ్రత, వెలుతురు లేని గదులు, గది విస్తీర్ణానికి మించి విద్యార్థులను ఉంచడం వంటి సమస్యలెన్నో వెలుగుచూశాయి. ఏసీ క్యాంపస్‌లని చెబుతున్నా అవీ సరిగాపనిచేయవు.
- ఒక సబ్జెక్టును ఏకధాటిగా మూడు గంటల పాటు బోధిస్తున్నారని, వారానికి 3-4 పరీక్షలు నిర్వహిస్తున్నారని గుర్తించారు.
- ఆయా కళాశాలలకు నోటీసులిచ్చారు. అయితే ఎప్పటిలోగా వివరణ ఇవ్వాలో చెప్పలేదు. దీంతో కళాశాలలు సమాధానం ఇవ్వలేదు.. బోర్డు అడగనూ లేదు.
- అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్షాలు విద్యార్థుల ఆత్మహత్యల గురించి నిలదీస్తాయనే బోర్డు అధికారులు తూతూమంత్రం తనిఖీలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.

ఊపిరి సలపని ఒత్తిడి



జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్, నీట్, ఎయిమ్స్, ఎంసెట్ వంటి ప్రవేశ పరీక్షల్లో ర్యాంకుల కోసం కార్పొరేట్ కళాశాలలు విద్యార్థులతో బట్టీ పట్టిస్తున్నాయి. విద్యార్థులకు ఇష్టం ఉన్నా లేకున్నా తరగతులు, స్టడీ అవర్స్ అంటూ రోజుకు 16 గంటలు చదివిస్తున్నారు. ఇక ప్రతిరోజూ పరీక్ష, వారం వారం పరీక్షలు. . ప్రతి దాంట్లో నిరూపించుకోవాల్సిందే. మార్కులు తగ్గితే సెక్షన్లు మార్చేస్తారు. అదే జరిగితే అమ్మానాన్నలు ఏమంటారో, సహ విద్యార్థులు గేలిచేస్తారనే ఆందోళనతో పిల్లలు నిత్యం కుంగిపోతున్నారు. కొందరు అధ్యాపకులు విద్యార్థులను వేస్ట్ ఫెలోస్, మొద్దులు అంటూ మానసికంగా దెబ్బతీస్తున్నారు.

ఆన్‌లైన్ ప్రవేశాలతోనే ముకుతాడు

కార్పొరేట్ కళాశాలలకు ముకుతాడు వేయడానికి డిగ్రీ కోర్సుల్లో మాదిరిగా ఆన్‌లైన్ ప్రవేశాలు జరపాలని విద్యార్థి, తల్లిదండ్రుల సంఘాలు నిరుడు ఆందోళనకు దిగాయి. దాంతో ఇంటర్‌బోర్డు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. అయితే రెసిడెన్షియల్ విధానంతోపాటు ప్రవేశ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నామని కళాశాలలు చెబుతున్నందున రుసుములను ఎలా నిర్ణయిస్తామని ప్రభుత్వం ప్రశ్నించి, పరిష్కారం వెతకకుండా ఆన్‌లైన్ ప్రవేశాలను పక్కనపెట్టేసింది. ఆన్‌లైన్ ప్రవేశాలు చేస్తే రుసుముల గురించి కూడా వెబ్‌సైట్లో ఉంచాలనే ఆ ప్రతిపాదన విరమించుకున్నారని విమర్శలు వినిపించాయి.

- ఈనాడు, హైదరాబాద్

మానసిక ఆందోళనతోనే వ్యక్తిగత దాడులు

- నల్గొండ జిల్లా ఫ్లోరైడ్ పాపం కాంగ్రెస్‌దే
- పదవుల కోసం పెదవులు మూసుకున్న చరిత్ర వాళ్లది
- శివన్నగూడెం రిజర్వాయర్‌తో ఫ్లోరైడ్‌కు విముక్తి
- మునుగోడు ప్రగతిసభలో మంత్రి కేటీఆర్



సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్ ● హాజరైన ప్రజలు

ఈనాడు, నల్గొండ: అధికారం లేకపోవడంతోనే కాంగ్రెస్ నాయకులు మానసిక ఆందోళనకు గురవుతున్నారని.. ఆ అక్కసుతోనే శాసనసభలో వ్యక్తిగత దాడులకు దిగుతున్నారని రాష్ట్ర ఐటీ, పంచాయతీరాజ్ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. గవర్నర్ ప్రసంగం జరిగేటపుడు కాంగ్రెస్ పార్టీ వ్యవహరించిన తీరుపై.. హుందాగా వ్యవహరిస్తానని మాట్లాడే సీఎల్పీ నేత జానారెడ్డి ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. నల్గొండ జిల్లాలో దాదాపు 2లక్షల మందిని జీవచ్ఛవాలను చేసిన ఫ్లోరైడ్ పాపం కాంగ్రెస్‌దేనని విమర్శించారు. మునుగోడు నియోజకవర్గ కేంద్రమైన చండూరులో సోమవారం నిర్వహించిన మునుగోడు ప్రగతి సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు అన్యాయం జరిగినా ఇక్కడి కాంగ్రెస్ నాయకులు పదవుల కోసం పెదవులు మూసుకున్నారని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు బస్సుయాత్ర పేరుతో సర్కస్ యాత్రలు చేస్తున్నారన్నారు. డిండి ఎత్తిపోతలలో భాగంగా శివన్నగూడెం రిజర్వాయర్‌ను నిర్మించి ఈ ప్రాంతాన్ని ఫ్లోరైడ్ నుంచి విముక్తి చేస్తామని ప్రకటించారు. ఆంధ్రలో తెలంగాణ కలిసేటపుడు ఇక్కడ ఫ్లోరైడ్ లేదని.. తర్వాత వచ్చిన నాయకుల నిర్లక్ష్యం వల్లే ఈప్రాంత ప్రజలు ఈ వ్యాధితో బాధపడుతున్నారన్నారు. 22 ఏళ్ల కిందటే అప్పటి తన నియోజకవర్గంలోని ఇంటింటికీ తాగునీరందించిన ఘనత సీఎం కేసీఆర్‌ది అన్నారు. రాష్ట్రంలో ఏ మహిళా బాధపడకూడదని, మిషన్ భగీరథ లాంటి ప్రతిష్ఠాత్మక పథకాన్ని మునుగోడు నియోజకవర్గం చౌటుప్పల్ ప్రాంతం నుంచి ప్రారంభించారన్నారు.

దిల్లీ అనుమతులు మనకెందుకు?

ఏపని చేయాలన్నా దిల్లీ అనుమతులు తీసుకునే కాంగ్రెస్ నేతలు మనకు అవసరం లేదని.. స్వయంపాలనతో తెలంగాణను బంగారు తెలంగాణగా మార్చే శక్తి తమకుందని కేటీఆర్ స్పష్టంచేశారు. రైతులను కాల్చి చంపిన చరిత్ర గత ప్రభుత్వాలదన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండు మల్కాపురంలో 350 ఎకరాల్లో పారిశ్రామిక పార్కును ఏర్పాటుచేసి స్థానికులకే ఉద్యోగాలు ఇస్తామని వెల్లడించారు. సాగుకు 24 గంటల ఉచిత విద్యుత్తు ఇచ్చేది తెలంగాణ రాష్ట్రమేనన్నారు. స్థానిక ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి జగదీశ్‌రెడ్డి, నల్గొండ జడ్పీ ఛైర్మన్ బాలు నాయక్, ఎంపీ బూర నర్సయ్యగౌడ్, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, గాదరి కిశోర్, పైళ్ల శేఖర్‌రెడ్డి, రవీంద్రనాయక్ పాల్గొన్నారు.

పరిశ్రమల్లో స్థానిక యువతకే ఉద్యోగాలు

- హెచ్‌ఎఫ్‌సీఎల్ శంకుస్థాపనలో మంత్రి కేటీఆర్



ఆప్టికల్ ఫైబర్ ప్లాంట్ నమూనాను మంత్రులు కేటీఆర్, మహేందర్‌రెడ్డిలకు వివరిస్తున్న హెచ్‌ఎఫ్‌సీఎల్ ఎండీ మహేంద్ర నహతా

మహేశ్వరం, న్యూస్‌టుడే: తెలంగాణలో స్థాపించే పరిశ్రమల్లో స్థానిక యువతకే ఉద్యోగాలు కల్పిస్తామని, అందుకోసం వారికి సాంకేతిక నైపుణ్య శిక్షణ ఇస్తామని పరిశ్రమల శాఖ మంత్రి కె.తారక రామారావు అన్నారు. మహేశ్వరం మండలం రావిర్యాల, శ్రీనగర్ రెవెన్యూ పరిధిలోని ఫ్యాబ్‌సిటీలో ఆప్టికల్ ఫైబర్ ప్లాంట్‌కు మంత్రి మహేందర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డితో కలిసి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. హిమాచల్ ఫ్యూచరిస్టిక్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ (హెచ్‌ఎఫ్‌సీఎల్) వారు 20 ఎకరాల్లో రూ.700 కోట్లతో నిర్మించబోతున్న ఆప్టికల్ ఫైబర్ ప్లాంట్‌లో వెయ్యి నుంచి నాలుగు వేల వరకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ఈ ఉద్యోగాలకు అవసరమైన శిక్షణను స్థానిక యువతకు ఇప్పించాలని ఐటీ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్‌ను కేటీఆర్ ఆదేశించారు. వీలైనంత త్వరగా పనులను ప్రారంభించి, ఏడాది లోపల ఉత్పత్తి చేయాలని పారిశ్రామికవేత్తలను కోరారు. రాబోయే రోజుల్లో తెలంగాణలోని ప్రతి గ్రామాన్నీ సాంకేతికంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఏడాదిలోగా కోటి కుటుంబాలకు హైస్పీడ్ అంతర్జాల సదుపాయాన్ని కల్పిస్తామన్నారు. ఇందులో భాగంగా మహేశ్వరం మండలంలోని మన్‌సాన్‌పల్లి, మహేశ్వరం, తుమ్మలూరు, సిరిగిరిపురం గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. మంత్రి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడ్డాక రంగారెడ్డి జిల్లాలోని మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, శంషాబాద్ ప్రాంతాల్లో అనేక పరిశ్రమలు వస్తున్నాయని చెప్పారు. రాబోయే రోజుల్లో మహేశ్వరం ప్రాంతానికి ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. హెచ్‌ఎఫ్‌సీఎల్ ఛైర్మన్ మహేంద్ర ప్రతాప్, ఎండీ మహేంద్ర నహతా, తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది వారాల్లో వైద్యవిధాన పరిషత్తు ఉద్యోగుల విభజన: హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: వైద్యవిధాన పరిషత్తు ఉద్యోగుల విభజన ప్రక్రియను 8 వారాల్లో పూర్తి చేయాలని తెలుగు రాష్ట్రాల వైద్యవిధాన పరిషత్తు, వైద్య, ఆరోగ్య శాఖలను ఉమ్మడి హైకోర్టు సోమవారం ఆదేశించింది. ఏపీ, తెలంగాణ వైద్యవిధాన పరిషత్తు ఉద్యోగుల విభజనకు విధి విధానాలను నాలుగు వారాల్లో ఖరారు చేసి, తర్వాత 8 వారాల్లో ఉద్యోగుల విభజన పూర్తి చేయాలని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మిలతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది. తెలంగాణ వైద్యవిధాన పరిషత్తు ఆధ్వర్యంలోని కింగ్ కోఠి జిల్లా ఆస్పత్రిలో ప్రోగ్రామింగ్ అధికారిగా పనిచేస్తున్న డాక్టర్ ఎస్.సుజాత, డిప్యూటీ కమిషనర్‌గా పదవీ విరమణ చేసిన డాక్టర్ ఎం.సుబ్బరాములు పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై ధర్మాసనం విచారణ చేపట్టింది. సుజాత తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ పిటిషనర్ ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారన్నారు. తనను ఏపీకి పంపాలని 2016 జులై 25న తెలంగాణ అధికారులకు.. ఏపీలోస్థానం కల్పించి, సర్వీసు నిబంధనల ప్రకారం పదోన్నతి ఇవ్వాలని ఏపీ వైద్యవిధాన పరిషత్తుకు వినతిపత్రాలు సమర్పించారన్నారు. అయితే రెండు రాష్ట్రాల వైద్యవిధాన పరిషత్తు కమిషనర్లు, వైద్య, ఆరోగ్యశాఖలు వీటిని పట్టించుకోలేదన్నారు. తెలంగాణలో తనకు కమిషనర్ పోస్టుకు సరిపడే సీనియార్టీ ఉన్నా ఏపీ స్థానికురాలనే కారణంతో మరొకరికి ఆ అవకాశం ఇచ్చారన్నారు. తెలంగాణలో పనిచేస్తున్నానని ఆంధ్రప్రదేశ్‌లోనూ పదోన్నతి కల్పించడం లేదని పిటిషనర్ సుజాత తెలిపారు. తనను ఇక్కడ విధుల నుంచి రిలీవ్ చేయాలని తెలంగాణ అధికారులను, ఏపీలో విధులు అప్పగించి, పదోన్నతులు కల్పించేలా ఏపీ అధికారులను ఆదేశించాలని అభ్యర్థించారు.

శ్రీశైలంలో జలఘంటికలు

- పడిపోతున్న నీటి మట్టం
- 832 అడుగులకు తగ్గుదల

ఈనాడు, హైదరాబాద్: శ్రీశైలం నీటిమట్టం వేగంగా తగ్గిపోతోంది. రెండు రాష్ట్రాల అవసరాలు, నాగార్జునసాగర్‌లో నీటినిల్వలను పరిగణనలోకి తీసుకొని ఈ నెలాఖరుకు శ్రీశైలంలో కనీస నీటి మట్టం దిగువకు నీటిని తీసుకోవాలని గతవారం నీటి యాజమాన్య బోర్డు నిర్ణయం తీసుకొంది. తర్వాత 4రోజులకే శ్రీశైలంలో నీటినిల్వ కనీస నీటి మట్టానికి దిగువకు వెళ్లిపోయింది. ఈ ప్రాజెక్టులో కనీస నీటిమట్టం 834 అడుగులు కాగా, సోమవారం సాయంత్రానికి 832 అడుగులకు తగ్గిపోయింది. ఉమ్మడి రిజర్వాయర్లయిన శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో కనీస నీటిమట్టానికి పైన 33.77 టీఎంసీలు ఉన్నాయని, ఇందులో తెలంగాణ 24.467 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్ 9.303 టీఎంసీలు వాడుకునేలా ఈనెల 2న రెండు రాష్ట్రాల ఇంజినీర్ ఇన్ చీఫ్‌లు, బోర్డు సభ్యకార్యదర్శితో కూడిన త్రిసభ్య కమిటీ నిర్ణయం తీసుకొంది. ఈ నెల 6న బోర్డు సభ్యకార్యదర్శి జారీచేసిన ఉత్తర్వుల్లో ఈ విషయాన్ని స్పష్టం చేశారు. నాగార్జునసాగర్‌లో మార్చి 20వరకు 520 అడుగులు, మార్చి 31 వరకు 515 అడుగులు ఉండేలా చర్యలు తీసుకోవాలని, మార్చి ఆఖరుకు లేదా అంతకంటే ముందు శ్రీశైలంలో కనీస నీటి మట్టం దిగువ నుంచి నీటిని తీసుకోవాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. 7న బోర్డు కార్యదర్శి రాసిన మరో లేఖలో శ్రీశైలంలో 800 అడుగుల వరకు, నాగార్జునసాగర్‌లో 500 అడుగుల వరకు నీటిని తీసుకోవాలని నిర్ణయం జరిగిందని, దీనిపై రాతపూర్వకంగా 12లోగా రెండు రాష్ట్రాలు అంగీకారాన్ని తెలపాలని కోరారు. అదేరోజుకు శ్రీశైలంలో నీటి నిల్వ కనీస నీటిమట్టానికి దిగువకు చేరుకుంది.

ఈనీరే శరణ్యం: శ్రీశైలం, నాగార్జునసాగర్ రిజర్వాయర్లలో కనీస నీటిమట్టాలకు దిగువన 41 టీఎంసీలు ఉన్నాయి. ఈ ఏడాది ఆగస్టు వరకూ రెండు రాష్ట్రాలు తాగునీటికి.. ఇతర అవసరాలకు ఈనీటిపైనే ఆధారపడి ఉండాల్సి వస్తుంది. ప్రస్తుతం విడుదల చేస్తున్న నీటిని కొనసాగిస్తే ఈ నెలాఖరుకే శ్రీశైలం 800 అడుగులకు చేరే అవకాశం ఉంది. తర్వాత ఈ రిజర్వాయర్ నుంచి ఏ ప్రాజెక్టుకు నీటిని తీసుకొనే అవకాశం ఉండదు. ఇప్పటికే తీసుకొన్న నీటినుంచే తాగునీటికి వినియోగించుకోవాల్సి ఉంటుంది. వర్షాకాలంలో ప్రవాహం మొదలయ్యేవరకు మళ్లీ నీటిని ఇవ్వడం సాధ్యం కాదు. గతేడాది ఆలస్యంగా నీటి ప్రవాహం మొదలైనా శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచే 425 టీఎంసీల వినియోగం జరిగింది. ఈఏడాది కనీస నీటిమట్టాలు కొనసాగించి ఉంటే వచ్చే ఖరీఫ్‌లో ఆరంభంలోనే నీటిని విడుదల చేసుకోవడానికి అవకాశం ఉండేది.

కాపీయింగ్ జరిగితే నాదే బాధ్యత

- ఇన్విజిలేటర్లు రాతపూర్వకంగా ఇవ్వాలి
- పరీక్షల విభాగం సంచాలకుడు ఆదేశాలు

ఈనాడు, హైదరాబాద్: 'నేను విధులు నిర్వహిస్తున్న గదిలో కాపీయింగ్ జరిగితే నాదే బాధ్యత... నాపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవచ్చు' అని పదో తరగతి పరీక్షల విధుల్లో పాల్గొనే ఇన్విజిలేటర్లు రాత పూర్వకంగా అధికారులకు లేఖలు ఇవ్వాలి. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుడు బి.సుధాకర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 15 నుంచి పది పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో డీఈఓలు, ఎంఈఓలు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. తమ పరిధిలో కాపీయింగ్ జరిగితే డీఈఓలు, ఎంఈఓలు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుంది. కాపీయింగ్ జరిగితే తమదే బాధ్యతని ఇన్విజిలేటర్లు డిక్లరేషన్లు ఇవ్వాలని నిర్బంధం చేయడం తగదని ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి భుజంగరావు, సదానందం గౌడ్ పేర్కొన్నారు.

గవర్నర్‌కు కాగ్ నివేదిక

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని ఆర్థిక స్థితిగతులకు సంబంధించిన కాగ్ నివేదికను గవర్నర్ నరసింహన్‌కు, రాష్ట్రప్రభుత్వానికి సోమవారం అందజేసినట్లు తెలంగాణ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ కార్యాలయం తెలిపింది. 2016-17 సంవత్సరానికి తెలంగాణ ప్రభుత్వ ఆర్థిక స్థితి, పద్దులు, బడ్జెట్ ప్రక్రియలకు సంబంధించి ఆడిట్ వ్యాఖ్యలు, పరిశీలనలు కాగ్ నివేదికలో విశ్లేషించినట్లు వివరించింది. శాసనసభలో కాగ్ నివేదికను ప్రవేశపెట్టేందుకు గవర్నర్‌కు, ప్రభుత్వానికి అందజేసినట్లు పేర్కొంది.

18 నుంచి ఎడ్‌సెట్ దరఖాస్తులు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో బీఈడీ, న్యాయవిద్య కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల సమర్పణ కాలపట్టికను తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రకటించింది. ఆయా పరీక్షల కమిటీల సమావేశం సోమవారం నిర్వహించి కాలపట్టికను ఖరారు చేసింది. సమావేశంలో విద్యామండలి ఛైర్మన్ తుమ్మల పాపిరెడ్డి, ఉపాధ్యక్షుడు లింబాద్రి, కన్వీనర్లు మధుమతి, ఎస్‌బీ ద్వారకానాథ్, సాంకేతిక సమన్వయకర్త రమేష్‌బాబు పాల్గొన్నారు. ఎడ్‌సెట్‌కు ఈనెల 18 నుంచి, లాసెట్, పీజీలాసెట్‌లకు 25 నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను సమర్పించే ప్రక్రియ మొదలవుతుంది. దరఖాస్తుల రుసుము దాదాపు రెట్టింపు పెంచారు. ఎడ్‌సెట్‌కు గతేడాది జనరల్ అభ్యర్థులకు రూ.400, ఎస్సీ, ఎస్టీలకు రూ.200 రుసుము ఉండగా ఈసారి అది వరుసగా రూ.650, రూ.450 పెరిగింది. లాసెట్, పీజీఎల్‌సెట్‌కు కూడా పెంచారు. లాసెట్‌కు ఈసారి రూ.500, రూ.800, పీజీఎల్‌సెట్‌కు రూ.600, 1000గా నిర్ణయించారు. ఎడ్‌సెట్‌కు ఈనెల 15న, లాసెట్‌కు 22న ప్రకటన జారీ చేస్తారు.

ఎడ్‌సెట్ కాలపట్టిక..

- **మార్చి 18– ఏప్రిల్ 20:** దరఖాస్తుల సమర్పణ
- **మే 16– 25:** రూ.5 వేల ఆలస్య రుసుంతో తత్కాల్ కింద అవకాశం
- **మే 31, జూన్ 1:** ప్రవేశ పరీక్ష(ఉదయం 10-12, మధ్యాహ్నం 2.30- 4.30 గంటల వరకు)
- **జూన్ 6:** ప్రాథమిక కీ విడుదల
- **జూన్ 11:** ర్యాంకులు వెల్లడి

లాసెట్, పీజీఎల్‌సెట్...

- మార్చి 25- ఏప్రిల్ 25: ఆన్‌లైన్‌లో దరఖాస్తుల సమర్పణ
- మే 17- 23: రూ.4 వేల ఆలస్య రుసుంతో...
- మే 25: పరీక్ష (ఉదయం 11- 12.30 గంటలు)
- మే 28: ప్రాథమిక కీ విడుదల
- జూన్ 10: ర్యాంకులు వెల్లడి

టీటీజాక్‌కు నూతన కార్యవర్గం

తెలంగాణ ఉపాధ్యాయుల ఐకాస(టీటీజాక్) నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి.సరోత్తంరెడ్డి(పీఆర్‌టీయూ టీఎస్), ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి(టీపీయూఎస్), ఉప ఛైర్మన్‌గా ఎస్.లక్ష్మారెడ్డి(జీహెచ్‌ఎంఏ), ఉప ప్రధాన కార్యదర్శి ఎల్లాల లక్ష్మారెడ్డి(టీఆర్‌టీఎఫ్) ఎన్నిక అయ్యారు.

తొలిసారి.. అగ్రస్థానం



దిల్లీ: భారత షూటర్లు అదరగొట్టారు. షూటింగ్ ప్రపంచకప్ చరిత్రలోనే తొలిసారి భారత్ అగ్రస్థానంతో టోర్నీని ముగించింది. మెక్సికోలో జరిగిన ఈ టోర్నీలో ఆఖరి రోజు పతకాలేమీ రాకపోయినా మొత్తం నాలుగు స్వర్ణాలు, ఓ రజతం, ఓ కాంస్యం సాధించి పతకాల పట్టికలో ప్రథమ స్థానంలో నిలిచింది. సోమవారం పురుషుల స్కీట్‌లో విన్సెంట్ హన్‌కాక్ (అమెరికా) విజేతగా నిలిచాడు. భారత షూటర్లు స్మిత్ సింగ్ 15వ స్థానం, అంగద్ బజ్వా 18వ స్థానాలతో సంతృప్తి చెందారు. ఈ టోర్నీలో భారత్ తరఫున షెజార్ రిజ్వీ, మను బాకర్, అఖిల్ షెరాన్, ఓమ్ ప్రకాశ్ మిత్రావల్ స్వర్ణాలతో మెరిశారు.

ఛాంపియన్స్

ఫైనల్‌కు చేరువలో..

ముక్కోణపు టీ20 సిరీస్‌లో భారత్ ఫైనల్‌కు చేరువైంది. వరుసగా రెండో విజయం సాధించిన భారత్.. ఫైనల్ అవకాశాల్ని మరింత మెరుగుపరుచుకుంది. తొలి మ్యాచ్‌లో తనను కంగుతినిపించిన లంకపై సోమవారం భారత్ ప్రతీకార విజయం సాధించింది. మొదట తొలి అర్ధంలో ఆధిపత్యం చలాయించిన లంకను రెండో అర్ధంలో బౌలర్లు కట్టడి చేయగా.. భారత్ ఛేదన కూడా అదే తరహాలో సాగింది. మొదట్లో లంకేయుల ఆధిపత్యమే సాగినప్పటికీ.. తర్వాత బ్యాట్స్‌మెన్ సమష్టిగా సత్తా చాటడంతో లక్ష్యాన్ని భారత్ సులువుగానే ఛేదించింది.



పాండే (42 నాటౌట్)

● భారత్‌కు వరుసగా రెండో గెలుపు
● లంకపై ప్రతీకార విజయం

కొలంబో

ముక్కోణపు టీ20 సిరీస్‌లో భాగంగా సోమవారం ఆతిథ్య శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. వర్షం వల్ల 19 ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో మొదట లంకను 152/9కు కట్టడి చేసిన భారత్. . లక్ష్యాన్ని ఇంకో 9 బంతులు మిగిలుండగానే 4 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. లంక ఇన్నింగ్స్‌లో కుశాల్ మెండిస్ (55; 38 బంతుల్లో 3×4, 3×6) ఒక్కడే సత్తా చాటాడు. శార్దూల్ ఠాకూర్ (4/27), వాషింగ్టన్ సుందర్ (2/21) లంక పతనంలో కీలక పాత్ర పోషించారు. బ్యాటింగ్‌లో మనీష్ పాండే (42 నాటౌట్; 31 బంతుల్లో 3×4, 1×6), దినేశ్ కార్తీక్ (39 నాటౌట్; 25 బంతుల్లో 5×4), సురేశ్ రైనా (27; 15 బంతుల్లో 2×4, 2×6) రాణించారు. శార్దూల్ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా ఎంపికయ్యాడు. బుధవారం భారత్ తన చివరి లీగ్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను ఢీకొంటుంది. ఆ మ్యాచ్‌లో గెలిస్తే ఫైనల్ బెర్తు ఖరారవుతుంది. ఆ మ్యాచ్‌లో ఓడినా అవకాశాలుంటాయి. కాకపోతే చిత్తుగా ఓడకూడదు.



'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' శార్దూల్

ఆరంభంలో అలజడి: లక్ష్యం చిన్నదే అయినా భారత్ ఛేదన ఆశించిన స్థాయిలో ఆరంభం కాలేదు. పేలవ ఫామ్‌ను కొనసాగిస్తూ రోహిత్ శర్మ (11) మరోసారి తక్కువ స్కోరుకే వెనుదిరిగాడు. వరుసగా సిక్స్, ఫోర్ కొట్టి ఊపుమీద కనిపించిన రోహిత్‌ను చూస్తే అతను గాడిన పడ్డట్లే కనిపించింది. కానీ అంతలోనే స్పిన్నర్ ధనంజయ బౌలింగ్‌లో ఒక పేలవ షాట్ ఆడి వికెట్ సమర్పించుకున్నాడు. ఫామ్‌లో ఉన్న ధావన్ (8) కూడా విఫలమవడంతో భారత్ ఒత్తిడిలో పడింది. దీంతో భారత్ 22/2తో నిలిచింది. ఈ దశలో రైనా చెలరేగి ఆడాడు. ఉన్నంతసేపు విధ్వంసకర షాట్లతో లంక బౌలర్ల లయను దెబ్బ తీసే ప్రయత్నం చేశాడు. ఏడో ఓవర్లో అతను ఔటయ్యే సమయానికి స్కోరు 62/3. తర్వాత స్కోరు వేగం తగ్గింది. చాన్నాళ్ల విరామం తర్వాత టీ20 ఆడే అవకాశం దక్కించుకున్న కేఎల్ రాహుల్ (18) ఉన్నంతసేపు ఆత్మవిశ్వాసంతోనే కనిపించినా.. అనూహ్య రీతిలో హిట్‌వికెట్ రూపంలో వెనుదిరిగాడు. భారత్ 10 ఓవర్లకు 85/4తో నిలిచింది. ఐతే ఇన్నింగ్స్ ద్వితీయార్ధంలో భారత్‌కు ఏమాత్రం ఇబ్బంది లేకపోయింది. మనీష్ పాండే, దినేశ్ కార్తీక్ ఏ తడబాటూ లేకుండా సమయోచితంగా షాట్లు ఆడుతూ జట్టును లక్ష్యం దిశగా నడిపించారు. సాధించాల్సిన రన్‌రేట్ అదుపులోనే ఉండటంతో 18వ ఓవర్లోనే ఛేదన పూర్తయింది.

తొలి సగం ధనాధన్.. రెండో సగంలో టపటపా: అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో సగం వరకు లంక బ్యాట్స్‌మెన్ జోరు సాగగా.. రెండో సగంలో భారత బౌలర్లు పుంజుకుని క్రమం తప్పకుండా వికెట్లు పడగొట్టి ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే కట్టడి చేశారు. లంక ఇన్నింగ్స్‌కు కుశాల్ మెండిస్ ధనాధన్ ఆరంభాన్నిచ్చాడు. ఇన్నింగ్స్ రెండో బంతికే సిక్సర్ బాదిన అతను.. ఆ తర్వాత కూడా దూకుడు కొనసాగించాడు. మరో ఓపెనర్ గుణతిలక (17)తో పాటు ప్రమాదకర కుశాల్ పెరీరా (3)లను భారత బౌలర్లు త్వరగానే ఔట్ చేసినప్పటికీ.. మెండిస్‌ను ఆపలేకపోయారు. అతడికి తరంగ (22) తోడవడంతో 10 ఓవర్లకు 94/2తో లంక పైచేయి సాధించింది. ఐతే తర్వాతి ఓవర్ నుంచి లంక ఇన్నింగ్స్ గాడి తప్పింది. భారత బౌలర్లందరూ సమష్టిగా సత్తా చాటి లంకను దెబ్బ తీశారు. 10-15 మధ్య 5 ఓవర్ల వ్యవధిలో 4 వికెట్లు పడగొట్టిన భారత్.. 32 పరుగులే ఇచ్చింది. చివర్లో శనక (19) కొన్ని షాట్లు ఆడటంతో లంక 150 దాటగలిగింది. చివరి ఓవర్లో శార్దూల్ ఠాకూర్ రెండు వికెట్లు పడగొట్టి ఆరు పరుగులే ఇచ్చాడు. అతను ఇన్నింగ్స్ ఆద్యంతం చక్కగా బౌలింగ్ చేశాడు. యువ స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్ (4-0-21-2) తొలి బంతికే సిక్సర్ సమర్పించుకున్నప్పటికీ.. ఆత్మవిశ్వాసం కోల్పోకుండా చక్కటి ప్రదర్శన చేశాడు. ఈ మ్యాచ్‌కు భారత్ రిషబ్ పంత్ స్థానంలో కేఎల్ రాహుల్‌ను తీసుకుంది. సస్పెన్షన్ వేటుకు గురైన కెప్టెన్ చండిమాల్ స్థానంలో శ్రీలంక.. ఫాస్ట్‌బౌలర్ లక్మల్‌ను ఎంచుకోవడం విశేషం. తిసార పెరీరా జట్టుకు నాయకత్వం వహించాడు.

శ్రీలంక ఇన్నింగ్స్: గుణతిలక (సి) రైనా (బి) శార్దూల్ 17; కుశాల్ మెండిస్ (సి) రోహిత్ (బి) చాహల్ 55; కుశాల్ పెరీరా (బి) సుందర్ 3; తరంగ (బి) శంకర్ 22; తిసార పెరీరా (సి) చాహల్ (బి) శార్దూల్ 15; జీవన్ మెండిస్ (బి) సుందర్ 1; శనక (సి) కార్తీక్ (బి) శార్దూల్ 19; అకిల ధనంజయ (సి) రాహుల్ (బి) ఉనద్కత్ 5; లక్మల్ నాటౌట్ 5; చమీర (సి) ఉనద్కత్ (బి) శార్దూల్ 0; ప్రదీప్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 10 **మొత్తం:** (19 ఓవర్లలో 9 వికెట్లకు) **152**

వికెట్ల పతనం: 1-25, 2-34, 3-96, 4-113, 5-118, 6-120, 7-146, 8-151, 9-151

బౌలింగ్: ఉనద్కత్ 3-0-33-1; సుందర్ 4-0-21-2; శార్దూల్ ఠాకూర్ 4-0-27-4; చాహల్ 4-0-34-1; విజయ్ శంకర్ 3-0-30-1; రైనా 1-0-6-0

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) కుశాల్ మెండిస్ (బి) ధనంజయ 11; ధావన్ (సి) తిసార పెరీరా (బి) ధనంజయ 8; రాహుల్ హిట్ వికెట్ (బి) కుశాల్ మెండిస్ 18; రైనా (సి) పెరీరా (బి) ప్రదీప్ 27; మనీష్ పాండే నాటౌట్ 42; దినేశ్ కార్తీక్ నాటౌట్ 39; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం:** (17.3 ఓవర్లలో 4 వికెట్లకు) **153**

వికెట్ల పతనం: 1-13, 2-22, 3-62, 4-85

బౌలింగ్: లక్మల్ 2-0-19-0; ధనంజయ 4-0-19-2; చమీర 3-0-33-0; నువాన్ ప్రదీప్ 2.3-0-30-1; జీవన్ మెండిస్ 4-0-34-1; తిసార పెరీరా 2-0-17-0

షమి అలాంటోడు కాదు: ధోని



ముంబయి: పలువురు మహిళలతో వివాహేతర సంబంధం పెట్టుకున్నట్లు, భార్యను వేధించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న టీమ్‌ఇండియా ఫాస్ట్‌బౌలర్ మహ్మద్ షమికి మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోని మద్దతుగా నిలిచాడు. తనకు తెలిసి షమి అలాంటి వాడు కాదని ధోని అభిప్రాయపడ్డాడు. "ఇది షమి వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయం. దీనిపై నేను వ్యాఖ్యానించకూడదు. ఐతే నాకు తెలిసి షమి గొప్ప వ్యక్తి. అతను భార్య, దేశాన్ని వంచించడు" అని ధోని అన్నాడు. షమి కెరీర్ ఎదుగుదలలో కెప్టెన్‌గా ధోని కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే.

షమి దుబాయ్‌కెందుకెళ్లాడు?: షమిపై అతడి భార్య పలు ఆరోపణలు చేస్తూ కేసులు పెట్టిన నేపథ్యంలో కోల్‌కతా పోలీసులు విచారణ మొదలుపెట్టారు. తాను ఇంతకుముందే పెళ్లి చేసుకున్న పాకిస్థాన్ అమ్మాయిని కలవడానికి షమి ఇటీవలే దుబాయ్ వెళ్లినట్లు అతడి భార్య ఆరోపించిన నేపథ్యంలో.. దక్షిణాఫ్రికా పర్యటన ముగిసిన అనంతరం షమి దుబాయ్ వెళ్లడంపై సమాచారం ఉందా, దానికి సంబంధించి వివరాలు చెప్పాలని కోరుతూ పోలీసులు బీసీసీఐకి లేఖ రాశారు.



ఒకటి కంటే ఎక్కువే!

ఆల్ ఇంగ్లాండ్ పతకావకాశాలపై **గోపీచంద్** ఆశాభావం

ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్‌షిప్.. ప్రపంచ బ్యాడ్మింటన్‌లో అత్యంత పురాతన టోర్నీ. భారత్ తరఫున దిగ్గజ ఆటగాళ్లు ప్రకాశ్ పదుకొణె, పుల్లెల గోపీచంద్ మాత్రమే ఈ టైటిల్ సాధించారు. ఒలింపిక్స్, ప్రపంచ ఛాంపియన్‌షిప్, సూపర్ సిరీస్‌లలో సత్తాచాటిన సైనా నెహ్వాల్, పి.వి. సింధులకు ఆల్ ఇంగ్లాండ్ ఇప్పటికీ అందని ద్రాక్షే. అందరి కంటే అధికంగా 10 సార్లు ఆల్ ఇంగ్లాండ్‌లో ఆడిన సైనాకు 2015లో రన్నరప్‌గా నిలవడమే అత్యుత్తమం. ఐదు మార్లు బరిలో దిగిన సింధు ఇప్పటివరకు కనీసం క్వార్టర్ ఫైనల్ దాటలేదు. చూస్తుండగానే మరోసారి ఆల్ ఇంగ్లాండ్ వచ్చేసింది. బుధవారమే షురూ. ఐతే ఈసారి భారత క్రీడాకారులు విజేతలుగా నిలిచేందుకు మెరుగైన అవకాశాలు ఉన్నాయంటున్న చీఫ్ కోచ్ గోపీచంద్‌తో ముఖాముఖి 'ఈనాడు'కు ప్రత్యేకం.

■ ఆల్ ఇంగ్లాండ్‌లో ఈసారైనా టైటిల్ ఆశించొచ్చా..?

భారత జట్టు పూర్తిస్థాయిలో సన్నద్ధమైంది. 3 వారాల సమయం దొరకడంతో క్రీడాకారులంతా చక్కగా సాధన చేశారు. శ్రీకాంత్, ప్రణయ్, సాయిప్రణీత్ ప్రాక్టీస్‌లో మెరుగ్గా కనిపించారు. సైనా, సింధు, సిక్కి, అశ్విని, ప్రణవ్, సుమీత్, మను అత్రిలకు మంచి సన్నాహకం లభించింది. ఈసారి మెరుగైన ఫలితాలతో వస్తామని ఆశిస్తున్నా.

■ కచ్చితంగా గెలవొచ్చు అనుకునే విభాగమేది..?

ఇప్పటి వరకు ఏదో ఒక విభాగంలో టైటిల్ సాధిస్తే గొప్ప అనుకునే వాళ్లం. సైనా లేదా సింధు నుంచి టైటిల్ ఆశించేవాళ్లం. ఇప్పుడు పరిస్థితి మారింది. అందరూ బాగా ఆడుతున్నారు. పురుషుల సింగిల్స్, మహిళల సింగిల్స్, డబుల్స్‌లో భారత క్రీడాకారులు మెరుగ్గా కనిపిస్తున్నారు. ఒకటి కంటే ఎక్కువ విభాగాల్లో విజేతలుగా నిలిచే అవకాశాలు అధికంగా ఉన్నాయి. డబుల్స్‌లో భారత క్రీడాకారులు చాలా మెరుగయ్యారు. జపాన్, ఇండోనేసియా ఓపెన్‌లలో భారత జోడీలు సెమీస్ చేరుకున్నాయి. ఆల్ ఇంగ్లాండ్‌లో కూడా ఈస్థాయి పోటీనే ఎదురవ్వొచ్చు. కాబట్టి ఈసారి మంచి ఫలితాల్ని రాబట్టే సత్తా మనోళ్లకుంది.

■ శ్రీకాంత్ గాయం నుంచి పూర్తిగా కోలుకున్నట్లేనా?

నిరుడు శ్రీకాంత్ 4 సూపర్ సిరీస్ టైటిళ్లు గెలిచాడు. ఐతే గత అక్టోబరు నుంచి గాయాలతో ఇబ్బంది పడుతున్నాడు. అతని శిక్షణలో కొన్ని మార్పులు చేశాం. ఎక్కువ టోర్నీలు ఆడించలేదు. ఆరు నెలల్లో చాలా పురోగతి సాధించాడు. ఫిట్‌నెస్ కోసం చాలా కష్టపడ్డాడు. ఆల్ ఇంగ్లాండ్‌లో శ్రీకాంత్ నుంచి మెరుగైన ఫలితం ఆశిస్తున్నా.

■ భారత క్రీడాకారులకు ఎదురైన డ్రా ఎలా ఉంది?

సింధు, శ్రీకాంత్, ప్రణయ్, సాయిప్రణీత్‌లకు సులువైన డ్రా పడింది. సైనా తొలి రౌండ్లో తై జు యింగ్ (చైనీస్ తైపీ)తో తలపడనుంది. సైనాకు కాస్త కఠినమైన డ్రా ఎదురైనట్లే. అత్యున్నత స్థాయిలో ఆడుతున్నప్పుడు ఒకటి, రెండు రౌండ్లలో గట్టి ప్రత్యర్థులు ఎదురవడం సహజం. అలాంటి వాళ్లపై గెలిచినప్పుడే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. తై జుపై సైనా గెలుస్తుందనే నమ్మకంతో ఉన్నా.

■ కొత్తగా ప్రవేశపెడుతున్న సర్వీస్ నిబంధనతో ఇబ్బందేంటి?

సర్వీస్ సందర్భంగా షటిల్‌ను తాకే సమయంలో రాకెట్ కోర్టు నుంచి 1.15 మీటర్లకు మించి ఎత్తులో ఉండకూడదన్నది కొత్త నిబంధన. పొడగరులకు ఇది నష్టం. పొట్టిగా ఉన్నవాళ్లకు లాభం. ఈ నిబంధన వల్ల సాత్విక్, ప్రణయ్, సింధులకు కొంచెం ఇబ్బందే. ఐతే సింగిల్స్ కంటే డబుల్స్ క్రీడాకారులపై ఈ నిబంధన ప్రభావం అధికం.

■ అగ్రశ్రేణి క్రీడాకారులు కనీసం 12 టోర్నీలు ఆడాలన్న నిబంధనను బీడబ్ల్యూఎఫ్ వెనక్కి తీసుకునే అవకాశముందా?

ఏడాదిలో 12 టోర్నీలు ఆడాలన్న నిబంధన అన్ని దేశాల క్రీడాకారులకు కష్టమే. మనకు ఇంకాస్త ఎక్కువ కష్టం. మిగతా వాళ్లతో పోలిస్తే భారత క్రీడాకారులు కామన్వెల్త్ క్రీడలు, ఆసియా క్రీడలు, పీబీఎల్‌తో కలిపి అదనంగా 2 నెలలు ఎక్కువగా ఆడాలి. ప్రపంచ ఛాంషియన్‌షిప్, థామస్.. ఉబర్ కప్, ఇండియా ఓపెన్‌తో సహా మొత్తం 18, 19 టోర్నీలు భారత క్రీడాకారులు ఆడాల్సి ఉంటుంది. ఇలాంటి నిబంధన సరైంది కాదు

- ఈనాడు, హైదరాబాద్

జకోవిచ్‌కు షాక్

ఇండియన్‌వెల్స్: ఇండియన్‌వెల్స్ మాస్టర్స్‌లో ఐదుసార్లు ఛాంపియన్ నొవాక్ జకోవిచ్ కథ ముగిసింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 109వ స్థానంలో క్వాలిఫయర్ తారో డేనియల్ (జపాన్) అతడికి షాకిచ్చాడు. సోమవారం జరిగిన రెండో రౌండ్లో తారో 7-6 (7-3), 4-6, 6-1తో జకోవిచ్ (సెర్బియా)పై సంచలన విజయం సాధించాడు. జకోవిచ్ 62 అనవసర తప్పిదాలు చేశాడు. పునారాగమనంలో జకోవిచ్‌కు ఇది రెండో టోర్నమెంట్ మాత్రమే. కుడి మోచేయి గాయం కారణంగా 2017 వింబుల్డన్ తర్వాత జకోవిచ్ ఆటకు దూరమయ్యాడు. ''పూర్తిగా లయను కోల్పోయా. గత కొన్ని వారాలు అనారోగ్యంతో కాస్త ఇబ్బందిపడ్డా'' అని మ్యాచ్ అనంతరం జకోవిచ్ వ్యాఖ్యానించాడు.



బోల్టన్ (100 నాటౌట్)

భారత మహిళల ఓటమి

ఆస్ట్రేలియాతో తొలి వన్డే

వదోదర: ఆస్ట్రేలియా మహిళలతో వన్డే సిరీస్‌ను భారత్ పేలవంగా ఆరంభించింది. సోమవారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 8 వికెట్ల తేడాతో ఓడిపోయింది. మొదట బ్యాటింగ్‌లో భారత్ తడబడింది. ఎడమచేతి వాటం స్పిన్నర్ జొనాసెన్ (4/30), లెగ్‌స్పిన్నర్ అమండ జేడ్ వెల్లింగ్టన్ (3/24) విజృంభించడంతో 50 ఓవర్లలో 200 పరుగులకు ఆలౌటైంది. ఓ దశలో 113 పరుగులకే 7 వికెట్లు కోల్పోయిన భారత్‌ను పూజ వస్త్రాకర్ (51), సుష్మా వర్మ (41) ఆదుకున్నారు. ఎనిమిదో వికెట్‌కు 76 పరుగులు జోడించారు. ఓపెనర్ పూనమ్ రౌత్ 37 పరుగులు చేసింది. నికోల్ బోల్టన్ (100 నాటౌట్) చెలరేగడంతో లక్ష్యాన్ని ఆస్ట్రేలియా 32.1 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి అలవోకగా ఛేదించింది. అనారోగ్యం కారణంగా ఈ మ్యాచ్‌కు మిథాలీరాజ్ దూరమైంది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆసీస్ 1-0 ఆధిక్యం సంపాదించింది. రెండో వన్డే గురువారం జరుగుతుంది.



యుకి సంచలనం

ఇండియన్‌వెల్స్: భారత డేవిస్‌కప్ ఆటగాడు యుకి బాంబ్రి తన కెరీర్‌లోనే అతి పెద్ద విజయం సాధించాడు. ఇండియన్ వెల్స్ మాస్టర్స్ రెండో రౌండ్లో 6-4, 6-4తో ప్రపంచ 12వ ర్యాంకు ఆటగాడు లుకాస్ పౌలీ (ఫ్రాన్స్)కి షాకిచ్చాడు. యుకి ప్రస్తుతం ర్యాంకింగ్స్‌లో 110వ స్థానంలో ఉన్నాడు. అతడు తన తర్వాతి రౌండ్లో ప్రపంచ 21వ ర్యాంకు ఆటగాడు సామ్ క్వెరీ (అమెరికా)ను ఢీకొంటాడు. ''నేను బాగా సర్వ్ చేశా. దూకుడుగా ఆడా. అదే కీలకం'' అని యుకి చెప్పాడు. యుకి గత ఆగస్టులో ప్రపంచ నంబర్-22 గేల్ మోన్‌ఫిల్స్ (ఫ్రాన్స్)కు షాకిచ్చాడు.

దెబ్బకు దెబ్బ

రెండో టెస్టులో ఆస్ట్రేలియాపై దక్షిణాఫ్రికా విజయం

పోర్ట్ ఎలిజబెత్: ఆస్ట్రేలియాతో నాలుగు టెస్టుల సిరీస్‌లో దక్షిణాఫ్రికా గట్టిగా పుంజుకుంది. కంగారూల్ని దెబ్బ దెబ్బ తీసింది. తొలి టెస్టు ఓటమి నుంచి తేరుకున్న సఫారీ జట్టు రెండో టెస్టులో ఘనవిజయం సాధించింది. నాలుగో రోజు మధ్యాహ్నానికే ముగిసిన ఈ టెస్టులో దక్షిణాఫ్రికా 6 వికెట్ల తేడాతో నెగ్గింది. సోమవారం 101 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఆ జట్టు.. 22.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. 32 పరుగులకే ఓపెనర్లు ఔటైనప్పటికీ హషీమ్ ఆమ్లా (27), ఏబీ డివిలియర్స్ (28) నిలబడటంతో దక్షిణాఫ్రికాకు పెద్దగా ఇబ్బంది లేకపోయింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 180/5తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా.. ఇంకో 13 ఓవర్లు మాత్రమే ఆడి 239 పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను ముగించింది. ఆట మొదలైన కొన్ని నిమిషాల్లోనే మిచెల్ మార్ష్ (45) ఔటైపోగా.. తర్వాత కూడా వికెట్ల పతనం కొనసాగింది. టిమ్ పైన్ 28 పరుగులతో అజేయంగా నిలిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు తీసిన రబాడ.. రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు పడగొట్టాడు. అతడికే 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఈ విజయంతో నాలుగు టెస్టుల సిరీస్‌ను దక్షిణాఫ్రికా 1-1తో సమం చేసింది. మూడో టెస్టు ఈ నెల 22న కేప్‌టౌన్‌లో మొదలవుతుంది.



'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' రబాడ

రబాడపై రెండు మ్యాచ్‌ల నిషేధం

దక్షిణాఫ్రికాకు విజయానందం.. అంతలోనే ఆ ఆనందాన్ని తగ్గించే పరిణామం! ఆస్ట్రేలియాతో రెండో టెస్టులో అద్భుత ప్రదర్శనతో జట్టుకు విజయాన్నందించిన కాగిసో రబాడ.. తర్వాతి రెండు టెస్టులకూ దూరమయ్యాడు. ఈ మ్యాచ్‌లో రెండుసార్లు ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించిన రబాడపై రెండు మ్యాచ్‌ల నిషేధం పడింది. ముందు మ్యాచ్ తొలి రోజు ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవెన్ స్మిత్‌ను ఔట్ చేసిన అనంతరం అతడి భుజానికి భుజం తాకిస్తూ వెళ్లినందుకు రిఫరీ రబాడ మ్యాచ్ ఫీజులో 50 శాతం కోతతో పాటు మూడు అయోగ్యత పాయింట్లు విధించాడు. తాజాగా ఆస్ట్రేలియాతో రెండో ఇన్నింగ్స్ సందర్భంగానూ రబాడ హద్దులు దాటాడు. వార్నర్ ఔటయ్యాక అతణ్ని సాగనంపుతూ రెచ్చగొట్టేలా వ్యవహరించాడు. ఈ తప్పిదంతో అతడి మొత్తం అయోగ్యత పాయింట్లు ఎనిమిదికి చేరుకున్నాయి. దీంతో ఐసీసీ నిబంధనల ప్రకారం అతడిపై రెండు టెస్టుల నిషేధం పడింది. రబాడ విషయంలో రిఫరీ కఠినంగా వ్యవహరించాడని భావిస్తున్న దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు అతడిపై పడ్డ సస్పెన్షన్ విషయంలో అప్పీల్ చేయాలని భావిస్తోంది. దక్షిణాఫ్రికా రెండో టెస్టులో నెగ్గడంతో సిరీస్ రసవత్తరంగా మారిన సమయంలో తిరుగులేని ఫామ్‌లో ఉన్న రబాడ దూరం కావడం ఆ జట్టును బలహీనపరచడమే కాదు, సిరీస్‌పై ఆసక్తినే తగ్గించేస్తుందనడంలో సందేహం లేదు.



చికిత్స పొందుతున్న జయప్రీత్‌సింగ్

నిట్‌లో విద్యార్థిపై హత్యాయత్నం

ఏడుగురిపై కేసు నమోదు

కాజీపేట టౌన్, న్యూస్‌టుడే: వరంగల్ అర్బన్ జిల్లా కాజీపేటలోని జాతీయ సాంకేతిక విద్యాలయం(నిట్)లో ఆదివారం రాత్రి విద్యార్థిపై కత్తులతో దాడి చేసి గాయపర్చిన ఏడుగురు నిట్ విద్యార్థులపై స్థానిక పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. కాజీపేట పోలీస్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్. అజయ్ తెలిపిన ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన బీటెక్ చివరి సంవత్సర విద్యార్థి జయప్రీత్‌సింగ్‌కు, అదే కళాశాలలో ఎంటెక్ చివరి ఏడాది చదువుతున్న హరియాణాకు చెందిన అమిత్‌యాదవ్ వర్గాల మధ్య స్టూడెంట్స్ కౌన్సిల్ ఎన్నికల నాటి నుంచి గొడవలు జరుగుతున్నాయి. కళాశాల స్టూడెంట్ డీన్ రెండు వర్గాలకు కౌన్సెలింగ్ ఇవ్వడంతోపాటు తప్పు చేసిన వారికి జరిమానా విధించి ఇకపై గొడవలకు దిగొద్దని హెచ్చరించారు. నిట్ వసంతోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి ప్రోనైట్ షో జరుగుతుండగా అమిత్‌యాదవ్ తన మిత్రులతో కలిసి వచ్చి జయప్రీత్‌సింగ్‌పై కత్తి, రాడ్లతో దాడి చేశారు. అక్కడే ఉన్న పోలీసులు కలగజేసుకుని వారిని శాంతింపజేశారు. తీవ్రంగా గాయపడిన జయప్రీత్‌సింగ్‌ను హన్మకొండలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అమిత్‌యాదవ్, ధీరజ్‌కుమార్, ఫంకజ్‌యాదవ్, నితేష్‌కుమార్, అలివారిష్, రవికాంత్‌యాదవ్, రోహిత్‌కుమార్‌పై సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏడుగురిలో ఆరుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. రోహిత్‌కుమార్ పరారీలో ఉన్నాడు.

వక్ఫ్ భూముల కబ్జాను అడ్డుకోండి: మహమూద్ అలీ

ఈనాడు, హైదరాబాద్: మాదాపూర్‌లోని గుట్టల బేగంపేట్‌లో ఉన్న 91 ఎకరాల వక్ఫ్ భూములను పరిరక్షించేందుకు ప్రభుత్వ శాఖలు చర్యలు చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ ఆదేశించారు. సోమవారం సచివాలయంలో భూముల పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. ఈ భూములపై న్యాయస్థానంలో వ్యాజ్యం ఉన్నప్పటికీ కొందరు కబ్జాకు పాల్పడుతున్నారని, మరికొందరు నిర్మాణాలు చేస్తున్నారని ఆయన తెలిపారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ రఘునందన్‌రావు, ప్రభుత్వ సలహాదారు ఏకే ఖాన్, వక్ఫ్ బోర్డు ఛైర్మన్ సలీం, మైనారిటీ సంక్షేమశాఖ కార్యదర్శి దాన కిశోర్, మాదాపూర్ డీసీపీ విశ్వప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి దారుణ హత్య

- జాతీయ రహదారిపై కత్తులతో విచక్షణారహితంగా దాడి
- పాత కక్షలే కారణం
- హైదరాబాద్‌లో కలకలం

మూసాపేట - న్యూస్‌టుడే

అది హైదరాబాద్ నగరంలోని కూకట్‌పల్లి జాతీయ రహదారి.. సమయం ఉదయం 8.20 గంటలు.. పాదచారులు, వాహనాలతో ఆ ప్రాంతమంతా రద్దీగా.. రణగొణ ధ్వనులతో నిండి ఉంది.. ఉన్నట్లుండి కలకలం.. ఇంటర్ పరీక్ష రాయడానికి తన స్నేహితులతో మోటారుసైకిల్‌పై వెళ్తున్న ఓ విద్యార్థిపై నలుగురు యువకులు కత్తులతో దాడిచేశారు. తప్పించుకుని పరుగెత్తిన అతడిని వెంటపడి మరీ దారుణంగా చంపారు. కళ్ల ముందే జరిగిన ఈ ఘోరాన్ని చూసినవారు భీతావహులై పరుగులు తీశారు. పాతకక్షల కారణంగానే ఈ హత్య జరిగినట్లు తెలుస్తోంది. తీవ్ర సంచలనం సృష్టించిన ఈ ఘటన వివరాలు ప్రత్యక్షసాక్షులు, పోలీసులు తెలిపిన ప్రకారం ఇలా ఉన్నాయి..

మూసాపేట జనతానగర్‌కు చెందిన పాల వ్యాపారులు రాజు, రాణి దంపతులకు నలుగురు కుమారుల్లో ఎలగల సుధీర్(18) చిన్నవాడు. కూకట్‌పల్లిలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ సీఈసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి. పరీక్ష రాయడానికి సుధీర్ ఉదయం 8.10 గంటల సమయంలో స్నేహితులు మేఘనాథ్, సాయిలతో కలిసి మోటారుసైకిల్‌పై వెళుతుండగా, కూకట్‌పల్లిలోని సాగర్ హోటల్‌వద్ద వీరి వాహనాన్ని వెనుకనుంచి మోటారుసైకిళ్లపై వచ్చిన జిల్లా మహేష్, బైపేట నవీన్, కొర్రె తేజ, ఇప్పలి కృష్ణలు అడ్డగించారు. తనపై దాడి జరుగుతోందనే విషయాన్ని గ్రహించిన సుధీర్ బిగ్గరగా కేకలు వేస్తూ పరుగెత్తి అటుగా వెళ్తున్న ఓ ప్రైవేటు పాఠశాల బస్సులోకి ఎక్కాడు. మహేష్,




ఘటనా స్థలంలో సుధీర్ మృతదేహం

అతడి స్నేహితులు సుధీర్‌ను వెంటాడి ఆ బస్సులోకి ఎక్కి అతడిని కిందకు లాగారు. తాను పరీక్ష రాయడానికి వెళ్తున్నానని.. తిరిగి వచ్చాక మాట్లాడుకుందామని సుధీర్ వారితో ప్రాధేయపడినా కనికరించకుండా వారు కొబ్బరిబొండాలు కొట్టే రెండు కత్తులతో మెట్రోపిల్లరు నంబరు 33వద్ద సుధీర్‌పై విచక్షణా రహితంగా దాడిచేశారు. తల, మెడ, ముఖాలపై తీవ్రగాయాలు కావడంతో సుధీర్ రక్తపు మడుగులో అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. ఓ కత్తి హతుడి తలలో లోతుగా ఇరుక్కుపోయి అలాగే ఉండిపోయింది. అడ్డుకోబోయిన సుధీర్ స్నేహితులపై కూడా మహేష్ అనుచరులు దాడికి యత్నించారు. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ హెడ్‌కానిస్టేబుల్ ప్రభాకర్, కానిస్టేబుల్ అంజిలు మహేష్ అనుచరులను అడ్డుకోబోగా వారినీ కత్తులతో బెదిరించారు. వారిద్దరూ చాకచక్యంగా వ్యవహరించి, నలుగురిలో మహేష్‌ను పట్టుకుని కూకట్‌పల్లి పోలీసులకు అప్పగించారు. మిగతా ముగ్గురూ పరారీలో ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. వారిలో ఇప్పలి కృష్ణ(19) పలు కేసుల్లో నిందితుడు. ఓ బాలికపై అత్యాచారం కేసులో అతడు జైలుకు వెళ్లి ఇటీవలే వచ్చాడు. నగరంలోని వేర్వేరు ఠాణాల్లో మూడుచోరీ కేసులు కూడా అతడిపై నమోదై ఉన్నాయి.

చిలికి చిలికి గాలివానై..

మృతి చెందిన సుధీర్ మిత్రులకు మహేష్ అనుచరులతో ఈనెల 10న మూసాపేట గూడ్స్‌షెడ్ రోడ్డులో గొడవ జరిగింది. మహేష్ మిత్రుడైన ఇప్పలి కృష్ణ వర్గంతో సుధీర్ మిత్రులు ఘర్షణ పడ్డారు. సుధీర్ మిత్రుడి సోదరిని నిందితుల్లో ఒకరు వేధించడం కూడా ఘటనకు ఓ కారణమై ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో పరస్పరం దాడులు, చంపుతామంటూ హెచ్చరికలు చేసుకున్నట్లు తెలుస్తోంది. సుధీర్ మిత్రులు నలుగురిపై కూకట్‌పల్లి పోలీసులు కేసు కూడా నమోదుచేశారు. హత్య ఘటనలో పాల్గొన్నది, ఇటీవల ఘర్షణల్లో ఉన్న యువకులంతా ఒకే బస్తీకి చెందిన వారు, అందరూ 20 ఏళ్లలోపు వయసు వారే. నిందితులు పక్కా ప్రణాళికతోనే హత్యకు పాల్పడినట్లు స్పష్టమవుతోంది. పరీక్ష రాసేందుకు వెళ్లిన కుమారుడు నిమిషాల వ్యవధిలోనే దారుణంగా హత్యకు గురయ్యాడని తెలిసి ఘటనా స్థలికి చేరుకున్న తల్లిదండ్రులు విలపించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. మృతుడి తండ్రి రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురు నిందితులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు కూకట్‌పల్లి సీఐ వడ్డె ప్రసన్నకుమార్ చెప్పారు.



పోలీసుల అదుపులో నిందితుడు మహేష్

తెదేపా మహిళా నేత హత్య

- కుమార్తెను కట్టేసి మరో గదిలో బంధించిన దుండగులు
- ఆ చిన్నారి చూస్తుండగానే తల్లిపై దాడి

కాటారం, న్యూస్‌టుడే: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం తెలుగు మహిళా అధ్యక్షురాలు రామిల్ల కవిత(30) దారుణ హత్యకు గురయ్యారు. ఆదివారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న ఆమెపై దాడికి పాల్పడిన దుండగులు కిరాతకంగా హత్య చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. కొత్తపల్లికి చెందిన కవితకు ఇద్దరు కుమార్తెలు శ్రీజ (15), శిరిణి(14) ఉన్నారు. పదేళ్ల క్రితం భర్తతో విడిపోయిన ఆమె ఇద్దరు కుమార్తెలను చదివించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బంధువుల వివాహవేడుకల్లో పాల్గొనేందుకు కవిత తన పిల్లలను తీసుకొని ఆదివారం మంథని వెళ్లారు. వేడుకల అనంతరం నూతన వధువుకు తోడుగా తన చిన్న కుమార్తె శిరిణిను పంపించి పెద్ద కుమార్తె శ్రీజతో రాత్రికి ఇంటికి చేరుకున్నారు. అర్ధరాత్రి ఇంట్లోకి చొరబడిన దుండుగులుకవితపై హత్యాయత్నం చేస్తుండగా అడ్డుకునే ప్రయత్నం చేసిన శ్రీజ కాళ్లు, చేతులు కట్టేసి మరో గదిలో బంధించారు. తాను చూస్తుండగానే కన్నతల్లిపై జరుగుతున్న దాడిని తట్టుకోలేక ఆ చిన్నారి దుఃఖసాగరంలో మునిగిపోయింది. దుండగులు అక్కడే ఉన్న కత్తిపీటతో కవిత తలపై దాడిచేసినరికి హత్య చేశారు. ఆమె ఒంటిపై ఉన్న బంగారు, వెండిఆభరణాలు తీసుకొనిపారిపోయారు. కేసునమోదుచేసిన పోలీసులు దర్యాప్తుచేస్తున్నారు.



కవిత (పాతచిత్రం)

జనాభా దామాషా ప్రకారం నిధులివ్వాలి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించాలని టీ-మాస్ రాష్ట్ర కమిటీ ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. ఉద్యోగాల భర్తీ విషయంలో చిత్తశుద్ధితో వ్యవహరించాలని, ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికిఅదనంగా నిధులివ్వాలనికోరింది. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించింది.

తెదేపా ఎంపీలకు దేవేందర్‌గౌడ్ విందు

ఈనాడు, దిల్లీ : రాజ్యసభ సభ్యుడిగా పదవీకాలం ఏప్రిల్ 2తో ముగియనున్న సందర్భంగా దేవేందర్ గౌడ్ సోమవారం దిల్లీలో సహచర తెదేపా ఎంపీలకు విందు ఇచ్చారు. కేంద్ర మాజీ మంత్రులు అశోక్ గజపతిరాజు, సుజనాచౌదరి, ఎంపీలు తోట నరసింహం రామ్మోహన్ నాయుడు, కేశినేని నాని, నిమ్మల కిష్టప్ప, కొనకళ్ల నారాయణ, అవంతి శ్రీనివాస్, గల్లా జయదేవ్, శ్రీరాం మాల్యాద్రి, రవీంద్రబాబు, మాగంటి బాబు, తోట సీతారామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఐటీశాఖ ద్వారానే ప్రభుత్వ వెబ్‌సైట్ల నిర్వహణ

పది రోజుల్లోగా నివేదిక ఇవ్వాలి: సీఎస్ ఆదేశం

తెలంగాణ ప్రభుత్వ విభాగాల వెబ్‌సైట్లను ఐటీశాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వ నియమావళి మేరకు నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి ఆదేశించారు. ఈ మేరకు 10 రోజుల్లోగా నివేదిక అందించాలని సూచించారు. ప్రజాసమస్యల్ని పరిష్కరించేందుకు సూర్యాపేట జిల్లాలో అమలు చేస్తున్న జనహిత, సమీకృత ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను అన్ని జిల్లాల్లో అమలు చేయాలని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా ఈ-మెయిల్, ఆన్‌లైన్, వాట్సాప్‌ల ద్వారా ప్రజా సమస్యల్ని వేగంగా, పారదర్శకంగా పరిష్కరించాలన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఐటీ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్, డిజిటల్ మీడియా డైరెక్టర్ దిలీప్‌తో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు.

నల్గొండ ఎస్పీ బదిలీ

నల్గొండ ఎస్పీ డి.వి.శ్రీనివాసరావును బదిలీ చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనను డీజీపీ కార్యాలయానికి ఎటాచ్ చేశారు. ఆయన స్థానంలో హైదరాబాద్ కమిషరేట్‌లో డీసీపీ (ట్రాఫిక్)గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎ.వి.రంగనాథ్‌ను నియమించారు. ఇటీవల కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్ హత్య కేసు దర్యాప్తులో సమర్థంగా వ్యవహరించలేదనేది ఉన్నతాధికారుల అభిప్రాయం. ఎస్పీ బదిలీకి ఇదే కారణంగా భావిస్తున్నారు.

ఉద్యమ స్ఫూర్తితో కలిసి నడుద్దాం: కోదండరాం

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ఉద్యమ స్ఫూర్తితో కలిసి నడుస్తూ.. సుందర తెలంగాణ నిర్మిద్దామని ఐకాస ఛైర్మన్ కోదండరాం పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్సీ కె.దిలీప్‌కుమార్ సోమవారం ఐకాసలో చేరారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో విలేకరులతో కోదండరాం మాట్లాడారు. అభివృద్ధి ప్రాధాన్యతలు, సామాజిక మార్పులను నిర్ణయించేది రాజకీయాలే అన్నారు. వాటిపై స్పష్టత లేకుండా అభివృద్ధి విషయాలపై స్పష్టత రాదని గుర్తించి ఐకాస ఆధ్వర్యంలో ప్రత్యామ్నాయ పార్టీ పెట్టాలని నిర్ణయించామన్నారు. దిలీప్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యమ స్ఫూర్తితో సాధించుకున్న తెలంగాణను కాపాడుకోవడానికి కోదండరాం వెంట నడవాలని నిర్ణయించుకున్నామన్నారు. దిలీప్‌కుమార్‌తో పాటు ఆయన సతీమణి ఇందిర, రాష్ట్రీయ లోక్‌దళ్ మాజీ అధ్యక్షుడు డాక్టర్.రియాజ్ తదితరులు ఐకాసలో చేరారు.

నయీం ప్రధాన అనుచరుడి అరెస్టు

భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే: గ్యాంగ్‌స్టర్ నయీం ప్రధాన అనుచరుడు పాశం శ్రీనును భువనగిరిలో పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇతను నయీం ఎన్‌కౌంటర్ తర్వాత పీడీ యాక్ట్ కింద అరెస్టయి ఫిబ్రవరి 1న బెయిల్‌పై విడుదలయ్యాడు. నయీం అనుచరుడిగా ఉండి గతంలో భూకబ్జాలు, బెదిరింపులకు సంబంధించి 30 కేసుల్లో నిందితుడిగా ఉన్న పాశం శ్రీనుపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరెస్ట్ చేసి భువనగిరి కోర్టులో హాజరు పరిచినట్లు డీసీపీ రామచంద్రారెడ్డి తెలిపారు.

తమిళనాడు కార్చిచ్చుతో మేల్కోండి: అటవీశాఖ

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణకు అటవీ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ సోమవారం ఒక ప్రకటన జారీచేసింది. తమిళనాడులో తెన్ని అటవీ డివిజన్‌లో దావానలంతో జరిగిన ఘోరాన్ని ఉదహరిస్తూ పలు సూచనలు చేసింది. జిల్లాల్లో అగ్నిప్రమాదాలకు ఆస్కారం ఉండే అన్ని ప్రాంతాలపైనా ప్రభుత్వ శాఖలను అప్రమత్తం చేయాలని పేర్కొంది.

టీఎస్‌టీడీసీ ఎండీగా మనోహర్ బాధ్యతల స్వీకరణ

రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండీగా బి.మనోహర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. హిమాయత్ నగర్‌లోని పర్యాటకాభివృద్ధి సంస్థ కార్యాలయంలో సంస్థ ఛైర్మెన్ పేర్వారం రాములు సమక్షంలో ఆయన విధుల్లో చేరారు. పర్యాటకాభివృద్ధికి కృషి చేయాలని సంస్థ ఛైర్మెన్ పేర్వారం రాములు సూచించారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00